# బహుళ

## త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక

సంపుటి -1 సంచిక - 5 https://www.bahulabyjwalitha.com సెప్టెంబర్ - నవంబర్ 2022



* నీలాకాశంలో నిధి (పిల్లల నవల మొదటి భాగం) - శాంతి ప్రబోధ
* అండమాన్ -ఓ మహా ఆకర్షణ - కొండవీటి సత్యవతి
* అత్యాచార భారత్ - నస్రీన్ ఖాన్
* స్వతంత్ర్యపోరాటంలో తెగువచూపిన తెలుగు మహిళలు - దామరాజు విశాలాక్షి

భారత రాష్ట్రపతి "ద్రౌపది ముర్ము" - 25 జూలై 2022.

# "ధర్మో రక్షతి, రక్షితః"



అజాదీ అమృతోత్సవాలు జరుగుతున్న సందర్భంలో "ధర్మో రక్షతి, రక్షితః" అనే నినాదాన్ని పునర్నిర్వచించుకోవాలి. ఏ ధర్మాన్ని రక్షించాలి ? అంటే.. రాజ్యాంగ ధర్మాన్ని అంటాను రాజ్యాంగాన్ని మనం రక్షించుకుంటే రాజ్యాంగం మనని రక్షిస్తుంది.

భారతదేశ 48వ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ గారు 26 ఆగష్టు 2022న తమ పదవీ విరమణ సందర్భంగా "మన దేశ న్యాయవ్యవస్థ భారతీకరణ జరగాలి" అన్నారు. ఆ మాటలను ప్రతి ఒక్కరు జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

అట్లా అని వంద శాతం మనని రాజ్యాంగమే రక్షిస్తుందని నిశ్చింతగా ప్రశాంతంగా ఉండటం కాదు. రాజ్యాంగ హక్కులను పరిరక్షించే న్యాయవ్యవస్థ అప్పుడప్పుడు అనారోగ్యం పాలవుతుంది. చాలా ఎక్కువ నీరస పడుతుంది బలహీనమైనప్పుడే కదా అనేక అసాంఘిక శక్తులు రెచ్చిపోతుంటాయి. అందుకే న్యాయ పరంగా రక్షించబడవలసిన వారు అభద్రతకు గురయ్యై ప్రాణభీతితో పరుగులు పెట్టవలసిన పరిస్థితి వస్తుంది. శిక్షింపబడ వలసిన నేరస్థులు విడుదలయి అధికారులచే సన్మానించబడతారు. సన్మానమంటే అత్యాచారం కంటే అసహ్యమైన జుగుప్సాకరమైనదిగా మారి పోయింది. గుజరాత్ రాష్ట్రంలో బిల్కిస్ బాను కేసులో జరిగింది అదే. ఆ మహిళపై పదకొండు మంది అత్యాచారం చేసి ఆమె కళ్ళముందే తన పసి బిడ్డను చంపేస్తే.. ప్రాణులుగ్గ పట్టుకొని పోరాటం చేసి, న్యాయస్థానం ద్వారా శిక్ష పడిందని ఊపిరి పీల్చుకుంటుంటే. వజ్రోత్సవాల సందర్భంగా.. న్యాయ సూత్రాలను పక్కకు పెట్టి నేరస్తులను విడుదల చేసి వారికి సన్మానం చేసింది ప్రభుత్వం.

బాలలంటే అమూల్యమైన విశ్వమానవ వనరులు. ఒక దేశపు బాలలు, ఆ దేశం యొక్క భవిష్యత్తుకు మూల స్తంభాలు. అటువంటి బాలుడొక్కడు రాజస్తాన్ రాష్ట్రంలో ఒక ప్రభుత్వ పాఠశాలలో తన దప్పిక తీర్చుకోడానికి మంచినీటి కుండను ముట్టుకున్నాడని, ఉపాధ్యాయుని దారుణ దండనకు గురై జీవించే హక్కును పోగొట్టుకొని మరణించాడు... కేవలం తక్కువ కులంలో పుట్టిన కారణంగా మృత్యువు ఒడికి చేరుకున్నాడు. ఇక్కడ కూడా హంతకుడయిన గురువును రక్షించేందుకు ఒక సమూహం ధర్నాలు చేసింది..

స్వాతంత్ర్యోద్యమకారులను వందలమందిని 'జలియన్ వాలా బాగ్' మారణఖాండలో మట్టుపెట్టిన జనరల్ డయ్యర్ కు బంగారు ఖడ్గాన్ని బహూకరించింది బ్రిటిష్ ప్రభుత్వం... అదే పునరావృతమౌతోంది పై రెండు కేసుల్లో.. మీరు నేరాలు చేసినా రక్షింప బడతారని హామీనిస్తోంది.

రాజ్యాంగమే మనకు రక్షణ.. దానిని రక్షించుకోవటమే మన కర్తవ్యం.

ఇక మన రాష్ట్ర పరిస్థితి. మన రాష్ట్రంలో ఏటా 154 వేల కుటుంబ నియంత్రణ జరుగుతుండగా 3 శాతం పురుషులు మాత్రమే కు.ని. సర్జరీలు చేసుకుంటారట. ఆకాశంలో సగం.. మహిళా సాధికారత.. సాధించినా.. వివక్షకు గురయ్యే మరో కోణమన్న మాట. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సెంటర్లో ఆగష్టు రెండవ వారంలో 34 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ సర్జరీలు జరిగితే, నలుగురు మహిళలు చనిపోయారు. అంటే 10 శాతంకంటే ఎక్కువే.. గతంలో కూడా కు.ని.క్యాంపుల్లో ఇటువంటివి జరిగాయి. ఎవరి నిర్లక్ష్యం ఖరీదు నాలుగు ప్రాణాలు.

మేధావులు మౌన వహించే జాతి ప్రమాదంలో ఉన్నదని చరిత్ర చెప్పిన సాక్ష్యాలు చాలా ఉన్నాయి.

– జ్వలిత, ప్రధాన సంపాదకురాలు


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**సంపాదక వర్గం**
డా. తిరునగరి దేవికీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమ్రాజు రామలక్ష్మి
ఆచార్య సూర్య ధనుంజయ
ఆచార్య కె. ఆశాజ్యోతి
డా. త్రివేణి
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. నందిగామ నిర్మల కుమారి
డా. మారోజు దేవేంద్ర
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి


**బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్టు కాదు.**

రచనలు పంప వలసిన చిరునామా :
జ్వలిత, సాహితీవనం, 15-21-130/2, బాలాజీనగర్, కూకట్పల్లి, హైదరాబాద్ – 500072, తెలంగాణ editorbahula@ gmail.com

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ముఖచిత్రం | | .................................................1 |
| 2. | వ్యాసం | అత్యాచార భారత్ | – నస్రీన్ ఖాన్ ..............................4 |
| 3. | కథ | సీతాకోకచిలుక | – మానస ఎండ్లూరి .......................7 |
| 4. | యాత్రా రచన | అండమాన్ –ఓ మహా ఆకర్షణ | – కొండవీటి సత్యవతి, ................11 |
| 5. | కథ | ఇటేటు రమ్మంటే....... | – తిరునగరి దేవకీ దేవి .............17 |
| 6. | వ్యాసం | అంబేద్కర్ వెనుక ఆమె! | – యం.రాం ప్రదీప్ ....................24 |
| 7. | కథ | "మున్నీకి అమ్మీ" | – ఆచార్య సూర్యా ధనంజయ్.........26 |
| 8. | కవిత | అక్షర నదం | – సుమన ప్రణవ్.........................30 |
| 9. | వ్యాసం | స్వతంత్ర్యపోరాటంలో తెగువచూపిన తెలుగు మహిళలు | – దామరాజు విశాలాక్షి ..............31 |
| 10. | పిల్లల నవల | నీలాకాశంలో నిధి (పిల్లల నవల – మొదటి భాగం) | – శాంతి ప్రబోధ,........................35 |
| 11. | వ్యాసం | ప్రశ్నించడం ఓ కళ !! | – నాంపల్లి సుజాత .....................43 |
| 12. | కథ | అత్తమ్మ | – సుభాషిణి తోట .......................44 |
| 13. | కవిత | వనితా తెలుసుకో నీ ఘనత | – చంద్రకళ దీకొండ ..................49 |
| 14. | కథ | తెరువని కవర్లు | – చల్లా సరోజిని దేవి ..................50 |
| 15. | కవిత | అందుకే | – హిమజ ...................................56 |
| 16. | కథ | మనోరథం | – వేలూరి ప్రమీల........................57 |
| 17. | కవిత | నేను | – వకుళవాసు ..........................59 |
| 18. | కవిత | అంతరాలు | – ఆసూరి ఉషారాణి....................59 |
| 19. | వ్యాసం | సంతృప్తి | – డా. శ్రీభాష్యం అనూరాధ ..........60 |
| 20. | కథ | "సీమంతం" | – లంకా సీత ............................61 |
| 21. | కవిత | సంకెళ్ళు | – సౌజన్య వేముల.......................63 |
| 22. | కథ | ప్రస్థానం | – సిస్టర్ అనసూయ.....................64 |
| 23. | కవిత | యుద్ధం : అహం విశ్వరూపం | – ఝాన్సీ కే.వీ. కుమారి ..............68 |
| 24. | వ్యాసం | వివక్షను గెలిచిన విజేత | – సరోజన బోయిని.....................70 |
| 25. | కవిత | అమ్మనై పుట్టినందుకు.. | – నిర్మలారాణి తోట ....................72 |
| 26. | కథ | బోషాణం | – జ్యోతిర్మయి మళ్ళ .....................73 |
| 27. | సమీక్ష | తిరుగులేని సంఘటిత ఆమె | – యడవల్లి శైలజ ప్రేమ్ ...............78 |
| 28. | కథానిక | మానస | – కె. జ్యోతి ...............................80 |
| 29. | సాహిత్య విమర్శనా వ్యాసం | మాలపల్లి నవల – సంఘసంస్కరణ దృక్పథం | – డా॥ సముద్రాల ప్రిస్కిల్ల .............81 |
| 30. | అనువాద సాహిత్యం | 'రసోత్కృష్టం' | – నిగమ ...................................84 |
| 31. | బాల బహుళ | చిత్రం – సాన్వి కలిత, కవిత – కె. వైష్ణవి | ..............................................89 |
| 32. | కొత్త పుస్తకాలు | | ..............................................90 |
| 33. | కవిత | మహిళా మణిపూసలు | – శ్రీమతి. జి. శాంతా రెడ్డి ............91 |

వ్యాసం

# అత్యాచార భారత్



- నస్రీన్ ఖాన్, హైదరాబాద్

9652432981

`కన్ను తెరిస్తే జననం. కన్ను మూస్తే మరణం` అన్నాడో కవి. ఇప్పుడు `కన్ను తెరిస్తే కిడ్నాప్. కన్ను మూస్తే అత్యాచారం.`అని మార్చుకోవాలేమో. దేశంలో ప్రతి రోజూ ఏదో ఒక మూలన ఒక పసికూనపైనో, ఒక కిశోర బాలికపైనో, ఒక మహిళపైనో, చివరాఖరుకు ఒక వృద్ధురాలిపైనో అత్యాచారం జరుగుతూనే ఉండి ఉండవచ్చు. ఇవి నోటికి వచ్చినట్లు చెబుతున్న మాటలు కావు. జాతీయ నేర పరిశోధక విభాగం విడుదల చేసిన గణాంకాలు. చేదు వాస్తవాలు. అసలు అత్యాచార వార్తలేని పత్రిక ఏ రోజూ వెలువడటంలేదు. నేరవార్త స్క్రోల్ కాని టీవీ లేదు. అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు తదితర మరెన్నో నేరాలలో రికార్డు సాధనకు చేరువలో ఉంది. వజ్రోత్సవ వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నప్పటికీ ప్రతి ఒక్కరి మదిలో ఎక్కడో ఓ మూలన ఆందోళన కొట్టొచ్చినట్లుగా కనబడుతూనే ఉంది.

రోజుకు 91 మానభంగాలు

అవును. మీరు చదివినది అక్షరాలా నిజం. 2018 సంవత్సరంలో దేశవ్యాప్తంగా రోజుకు 91 అత్యాచారాలు, 80 హత్యలు, 289 కిడ్నాప్ లు జరిగాయి. అంతేకాదు. ఇదే సంవత్సరంలో 50.74 లక్షల నేరాలు జరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో(జాతీయ నేర పరిశోధన విభాగం) గణాంకాలు చెబుతున్నాయి. 2017తో పోల్చితే 2018లో నేరాల శాతం మరింత పెరిగిందని బ్యూరో వెల్లడించింది. 2017తో పోల్చితే 2018లో నేరాల నిష్పత్తి 1.8శాతం పెరిగింది.

సంరక్షణ కేంద్రాల్లోనూ లైంగిక వేధింపులే

మహిళలు, బాలికల సంరక్షణ కేంద్రాల్లో రక్షకులే భక్షకులు అన్న చందంగా మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు జరుగుతుండటం ఆందోళనకు గురి చేస్తున్న అంశం. బ్యూరో విడుదల చేసిన నివేదికలో పేర్కొన్న వివరాల ప్రకారం 2018 సంవత్సరంలో సంరక్షణ కేంద్రాల్లో 30శాతం వేధింపులు మహిళలు, బాలికలపై జరిగాయి. చాలావరకు కేసులను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) విచారణ చేస్తున్నట్లుగా చెప్పుకొచ్చింది. ముఖ్యంగా ముజఫర్ పూర్ సంరక్షణ కేంద్రంలో బాలికలపై జరిగిన లైంగిక వేధింపులను నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రస్తావించింది.

భయపెడుతున్న ఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీ మహిళలకు ఎంతమాత్రమూ సురక్షితమైన ప్రాంతం కాదన్నట్లుగా భయభ్రాంతులకు గురిచేస్తోంది. 2018లో నమోదైన కేసులు గమనిస్తే దోపిడీలు అత్యధికంగా నమోదైనప్పటికీ అత్యాచారాల భయం అక్కడి పౌరులను వెంటాడుతూనే ఉంది. నేర పరిశోధక విభాగం ప్రకటించిన వివరాలను పరిశీలిస్తే ఎక్కువగా దోపిడీ, దొంగతనాల కేసులే 80శాతంగా 2018 సంవత్సరంలో నమోదయ్యాయి. జనవరి 2018 నుంచి డిసెంబర్ 2018 వరకు ఢిల్లీలో 2,49,000 కేసులు నమోదవగా, 2009లో దోపిడీల శాతం 40 ఉంటే అది కాస్తా 2018 నాటికి రెట్టింపై 80శాతానికి చేరడం ఆందోళనకు గురి చేసే అంశం.

తెలుగు రాష్ట్రాల్లో...

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ వరుస అత్యాచార ఘటనలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. సామూహిక అత్యాచారాలు సమస్య తీవ్రతను మరింతగా పెంచుతూ ఆడవారి భద్రతపై ప్రభుత్వాలకు సవాల్ చేస్తున్నాయి. ఒక విషాదాన్ని మరువకముందే మరో విషాదం సంభవిస్తూ తల్లిదండ్రుల

కంటికి కునుకు పట్టనీయడంలేదు. గడిచిన రెండు మాసాల్లోనే తెలంగాణలో వరుస అత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మైనర్లపైనా గ్యాంగ్ రేపులు జరుగుతుండటం మరింత విషాదానికి గురి చేస్తున్నాయి.

సికింద్రాబాద్ కార్ఖానాలో బాలికపై ఐదుగురు రేప్ చేయడం సంచలనంగా మారింది. ఐదుగుర్లో ముగ్గరు మైనర్లే అని తేల్చారు పోలీసులు. ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికతో పరిచయం చేసుకున్న ధీరజ్, రితేష్ లు.. ఆమెను ఓరోజు హోటల్‌కు పిలిపించుకుని గ్యాంగ్ రేప్ చేశారు. అక్కడితో ఆగకుండా దాన్ని వీడియో తీసి బాలికను బెదిరించడం మొదలుపెట్టారు. 2నెలలుగా బాలికను బెదిరిస్తూ రేప్ చేస్తూనే ఉన్నారు. ఇక వీడియోలు అప్పగిస్తామని మళ్లీ హోటల్‌కు పిలిపించి మరో ముగ్గురు స్నేహితులతో కలిసి అఘాయిత్యానికి పాల్పడ్డారు. కూతురి పరిస్థితి తెలుసుకున్న తల్లిందడ్రులు డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లడంతో విషయం బయటపడింది. ఈ ఏడాది మే మాసంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులు ఐదుగుర్ని అరెస్ట్ చేసిన పోలీసులు.. వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఇక మరో ఘటనలో అనాథ మైనర్‌పై అత్యాచారం జరిగింది. నిత్యం రద్దీగా ఉండే నెక్లెస్ రోడ్డులోనే ఈ దుర్ఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రేమపేరుతో నమ్మించిన ఓ యువకుడు బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాధితురాలు నింబోలి అడ్డా అనాథాశ్రమంలో ఉంటోంది. ఇంటర్ చదువుతున్న బాలికకు.. దగ్గర్లోనే జిరాక్స్ షాప్‌లో పనిచేస్తున్న నిందితుడు సురేష్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెకు ఫోన్ కొనిచ్చిన సురేష్.. తరచూ కాల్ మాట్లాడేవాడు. ఏప్రిల్ 20న తాను ఫ్రెండ్స్ బర్త్‌డేకు నెక్లెస్ రోడ్‌కు వెళ్తున్నట్లు బాలిక సురేష్‌తో చెప్పింది. తాను వస్తానని చెప్పి అక్కడికి వెళ్లిన సురేష్.. అందరూ బిజీగా ఉన్న సమయంలో బాలికను మాట్లాడుకుందామని చెప్పి పక్కకు తీసుకెళ్లాడు. కారులోకి ఎక్కించి అత్యాచారం చేశాడు. విషయం ఇటీవలే అనాథశ్రమం నిర్వాహకులకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సురేష్‌ను అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఈఏడాది ఏప్రిల్ నెలలో మాత్రం కేవలం 15రోజుల వ్యవధిలోనే ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు, ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఒక కేసు నమోదు కాగా ఏప్రిల్ నెల మొత్తంలో ఐదు కేసులు నమోదయినట్టు రికార్డులు చెబుతున్నాయి. దాంతో గతంతో పోలిస్తే ఈ సారి అత్యాచార సంబంధిత నేరాలు పెరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. 2019 నుంచి మూడేళ్లలో పాత గుంటూరు, విజయవాడ, కృష్ణా జిల్లా పోలీసు స్టేషన్‌ల పరిధిలో సామూహిక అత్యాచారాల కేసుల వివరాలు పరిశీలిస్తే ఈ కేసులు పెరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది. 2019లో కరోనావైరస్ వ్యాప్తి కారణంగా సంపూర్ణ లాక్‌డౌన్ అమలుచేశారు. 2020లోనూ లాక్‌డౌన్ అమలు చేశారు.

2020, 21 సంవత్సరాల్లో ఏప్రిల్ మాసంలో గ్యాంగ్ రేప్‌లకు సంబంధించి రెండు చొప్పున కేసులు ఈ జిల్లాల పరిధిలో నమోదయ్యాయి. 2019 ఏప్రిల్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. ఈఏడాది ఏప్రిల్ నెలలో మాత్రం కేవలం 15రోజుల వ్యవధిలోనే ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు, ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఒక కేసు నమోదు కాగా ఏప్రిల్ నెల మొత్తంలో ఐదు కేసులు నమోదయినట్టు రికార్డులు చెబుతున్నాయి. దాంతో గతంతో పోలిస్తే ఈ సారి అత్యాచార సంబంధిత నేరాలు పెరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం ఏపీలో 2019లో 1084 అత్యాచార కేసులు నమోదయ్యాయి. 1104 మంది బాధిత మహిళలపై జరిగిన లైంగిక దాడుల్లో ఈ కేసులు నమోదయ్యాయి. 2020కి వచ్చేసరికి ఈ కేసులు 1090కి పెరిగాయి. బాధిత మహిళలు 1107 మంది ఉన్నారు. 2021లో కూడా ఏపీలో అత్యాచార కేసులు పెరిగాయి. వాటి సంఖ్య 1100 దాటినట్టు రాష్ట్ర పోలీస్ అధికారుల నివేదికలు చెబుతున్నాయి.

సంచారమున్న ప్రాంతాల్లోనూ...

జనాలు పెద్దగా లేని చోట, ఎవరూ గుర్తించరని భావించిన చోట ఎక్కువగా ఈ తరహా నేరాలకు ఆస్కారం

గతంలో ఉండేది. కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా నిత్యం అనేకమంది రాకపోకలు సాగించే ప్రాంతాల్లో మహిళలపై సామూహిక అత్యాచారాలు జరుగుతున్నాయని బిబిసి ఒక కథనంలో పేర్కొంది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ.. “మహిళల రక్షణ కోసం ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు అక్కరకు రావడం లేదు. రాష్ట్రంలో అన్ని మూలలా నిత్యం దారుణాలు జరుగుతున్నాయి. దిశ చట్టం పేరుతో చాలా ప్రచారం నిర్వహించారు. చివరకు దిశ యాప్‌కే పరిమితమయ్యారు. కానీ అవి సామాన్య, వలస కూలీ మహిళలను ఎలా కాపాడుతాయి. ఇంతగా పెచ్చరిల్లుతున్న వారిని అదుపు చేయడంలో పోలీస్ యంత్రాంగం విఫలమయింది. మహిళల భద్రతకు భరోసా లేకుండా పోయింది”అని ఆమె అభిప్రాయపడ్డారు. వాస్తవానికి మహిళలపై నేరాలే అదుపు చేసేందుకంటూ జగన్ ప్రభుత్వం 2019 డిసెంబర్‌లో కొత్త చట్టం తీసుకొచ్చింది. హైదరాబాద్‌లో దిశ ఘటన తర్వాత ఏపీ అసెంబ్లీలో ప్రభుత్వం చట్ట సవరణ చేసి ‘దిశ చట్టం’ తీసుకొచ్చింది.

రాజకీయ జోక్యం ఉండకపోతేనే...

“గ్యాంగ్ రేప్ ఘటనలపై రాజకీయాలు అత్యంత విషాదకరం.వారి తీరుతో చివరకు బాధితుల వ్యవహారాలు కూడా బయటపడుతున్నాయి. నిబంధనల ప్రకారం అత్యాచారానికి గురయిన వారి సమాచారం బయటకు రాకూడదు. కానీ పరామర్శల సమయంలో రాజకీయాల మూలంగా బాధితుల సంబంధీకుల గుట్టురట్టవుతోంది. సహజంగా నిందితులకు ఫలానా పార్టీ అంటూ ఉండదు. అయినా నాయకుల విమర్శలు, ప్రతివిమర్శలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అరాచకాలకు పాల్పడుతున్న వారిని అదుపు చేసేందుకు ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలి. అందుకు భిన్నంగా విపక్షాల మీద విమర్శలకు ప్రయత్నించడమే విడ్డూరంగా ఉందంటూ”అని సామాజికవేత్త పీ ఏ దేవి వ్యాఖ్యానించారు. అరాచకాలు ప్రబలకుండా, పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన ప్రభుత్వం నుంచి స్పందన అత్యంత పేలవంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి దారుణాలు వెలుగులోకి రాగానే తగిన రీతిలో స్పందన కనిపించలేదని బీబీసీతో అన్నారు.

ఎక్కడ అన్యాయం జరిగినా న్యాయస్థానాల్లో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్న నమ్మకం బాధితులకు ఉంటుంది. కొన్ని కొన్ని చోట్ల ఆ ఆశలూ నీరుగారే సంఘటనలు విస్తుపోయేలా చేస్తున్నాయి. ఇటీవలే ఓ అత్యాచార నిందితుడికి బెయిలు మంజూరు చేసే సమయంలో.. ‘బాధితురాలు చెప్పేది నమ్మశక్యంగాలేద’ని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ దీక్షిత్ వ్యాఖ్యానించడం పట్ల మిగతా న్యాయవాదులు విస్మయం చెందారు. ‘ఆఫీస్‌కు రాత్రి 11 గంటలకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది? అతడితో కలిసి డ్రింక్స్ తాగడానికి ఎందుకు అభ్యంతరం చెప్పలేదు? తెల్లవారే వరకు తనతో కలిసి అతడు ఉండేందుకు ఆమె ఎందుకు అనుమతించింది?’ లాంటి ప్రశ్నలను బాధితురాలిపై సంధించారు.

ఘటన జరిగిన తర్వాత ఆమె అలసిపోయి, నిద్రలోకి జారుకున్నానని చెప్పడం.. భారత మహిళ వ్యవహరించిన తీరులాలేదని చెబుతూ.. ‘అత్యాచారం అయిన తర్వాత మన మహిళలు ఇలా స్పందించర’ని న్యాయమూర్తి వ్యాఖ్యానించినట్లు ఎన్నో కథనాలు ప్రసారమాధ్యమాలలో హల్ చల్ చేసాయి.

ఒక సినిమాలో చెప్పినట్లు... ఒకవైపు మర్డర్లు, మరోవైపు మానభంగాలు. అప్పుడేదో సరదాకోసం తీసుకున్న మాటలు కాస్తా ఇప్పుడు నిజమైపోయి దేశం ఇప్పుడు నిజంగానే క్లిష్టపరిస్థితుల్లో ఉంది. ఒక సినిమాలో నూతన్ ప్రసాద్ చెప్పే డైలాగ్ ఒకటి నవ్వులు పూయిస్తుంది. `ఒకవైపు మర్డర్లు, మరోవైపు మానభంగాలు.` అప్పుడేదో సరదాకోసం తీసుకున్న మాటలు కాస్తా ఇప్పుడు నిజమైపోయి దేశం నిజంగానే క్లిష్టపరిస్థితుల్లో ఉంది. నిర్భయ చట్టం, దిశ చట్టం అంటూ ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా నేరస్తుల్లో ఆశించిన మార్పు కనిపించడంలేదు. బాధితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇందుకు అన్ని వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ జరిపి పటిష్టమైన పరిష్కార మార్గాన్ని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

కథ

# సీతాకోకచిలుక



- మానస ఎండ్లూరి, హైదరాబాద్

91607 34990

అదే చివరి ముద్దు అని ఆమెకి అప్పటికే తెలుసు.

★★★

"గిరిజనులు హరిజనులు
ఏ రోజుకారోజు
బలిపశువులెట్లయ్యేరో
పాపయ్య బందుకెందుకుబట్టిరో.."

దప్పు చప్పుడు లీలగా అతని స్వరం కీచుగా వినిపిస్తూ ఉంది. చిన్నగా పరిగెడుతూ వెళ్ళే సరికే పాట ముగించేశాడు.

"అబ్బా! మళ్ళీ నీ పాట పూర్తిగా వినలేకపోయాను" అంటూ నిరాశగా స్నేహితుల మధ్యలో కూర్చుంది అరుణ.

"వాడు రోజంతా పాడతానే ఉంటాడులే. నువ్వో పాట పాడు అరుణ" చిత్రా చిటికెన పుల్లా సిద్ధం చేసుకుంటూ అడిగాడు ప్రశాంత్.

"లేదు లైబ్రరికి వెళ్ళాలి. రాజా పాట విని ఆగాను.

"పాడేసి పోదువులే" సునీత.

క్షణం కూడా తడుముకోకుండా పాటెత్తుకుంది అరుణ.

"మాలముండ కొడుకుల్లార భూములు మీకేలంటూ
గోపన్న వలసలో పరశురాముల చంపినారు
మాదిగ ముండల్లారా.. మీ.. కెందుకింత అందమని
మద్దికేర మరతమ్మ మాన ప్రాణం తీసినారు
ఈ పాలించెటోళ్ళు మన ఇద్దర్ని చంపుతుంద్రు..
తక్షణం.. ఆత్మరక్షణ పోరుజెయ్యరో..
నిజమయ్యో.. నువ్వూ నేను శత్రువులం కాదయ్యో"

టక్కున పాట ఆపేసింది అరుణ.

"సరే ఇంక వెళ్తా"

"అరె చంద్రశ్రీ పాట! మొత్తం పాడేసి పోరాదు" రాజా.

"సాయంత్రం పాడతాలే. బై" అరుచుకుంటూ లైబ్రరి వైపు అడుగులు వేసింది.

"ఏం రా రాజా! ఎప్పుడూ లేనిది పాట పాడమని అడుగుతున్నావ్ ఆ పిల్లని" దప్పు పక్కన పెడుతూ అడిగాడు ప్రశాంత్.

"రేయ్ అడిగింది నువ్వు!"

"పాడింది నువ్వు చెప్పాకే కదా"

"అది ఆ అమ్మాయినే అడుగు. నన్నడిగితే?"

"అంతేనా"

"అంతే"

"పోతా పోతా తిరిగి సూస్తనే ఉన్నది కద రా! నువ్ సూడలే?" రమేశ్.

"పిచ్చి పట్టిందా మీ అందరికీ?చూస్తే చూడనీ. ఆమెకే ఏమన్నా ఇంటరెస్ట్ ఉందేమో. స్కూల్ పిల్లల్లాగా చేస్తారేంటి?"

రాజా విసుగ్గా మొహంపెట్టి కాంటీన్ లోంచి బయటకు నడిచాడు. మిత్రబృందం కూడా అతని వెనకే కదిలారు.

★★★

'నిజంగానే అరుణకు నా మీద ఇంట్రెస్ట్ ఉండి ఉంటుందా?'

ఆ ఒక్క క్షణం రాజా గుండె ఝల్లుమంది.

'నా పక్కన ఒకమ్మాయిని ఊహించుకోగలనా? వెంటే ఉంటూ తియ్యగా కబుర్లు చెప్పడం నేను చేయగలనా? ఇవన్నీ చేస్తేనే ప్రేమా? ఛ! ఏం ఆలోచిస్తున్నానసలు'

వాస్తవ గాలులు వెచ్చగా వీచాయి..

Xxx

"అంబేద్కర్ జయంతికి ఏం జేద్దామ్ రా? పూలేసుదు, దండాల్ వెట్టుడేనా?" సురేందర్.

"ఇంకేం చేస్తాం రా" అనిల్.

"ఆన్లైన్ సెమినార్ పెడదామా?" సునీత.

"కాదు ఆఫ్లైనే పెడదాం. మన ఆడిటోరియంలో" రాజా.

"సెలవు కదరా. ఒస్తరా?" సురేందర్.

"వస్తారు. రావాలి" రాజా.

"స్పీకర్స్ ఎవరు ఇంతకీ?"

"ఆ ఖాసీమన్న పక్కా ఉంటడు. కోయి కోటేశ్వర్రావన్న మొన్న పిలిస్తే రాలేకపోయిండు. ఇప్పుడొస్తడేమో అడగాలే" వెంకటాద్రి.

"ఇంకా"

"కత్తి పద్మారావు సార్ ఒస్తడా?"

"అహే! ఆయన హైదరాబాద్ సభలకి రాక కొన్నేళ్ళవుతుంది"

"ఆ సరే. డీన్ సార్, హెడ్ సార్లను ఎట్లనో పిలుస్తం. రవీందరన్న ఉంటడు"

"సరిపోతార్లే" రమేశ్.

"ఇగ పోస్టర్లు, ఫోన్లు, పిలుపులు షురూ చెయ్యాలె"

"అరుణని ఇంగ్లీష్లో ఇన్విటేషన్ రాయమని చెప్పాలి" రాజా.

"అనిల్ రాస్తాడుగా ప్రతిసారీ"

"అరుణ కూడా ఇంగ్లీష్ డిపార్ట్మెంటే కదా. కొత్త వాళ్ళకి పని తెలియొద్దా?" లేచి గబగబా వెళ్ళిపోయాడు రాజా.

★★★

"హలో చెప్పు" అరుణ.

"ఏం చెప్పాలి" రాజా

"ఏం చెప్పాలని కాల్ చేశావ్?"

"పాట పాడతావని"

"ఏం పాట"

"ఏదో చెప్దామని ఫోన్ చేస్తే ఏదేదో మాట్లాడిస్తావ్ నా చేత"

"నేనా"

"సరే చెప్పేది విను. అంబేద్కర్ జయంతి రోజున క్యాంపస్ లోనే సెమినార్ పెడుతున్నాం. నువ్వు ఇంగ్లీష్లో ప్రెస్ నోట్, ఇన్విటేషన్ రాసి పంపాలి"

"ఆ రోజు సెలవు కదా ఎవరొస్తారు?"

"వచ్చే వాళ్ళు వస్తారు. రాని వాళ్ళు మిస్ అవుతారు"

"ఎవరెవరు మాట్లాడుతున్నారు"

"ఖాసిం, కోయి, పసునూరి, మన డీన్, హెడ్. అంతే"

"అదేంటి ఒక్క ఉమన్ స్పీకర్ కూడా లేకుండా?"

"ఇదేం విమెన్స్ డే కాదు?"

"మరి మెన్స్ డే నా?"

ఫోన్ కట్ అయ్యింది. కనెక్ట్ అవ్వాలంటే కోపం తగ్గాలి. తానూ తగ్గాలి.

కోపమైతే వెంటనే తగ్గింది. ఫోన్ మళ్ళీ కనెక్ట్ అయ్యింది.

"అలా కాదు రా.."

"ఏంటీ?"

కొత్త పిలుపు ఈ సందర్భంలో అతకలేదు.

"అది కాదు అరుణా! స్పీకర్స్ ఎక్కువైతే టైమ్ సరిపోదు. మనమే పిలిచి మాట్లాడడానికి టైమ్ ఇవ్వకపోతే ఎలా చెప్పు. అందుకే ఐదుగురినే అనుకున్నాం"

"ఎవరనుకున్నారు?"

"నేను, రవి, సురేందర్"

వెటకారానికి చిన్నగా సరిపోతుందని పెద్దగా వచ్చే నవ్వుని విసుగ్గా కత్తిరించింది.

"సరే శ్యామలక్కని పిలుద్దామా"

"నీ ఇష్టం. నేను ఇన్విటేషన్ రాసి సాయంత్రం పంపిస్తాను"

★★★

"కులం కులానికీ తలారుల్ని సృష్టించి
నువు పొందిన నిశ్చింతల విశ్రాంతిని
గద్దనై ఎగరేసుకుపోతాను
మండుతున్న గుండెలయల్ని
నీ పొదరిళ్ళకు తగిలించి
నీ నిదుర దీపాన్ని ఆర్పేసిపోతాను..."

"కుల పోరాటం చేయకుండా నన్ను ప్రేమించలేవా?"

ఆ రాత్రి రహస్యంగా కెమిస్ట్రీ బిల్డింగ్ పై సమావేశమయ్యారు ఇద్దరూ. ప్రేమించుకోడానికి.

"కులం లేనిది ఎక్కడ? నీలో ఉంటుంది. నాలో ఉంటుంది"

దూరంగానే నిలబడ్డాడు. బహుశా అరుణే దగ్గరకి రావాలని ఎదురుచూపు కూడా అయ్యుండొచ్చు.

"కనీసం మన ప్రేమలో ఉండకపోతే చాలంటావా?"

"దానికీ భరోసా లేదు"

అరుణ నవ్వింది.

రాజా బక్కపలుచని శరీరం, నిలువు గీతల చొక్కా, నాలుగు రోజుల నుంచి వేస్తున్న అదే ప్యాంట్ తనని ఇష్టపడడానికి దోహదపడకపోయినా తృణీకరించడానికి

అడ్డంకావడం లేదు.

రాజా అరుణని అణువణువూ చూస్తున్నా పైకి గంభీరంగానే నటిస్తాడు. ధైర్యం చేసి రెండడుగులు అరుణ వైపు వేశాడు.

"అమ్మలూ.. "

కొత్త పిలుపుకి ఒళ్ళు పులకరించింది. సిగ్గుపడుతున్న అరుణని అంత దగ్గరగా చూసింది రాజా ఒక్కడే కాబోలు. అరుణ మొదటిసారి రాజా చేతిని తన చేతిలోకి తీసుకుంది. దురదృష్టం. అప్పుడే మోగుతున్న ఫోన్ ను జేబులోంచి తియ్యాల్సివచ్చింది. క్షణంలోనే అరుణ చేయి వదలాల్సివచ్చింది.

"ఏంట్రా"

"రాజా! అజయ్ గాడు సూసైడ్ చేస్కున్నాడ్రా. ఇప్పుడే వీసీకి చెప్పారు. నువ్వు త్వరగా స్టూడెంట్స్ సర్కిల్ దగ్గరికి రా"

"ఏమైంది" అని అడిగింది అరుణ. స్థాణువైన రాజాను చూసి.

"అజయ్ సూసైడ్ చేస్కున్నాడంట. నువ్వు హాస్టల్ కి వెళ్ళు. నేనటు వెళ్తాను"

"నేనూ వస్తాను"

"పద"

నేరుగా మెన్స్ హాస్టల్ కి వెళ్లారు. అరుణ బయటే ఉంది. లోపల అజయ్ ఇంకా వేలాడుతూనే ఉన్నాడు. చుట్టూ మగపిల్లలు. చప్పుడు లేకుండా చూస్తున్నారు. ఇంతలోనే పోలీస్ సైరన్. గుంపులు గుంపులుగా విద్యార్థులు, సిబ్బంది అక్కడికి వచ్చేశారు. ఆడపిల్లలు తక్కువగా ఉండడం వల్ల అరుణపై అందరి ప్రత్యేక దృష్టి పడుతోంది.

"మంచి పిలగాడే. ఎందుకిట్ల జేశిండో"

"గైడ్ ఏమన్నా అన్నాడేమో"

"కాదనుకుంటా"

"అమ్మాయి ప్రాబ్లెం అంట"

"అమ్మాయే ప్రాబ్లమా?" అరుణ.

"అలా కాదు. లవ్ ఫెయిల్యూర్ అంటున్నారు"

"ఎవరో ఓసీ అమ్మాయంట. పేరెంట్స్ ని ఒప్పిస్తానని హాస్టల్ నుంచి ఇంటికి వెళ్ళి వేరే పెళ్లి చేసుకుందంట"

హాస్టల్ లోపలి నుంచి జనాల మధ్యలోంచి వెక్కి వెక్కి ఏడుస్తూ వస్తున్నాడు రాజా.

"అజ... య్!!!" అరుస్తున్నాడు.

అజయ్ కి తప్ప అందరికీ వినబడుతోంది..

"ఇప్పుడు చెప్పు! ప్రేమకి కులం లేదా?"

జనం ముందే అరుణ మీద విరుచుకుపడ్డాడు. ఏం చేస్తది అరుణ? షాక్ అయ్యింది. భయపడింది.

పోలీసులొచ్చారు. హాస్టల్ గుమ్మంలోనే అడ్డుకున్నాడు రాజా.

"ఎందుకు మీరు లోపలికి వెళ్ళేది? మా ఫ్రెండ్ కి న్యాయం జరిగే వరకు వాణ్ణి ముట్టుకోడానికి వీల్లేదు. రేయ్ రండ్రా" అంటూ మిగతవారితో కలిసి దారి బ్లాక్ చేశాడు రాజా.

"న్యాయం జరగాలంటే ముందు ఎంక్వైరీ చెయ్యాలి కదా. తప్పుకోండి"

"అజయ్ ని మోసం చేసిన అమ్మాయి ఇక్కడికి రావాలి. ఇదే క్యాంపస్ లో వాడితో తిరిగింది. ప్రాణాలు పోగొట్టుకునేలా చేసింది"

"స్టూడెంట్స్ అయ్యుండి ఇలా మాట్లాడుతున్నారా? టైమ్ వేస్ట్ చేయకండి. జరగండి"

అరుణ చూస్తోంది..

"ముందు ఆ అమ్మాయి క్షమాపణ చెప్పాలి" చెమటలు కక్కుతున్నాడు రాజా.

"ఎవరికి"

"అజయ్ వాళ్ళమ్మకి"

"ఆమెనడిగే అతను ప్రేమించాడా? తెలివుండే మాట్లాడుతున్నారా?"

క్యాంపస్ కి దగ్గరలో ఉన్న ఫ్యాకల్టీ, అడ్మిన్ వాళ్ళు వచ్చారు. కానీ స్టూడెంట్స్ ముందు వారెవరూ సరిపోవడం లేదు. చూస్తూనే గొడవ పెద్దదైంది. పోలీస్, విద్యార్థుల కొట్లాటలో రాజా సహా పదిమందిని అరెస్ట్ చేశారు.

అక్కడ రాజా ఇంకొద్దిపాటి హీరో అయ్యాడు. కాసేపటికి అరుణ తప్ప అందరూ స్థిమితపడ్డారు.

★★★

అసలు రాజా ఏం ఆలోచిస్తున్నాడు అని అరుణ ఆలోచిస్తోంది.

'తన మాట వినే వేదిక మీద ఒక్క స్త్రీ అయినా లేకపోతే ఎలా అని మిగతా వారిని ప్రశ్నించాడు. ఇప్పుడు పెళ్ళైన ఒక పిల్లని క్యాంపస్ కి రావాలని పట్టుబట్టాడు. అల్లరిపాలు చేయాలని చూశాడు. వాళ్ళమ్మకి క్షమాపణ చెప్తే ఆమెకి వచ్చేది

ఏంటి? ఇందులో రాజాకి దక్కేది ఏంటి?

"పాముకున్న అందం నీకెక్కడుంది?

పాముకున్న సెక్సపీల్ నీలో ఏది?

ఈసకపోయిన గొడ్డులా ఉంటావు..

ఎండిపోయిన సర్విచేనులా ఉంటావు.."

అంటూ మద్దూరి కవితాలతలై నన్నల్లుకున్నాడు. రెహమాన్ పాటలతో నన్ను పరవశింపచేశాడు. దిగంబర కవిత్వంతో ఉగ్రూతలూగించాడు. తను రాసిన కవితలు నాకు మాత్రమే విన్పించి నా గుండెల్లోకొచ్చి కూర్చున్నాడు…'

తన రూమ్ కిటికీ పక్కన నిలబడి బంతిపూల కోసం వచ్చిన తూనీగలతో రాజా కబుర్లన్నీ చెప్తోంది అరుణ..

"అరుణా! రాత్రి పి ఎస్ లో ఉన్న వాళ్ళంతా వస్తున్నారు. మెయిన్ గెట్ దగ్గర ఉన్నారు. రా వెళ్దాం" పరిగెత్తుకు వచ్చింది వసుంధర.

"నేను రాన్లే. మీరు వెళ్ళండి"

తూనీగలకి చెప్పాలసింది ఇంకా చాలా ఉంది.

'నువ్వు లేని రాత్రి

కలలు రాని నిద్రలా నిర్లిప్తంగా ఉంది.

నువ్వు రాని ఉదయం

కానరాని చీకటిలా ఉంది.

నువ్వొచ్చే సరికి

రేయికి పగటికి మధ్యన

సీతాకోకచిలుక నై

ఎదురౌతాను'

నీ అరుణ

అని వాట్సప్ లో రాసి రాజాకి పంపింది.

'ఎప్పుడెదురౌతావ్' రాజా నుంచి రిప్లయ్.

'సాయంత్రం'

★★★

"ఏంటి ఎవరూ లేరా?"

మెన్స్ హాస్టల్ కారిడార్ లో భయం భయంగా రాజా చేయి పట్టుకుని నడుస్తోంది అరుణ.

"అవతల వింగ్ లో ఇద్దరు ముగ్గరు ఉన్నారు. అందరూ అజయ్ ఊరికి వెళ్లారు. రేపు సమాధి చేస్తున్నారు. నేను తెల్లారే బయల్దేరుతాను"

రూమ్ లోకి వెళ్లారు. వెంటనే తలుపులు కిటికీలు వేశాడు రాజా. అన్నీ తెలిసినా ఎప్పుడూ ఏదో భయం వెన్నంటే ఉంటుంది అరుణకి. బహుశా ఆడపిల్లలందరికీ.

"చెప్పు"

"ఏం చెప్పాలి"

"సాయంత్రం ఏదో మెసేజ్ పెట్టావ్" అరుణ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు రాజా. ఈసారి ధైర్యంగా.

"చాలా మిస్ అయ్యాన్నిన్ను"

అరుణ కరచాలనం బిగించింది.

"నేను కూడా. పోలీస్ స్టేషన్ లో కొంచెం భయమేసింది. కానీ నువ్వే గుర్తొచ్చావ్. నా వళ్ళో కూర్చోవచ్చు కదా అమ్మలూ"

అరుణ కూర్చుంది. రాజాకి నచ్చింది.

"ఇంకా.."

"తిరిగి వస్తానని అనుకున్నావా?"

అరుణ సువాసనల్ని పీల్చుతున్నాడు.

"కచ్చితంగా అనుకున్నాను. కానీ ఇలా కలుస్తామనుకోలేదు"

అరుణ మాత్రం ఎంతసేపని ముంచుకొచ్చే సిగ్గు దాచుకోగలదు.

"నచ్చలేదా?"

నచ్చిందని సాదాగా చెప్పడం అరుణకి నచ్చదు. రాజా చంపలపై దట్టమైన గడ్డాన్ని పెదాలతో తాకుతూ చెప్పింది. అప్పటికే రాజా ముగ్ధుడయ్యాడు.

ఎలా అంత చనువుగా రాజా పరుపు మీద నడుం వాల్చిందో తనకీ తెలీదు.

పాదాలు..రాజా అరచేతిలో అరుణ మెత్తటి పాదాలు తన ప్రేమ గీతాల్లా ఉన్నాయి.

"ఎంతందంగా ఉన్నాయి అమ్మలూ నీ పాదాలు. నెయిల్ పాలిష్ కూడా పెట్టలేదు". ఆమె కాలి గోళ్లకి అతని పెదాల స్పర్శే ప్రణయ రంగుల్ని నింపాయి.

అరుణ కళ్ళతోనే ప్రేమిస్తోంది...

"అబ్బా! అమ్మలూ నీ పిక్కలేంటి ఇంత బావున్నాయి. అచ్చం బాపనోళ్ల పిక్కల్లాగా తెల్లగా"

పాదాలు వళ్ళోంచి కింద పడ్డాయి. రెక్కల్లేని సీతాకోకచిలుక గొంగళిపురుగై అరుణ పాదాల మీద పాకింది…

చివరి ముద్దూ ముగిసింది.

యాత్రా రచన

# అండమాన్ -ఓ మహా ఆకర్షణ



- కొండవీటి సత్యవతి, హైదరాబాద్

అండమాన్ దీవుల ప్రయాణం గురించి రాద్దామనుకున్నపుడుడల్లా ఏవో పనుల హడావుడి అడ్డం పడుతూనే వుంది.

జీవితం ఎంత వేగవంతమైపోయిందో! అనుభవాలు వ్యక్తీకరించకుండానే ఒక దానిమీద ఒకటి పేరుకుపోతున్నాయి.

అండమాన్ వెళ్ళి వచ్చిన తరువాత జైపూర్ కూడా వెళ్ళాను. అయినా అండమాన్ సందర్శనానుభవాలు ఇంకా అలా ఫ్రెష్‌గా గుండెల్లో వుండిపోయాయి. రాయమనే పోరు లోపల జరుగుతూనే వుంది. ఆ అనుభవాలను మిత్రులతో పంచుకోవాలని నాకు చాలా అన్పిస్తోంది. అందుకే రాయడానికి కూర్చున్నాను.

అండమాన్ ఒక గాయం. సునామీ మిగిల్చి వెళ్ళిన గాయం గురించి నేను మాట్లాడటం లేదు. సెల్యూలర్ జైలు చూశాక, ఆ జైలులో ఖైదీలు అను భవించిన వర్ణనాతీత వేదనలు విన్నాక అండమాన్ ఎర్రటి పుండు మానిన గాయం లాగానే అన్పించింది నాకు. వందల సంఖ్యలో ఉరితీయబడిన ఖైదీలు, భయానక బాధల నడుమ కూడా చైతన్యంతో ఉద్యమాలు నడిపిన ఖైదీలు, ధిక్కార స్వరాలు క్రూర,కసాయి బ్రిటిష్ జైలర్లు. అండమాన్‌లో అడుగిడిన సాయంత్రమే సెల్యులర్ జైలును చూడడం, లైట్ అండ్ సౌండ్ ప్రోగ్రామ్‌లో జైలు చరిత్ర, ఖైదీల ఆర్తనాదాలు సజీవంగా ముందుకు రావడంతో మనసు వికలమై పోయింది. ఆ రాత్రి కలల నిండా ఖైదీలే. వారి హృదయ విదారక ఆర్తనాదాలే. పోలీసుల కరకు బూట్లచప్పుడు గుండెల మీద ఆనుతున్నట్టుగా అన్పించి చాలాసేపు నిద్రపట్టలేదు.

ఆ తర్వాత తిరగిన సుందర ప్రదేశాలు మొదటి రోజు చేదు అనుభవాన్ని కొంతవరకు తగ్గించేయి. సెల్యూలర్ జైలు చూడ్డానికి వెళ్ళకముందు సన్‌సెట్ పాయింట్‌కి వెళ్ళాం. మేమున్న గెస్టహౌస్‌కి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో వుంది. మెలికలు తిరిగిన రోడ్డు. దట్టమైన అడవిగుండా మా ప్రయణం సాగింది. కొబ్బరి చెట్లు, ఆకాశన్నంటే పోక చెట్లు దారిపొడుగునా ఉన్నాయి. నాకెంతో ఇష్టమైన మొగలి పొదలు చాలా కన్పడ్డాయి. అయితే ఈ పొదలు కొబ్బరి చెట్లంత పొడవున్నాయి. పెద్ద పెద్ద ఆకుల్తో పొడవుగా ఎదిగిన ఈ చెట్ల నుండి మొగలి పొత్తుల్ని ఎలా కొస్తారా అని తెగ ఆశ్చర్యపోయాన్నేను. కొబ్బరి, పోక, మొగలి ముప్పేటలా అల్లుకున్న ఆ తోటల్లోంచి మా కారు చాలా వేగంగా దూసుకెళ్ళసాగింది. అపుడపుడూ సముద్రం కూడా దర్శనమిస్తోంది. అకాశం రంగులో నీళ్ళు. స్వచ్ఛంగా వున్నాయి. ఓ నలభై నిముషాలు ప్రయాణం చేసాక సూర్యాస్తమయ ప్రదేశం వచ్చింది. ఎదురుగా నీలిరంగు సముద్రం. సముద్రానికి అటువేపు చిన్న దీవి. ఆ చిన్న దీవిలో ఎత్తైన కొండవెనక్కి సూర్యుడు జారిపోతున్న అద్భుతదృశ్యం కంటపడింది. టైమ్ చూస్తే నాలుగున్నరే అయ్యింది. మరి కాసేపట్లో చీకట్లు అలుముకున్నాయి. ఐదింటికల్లా చీకటిపోయింది. అప్పటివరకు నీలాకాశం రంగులో కనబడిన సముద్రం నల్లటి దుప్పటి కప్పుకుని పడకేసీనట్లనిపించింది. సన్‌సెట్ పాయింట్ దగ్గర అటవీశాఖవారి అందమైన అతిధి గృహం వుంది. బయట లాన్‌లో కూర్చుంటే నల్లటి దుప్పట్లో దూరిన సముద్రం గురకలు పెట్టినట్టుగా చిరు కెరటాలు తీరాన్ని తాకుతూ విరుగుతున్న సవ్వడి విన్పిస్తుంది. వేడిగా ఓ టీ తాగేసి మేము తిరుగు ప్రయాణమయ్యాం. చీకటి దట్టమైపోయింది. కొబ్బరి చెట్లు, పోక,. మొగలి పొదలు ఏకమైపోయాయి. చల్లటి సముద్రగాలిని ఆస్వాదిస్తూ ఓ గంట తర్వాత మా గెస్ట్ హవుస్‌కి వచ్చేం.

మేము బస చేసిన గెస్ట్‌హౌస్ సముద్రానికి ఆనుకుని వుంది. మేమున్న రూమ్ పేరు నికోబార్. పెద్ద పెద్ద చెట్లతో గెస్ట్‌హౌస్ చాలా బావుంది. మేము రూమ్‌లో కెళ్ళగా ఓ కుర్రాడొచ్చి తలుపు తట్టాడు. ''నమస్కారం సార్'' అంటూ పలకరించాడు. తెలుగోడివా అంటే ''మాది విజయనగరం. ఇక్కడ క్యాంటీన్‌లో వంట చేస్తా. ఏమేం స్పెషల్స్ కావాలో చెప్పండి.'' అన్నాడు. మాకు బోలెడంత సంతోషం వేసింది. అతని పేరు మల్లిఖార్జున్. మేమున్నన్ని రోజులు మంచి భోజనం పెట్టాడు. చేపలు, పీతలు, నాటుకోడి అన్నీ ఆంధ్రా స్టయిల్‌లో వండి వడ్డించే వాడు కాంటీన్‌లో.

మర్నాడు హేవ్‌లాక్ ఐలాండ్‌కి వెళ్ళాలనేది మా ప్రోగ్రామ్. పోర్ట్ బ్లయర్ నుంచి హేవ్‌లాక్‌కి షిప్‌మీద రెండు గంటల ప్రయాణం. ఉదయం ఎనిమిందింటికి షిప్ బయలురుతుందని రెడీగా వుండమని చెప్పి వెళ్ళాడు ప్రొటోకాల్ చూస్తున్న భండారి.

మర్నాడు ఉదయం తొందరగా బ్రేక్‌ఫాస్ట్ చేసేసి షిప్ బయలుదేరే ప్రదేశానికి వెళ్ళాం. అక్కడంతా చాలా రష్‌గా, గోలగా వుంది. వివిధ ప్రదేశాలకు బయలుదేరే షిప్‌లు అక్కడ ఆగివున్నాయ్. మా షిప్ పేరు వందూర్ అని, అది హేవ్‌లాక్ ఐలాండ్‌కి వెళుతుందని

భండారి చెప్పి మమ్మల్ని అందులో ఎక్కించాడు. మేము లోపలి కెళుతుండగా ఓ కబురు కూడా చెప్పాడు. విఐపి లాంజ్‌లో ఖాళీలేవని, ఒక రూమ్ వున్నా అది శుభ్రంగా లేదని, పబ్లిక్‌తో పాటు కూర్చోవాల్సి వుంటుందని చెప్పాడు. ఏం ఫర్వాలేదు. ఇంతటి జలరాశిని వదిలి పెట్టి రూమ్‌ల్లో ఏం కూర్చుంటాంలే అని అతనితో చెప్పి మేము మాకిచ్చిన రూమ్‌లో కెళ్ళి మా బ్యాగు పెడుతుండగానే షిప్ బయలుదేరింది. ఇంతలో ఇంజన్ రూమ్‌లో వుండే అటెండెంట్ వచ్చి పైకి వెళదాం రండి అని మమ్మల్ని కెప్టెన్ కేబిన్‌ల్లోకి తీసుకెళ్ళాడు. కనుచూపు మేరంతా నీలం రంగులో పరుచుకున్న బంగాళాఖాతం. నేను కళ్ళు తిప్పుకోలేక అలాగే చూస్తుంటే ''ఏం సార్ తెలుగువారా?'' అనే పిలుపు వినబడింది. ''అవును. ఎలా గుర్తు పట్టారు'అన్నాం. తెలిసిపోతుంది సార్. మాది వైజాగు. నా పేరు స్వామినాథం నేను ఈ షిప్ కెప్టెన్‌ని'' అంటూ పరిచయం చేసుకున్నాడు. 'ఆహా! బావుందండి.చూస్తుంటే అండమాన్‌లో ఆంధ్రవాళ్ళు బాగానే వున్నట్టున్నారు. ''అవును. చాలామంది వున్నారు. వైజాగు నించి షిప్‌లో వస్తుంటారు.'' అంటూ ఆయన కబుర్లలోకి దిగారు.

మా కోసం కుర్చీలు తెప్పించి వేయించారు. నేను కన్నార్పకుండా ఆ మహాసాగరాన్ని చూస్తున్నాను. మా షిప్ చాలా వేగంగా వెళుతోంది. మధ్యలో చిన్న చిన్న ద్వీపాలు ఎదురౌతున్నాయి. దట్టమైన అడవులు కన్పిస్తున్నాయి. నీలపు నీళ్ళ అంచుల వెంబడి విస్తరించిన ముదురాకుపచ్చ అడవుల సౌందర్యం చూసి తీరాల్సిందే. నేను చాలా బీచ్‌లు చూసాను గాని కెరటాలను తాకుతూ వుండే అడవుల్ని ఎక్కడా చూడలేదు. ఒడ్డుకు చాలా దూరంగా కొబ్బరి తోటలు చూసాను కానీ ఇలాంటి అడవుల్ని చూళ్ళేదు. నీళ్ళల్లో మునిగి వుండే మంగ్రవ్స్ మొక్కల్ని కూడా నేను అక్కడే చూసాను.

మా 'వంగర్' సాగర జలాలను చీల్చుకుంటూ హేవలాక్ ద్వీపం వైపు వెళుతోంది. వేడి వేడి కాఫీ వచ్చింది. సముద్రపు గాలి చల్లగా వొంటిని తాకుతుంటే, వెచ్చటి కాఫీ తాగడం ఎంత బాగుందో. ఆంధ్ర కెప్టెన్ మాకు బోలెడన్ని మర్యాదలు చేసాడు. షిప్ అంతా తిప్పిచూపించాడు. ఇంజన్ రూమ్‌లోకి తీసుకెళ్లగానే ఆ వేడికి నా శరీరం కాలిపోతుందేవె అన్పించింది. ఆ శబ్దానికి చెవులు చిల్లులడిపోతాయని భయమేసింది. అంత వేడిగా, అంత భయంకరమైన చప్పుడుగా వుందక్కడ.చెవులకి రక్షణగా కప్స్ తగిలించుకున్నాగాని ఆ హోరు వినబడుతూనే వుంది. అలాంటి స్థితిలో కూడా పనిచెయ్యక తప్పని మనుష్యులున్నారక్కడ. మేము కొంచెం సేపు అటు ఇటు తిరిగి పైకి వచ్చేసాం.

ఇంకో పది నిముషాల్లో హేవలాక్ ఐలాండ్‌లో వందూర్ ఆగింది. 'సాయంత్రం మా షిప్‌లోనే రండి' అంటూ మా కెప్టెన్ ఆహ్వానించాడు. మేము వసతి దొరికితే రాత్రిని హేవలాక్‌లోనే గడుపుదామనుకున్నాం. 'మేము సాయంత్రం బయలుదేరితే వంగర్‌లోనే వస్తామని' చెప్పి షిప్‌దిగి బయటకొచ్చాం. అక్కడంతా హడావుడిగా, రద్దీగా వుంది. షిప్‌లోంచి దిగిన యాత్రికులు,కారు హారన్ వెతలు గందరగోళంగా వుంది. కొంచెం దూరంలో మా పేర్లు రాసిన ప్లేకార్డు పట్టుకుని ఓ కుర్రాడు నిలబడ్డాడు. మేము అతని దగ్గరకెళ్ళాం. 'ఆయియెమేంసాబ్' అంటూ మమ్మల్ని ఆహ్వానించి కారు దగ్గరకు తీసుకెళ్ళాడు. అతని పేరు జెయిమ్. కారు అతనిదే. చక్కటి హిందీ, ఇంగ్లీషు మాట్లాడుతున్నాడు.



మేము కారులో కూర్చోగానే ప్రోగ్రామ్ ఏంటని అడిగాడు. గెస్ట్‌హౌస్‌కి వెళదామంటే, రూమ్‌లు దొరకడం కష్టమని,ప్రెసిడెంటు పర్యటన సందర్భంగా ఎవరికీ రూమ్‌లివ్వడం లేదని అన్ని గెస్ట్ హౌస్‌లు రిపేర్ చేస్తున్నారని చెప్పాడు జెయిమ్ . ప్రయత్నం చేద్దాంపద అంటే సరే అని బయలుదేరాడు. హేవలాక్ ద్వీపం చుట్టూ సముద్రం.ద్వీపం లోపల దట్టమైన అడవిలాగా పెరిగిన కొబ్బరి,పోకచెట్లు. ఎంత పచ్చగా వుందంటే–ఆ పచ్చదనానికి గుండెలయ తప్పుతుంది. ఆ ప్రకృతితో ప్రేమలో పడి మిగిలిన ప్రపంచాన్ని ఎడమకాలితో తన్నేయగల తన్మయం కల్గుతుంది. నేను ఆ చెట్లల్లో, పుట్టల్లో పడి పారవశ్యంలో మునిగిన వేళ మా కారు అంతకన్నా అద్భుతమైన ప్రదేశంలో ఆగింది. నీలి సముద్రం ఒడిలో కెరటాల లాలిపాటలో ఒదిగివున్న డాల్ఫిన్స్ గెస్టహౌస్‌కి మమ్మల్ని తెచ్చాడు. గెస్ట్‌హౌస్‌కి ఎదురుగా ఎండలో మిల మిల మెరిసిపోతున్న సాగరం. అబ్బ! ఈ గెస్ట్‌హౌస్‌లో ఒక్కరోజున్నా చాలు కదా! ఇంత సౌందర్యం, ఇంత నిశ్శబ్దం, కెరటాల చప్పుడు తప్ప మరేమీ వినబడని ఈ నిరామయ ప్రదేశం.

నేను వెంటనే ఆ ప్రాంతంతో ప్రేమలో పడిపోయాను. నేనలా తన్మయంలో మునిగివుండగానే జెయమ్ రూమ్‌లివ్వరట. గెస్టహౌస్ మూసేసారట అని చెప్పాడు. నాకు చాలా కోపమొచ్చింది. ఎప్పుడో వారం తర్వాత వచ్చే ప్రెసిడెంట్ కోసం ఇప్పట్నించే పర్యాటకుల్ని ఇలా ఇబ్బంది పెట్టడం ఏం భావ్యం? ఇంత అందమైన ప్రాంతం వారం రోజులు బోసిపోవాల్సిందేనా? జనాలను చుట్టూ పక్కలక్కూడా రానీయడం లేదట. రూమ్‌కోసం చాలా

ప్రయత్నాలు చేసి చేసేదేంలేక కనీసం ఇక్కడి సముద్రాన్నయినా తాకుదాం. ఇంత స్వచ్ఛంగా మెరిసిపోతున్న జలాలను తాకకుండా ఎలా అనుకుంటూ నీళ్ళలోకి దిగి కెరటాలతో కాసేపు ఆడి, అక్కడి నుండి అయిష్టంగా బయలుదేరాం. బంగారంలా మెరిసిపోతున్న ఇసుక తిన్నెల్ని ప్రేమగా ఆలింగనం చేసుకుంటున్న నీలి రంగు నీళ్ళు. కళ్ళు తిప్పుకోలేని ప్రకృతి సౌందర్యం, కళ్ళనీళ్ళొచ్చాయి అలా వదిలేసి వెళ్ళిపోతున్నందుకు. ఆ బీచ్‌లోనే నాకో పెద్ద శంఖం దొరికింది. దాన్ని తాకినపుడల్లా నాకు డాల్ఫిన్స్ బీచ్ కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది.

మధ్యాహ్నం అవుతోంది. లంచ్‌కోసం మంచి హోటల్‌కి తీసుకెళ్ళమని జెయిమ్‌కు చెప్పాం. దట్టంగా అల్లుకున్న పొదలు, చెట్లు, పక్షుల కిలకిలా రావాల సంగీతం వినబడుతున్న చక్కటి పొదరిల్లులాంటి హోటల్‌కి తీసుకెళ్ళాడు.

అక్కడికి సమీపంలోనే సముద్రం. పక్షుల పాటల్తో పోటీ పడుతూ కెరటాల హోరు వినబడుతోంది. అంత హాయైన ప్రదేశంలో ఆకలేం వేస్తుంది? అయినా వాళ్ళు పెట్టిందేదో తిని మళ్ళీ మా వాహనంలో కొచ్చి పడ్డాం.

''జెయిమ్! ఇపుడెక్కడికి తీసుకెళతున్నావ్?''

'కోరల్స్ చూడ్డానికి ఎలిఫెంటా బీచ్ కెళుతున్నాం'అన్నాడు. ''కోరల్స్''ఎక్కడున్నాయ్? సముద్రం లోపలికెళ్ళాలి. ''హేవ్‌లాక్‌నుంచి ఓ గంట ప్రయాణం. పడవలో ఎలిఫెంటా బీచ్‌కెళ్ళాలి.'' ఈ మహా సముద్రంలో పడవ మీదా?'' 'అవును . పడవలోనే వెళ్ళాలి. సముద్రంలోపలి కెళితే గాని కోరల్స్ కనబడవు.''అంటుండగానే ఉదయం మేము షిప్ దిగిన ప్రాంతానికి వచ్చాం. ఇక్కడినుంచే పడవ మాట్లాడుకోవాలి'అన్నాడు జెయిమ్. మేము కారుదిగి నిలబడగానే ఓ కుర్రాడు మా దగ్గరకు వచ్చాడు.'ఇతను సురేష్. పడవ ఇతనిదే. మిమ్మల్ని ఎలిఫెంటా బీచ్‌కి తీసుకెళ్ళి, కోరల్స్ చూపిస్తాడు''. చెప్పాడు జెయిమ్.రానూ పోనూ మాట్లాడుకొని మేము అతను తెచ్చిన గటిపడవ ఎక్కాం. పడవ ఎంతో అందంగా వుంది. పసుపు. ఎరుపు రంగు గడుతో ఆకర్షణీయంగా వున్న మర పడవ. జెయిమ్ కూడా మాతో పాటే పడవెక్కాడు. మోటార్ ఆన్ చేయగానే పడవ సముద్ర గర్భంవేపు దూసుకెళ్ళసాగింది. మేము కూర్చున్న ఎడమ చేతివేపు సముద్రతీరం వెంబడి దట్టమైన అడవి. నీళ్ళల్లోకి చొచ్చుకొచ్చిన మంగ్రోస్ చెట్లు. ఎగిసిపడుతున్న కెరటాల మీద ఎగిరెగిరి పడుతున్న పడవ. ఇటీవల ప్రళయకావేరిలో పడవ ప్రయాణం గుర్తొచ్చింది. ఈ సముద్ర కెరటాలు మరింత ఎత్తుగా రావడంతో పడవలోకి నీళ్ళు చిప్పిల్లుతున్నాయి. సముద్ర మధ్యంలోకి ఇంత చిన్న పడవలో ప్రయాణం చేయడం సాహసమే. పడవ ఎగిరినపుడల్లా గుండె ఝుల్లుమంటోంది. చుట్టూ అల్లుకున్న ఈ అనంత జలరాశి, నీలపు రంగుతో అందమైన డిజైన్లు, నడినెత్తిమీదున్న సూర్యుడి కిరణాలకి మిల మిల మెరిసిపోతున్న నీళ్లు. ఎగిరెగిరి పడుతున్న మా గూటి పడవ. ప్రకృతి సౌందర్యాన్ని, బీభత్సాన్ని, గగుర్పాటుని, సాహసాన్ని ఒకేసారి అనుభవించడం అంటే ఏమిటో అవగతమైన క్షణాలవి. మా పడవ వూగుతూ, వయ్యారాలు పోతూ ఎలిఫెంటా బీచ్‌కి చేరింది. బీచ్‌ని ఆనుకుని అడవి. ఈ అడవిలోంచి ఏనుగులతో కట్టెల్ని మోయిస్తారట. లోపల్నించి ఏనుగులు మోసుకొచ్చిన పెద్ద పెద్ద మానుల్ని పడవలమీద ఎగుమతి చేస్తారట. ఒకప్పుడు చాలా ఏనుగులుండేవట. మాకయితే ఒక్కటీ కనబడలేదు. బహుశ అడవి లోపల ఉండొచ్చు.

పడవని కట్టేసి సురేష్ వచ్చాడు. అతని చేతిలో ఆక్సిజన్ మాస్క్ వుంది. ''ఇదెందుకు సురేష్ అంటే సముద్రం లోకి వెళ్ళాలి కదా! అన్నాడు. కోరల్స్ ఎక్కడున్నాయి? అంటే అక్కడ అంటూ కడలి వేపు చూపించాడు. అమ్మో! అంతలోపలికా అంటే 'ఫర్వాలేదు నేనున్నాను కదా! భయపడకుండా నా చెయ్యి పట్టుకుని వచ్చేయండి అన్నాడు. 'మళ్ళీ తనే మీరు చీరతో లోపలికి రాలేరు. అదిగో అక్కడ డ్రస్‌లు అద్దెకిస్తారు. వెళ్ళి మార్చుకురండి అన్నాడు. నాసహచరుడు హాయిగా నిక్కరేసేసుకుని కెరటాలమీద ఈత కొడుతున్నాడు. నేను బట్టలు అద్దెకిచ్చే చిన్న పాక దగ్గరికెళ్ళి ఓ నిక్కరు, టీ షర్ట్ తీసుకుని వేసుకున్నాను. నాలాంటి వాళ్ళు చాలామందే వున్నారక్కడ. ఎవ్వరికీ వొంటిమీద ఏం వేసుకున్నామన్న స్పృహే లేదు. నీళ్ళతో ఆడుతూ, ఇసుకలో దొర్లుతూ, సముద్ర గర్భంలోకి వెళుతూ అందరూ మహానందనంలో మునిగివున్నారు. కెరటాలతో సయ్యాటకి చీరెంత

అడ్డో నేను వేరే డ్రస్సులోకి మారాక అర్థమైంది. ఇంక లోపలికి వెళదామా అంటూ సురేష్ వచ్చాడు. నువ్వు ముందువెళ్ళు అన్నాడు రావ్. నా తలకి ఆక్సిజన్ మాస్క్ తగిలించాడు. నీళ్ళల్లో మునిగి ప్రాక్టీస్ చెయ్యమన్నాడు. మొదటిసారి మునగ్గానే నోట్లోకి ఉప్పునీళ్ళు వెళ్ళిపోయి ఉక్కిరిబిక్కిరైపోయాను. అలా నాలుగైదు సార్లు ప్రాక్టీస్ చేసాక కాస్త అలవాటయింది.

'సరే వెళదాం పద'అన్నాను. సురేష్ చేయి అందించాడు. అతని చేతిని గట్టిగా పట్టుకుని ఇంతకు ముందెప్పుడూ చూడని, కలలో సైతం ఊహించని ఓ అద్భుత ప్రపంచం లోకి చేపపిల్లలా ఈదుకుంటూ వెళ్ళిపోయాను. ముక్కుతో మాత్రమే గాలి పీల్చుకుంటూ, ఎట్టి పరిస్థితుల్లోను నోరు తెరవకుండా మొదటిసారి నీళ్ళల్లోకి మునిగి కళ్ళముందు కనబడిన అపూర్వదృశ్యానికి అబ్బురపడి 'వావ్' అంటూ నోరు తెరవడంతో నోట్లోకి నీళ్ళు పోయి ఉక్కిరి బిక్కిరై పైకి వచ్చేసాను. సురేష్ హెచ్చరికని పాటించి మళ్ళీ నీళ్ళ అడుగుకి వెళ్ళాను. అబ్బ! బతికివున్న రంగు రంగుల కోరల్స్. రకరకాల చేపలు. సూదుల్లా కాళ్ళకు గుచ్చుకుంటున్నాయి. గుత్తులు గుత్తులుగా, రంగు రంగుల పూల గుత్తుల్లా జీవంతో తొణికిసలాడుతున్న కోరల్స్. సురేష్ చేతిని గట్టిగా పట్టుకుని అతని వెంబడి అలా అలా నీళ్ళమీద నడుస్తూ, సాగర సంపదని కన్నార్పకుండా చూస్తూ మైమరచిపోయాను. ఇలాంటి దృశ్యాలను డిస్కరరీ ఛానల్‌లో చూస్తూ పరవశించడమే ఇంతకాలం తెలుసు. ఇపుడు నేను కూడా ప్రత్యక్షంగా చూడగలుగుతున్నానే, తాకగలుగు తున్నానే అనే ఆనందం అణువణువు లోను నిండి పోయింది. అతను నన్ను సాగర గర్భంలోకి, కోరల్స్ కమనీయదృశ్యాల్లోకి ఎంతసేపలా లాక్కెళ్ళి పోయాడో గాని గాలి పీల్చుకోవడం కోసం నీళ్ళపైకి రాగానే తీరం చాలా దూరంగా కనబడింది. రావ్ చాలా దూరంలో కనబడతున్నాడు. ఇంత లోపలికికొచ్చేసామా అంటూ ఆశ్చర్యపడుతూ, మళ్ళొకసారి నీళ్ళల్లో మునిగి సూర్యకాంతితో సమానంగా మెరుస్తున్న కోరల్స్‌ని తనవితీరా చూసి ఓ చిన్న ముక్కని పీకడానికి ప్రయత్నించాను కానీ రాలేదు. సురేష్ అవలీలగా ఓ చిన్న కోరల్‌ని పీకాడు. దాన్ని మోసుకుంటూ నీళ్ళ మీది కొచ్చేం. మెల్లగా ఈదుకుంటూ తీరం చేరాం. ఎలా వుంది అని రావ్ అడిగాడు. అద్భుతం, అపూర్వం అన్నాను. తర్వాత రావ్‌ని తీసుకుని, సురేష్ వెళ్ళాడు. నేను ఆ అద్భుతానందాన్ని గుండెల్లోకి ఒంపుకుంటూ కెరటాలతో ఆటాడుతూ నిలబడ్డాను. అక్కడ తీరం వెంబడి రకరకాల ఆకారాలతో చనిపోయిన కోరల్స్ వెదజల్లి నట్టున్నాయి. బోలెడన్ని కోరల్స్ ఏరాను. వాటన్నింటినీ బాగులో వేసుకున్నాను. రావ్ కూడా తిరిగొచ్చాక, మా పడవలో హేవలాక్ బయలుదేరాం.

ఆ రోజు పౌర్ణమి.సముద్రం మంచి పోటు మీదుంది. కెరటాలు మరింత ఎత్తుకి లేస్తూ పడవని ఢీ కొడుతున్నాయి. నీళ్ళు ఎగిరొచ్చి మమ్మల్ని తడుపుతున్నాయి. హఠాత్తుగా పడవ బోల్తా పడితే? ఏముంది పోయి ఆ కోరల్స్ మీదేగా పడతాం. 'ఇక్కడ పడవలెప్పుడైనా బోల్తాకొట్టాయా? సురేష్‌ని అడిగాం. ఊహూ.. డరనా నహీ ..కుచ్ నైహోగా అన్నాడు''. హమ్ నహీడరరే. ఊరికే అడుగుతున్నాం'' అన్నాను నేను.జెయిమ్ అందుకుని ''కోరల్స్ బావున్నాయా? మీకు నచ్చిందా?'' అన్నాడు. నేను సమాధానం చెప్పేలోగానే సురేష్ 'మేడమ్! మీకు బతికిన కోరల్ ఇచ్చాను కదా! అది ఎవ్వరికీ చూపించొద్దు.'' అన్నాడు. ''ఏమౌతుంది చూపిస్తే..'' ''బతికిన కోరల్స్ సముద్రంలోంచి తియ్యడం నేరం. పోలీసులు పట్టు కుంటారు''.''అరే! వాటిని తియ్యకూడదా?మాకు తెలియదు కదా! ఇక్కడ బోర్డు కూడా పెట్టలేదు!'' ''ఫర్వాలేదు. ఏమీకాదు. మీరు ఉప్పునీళ్ళల్లో దాన్ని వేయండి. అది బతుకుతుంది.''అన్నాడు. మేమిలా మాటల్లో వుండగానే మా పడవ హేవలాక్ తీరం చేరింది. జెయిమ్ వెళ్ళి కారు తెచ్చాడు. మేము పడవ దిగి కారులో ఎక్కగానే ''మనమిప్పుడు రాధానగర్ బీచ్ కెళుతున్నాం'' అన్నాడు.

బాగా ఆకలిగా వుంది. ఏమైనా తిందామంటే అక్కడ బీచ్‌లో హొటల్స్ వుంటాయని అక్కడ తినొచ్చని చెప్పాడు. 'అయితే నేను కొబ్బరి బొండాం తాగుతాను! అంటే బొండాలమ్మే బండి దగ్గర ఆపాడు. మన ప్రాంతపు బొండాం కన్నా రెండింతలు పెద్దగా వుంది. లీటర్ నీళ్ళుపైనే వున్నాయి. తియ్యగా, చల్లగా చాలా బావున్నాయి కొబ్బరినీళ్ళు. ఓ పెద్ద అడవి, కొండ దాటి రాధానగర్ చేరాం. మేము అక్కడ హొటల్‌లో తింటున్నపుడు 'హాయ్! అంటూ ఓ విదేశీయుడు పలకరించాడు. అతను ఎలిఫెంటా బీచ్ దగ్గర కన్పించాడు. చేతిలో కర్రతో ఇంకొకతనితో కలిసి అడవిలోంచి, కొండదిగి మాకంటే ముందే వచ్చేసాడు. 'u came before us.how can it be possible?అంటే yah.everything is possible with this'అంటూ తన కర్ర చూపించాడు. అతను ఫ్రాన్స్‌నించి వచ్చాడట. పెయింటింగు పని చేస్తాడట. సంవత్సరమంతా పనిచేసి డబ్బు కూడబెట్టి నెలరోజులు ఇలా దేశాలు తిరుగుతాడట.'ఆహా! అన్పించింది నాకు.

టిఫిన్ తినడం అయ్యాక బీచ్‌లోకి వెళ్ళాం చాలా అందమైన బీచ్. బంగారంలా మెరిసిపోతున్న ఇసుక తిన్నెలు. స్వచ్ఛంగా , తేటగా వున్న నీళ్ళు, నీళ్ళనానుకుని అడవి. ఎక్కడా ఒక్క ప్లాస్టిక్ కవర్‌గాని, చెత్తా చెదారంగాని కనబడలేదు. శుభ్రంగా చీపురుతో ఊడ్చినంత నీట్‌గా వుంది బీచ్. కళ్లముందు కనబడుతున్న వివిధ రంగులు, బంగారం రంగు ఇసుక, ఆ ఇసుకను తాకుతూ తెల్లటి మల్లెపువ్వు ల్లాంటి కెరటాలు, ఆ కెరటాలను తరుముతున్న నీలం రంగు నీళ్ళు, కొంచెం కన్నుసారిస్తే ఆకుపచ్చటి అడవి. నేనలా మంత్రముగ్ధనై, ప్రకృతి సోయగానికి పరవశమై కళ్ళల్లో నీళ్లు బుకుతుంటే రెప్పవేయకుండా చూస్తుండి పోయను. విస్తారమైన ఆ బీచ్ కెరటాల సంగీతం తప్ప మహా నిశ్శబ్ధంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని అనుభవించాల్సిందే.

నిశ్శబ్దాన్ని ప్రేమించటానికి, మనలో పేరుకు పోయిన శబ్ద

కాలుష్యాన్ని కడుక్కోడానికైనా రాధానగర్ బీచ్ కెళ్ళాలి. మేమలా చిత్తరువుల్లా కూర్చుని వున్నపుడు జెయిమ్ వచ్చాడు. మేము మెల్లగా లేచి మా కారువేపు నడవసాగాం. నేను బోలెడన్ని డెడ్ కోరల్స్ ఏరుకున్నాను. రకరకాల డిజైన్లవి. మాకు గెస్టహౌస్ దొరకలేదు కాబట్టి పోర్ట్ బ్లేయర్‌కి తిరిగి వెళ్ళాలి.

మా కారు షిప్ ఎక్కాల్సిన యార్డ్ వేపు వెళుతోంది. జెయిమ్ ఆ ద్వీపం గురించి ముచ్చట్లు చెబుతున్నాడు. అక్కడ అందరూ కష్టపడి పనిచేస్తారని, పని లేకపోవడమంటూ వుండదని చెబుతూ, కొబ్బరికాయలు తీయడం, ఏరడం, పోకకాయలు తెంపడం,

వాటిని సేకరించడంలాంటి పనులు సంవత్సరమంతా వుంటాయట. టూరిస్ట్‌లకు సంబంధించి కూడా చాలా మందికి ఉపాధి దొరుకుతుంది. మా హేవలాక్‌లో ఎవ్వరూ పేదవాళ్ళు లేరు అంటూ చాలా గర్వంగా చెప్పాడు. పోకచెట్టు మీద ఎగబాకుతున్న మనిషి, ఓ చెట్టునుండి ఇంకో చెట్టుకు దూకుతూ కంటబడ్డాడు. సన్నగా, రివటలాగా వుండే పోక చెట్టు చాలా సులువుగా ఒంగుతుంది. ఒక చెట్టునుంచి ఇంకో చెట్టుకు చాకచక్యంగా దూకుతుంటారు. మేము కారు దిగి కొన్ని పోకకాయలు ఏరి తెచ్చుకున్నాం. మేము షిప్ ఎక్కే ప్రాంతానికి వచ్చేటప్పటికీ ఐదుగంటలైంది. వందూర్ రెడీగా వుంది. స్వామినాధం మా కోసమే ఎదురు చూస్తున్నాడు. జెయిమ్‌కి డబ్బు చెల్లించేసి అతనికి గుడ్‌బై చెప్పాం. షిప్ ఎక్కడానికి నిలబడినవారిని, ఆ ద్వీపానికి చెందినవారిని గమనిస్తుంటే అందరి నోళ్ళు ఒకే లయలో కదలడం చూసి జెయిమ్‌ని అడిగాం ఏం తింటున్నారు అందరూ అని. 'గుట్కా', పాన్‌పరాగు అన్నాడు నవ్వుతూ. హేవలాక్‌లో ప్రతి వొక్కరూ గుట్కా తింటారని. గుట్కా వ్యాపారం చేసి లక్షలు సంపాదిస్తారని కూడా చెప్పాడు.

మేం షిప్‌లోకి ఎక్కగానే అది బయలుదేరింది. సూర్యాస్తమయ సమయం. పడమటి దిక్కు సింధూరం రంగులోకి మారింది. అప్పటివరకు నీలి ఆకాశంతో పోటీ పడిన సాగర జలాలు క్రమంగా నలుపు రంగుకి మారుతున్నాయి. షిప్ వేగంగా వెళుతోంది. చల్లటిగాలి హాయిగా తాకుతోంది. అపుడే ఓ అద్భుతాన్ని చూసాన్నేను. పడమటి ఆకాశంలో అస్తమించే సూర్యుడు అచ్చం చంద్రుడిలాగానే వున్నాడు. తూర్పు దిక్కుకు చూద్దునుకదా వెండివెన్నెలలు వెదజల్లుతూ పౌర్ణమి చంద్రుడు.రెండు బింబాలు ఒకేలా వున్న అపూర్వ దృశ్యమది. క్రమంగా సూర్యుడు సముద్రంలో మునిగిపోయాడు. చుట్టూ దీపాలులేని అఖండజలరాశి.సముద్ర మధ్యంలో మా షిప్. నీళ్ళల్లోకి మిల మిల మెరుస్తూ కురుస్తున్న వెన్నెల. నేను నిశ్శబ్దంగా ఒక మూలకి కూర్చుండిపోయి,ప్రకృతిలో లీనమైపోయను.రావ్ హైదరాబాద్‌నుంచి వచ్చిన ఒక పోలీసాఫీసర్‌తో కబుర్లలో పడ్డాడు. నేను మాత్రం మాట పలుకు లేకుండా బంగాళాఖాతం మీద మనోహరంగా కురుస్తున్న వెన్నెల్లో తడుస్తూ, తన్మయమౌతూ తరించిపోయాను. నా ఆనందాన్ని నా ఆత్మీయ నేస్తాలతో పంచుకున్నాను. సముద్రం మధ్యలో సెల్‌ఫోన్‌లు పనిచేయడం ఆశ్చర్యమే. నా కళ్ళతో నేను అనుభవించిన ఆనందాన్ని నా మిత్రుల చెవుల్లో విన్పించడానికి సెల్‌ఫోన్ భలే ఉపయోగపడింది. సంతోషం ఇతరులతో పంచుకోవడానికే అని గాఢంగా నమ్ముతాను. వెన్నెల్లో గోదారిని చూసాను గాని వెన్నెల్లో సముద్రం అందాన్ని ఇప్పుడే చూస్తున్నాను.క్రమంగా దీపాలు కనబడసాగాయి. దూరంగా పోర్ట్‌బ్లేయర్ ఐలాండ్ కనబడుతోంది. దీపాలు దగ్గరయ్యే కొద్దీ వెన్నెల వెలుగులు మసక బారసాగాయి. మా వెంట తెచ్చు కున్న అరిశెలు, మురుకులు స్వామినాధానికిచ్చేసాం. అతను చాలా సంతోషపడిపోయాడు. మాకిచ్చిన ఆతి ధ్యానికి ధన్యవాదాలు చెప్పి మేము 'వందూర్'' దిగేసాం.

మర్నాడు మా ప్రోగ్రామ్ జైలు లోపలి కెళ్ళి చూడ్డం. రోస్ ఐలాండ్, పీక్ పాయింట్ (ఎత్తైన ప్రదేశం) చూడ్డం. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసి సెల్యూ లర్ జైలుకి వెళ్ళాం. మొదటి రోజు రాత్రిపూట సౌండ్ అండ్ మ్యూజిక్ ప్రోగ్రామ్‌లో చూసిన జైలు. ఏడు పొడవాటి గోడల్లాగా ఒక వైపు మాత్రమే సెల్ తలుపు లుండేలా చాలా ప్లాన్డ్‌గా కట్టిన కరకు నమూనా. ఖైదీలు ఒకరి ముఖాలొకరికి కనబడవు. వందలాది ఖైదీలను బంధించి, చిత్రహింసలు పెట్టి, ఉరితీసిన భయంకరమైన ఆ జైలు సందర్శనం ఒంటిని జలదరింపచేసింది. ఖైదీలను ఏ విధంగా హింసించేవారో చూపించే బొమ్మలు వున్నాయక్కడ. ఒకేసారి ముగ్గురిని ఉరితీసే గది, వాసానికి వేలాడుతున్న ఉరితాళ్ళు. వీరసావర్కార్ గది. ఆవరణలో ఓ పెద్ద రావిచెట్టు వుండేదని, ఈ జైలులో జరిగిన అకృత్యాలను మౌనసాక్షి అదేనని గైడ్ చెప్పాడు. సునామీకి ఆ చెట్టు కూలిపోయి, దాని స్థానంలో ఓ పిల్లచెట్టు మొలిచింది. చాలా సేపు ఆ చెట్టు ముందు నిలబడ్డాను. నాతో ఏదో చెప్పాలన్నట్లు ఆకులు గలగల లాడాయి. గుస గుసగా ఏదో చెప్ప ప్రయత్నించాయి.

మనసంతా భారమైపోయింది. అదే మూడ్‌తో సునామీకి బాగా దెబ్బతిన్న రాస్‌ఐలాండ్ చూడ్డానికి వెళ్ళాం. పోర్ట్ బ్లెయిర్‌కి కన్పిస్తూ వుంటుంది ఈ చిన్న ద్వీపం. అక్కడ బ్రిటిష్ వాళ్ళ ప్రాభవ చిహ్నాలు చాలా వున్నాయి. క్లబ్‌లు, చర్చి, వాళ్ళ క్వార్టర్స్, టెన్నిస్ కోర్టుల్లాంటివన్నీ ప్రస్తుతం కూలిపోయి, ఆ శిధిలాల్లోంచి చెట్లు మొలుచుకొచ్చాయి. ఆ చెట్లు భవనాల ఆకారంలో గమ్మత్తుగా వున్నాయి. సునామీ తీవ్రంగా తాకిన ద్వీపమిది. అక్కడ దానికి సంబంధించిన ఎగ్జిబిషన్ వుంది. అందులో సునామీ కెరటాల్లో తన కళ్ళ ముందే తన భార్య ఎలా కొట్టుకుపోయిందో ఓ భర్త రాసిన ఉత్తరం వుంది.అన్నింటికన్నా నన్ను ఎక్కువగా ఆకర్షించింది. అక్కడి నుండి స్పష్టంగా కనబడే సెల్యూలర్ జైలు, సెంట్రల్ టవర్. జైలరు, అధికారులు ఇక్కడి నుండి కూడా జైలును కంట్రోలు చేసేవారని అర్ధమైంది. ప్రస్తుతం ఇక్కడ జనమెవ్వరూ నివసించడంలేదు. టూరిస్ట్‌లు మాత్రమే తిరుగుతున్నారు.

అక్కడి నుండి పోర్ట్‌బ్లెయిర్ మొత్తం కనబడే 'పీక్ పాయింట్'

కి వెళ్ళాం. చిక్కటి అడవిలోంచి కొండెక్కడం, ఆ కొండమీంచి సముద్రం, చిన్నా చితకా ఐలాండ్స్ కనబడ్డాయి. పోర్ట్‌బ్లెయిర్ చుట్టూ వుండే సముద్రం కన్పడింది. అడవిలోంచి ఏవో జంతువుల అరుపులు, పక్షుల కిలకిలలు కింద సముద్ర కెరటాలు. చాలా అందమైన ప్రదేశం. మేం తిరుగు ప్రయాణంలో కొండ దిగుతుంటే''తెలుగు ప్రాథమికోన్నత పాఠశాల'' పేరుతో తెలుగులో రాసి వున్న బోర్డ్ కన్పడింది. భండారిని అడిగితే ఈ ప్రాంతంలో తెలుగు వాళ్ళు చాలామంది వున్నారని చెప్పాడు.

మర్నాడు మ్యూజియమ్ చూసాం. అండమాన్ చరిత్రకి అద్దం పడుతూ ఎంతో సమాచారముందక్కడ.

ఇక్కడ ఈ దీవుల చరిత్ర కొంత రాయాల్సి వుంటుంది. అండమాన్ నికోబార్ ఐలాండ్స్ గురించి 1777 వరకు బయట ప్రపంచానికేమీ తెలియదు. 1777లో బ్రిటిష్ వాళ్ళు జరిపిన సర్వేలోనే ఇవి బయట పడ్డాయి. అంతవరకు ఈ ద్వీపాల్లో బయట నుంచి అడుగుపెట్టిన వాళ్ళెవరూ లేరు. ఆదిమ మానవులుగా పిలవబడే ''నెగ్రిటాస్'' ''మంగోలాయిడ్స్'' జాతి ఆదివాసులు శతాబ్దాలుగా ఇక్కడ బతుకుతుండేవారు. ఇక్కడ మొదట అడుగు పెట్టింది ఇంగ్లీషు వాళ్ళే. వారి రాజకీయ అవసరాల కోసం, ఖైదీలను ఉంచడం కోసం సెటిల్‌మెంటుగా దీన్ని మార్చేసారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వేలాది దేశ భక్తుల్ని ఈ సెటిల్ మెంట్లలో నిర్బంధించేవారు. ఆ తర్వాత సెల్యూలర్ జైలు కట్టారు. ఆ తర్వాత జపాన్ వాళ్ళు దాడి చేసి ఈ దీవుల్ని ఆక్రమించు కున్నారు.1947లో భారతదేశానికి సిద్ధించిన స్వతంత్రంతోపాటు అండమాన్, నికోబార్‌లు కూడా స్వతంత్రయ్యాయి.

అండమాన్స్‌కి వలస వచ్చిన వాళ్ళలో బెంగాలీయులే అధికులు. ప్రభుత్వ పాలసీ ప్రకారం, పునరావాస కార్యక్రమాల్లో భాగంగా 'సెట్లర్స్'గా వీళ్లు వచ్చారు. ఈ పునరావాస కార్యక్రమం 1949 నుండి 70 వరకు కొనసాగింది. తూర్పు పాకిస్తాన్ (ఇప్పటి బంగ్లాదేశ్) నుండే ఎక్కువ మంది ఇక్కడికొచ్చారు. అలాగే ఎంతోమంది 'ఎక్స్‌సర్వీస్‌మెన్' అండమాన్ దీవుల్లో పునరా వాసం పొందారు. వీరిలో పంజాబీలు, మరాఠీలు, మళయాళీలు, తమిళులు, తెలుగు వాళ్ళు వున్నారు. ఇలా బ్రిటీష్‌వాళ్ళు అడుగుపెట్టి, ఈ దీవుల ఉనికిని కనుక్కుని, తమ రాజకీయ అవసరాలకు వాడుకున్న తరువాత , ప్రస్తుతం వివిధ ప్రాంతాలకు చెందిన భారతీయులు ఇక్కడ చొరబడ్డారు. ఈ నాగరీకుల ప్రవేశంతో అప్పటివరకు స్వేచ్ఛగా బతుకుతున్న ఆదివాసులు లోపల్లోపలికి కుంచించుకుపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం అండమాన్స్‌లో వున్న 572 దీవుల్లో ఆదివాసులు కొన్ని దీవుల్లో మాత్రమే వున్నారు. నికోబార్ ఐలాండ్స్‌లో వీరు ఎక్కువగా నివసిస్తున్నారు. జరువాలు, షోమ్‌పెన్, గ్రేట్ అండమానిస్, ఓగ్గ్స్, సెంటినలీస్ అనే ఐదు తెగలకు చెందిన ఆదిమమానవులు, నాగరీక సెట్లర్స్ చర్యల వల్ల ప్రమాదంలో వున్నారని ఇటీవల భారత ప్రభుత్వ ఆదివాసీ విభాగం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ తెగలవారిని ''కుతూహలంగా'' చూసేవారే తప్ప వారి సమస్యలు వీరికి అర్థం కావని కూడా పేర్కోనడం గమనించాలి.

నికోబార్ ఐలాండ్‌కి మేము వెళ్ళలేక పోయాం కానీ అక్కడి ఆదివాసులకు సంబంధించి అనేక చిత్రాలు మ్యూజియంలో ప్రదర్శించారు. వారి ఇళ్ళు, ఆహారపుటల వాట్లు వస్త్రధారణ ఎంతో భిన్నంగా వుంటాయి. సునామీలో వేలాదిగా నికోబార్‌లో వుండే ఆదివాసులు చనిపోయారని, కొన్ని ద్వీపాలు శాశ్వతంగా సముద్రంలో కలిసి పోయాయని రాసివుంది. నికోబార్ ఐలాండ్ వెళ్ళడానికి ప్రత్యేక అనుమతి, రక్షణ ఏర్పాట్లు అవసరమని, ఆదివాసులు ఎవరినీ నమ్మరని, ఒంటరిగా వెళ్ళడం చాలా ప్రమాదమని భండారి మాకు చెప్పడంతో మేము ఆ ప్రస్తావన వదిలేసుకున్నాం.

అద్భుతానుభవాల్ని గుండెల్లో పదిల పరుచుకుని అండమాన్ ద్వీపానికి, గెస్ట్‌హౌస్ సిబ్బందికి వీడ్కొలు పలికి మేము చెన్నైవిమానం ఎక్కాం. విమానం అనంతజలరాశి మీద ఎగురుతుంటే దాని నీడ చేపలాగా నీళ్ళల్లో కనబడింది. ఎన్నో ద్వీపాలు. నీలిరంగు నీళ్ళు చుట్టుకున్న ఆకుపచ్చటి ఐలాండ్స్. అండమాన్‌లో గాల్లో ఎగిరి చెన్నైలో దిగేవరకు రవ్వంత భమి కనబడదు. నీళ్ళే నీళ్ళు. చెన్నైలో దిగేటప్పుడు ఓ గమ్మత్తు జరిగింది. ల్యాండ్ అవడానికి విమానం చాలా కిందకి దిగింది. అయితే ఎందుకనో దిగకుండా కిందే ఎగురుతూ తిన్నగా వెళ్ళసాగింది. నెల్లూరు దాటి పులికాట్ మీదుగా వెళ్ళి వెనక్కి తిరిగింది. నాయుడుపేట, తిరుపతి రోడ్డు స్పష్టంగా కన్పడుతుంటే నాకు ప్రతిమ గుర్తొచ్చింది. ప్రతిమా! మీ ఊరి మీద ఎగురుతున్నానని అరిచి చెప్పాలన్పించింది.సెల్‌ఫోన్ వాడనిస్తే ఫోన్‌లో చెప్పేదాన్నేమో! చెన్నై చుట్టూ చక్కర్లు కొట్టి లాండ్ అయ్యింది విమానం. మేము హైదరాబాద్ ఫ్లయిట్ కోసం ఎదురుచూస్తూ లాంజ్‌లో కూర్చున్నాం.

ఓ మహా నిశ్శబ్దంలోంచి, పచ్చటి ప్రకతిలోంచి, నీలాల సంద్రపు కౌగిలిలోంచి విడివడి మళ్ళీ జనారణ్యంలోకి అడుగు పెట్టడంతో మా అండమాన్ ద్వీపాలయత్ర ముగింపుకొచ్చింది. జనాభాతో కిటకిట లాడుతున్న ఈ ప్రాంతాలెక్కడ 572 ద్వీపాలకు కలిపి నివసిస్తున్న నాలుగు లక్షల మంది ఎక్కడ. అందులో బెంగాలీలు, మళయాలీలు, తెలుగు వాళ్ళు, హిందువులు, ముస్లిమ్‌లు, క్రిష్టియన్‌లు కలిసి మెలిసి సామరస్యంగా జీవించే అండమాన్ ఓ అద్భుత యత్రాస్థలం. ప్రకృతికి అతి సమీపంగా, శబ్దరాహిత్యంలో తరించాలనుకునే వాళ్ళకి చక్కటి గమ్యం. ప్రకృతి ప్రేమికులను పారవశ్యంలో ముంచేయగల మహాసంద్రం బంగాళాఖాతం అడుగడుగునా పాదాలను తాకుత మనల్ని పునీతుల్ని చేస్తుంది. పునరాగమనకాంక్షని రగిలిస్తుంది. మళ్ళెపుడు...అంటూ మనల్ని బలంగా తనవేపు లాక్కెళ్ళిపోగల మహా ఆకర్షణ అండమాన్.

కథ

# ఇటేటు రమ్మంటే.......



- తిరునగరి దేవకీ దేవి
హైదరాబాద్, 9949636515

"ఏం మీటింగులో ఏమో? అందులో చర్చించి తీసుకున్న నిర్ణయాలు ఒక్కటీ అమలులో పెట్టేది ఉండదు.అంతా నామినల్ తతంగాలు.టైం వేస్ట్ కార్యక్రమాలు." ఆలోచిస్తూ నే సృజన ఇంటి దారి పట్టింది. పది నిమిషాల్లో ఇల్లు చేరుకుంది కూడా. గేటు తాళం తీయబోతున్న సృజనకు కాంపౌండు వాలును ఆనుకున్న వేపచెట్టుకింద పడుకున్న ఉన్న ఓ ఆకారం కనపడింది. ఓ నిమిషం తదేకంగా చూస్తే ఆ శాల్తీ రవే అని తేల్చుకుంది.వెంటనే దగ్గరగా పోయి "రవీ" అంటూ బిగ్గరగా పిలిచింది.ఆ పిలుపుకు చలనం లేదు. లాభం లేదనుకుని కొంచెం గొంతు పెంచింది సృజన.మాంచి నిద్రలో ఉన్న రవి ఆ పిలుపుకు ఉలికి పడి దిగ్గున లేచిండు. హైరానా పడుతూ లేచి నిలబడి అమాంతంగా వంగి సృజనకు పాదాభివందనం చేసిండు. అలసిపోయిన రవి ముఖం చూసి సృజన హృదయం జాలితో నిండి పోయింది.

"రవీ గాఢ నిద్రలో ఉన్నట్టున్నవ్ ?" అడిగింది సృజన

" ఔ...టీచర్. రాత్రంతా పొలం కాడ జాగారమైంది." రవి తన గాఢ నిద్రకు కారణం చెప్పే ప్రయత్నం

"ఎందుకు?"అంటూ ఎదురు ప్రశ్న వేస్తూనే సృజన గేట్ తాళం తీసింది.

"మక్కలేసినం టీచర్ . పందులు ఆ సేన్ను బతుకనిస్తలేవు. దినాం కాపల పోక తప్పుత లేదు. మల్ల తెల్లారంగనే వాడుక పాలు పోసొచ్చి ఎనిమిది గంటలకల్ల కాలేజికురికిన. అందుకే జర్రంత కునుకు పట్టింది."రవి

"రెక్కల కష్టానికి ఆసరయ్యే కొడుకును కన్న నీ తల్లిదండ్రులు ఏ జన్మల పుణ్యం చేసుకున్నరో గాని మస్త్ అదృష్టవంతులు" అనుకుంట ఇంట్లకు దారి తీసిన సృజన రవిని కూర్చోమని చెప్పి లోపలికి పోయింది. ఓ పది నిమిషాల్లో కాళ్ళూ చేతులు కడుక్కొన్న ఆమె రెండు చేతుల్లో చాయ కప్పులతో హాల్లోకి ఎంటరైంది. ఓ కప్పును రవికి అందించి కుర్చీలో కూచున్నది. సృజన గవర్నమెంట్ స్కూల్ టీచర్ .ఆమె భర్త శేఖర్ జూనియర్ కాలేజీ లెక్చరర్ . గ్రామాలలో పేదతనంతో చావలేక బతుకలేక రోజులు వెళ్ళదీస్తున్న జనాలను ఎక్కువ.. రైతు కుటుంబాలదీ అదే పరిస్థితి.ఊళ్ళో కాలేజీ ఉన్నా వాళ్ళ బ్రతుకులలో పెద్ద తేడా లేదు.ఎందుకంటే చాలా మందికి చదువు పట్ల ధ్యాస ఏ మాత్రం లేదు.కేవలం ఫీస్ రీ ఎంబర్స్మెంట్ కోసమే చేరేవాళ్ళ సంఖ్యే ఎక్కువ.కొందరి పిల్లలకు చదువాలనే ఆసక్తి ఉన్నా పేదరికం..వ్యవసాయం పనులు ఆ చదువుకు బ్రేకులు వేస్తై.రవి వంటి వాళ్ళు ఏ ఒకరిద్దరో మట్టిలో వేసిన విత్తనం ఆ భూమిని చీల్చుకొని మొలకెత్తినట్లు తమ లక్ష్యం చేరుకుంటూ ఉంటరు.రవి సృజన పని చేసిన స్కూల్లోనే టెన్త్ చదివిండు.ఆ పిల్లవాడి చురుకుదనం..చదువుపట్ల ఉన్న ఆసక్తి ...పట్టుదల చూసి సృజన ముచ్చట పడుతది.అవసరాన్నిబట్టి చాలా సార్లు ఇతోధిక ఆర్థిక సాయం కూడా చేసింది .ఇప్పుడు శేఖర్ పని చేస్తున్న కాలేజీ లో ఇంటర్ యం. పి. సి సెకండ్ ఇయర్ చదువుతున్నడు. లెక్కలలో సందేహాలను తీర్చుకోవడానికి అప్పుడప్పుడూ ప్రత్యక్షమౌతూ వుంటడు. చాయ తాగడం పూర్తి కాగానే రవి గ్లాస్ కోసం కిందికి వంగిందో లేదో రవే ఆమె గ్లాసుతో పాటు తన గ్లాసు తీసుకొని ఇంటి వెనక్కి పోయి వాటిని కడుక్కోని రావడం నిమిషాల్లో జరిగిపోయింది. స్కూల్లుకు పోయే హడావిడిలో చదువలేకపోయిన పనిని పూర్తి చేయదలచుకొని ఆ పని లో మునిగి పోయింది సృజన.

" టీచర్"

" ఏం రవీ".

" గిది తీసుకో"

సృజన ఏంటిదన్నట్లు రవి ముకం చూసింది ." జరంత జొన్నపిండి తెచ్చిన"చెప్పిండు రవి

" గదెందుకు తెచ్చినౌ?"

"సారుకు రొట్టెలంటె పానం కదాని తెస్తి."

" ప్రతి నెల జొన్నలు తెప్పించి పిండి పట్టియ్యడం నా కలవాటే.ఇంట్ల జొన్నలున్నై. పిండున్న ది. . నువ్వెందుకు తెచ్చినట్లు."

"మీఇంట్ల లెవ్వనికాదు. నా కుతికొద్ది తెచ్చిన."అభిమానంగ మొహం పెట్టి చెప్పిండు రవి.

"సరె సరె..ఇప్పుడు తెచ్చినవేమో కాని ఇంకోసారి తేవొద్దు వింటున్నావా ? మీరే రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడ్డా మీ ఎవుసంల ఫాయిదా లేకపాయె .దాండ్ల మాకు అవి ఇవి తెచ్చుడేంది?" కొంచెం మందలిం పు ధోరణిలో అన్నది సృజన.

"ఇంకోపారి తేను లే టీచర్."అని తప్పొప్పుకున్నట్లు అంగీకరిస్తూనే "సారింకా వస్తలేడేంది?" అడిగిండు.రవి

" వస్తునే ఉండొచ్చు . వచ్చే టైం గూడ ఐంది. ఇంతల ఈ పేపర్ చదువు" అని ఆంధ్రజ్యోతి పేపర్ రవి చేతికిచ్చి తను లోపలికి పోయింది.సృజన అడుగు వంటింట్లో పడుతున్నదో లేదో శేఖర్ అడుగు ముందు గదిలో పడ్డది.స్కూల్ నుండి వచ్చిన సృజన సాయంకాలం పనులు ముగించుకొని.. జొన్నరొట్టెలు కూడా చేసింది. పొద్దటి పప్పు ఉండటంతో కూర వండాల్సిన అవసరం రాలేదు. ఓ ప్లేట్లో రొట్టె పప్పు పట్టుకొని వస్తున్న సృజనకు " నమస్తే సర్. నేను పోత. " అంటున్నడు రవి మాటలు వినిపించినై.

"ఏం రవి .అప్పుడే పోతవా? రొట్టె తిని పో."అనుకుంట రవి చేతికి ప్లేటిచ్చి" మీరూ కాళ్ళు చేతులు కడుక్కొని రండి. రొట్టె తిందురు గాని"అన్నది. అభిమానంగనే రవి రొట్టె తిని వెళ్ళి పోయిండు.

అప్పుడప్పుడు వచ్చి శేఖర్ దగ్గర డౌట్లు క్లియర్ చేసుకోవడం రవికి మామూలే. ఎటొచ్చీ ఎంత వద్దన్నా

వినకుండా మా చేన్లవని కూరగాయలు తెస్తునే ఉంటడు. అవి తీసుకోవడం సృజనకు మనసేమాత్రం అంగీకరించదు. ఆమె ఎప్పుడూ గిట్టుబాటు లేని రైతుల గురించే ఆలోచిస్తూ ఉంటది.ఆ ఆలోచన వస్తే ఆమెకు కడుపులో దేవినట్లైతది. అందుకే రవిని చూస్తె ప్రేమ. శేఖర్ ది కూడా అదే తంతు. లెక్కలు చెప్పడమే కాదు అప్పుడప్పుడు ఆర్థికంగా ఆదుకుంటాడు కూడా.

★ ★ ★

" ఆదివారం. సెలవే. ఎవరికి? స్కూల్ కు. మరి తనకో? తనకే కాదు ఆడజాతికే సెలవు లేదు.ఏ నాడు ఉండదు కూడా. ఐనా స్కూల్ కు సెలవేమో కాని స్కూల్ పనులకు సెలవేది? పిల్లల హోంవర్క్ కరెక్షన్ ...పరీక్ష పేపర్స్ ఉండేవే." ఆలోచిస్తూనే వీకెండ్ పనులకు శ్రీకారం చుట్టింది.మధ్యలో ఓ స్పీడ్ బ్రేక్. అభిజ్ఞ నుండి ఫోన్"అమ్మా క్షేమమా అంటూ మొదలై తన చదువు..పరీక్షలు..మెస్ లో తిండి...సమస్తం చెప్పుకొచ్చింది. ఇద్దరూ బోలెడన్ని ముచ్చట్లతో ..సృజనకు టైమే తెలియ లేదు శేఖర్ పిలిచే వరకు. ఒక్కగానొక్క బిడ్డ. దూరాభారంగా డెల్హీ లో ఐ ఐ టి చేస్తున్నది.ఫోన్ పలకరింపులే ఆ తల్లికి ఓ ఊరడింపు. దగ్గర లేదన్న బాధ తప్ప అభిజ్ఞ గురించి వాళ్ళకేమాత్రం రంది లేదు. చురుకైన పిల్ల.చదువుల సరస్వతి. .

వాళ్ళిప్పుడు ఇంటి ఆవరణలో పెంచుతున్న మొక్కలను స్వంత పిల్లలను పెంచినంత జాగ్రత్తగా శ్రద్ధగా పెంచుతున్నరు. వాటి ఆలనా పాలనలో ఆనందమే కాదు. ఆరోగ్యం కూడా. ఎందుకంటే స్వంతగా పెంచుతున్న కూరగాయలు తాజాగా ఉండటమనేది కాదు ఏ కెమికల్స్ చల్లని ఆర్గానిక్ జాబితావి. అంతేనా అభిజ్ఞ ఆలోచనలనుండి ఓ డైవర్షన్.అట్లా ఓ ఐదు సంవత్సరాలు చాలా సాదా సీదాగా గడిచిపోయినై.

సాయంకాలం నాలుగు కావస్తుంది .సృజన ఇంటిముందు ఆవరణలో ఇంటి వెనుకచెట్లకు నీళ్ళు పట్టే పనిలో శేఖర్ బిజీగా ఉన్నరు.గేటు చప్పుడుకు సృజన తల తిప్పింది. గేటు తీసింది ఎవరో కాదు. రవే. " ఏయ్ రవి .నువ్వేనా? రా! రా! బాగున్నావా? " అంటూ సంతోషంగా పిలిచింది.

"అంతా మీ దయ టీచర్. "అనుకుంటనే అమాంతం కాళ్ళ మీద పడ్డడు.

"లే లే ఇదేంపని.ఇంతకూ ఏం విశేషం." అనుకుంటూ రవిని కాళ్ళ మీదినుండి లేవదీసింది.

రవి స్వీటు పాకెట్ తెరుస్తూ సారేడున్నడు?"అనుకుంట దిక్కులు చూసిండు." ఆగాగు. కొంచెం గుర్రాన్ని కట్టై. ఇంతకూ ఈ స్వీటేంటిది?ఓ.. రిజల్ట్స్ వచ్చినై కదా ! మరిచే పోయిన.ఫస్ట్ క్లాసే వచ్చుంటౌ.ఔను కదా! " అని సృజన ప్రశ్నలు తనే వేసి జవాబులు తనే చెప్తూ తెగ సంబుర పడ్డది. పైగా పెద్దగా "

ఏమండీ! ఇదిగో మన రవి శుభ వార్త తెచ్చిండు. తొందరగా రండి ."అంటూ పిలిచింది.శేఖర్ కూడా అంతే సంతోషంగా గబగబా చేతులు కడుక్కొని వచ్చిండు. శేఖర్ కు కూడా వీర లెవల్లో పాదాభివందనం చేసిన రవి మెల్లగా స్వీట్ డబ్బా తెరిచి చెరో కోవాబిళ్ల అందించిండు. వాళ్ళా స్వీటు ముక్కను తిరిగి రవికే తినిపించిన్రు. ఈ దండాలు పెట్టడం స్వీటు తినిపించడం కాదు. నువ్వు ఉత్తముడిగా ఎదిగితే మాకదే పది వేలు." అన్నారు ఇద్దరు.

"సర్...అంతా మీదే దయ."

" ఇందులో మా దయేంగాని నీ ప్రయత్నం పట్టుదలలే నీ సక్సెస్ కు కారణం" అన్నది సృజన?

"గట్లనకండి మేడమ్. ఇంటర్ రాంగనే యల్.యల్.బి చేయమని చెప్పింది మీరే కదా!"

మెల్లెగ ఏదో లింక్ ఆడ్ చేసిండు రవి.ముగ్గురూ హాల్లో చేసిన్రు.కాసేపు చదువులు ఉద్యోగాలపై చర్చ జరిగింది .సవ్యసాచి సృజన ఒకవైపు వాళ్ళిద్దరితో మాట్లాడుతూనే వంటింట్లోకి పోయి స్టౌ మీద బియ్యం పడేసి వచ్చింది.

"బార్ కౌన్సిల్ ఎగ్జామ్ రాయి రవి " సలహా ఇచ్చిండు శేఖర్ .

" రాద్దామనే ఉన్నది సర్.పగలేమన్న పని చేసుకుంట రాత్రి పరీక్షకు ప్రిపేర్ కావాలనుకుంటున్న"

రవి

" పనంటె ?.."

" ఎవరన్న లాయర్ దగ్గర జూనియర్ గ చేర్పించండి" బ్రతిమిలాడే ధోరణిలో కాదు మీదే ఆ బాధ్యత అన్న లెవల్లో మాట్లాడిండు.

" రెండెట్ల కుదురుతై.జూనియర్ గ పని చేసుడంటే మాటలుకాదు.పొద్దు మాపు ఆఫీస్ ల పనుంటది.మధ్యాహ్నం గూడ ఏ కోర్టుకు పొమ్మంటే ఆ కోర్ట్ కు అటెండై బెయిల్ ఇప్పించడం..కేసులకు వాయిదా డేట్స్ తీసుకోవడం .మస్త్ పనులుంటై. ఇకఎగ్జామ్ ప్రిపరేషన్ కు టైం ఎక్కడ దొరు కుతది" అడిగిండు శేఖర్.

"కేసులతోటి అనుభవం వస్తదని అనుకుంటున్న సార్ .పైగా నా చేతి ఖర్చులు కూడ ఎల్తైయని ఆశ. ఎట్లనన్న మీరు జర కోశీశ్ చేయ్యండి. నేను కష్టపడుత." పని ఇప్పియ్యక తప్పదన్నట్లు మాట్లాడిండు రవి.

"సరె ..ఐతే హైదరాబాద్ లో నా ఫ్రెండ్ గోపాల్ హై కోర్ట్ అడ్వకేటుగ పని చేస్తున్నడు.మంచి పేరున్న లాయర్. నువ్వు మంచిగ పని చేస్తనంటె ఫోన్ చేస్త."శేఖర్.

"తప్పకుండా కష్టపడుత మీకు మాట రానీయ. నా మీన నమ్మకముంచండి" అంటూ రవి నమ్మ పలకడంతో శేఖర్ గోపాల్ కు ఫోన్ కలపడం..విషయం చెప్పి అంగీకరింప చేయడం అన్నీ ఒకటి వెంట ఒకటి జరిగిపోయినై..రవి ఆ పూట అక్కడే భోజనం చేసి.. శేఖర్ ఇచ్చిన విజిటింగ్ కార్డ్ తీసుకొని వెళ్ళి పోయిండు.

★ ★ ★

కాలం గడుస్తనే ఉంటది. ఏ పరిస్థితులు దాని ప్రయాణాన్ని అడ్డుకోలేవు.అది ఎవరి కొరకు ఆగదు కూడా. రవి గోపాల్ దగ్గర చేరి అప్పుడే రెండు నెలలైపోయింది. పొద్దున్నే చాయ తాగుతూ పేపర్ తిరగేస్తున్నడు శేఖర్. నేనూ ఉన్నానంటూ ఫోన్ చెవులను బద్దలు కొట్టింది."ఎవరై ఉంటారు ?" అనుకుంటూనే ఫోన్ ఆన్ చేసిండు శేఖర్ .

"హలో ! శేఖర్ మహాశయా! క్షేమమా!" అంటూ గోపాల్ నుండి ఫోను ఎందుకో ఆ రోజు లేచింది మొదలు రవి గురించే ఆలోచనలు.రెండు పనులు సవ్యంగా చేయ గలుగుతున్నాడా లేదా? అని ఆలోచిస్తున్న శేఖర్ కు వెతుకబోయిన తీగ కాళ్ళకు తగిలినట్లనిపించింది.

" నాకేం. నిక్షేపంగా ఉన్నాను. నీ సంగతే ఆలోచిస్తున్నాను."

" నా గురించా? నీ శిష్యపుంగవుడు రవి గురించా ఆలోచించేది? " కొంచెం నిష్ఠూర ధోరణి లోనే అన్నాడు గోపాల్

" ఎందుకు మహానుభావా..ఆ నిష్ఠూరం?"

"భలే మంచి కాండిడేట్ ను పంపించినౌ"

"ఇంతకు ఏమైందో చెప్పు.సస్పెన్స్ తో చంపక"

"చెప్పక తప్పుతదా! మంచి పిల్లగాడిని పంపించినౌ కదాని మస్త్ సంబరపడ్డ.కాని మస్త్ హుషారుతనం చేస్తుండు మీ రవి.అన్ని బద్మాష్ పనులే. వచ్చిన క్లయింట్ల దగ్గర ఏందేందో ముచ్చట్లు చెప్పి పైసలు గుంజుడు..అవకాశం చూసి లేడీస్ కు లైనేసుడు...పైగా ఏ రోజు ఆఫీసుకు టైంకు రాడు. అదేందంటే. బార్ కౌన్సిల్ ఎక్జామ్స్ ప్రిపరేషన్ అంటడు.ఒకటా..రెండా ..ఎన్నని చెప్పమంటవ్? .కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడేట్లున్నది.."తన గోడు వినిపించుకున్నడు గోపాల్.

"బుద్ధిమంతుడనే నీ దగ్గరికి పంపించిన. నిజం చెప్పాలంటె ఈ ఊర్లె ఉన్నప్పుడు ఈ లక్షణాలేవి లేకుండె. ఇంత తతంగం జరిగిందా? ఐనా సరిగ్గ కేసులు అటెండ్ ఐతే లా అంత మంచిగ అర్థమయ్యేది కదా! గిట్లెందుకు చేసిండు. నిన్ననవసరంగ తిప్పలు పెట్టినట్లైంది."

"నువ్వు చెప్పిన లక్షణాలేవి ఆ పిల్లగానిల మచ్చుకు గూడ నాకు కనపడలే."

" నీ మాటలను పట్టి చూస్తె సైడ్ ట్రాక్ అయిండని అర్థమైతున్నది.ఇట్లైతదనుకుంటె నీ దగ్గరికి పంపియ్యకుంటి. వాడి వల్ల నీ రిపిటేషన్ దెబ్బతింటది కదా!"బాధతో అన్నడు శేఖర్ .

"అందుకే దొరా! నీకు ఫోన్ చేస్తున్న."గోపాల్ గొంతు.

"ఏం చేద్దాం. కనీసం ఆ తప్పును దిద్దుకునే ప్రయత్నాన్ని చేద్దాం.వాణ్ణి పంపించెయ్."అని చెప్పి సృజనకు విషయాన్నంత పూసగుచ్చినట్లు చెప్పిండు.పేదవాడు..వృద్ధిలోకి రావలసినవాడు..

వచ్చి తీరాలని తోచిన సాయం చేస్తే ..ఫలితం ఇంకో రూపంలో కనబడ్డందుకు వాళ్ళు తలలు పట్టు కున్నారు. ఆ రోజు వాళ్ళకు కంటిమీదికి కునుకు రావడానికి నిరాకరించింది.

★ ★ ★

గోపాల్ ఫోన్ చేసి వారం రోజులైంది.సాయంత్రం గోడ గడియారం ఐదు గంటలను మోగించింది. సృజన.. శేఖర్ లు టీ తాగుతూ అభిజ్ఞ పెళ్ళి..భవిష్యత్తు గురించి మాట్లాడుకుంటున్నరు.

బెల్ మోత వాటిని అడ్డుకున్నది. తలుపు తీసిన సృజనకు రవి దర్శనమిచ్చిండు.అంతకు ముందు పాదాభివందనాలు చేసిన అతని పద్ధతి నమస్కారానికి మారింది.సృజనా..శేఖర్ లు కోరుకున్న దదే .వినయం..విధేయత చేసే పనులలో ఉండాల్సి తప్ప..దండాలు"పాదాభివందనాలు కాదని వాళ్ళు కోరుకున్నది కూడా అదే.

"ఆఁఁరవీ! బాగున్నావా? రా!రా!కూర్చో"అని కుర్చీ చూపించిండు శేఖర్.రవి అసహనంగా కూర్చున్నడు.అది గమనించినా...గమనించనట్లే...ఏం విశేషాలు?"అడిగిండు శేఖర్..తనకేమొ తెలియదన్నట్లు.

"సార్! గోపాల్ సారు నన్ను ఆఫీసుకు రావద్దన్నడు."

"ఎందుకు ?"

"ఏందో ఆయన సంగతి నాకు సమఝ్ కాలే. మీరేమొ మంచోడు .సాయం చేస్తడని పంపించిన్రు. ఆయనేమొ మస్త్ పనులు చెప్తడు. ఏ పని జర అటిటు ఐనా బగ్గ తిడుతడు."

"నువ్వు సరిగ్గ పనులు చేసినా తిట్లు తప్పలేవంటవ్?" కొంచెం అసహనంగానే అన్నడు శేఖర్."ఐనా ఆఫీసుల మస్త్ పనుంటదని ఆయనకు తగ్గట్టుగ నడుచుకోవాలని ముందే చెప్తికద.మళ్ళీ అన్నడు శేఖర్.

"చెప్పిన్రనుకొండి.కని గింత తిప్పలనుకోలె.ఎగ్జామ్ ప్రిపరేషన్ ల రాత్రి జాగారమైంది పొద్దుగాల ఆఫీసుకు అప్పుడప్పుడు జర లేటైతుండె. దానికి అందరి ముందు చెడామడా తిడుతుండె"

"అందరంటె?"

"ఆఫీసుల ఉండే జూనియర్ల ముంగల"

"సరె ఆయనకు నీకు కుదర లేదు. వేరే దారి వెతుక్కోక తప్పదు"

" మీరేమన్న హెల్ప్ చేస్తె ఈ ఊళ్ళోనే ఆఫీసు తెరుసుకుంట"అన్నడు మెల్లగ. రవి మాటకు ఏంజవాబు చెప్పాలో అర్థంగాక అయోమయంలో పడ్డడు శేఖర్ . కొంచెం ఆలోచించి ఆఫీస్ ఎస్టాబ్లిష్మెంట్ కు కొంత సాయం చేస్త. ప్లేస్ వెతుక్కో.." శేఖర్ చెప్పడంతో రవి ఇంటి దారి పట్టిండు.రవితో సృజనకు మాట్లాడాలనిపించ లేదేమో..వాళ్ళ సంభాషణలో పాలు పంచుకోలేదు. కాని ఆఫీస్ ఎస్టాబ్లిష్ మెంట్ విషయం విని "రవి తీరును చూస్తుంటే ఇది అపాత్రాదానమనిపిస్తున్నది. "అంది శేఖర్ తో.

"చూడు సృజన.కొన్ని సమయాలలో ఇటువంటి నిర్ణయాలు తప్పవు.మెడకు పడ్డ పాము కరువక మానదు కదా!"అని సర్ది చెప్పిండు శేఖర్. చెప్పిన మేరకు శేఖర్ సహాయం చేసినా రవి ఆ ఫలితాన్ని దక్కించుకోలేక పోయిండు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉండిపోయింది. మరో రెండు నెలలకు శేఖర్ సృజనలముందు మరోసారి ప్రత్యక్షమైండు. విషయమంతా తెలిసిన ఆ భార్యాభర్తలకు ఏం మాట్లాడాలో అర్థంగాకమౌన ముద్రలో ఉండి పోయిన్రు.పేపర్ చదువుతున్నట్లు నటించిన శేఖర్

"ఆఁ చెప్పు రవి ..ఏం సంగతి?"ప్రశ్నించిండు శేఖర్.

"మీరు కొంచెం సాయం చేస్తె అమెరికా పోత." అన్న రవి మాటలు విని ఇద్దరూ షాక్ తిన్నరు.

మూర్ఛ వచ్చినంత పనైంది.స్పృహలోకి రావడానికి వాళ్ళకు కొంచెం కష్టమే ఐంది. కొంచెం సేపు మాటా మంతీ లేకుండా కూర్చుండి పోయిన్రు.

"మీ అభిజ్ఞ అమెరికాలనే ఉండె.నన్ను పంపిస్తె ఆమెకు తోడుగ ఉంట. కావలసిన సాయం చేయొచ్చు.పరాయి దేశంల ఓ మగతోడు అవసరమే కదా ! "అంటూ ఇంకా ఏదో మాట్లాడే ప్రయత్నం చేయబోయిండు. శేఖర్ కోపం నసాళానికి ఎక్కింది. ఐనా తమాయించుకొని స్థిమితంగానే

"రవీ! గుఱ్ఱాన్ని నీళ్ళ వరకు తీసుక పోయినా ఆ నీళ్ళు తాగాల్సిన బాధ్యత గుఱ్ఱానిదే. ఇప్పటివరకు మేం చేసిన సహాయం అటువంటిదే.ప్రస్తుతం నీ భవిష్యత్తుకు నువ్వే బాటలు వేసుకోవాలె.

ఇంకొకరిపై ఆధారపడడం మంచిది కాదు." శేఖర్ .

"మీరు చెప్పిన్రనే లా చేసిన.లేదంటే బి టెక్ చేసి సాఫ్టువేర్ ఇంజనీర్ గ. ఎప్పుడో అమెరికాల వాల్తుంటి. గిప్పుడేమొ మాకేం సంబంధం లేదనబడ్తిరి" రవి. శేఖర్ కోపం తారాస్థాయికి పోతున్నా తనను తాను సంబాళించుకుని. "చూడు రవి. అవన్నీ కుదరని పనులు. అటువంటి ఆలోచనలేం పెట్టుకోకు. ఇంత వరకు తోచిన సాయం చేసినం.ఇక మా వల్ల కాదు" అని నెమ్మదిగా చెప్పినా ఖచ్చితంగానే అన్నడు.

"కొంచెం మల్లో సారి ఆలోచించండి."కొంచెం ఒత్తిడి తెస్తూ అన్నడు రవి.

"ఈ విషయంలో నాకు సెకండ్ థాట్ లేదు."అని చెప్తూనే లేచి లోపలికి పోయిండు...ఇక నువ్వు వెళ్ళిపోవచ్చనే సూచనగా

★ ★ ★

డిసెంబరు నెల.విపరీతమైన చలి.ఏ పని చేయాలన్నా ఇబ్బందిగా ఉన్నది.రెండేళ్ళ తర్వాత అభిజ్ఞ ఇండియా వచ్చింది. పిల్లకేవేవో పిండి వంటలు చేసి పెట్టాలనే ఆరాటం..బోలెడన్ని ముచ్చట్లు మాట్లాడుకోవాలనే ఉబలాటం...వచ్చిపోయే చుట్టాల స్నేహితుల దాడి .సృజనకు ఊపిరి సలపడం లేదు. అభిజ్ఞకు ఇష్టమని అరిసెల పని పెట్టుకున్న సృజన బెల్లం పాకం పడుతున్నది.

"అమ్మా! నేను మాధవి వాళ్ళింటికి పోతున్న."చెప్పింది అభిజ్ఞ .

"సరె మంచిది.తొందరగా రా.సరేనా?" సృజన

"వాళ్ళింట్లోనే లంచ్.అనన్య...భార్గవి..రమ్య..రంజిత అంతా కలుసుకుంటున్నాం. ఐనా ఈ విషయం మొన్ననే చెప్పిన కదా! మరిచిపోయినట్లున్నవ్."

" ఔను తల్లీ. రకరకాల పనులలో. ఒక్కటీ జ్ఞాపకముండి చావడంలేదు. సరె.మంచిది..ఏది ఏమైనా చీకటి పడక ముందు వచ్చై వింటున్నావా?" వంటింట్లోనుండే అన్నది సృజన అభిజ్ఞ వాళ్ళ అమ్మ మాట విన్నదో..లేదో కాని"అమ్మా! బై అంటూ వెళ్ళిపోయింది.

సాయంత్రం ఐదు కావస్తుంది .అభిజ్ఞ మాధవి ఇంటినుండి తిరుగు ముఖం పట్టింది. స్నేహి తులతో గడపడం ఎంతో హాయిగా ఫీలైంది.తిండికన్నా ముచ్చట్లు కడుపు నింపేసినై.ఆ అనుభూతి గాలిలో తేలిపోయినట్లనిపించింది.ఆ ఊహలలో తేలియాడుతూ నడుస్తున్న అభిజ్ఞ కు

"అభిజ్ఞా బాగున్నావా?"అన్న గొంతు వినిపించింది. ఎవరై ఉంటారని తల వెనక్కి తిప్పింది.

" ఎవరో కాదు. రవే.ఎప్పుడూ అమ్మా నాన దగ్గరికి వచ్చిన శాల్తీ" అనుకుంది.

"అమెరికానుండి ఎప్పుడొచ్చినౌ."రవి ప్రశ్న.

"థర్డ్ డిసెంబరు ."

"జాబ్ చేస్తున్నవట కదా!"

"ఔను రెండేళ్ళైంది"

"మరి పెళ్ళెప్పుడు చేసుకుంటవు?"

"రవి మాట్లాడే తీరు అభిజ్ఞకు ఏమాత్రం నచ్చక పోయినా బాగుండదని ముక్తసరి జవాబులు చెప్తూ పోయింది. మరీ పెళ్ళి విషయం మాట్లాడడం ఇబ్బందిగనే కాదు .కోపం తెప్పించింది.ఐనా తమాయించుకొని "ఆవిషయం అమ్మా వాళ్ళు చూసుకుంటరు"అని పొడిపొడిగా చెప్పి నడక వేగాన్ని పెంచింది. ఐనా పట్టు వదలని విక్రమార్కుడిలా "అమెరికా పోయినా అమ్మ కొంగు చాటు పిల్లలా?"అంటున్న రవి మాటలు లీలగా చెవులలో చేరినై.ఇంట్లో అడుగు పెట్టిందో లేదో రవి విషయం పూసగుచ్చి నట్లు తల్లికి చెప్పింది.

అక్కడే ఉండటంతో శేఖర్ చెవిలో కూడా పడ్డదావిషయం.ఇద్దరూ రవి నడుచుకుంటున్న తీరు అభిజ్ఞ ముందు బయటపడకుండా జాగ్రత్త పడ్డారు. కాలం దాని మానాన అది నడుచుకుంటూ వెళ్ళిపోయింది. అభిజ్ఞ అమెరికా తిరుగు ప్రయాణం కట్టింది.ఇల్లంతా చిన్నబోయింది.మనసు నిండా అభిజ్ఞ జ్ఞాపకాలు ..కళ్ళ నిండా ఆమె ఛాయలు..

చెవుల నిండా ఆమె మాటల సవ్వడులు.సృజనకు ఏమీ తోచడం లేదు. కాలుగాలిన పిల్లోలె ఏవేవో సదరడం అడ్డం పెట్టుకొని అయోమయంగా అటూ ఇటూ తిరుగబట్టింది. బర్ ర్ న గేటు చప్పుడు కాంగనే ఎవరై ఉంటరు? గింత చప్పుడేంటిది? అని ఆలో చించుకుంటనే ఇంటి ముందరికి పోయింది.లోపలికి రాష్ గా ఎంటరౌతున్న రవి. ఆ తీరు చూస్తే కొంచెం మందేసిన ట్లున్నడు.ఆ చప్పుడుకు చెట్ల పనిలో ఉన్న శేఖర్ కూడా గబగబా చేతులు కడుక్కొని ఇంటిముందుకు వచ్చిండు.

"నమస్తే సారు." కొంచెం సాగదీస్తూ అన్నడు.ఆ సాగతీతలో అమర్యాద కనిపించింది.ఆ వాలకం చూసి ఇద్దరికీ ఇంట్లోకి రమ్మనాలె అనే ఆలోచనే రాలేదు.

"చెప్పు రవీ ! ఏం సంగతి?"

"పెళ్ళెప్పుడు చేస్తరు?"

"ఎవరిది?"

"ఇంకెవరిది? నాదే"

"నీ పెళ్ళి మేం చేయడమేంది?"

" మీ బిడ్డతోని జరిగే పెళ్ళి మీరు గాగపోతె ఇంకెవరు చేస్తరు?" ఎదురు సవాలిసిరిండు రవి.

" నా బిడ్డ తోని నీ పెళ్ళేంది? పిచ్చి లేసిందా?."

"పిచ్చేం పిచ్చి. మా ప్రేమ మీకిష్టం కాలేదా!"

" మీ ప్రేమేంటిది? అభిజ్ఞ నిన్నెప్పుడు ప్రేమించింది?"

" మరిశి పోయినట్లు నాటకాలాడుతున్నరేంది.నీ బిడ్డ నా ఎంట తిరుగలేదా?. అమెరికా ఉడాయించంగనే అన్ని మరిసి పోయినారు." అంటున్న రవి మాటలకు శేఖర్ కోపం నసాళానికెక్కింది.

" మా బిడ్డ నీతోనెప్పుడు తిరిగింది. నిన్నెప్పుడు ప్రేమించింది. ఆమె చదువంత పట్నంల ఢిల్లీలనే జరిగె.ఎక్కువ తక్కువ బద్మాష్ తనం చేస్తె 420 కేసుల బొక్కలేయించుత. చల్ నడువు అను కుంటనే రవి గల్లా పట్టి బయటకు నెట్టి గేటేసిండు.ఆ రోజు సృజన..శేఖర్ లకు నిద్రే పట్టలేదు." తిన డానికి తిండి లేక పోయినా చదువాలనే ఆశ పడుతున్నాడని తోచినంత సాయం చేస్తే ....కృతజ్ఞత లేదు. సరే తిన్నింటి వాసాలు లెక్కపెట్టడమేంది?" రక రకాలు ఆలోచిస్తూ చాలా బాధ పడ్డారా భార్యాభర్తలు. మరు నాడు ఎందుకైనా మంచిదని పోలీస్టేషన్లో కంప్లైంట్ కూడా ఇచ్చిను.

★ ★ ★

కాలం మరో రెండు సంవత్సరాలను మింగింది.పెళ్ళి హాలంతా కళ్ళు మిరుమిట్లుగొలిపే అలంకరణలో అందరినీ అబ్బురపరుస్తున్నది.అతిథులతో హాలు కిటకిటలాడుతున్నది. సొన్నాయి చప్పుళ్ళ వీనులవిందు చేస్తుంటే....పూలపరిమళాలు ముక్కుపుటాలను అదుర గొడుతున్నై.కొందరు వెల్ కం డ్రింక్ ఆస్వాదిస్తున్నరు.మరి కొందరు సున్నితంగా తిరస్కరిస్తున్నరు. హాలంతా కోలాహలంగా ఉంది. పెళ్ళి పేరిట స్నేహితులు బంధువర్గం కలుసుకునే మంచి అవకాశం.కరచాలనాలు.. ఆలింగనాలు ... నవ్వులు .. అలజడి.కేరింతలు...అంతా చూడ ముచ్చటగా.జిలకర బెల్లం పని ముగిసింది.ఇక మిగి లింది మంగళ సూత్ర ధారణ.పూజారి "మాంగల్యం తంతునానేనా" అంటూ మంత్రం మొదలు పెట్టిండు. ఈ లోగా ఏదో అలజడి. పదిమంది మూక మంటపం వైపు దూసుకు వస్తూ.ఆ మూక ముందున్నది ఎవరో కాదు.రవి.అనుకోని సంఘటన. అంతా అయోమయంగా..ఏం జరుగుతుందో అర్థంగాక.

" నా తోని తిరిగి ఇంకోణ్ణి లగ్గం చేసుకుంటవా? ఏం కిలాడివే . ఈ పెండ్లి ఎట్లైతదో చూస్త" అను

కుంట మండపం వైపు పోతున్నడు.వెంట మిగిలిన వాళ్ళు. ఏంమాట్లాడుతున్నరో ఎవరికి ఏమర్థంకావ డం లేదు. సృజన శేఖర్ లబంధు వర్గంలో యువత వెంటనే స్పందించి ఆమూకతో తలపడ్డరు.ఈ పరిస్థితిని ముందే ఊహించిన శేఖర్ పోలీసులకు ఫోన్ చేసిండు.హాల్లో జనమంతా లేచి నిలబడ్డరు.

సృజన అన్నయ్య రేవంత్ కలగజేసుకొని అందరినీ కూర్చోబెట్టిండు.పదినిమిషాల్లో పోలీసుల జీపు రావడం.. రవి గాంగ్ ను పట్టుకపోవడం జరిగి పోయింది.పెళ్ళి కొడుకు మేనబావే కావడం..విషయం

ముందే తెలిసిందై ఉండటంతో ఏ అపార్థాలు లేకుండా పెళ్ళి సవ్యంగా జరిగి అంతా ఊపిరి పీల్చుకున్నా రు.

★ ★ ★

సెలవులు పెద్దగా లేకపోవడంతో అభిజ్ఞ ఆదిత్య అమెరికాకు తిరుగు ప్రయాణం కట్టిను.సృజన పెళ్ళి తర్వాత సార్దాట్ పనులతో సతమౌతున్నది.

"సృజనా! రేపు బయలుతన్నామమ్మా!" అన్నది వాళ్ళమ్మ ఆండాళమ్మ.

"అప్పుడేనా? ఇంకా సర్దుకోవాల్సిన పనులు... ఎవరి వస్తువులు వాళ్ళకు చేర్చడం...లెక్కలు సరిచూసుకొని

ఎవరికివ్వాల్సినవి వాళ్ళకు ముట్టచెప్పాలె.నువ్వుంటే నాకు కొంచెం సౌలత్ గ ఉంటది. ఇంకో వారం రోజులుండమ్మా!"బతిమాలే ధోరణిలో అన్నది సృజన

"అందుకే నానను ఉండమన్న. అన్నయ్య వదినలకు జీవితంలో సెలవులు దొరకడం కష్టం. డాక్టర్ల బతుకులే గంతనుకో.మరి పిల్లలను చూసుకోవాల్నాయె .తప్పదుకదా!"సమర్థించి చెప్పింది తల్లి.సృజన ఒప్పుకోక తప్పలేదు.అనుకున్నట్టే ఆమరుసటి రోజే ప్రయాణమయ్యిన్రు. వాళ్ళను సాగనంపి గేటువేయబోతుంటే ఓ నలుగైదుగురి గుంపు ఇంటివేపు వస్తున్నట్టనిపించింది. తీరా చూస్తే వాళ్ళెవరో కాదు.రవి తల్లిదండ్రులు ..వాళ్ళ చుట్టాలు. వాళ్ళు వస్తూ వస్తూనే అమాంతం శేఖర్ కాళ్ళమీద పడి "చమించు బాంచెను. వాని నోట్లె మన్నుపడ.కన్నకొడుకోలె సూసుకుంటె మీకే ఎసరు పెట్టిండు.తప్పైంది .మల్ల ఈ ఊరి దిక్కు రానియ్యం బాంచెను. మా అన్న కొడుకు తోని బొంబై పంపిస్తం. మీరు దయతలిస్తెనే బెయిలొస్తదంట. సచ్చి నీ కడుపున పుడుతం " అని గీమాలుతునే ఉన్నరు.

శేఖర్ సృజన..సృజన వాళ్ళ నాన ముగ్గురూ ఒకరి ముకం ఒకరు చూసుకున్నరు.ముగ్గురికి ముగ్గురూ ఇంటిముందున్న కుర్చీలలో కూర్చున్నరు.ఎవరి నోటి నుండి ఒక్క మాట పెగల్లేదు.దీర్ఘాలోచన లో మౌనంగా ఉండి పోయిన్రు. ఓ పదినిమిషాల తర్వాత

"ఓ ఆడ పిల్ల జీవితంతో చెలగాటమాడి ఇప్పుడేమొ సుద్దులు మాట్లాడవడ్తివి.మా అదృష్టం బాగుండి ...పిల్ల భర్త.. అత్తగారోల్లు నీ కొడుకే బట్ట కాల్చి మీదేస్తున్నడని అర్థం చేసుకున్నరు.లేదంటే ఎంత ఘోరం జరుగుతుండె. ఐనా ఇప్పుడు మా చేతులేమున్నది" బాధ కోపం కలగలిసిన గొంతుతో అన్నడు శేఖర్ .

"గట్లనకండి బాంచెను. దయగల్ల మారాజులు. మీరే గిట్లంటె మా బతుకులేంకాను..పోంగ పోంగ ఒక్కడే దక్కిండు.సస్తె కాష్టం చెయ్యనీకె సుత ఎవరు లేరు. వాడు తప్పు చెయ్యలేదంటలేము. చేసిండు.పోలీసోల్లు బరిగెలతోని బగ్గనే లగ్గం చేత్రాన్రు. ఇప్పటికే ఆనికి దేవుడు యాది కొస్తాండు. మల్ల ఇంకో ఆడపిల్ల ముకం సూడడు. " రవి తండ్రి.

" నీ కొడుకు చేసిన తప్పు చిన్నా చితుక కాదు కదా! ఐనా ఇంత సహాయం చేసినోల్లకు కీడు తలపెట్టాలనే ఆలోచనెట్లొచ్చిందో." సృజన తండ్రి పరంధామయ్య అడిగిండు.

"బుద్ధి గడ్డిదిన్నది బాంచెను. సెప్పుడు మాటలిన్నందుకు తగిన సిచ్చ పడ్డది. "

"చెప్పుడు మాటలేంది? మా కర్థంకాలె. "సృజన

"శేఖర్ సారు మస్తు అరుసుకుంటున్నడు నిన్ను. పిల్లనుగిన ఇస్తడా ఏంది? ఓ పారి అడిగి సూడక పోయినౌ. వాల్లకు కట్నం తప్పుద్ది.నువ్వు అమెరికల మంచిగ బతుకొచ్చు." అన్నడట ఓ ఆసామి

" ఈ మాట ఎవరన్నరు?"

" పేరు నాకు తెలువదు బాంచెను. నువ్వు కొలువు చేసే తాన్నె సేస్తడట." అన్న రవి తండ్రి మాటలు విని ఆ పుణ్యాత్ముడు ఎవరై ఉంటాడా?"అన్న ఆలోచన వాళ్ళ మెదళ్లను తొలవడం మొదలు పెట్టింది.ఓ గంటసేపు ఏడ్చి మొత్తుకొని వాళ్ళు వెళ్ళి పోయిన్రు.ఆ మనిషి ఎవరో తేల్చుకోవడంలో మునిగి పోయిండు శేఖర్ .పుట్టను తవ్వి పామును తీసినట్లు తనెంట గిట్టని వాళ్ళెవరై ఉంటారని తీవ్రంగా ఆలోచించిండు.తొలచిన మెదడులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది.తప్పకుండా రాజేశ్ అయి ఉంటాడనే నిర్ధారణకు వచ్చిండు. ఎందుకంటే కాలేజీ కి సంబంధించిన కొనుగోళ్ళలో అవినీతిని బయట పెట్టినందుకు తనపై గుర్రుగా ఉన్నడు రాజేశ్ .ఆ విషయమే సృజన ముందుంచిండు.ఆ మాట వింటూనే " చెప్పేవాడికి లేకపోయినా వినేవాడికి వివేకం ఉండొద్దూ!" సాగతీసిండు పరంధామయ్య.

"అదీ నిజమే నాన్న.మరీ ఇంత బరి తెగిస్తడా వాడు"సృజన

"వాడు..వీడు పదజాలమెందుకులే గాని ఇప్పుడు మన కర్తవ్యమేంటిది" అన్న ఆలోచనలో శేఖర్ మునిగి పోయిండు. "మామయ్యా! ఏంచెయ్యమంటారో మీరే చెప్పండి?" అడిగిండు పరంధా మయ్యను.

"మనం యఫ్. ఐ. ఆర్ అదీ ఇదీ అంటూ వత్తిడి తేకుండా ఉండటమే. బేల్ కోసం వాళ్ళ తిప్పలేమో వాళ్ళు పడుతరు." చెప్పిండు పరంధామయ్య.

అనుకున్నట్టే శేఖర్ వాళ్ళు కేసు విషయంలో కామ్ ఐపోయిన్రు.పోలీసులకు ఆమ్యామ్యాలు ...బేల్ డిపాజిట్లు తడిసి మోపెడై అమ్మబోతే అడివై అగ్గువ సగ్గువకు పొలమమ్మక తప్పని పరిస్థితి ఆ తల్లిదండ్రులకు. ఏది ఏమైనా వినదగు నెవ్వరు చెప్పిన పద్యం రవి విషయంలో నిజమై కూర్చుంది.

వ్యాసం

# అంబేద్కర్ వెనుక ఆమె!

## (నేడు అంబేడ్కర్ సతీమణి రమాబాయ్ వర్ధంతి)

- యం.రాం ప్రదీప్
తిరువూరు, 9492712836

'ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుంది "అంటారు.భార్య సహకారం లేకుండా ఏ భర్త కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించలేరు.డా. బి.ఆర్.అంబేద్కర్ జీవితంలో కూడా ఆయన సతీమణి రమాబాయి కీలక పాత్ర పోషించారు. కుటుంబంలో భార్య స్థానం ఎంత గొప్పదో చెప్పటానికి రమాబాయి గారి జీవితం ఒక ఉదాహరణ.

కుటుంబ ఆర్థిక అవసరాలు, సంపాదన ఎరిగి జాగ్రత్తగా తన భర్త సంపాదన ఖర్చుచేసే ఉత్తమ ఇల్లాలుగా శ్రీమతి రమాబాయి అంబేద్కర్ జీవితం మనకితెలియజేస్తుంది. అంబేద్కర్ లక్ష్యాన్ని తెలుసుకుని కుటుంబ భారం తనమీద వేసుకుని సంతోషంగా పైచదువులకి పంపారు. పిడకలు అమ్మి వచ్చిన డబ్బుతో కుటుంబ అవసరాలు తీర్చి, బాబాసాహెబ్‌కు కూడా మనీ ఆర్డర్ చేసేవారు. అంబేద్కర్‌లాంటి ప్రపంచ మేధావుల్లో ఒకరిని మనకి అందించిన త్యాగశీలి రమాబాయి.

భర్త బారిస్టరైనా రమాబాయి జీవితం పూలపాన్పుమాత్రం కాదు. అంబేద్కర్ మాటల్లో "తన జీవితభాగ స్వామి రమాబాయి జీవితం త్యాగాలమయం.

సాత్వికమైన ఆమె మనసు, ఆమెలోని మానసిక సద్భావనతో, పవిత్రమైన సదాచారాలతో దు:ఖభరితమైన దినాల్లో కూడా నాకు అండగా నిలబడింది.

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్. ఆయన చేసిన ప్రతి కార్యం వెనుక ఆయన భార్య రమాబాయి అంబేద్కర్ సహకారం ఎంతో ఉంది. ఈ విషయం వీరి జీవితాన్ని గమనిస్తే అర్థమవు తుంది.

రమాబాయి 1897, మే 7న బికువలదకరాకు రెండవ కుమార్తెగా వాలంగ్ గ్రామంలో దపోలో దగ్గర జన్మించారు. వీరిది చాలా పేద కుటుంబం. తండ్రి కూలిపనిచేసేవాడు. బుట్టలో చేపలు పట్టుకొని సముద్రపు తీరంలో ఓ బారులో అమ్మేవారు. అతని సంపాదన వారి తిండికి కూడాసరిపోయేది కాదు. అన్న కూలి పనిచేసేవారు. చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. కొంతకాలానికి తండ్రి కూడా మరణించాడు. తర్వాత బొంబాయిలో ఉండే మేనమామ వీరిని పోషించారు. రమాబాయికి తొమ్మిది ఏళ్ల వయసులో, అప్పటికే పదో తరగతి పూర్తి చేసిన పదిహేను సంవత్సరాల అంబేద్కర్‌తో పెళ్లి జరిగింది. వారి వివాహం జరిగిన విధానం ఆకాలంలో పేద జీవితానికి అద్దం పడుతుంది. వారి వివాహం బైకుల్లా చేపల మార్కెట్ (బొంబాయి)లో మార్కెట్ మూసిన తర్వాత, రాత్రి పూట ఓపెన్‌షెడ్‌లో జరిపించారు.

రమాబాయి చాలా తెలివిగా బాధ్యతగా వ్యవహరించేవారు. కడుపేదరికంలో ఉన్నప్పటికీ, ఎప్పుడూ ప్రశాంత వదనంతో ఉండేవారు. వివాహ సమయంలో ఆమెకు చదువురాదు. అంబేద్కర్ ఆమెకు చదవడం, రాయడం నేర్పించారు. అంబేద్కరంటే ఆమెకు అమితమైన ప్రేమ. అనురాగంతో కూడిన గౌరవం ఉండేది. నమ్మకం, త్యాగం, అర్థం చేసుకునే గుణం వీరిరువురినీ జీవితాంతం ఆనందంగా ఉండేటట్లు చేసింది. అంబేద్కర్ ఆమెని రాము అని పిలిచేవారు. ఆమె తన భర్తని సాహెబ్ అని పిలిచేవారు.

నిరంతర అధ్యయనంతో జ్ఞానసముపార్జనతో నిమగ్నమైన తన భర్తని చూసి ఆమె చాలా గర్వపడేవారు. ఆయన అభివృద్ధి కోసం నిత్యం తపించేవారు. అంబేద్కర్ ఇంటి

కోసం అసలు సమయం కేటాయించేవారు కాదు.

అయినా ఆమె సంసార బాధ్యతల్ని చక్కగా నిర్వహించేవారు.

అంబేద్కర్ పైచదువులకు అమెరికావెళ్లాలనుకున్నప్పుడు ఇంటి దగ్గర స్త్రీలంతా రమాబాయికి పంపవద్దని చెప్పారు. ఆమె అలాచేయక అంబేద్కర్ అమెరికా వెళ్లడానికి సహకరించారు. ఇది ఆమెకు అతనిపై ఉన్న అచంచల విశ్వాసం, ప్రగాఢమైన నమ్మకానికి నిదర్శనం.

భర్త బారిస్టరైనా రమాబాయి జీవితం పూల పాన్పుమాత్రం కాదు. ఆమె జీవితం త్యాగాల మయం. అంబేద్కర్ చదువు, ఉద్యమాలతో బిజీగా ఉండటంతో కుటుంబ భారమంతా రమాబాయి చూసుకోవాల్సి వచ్చింది.

అంబేద్కర్ ఉన్నత చదువులు చదవాలి అని ఆమెకు ఆశగా ఉండేది. బాబాసాహెబ్ డా. అంబేద్కర్ చదువులు కోసం లండన్ వెళ్లినప్పుడు రమాబాయినే కుటుంబ అవసరాలు తీర్చారు. కుటుంబ జీవితంలో ఎన్ని కష్టాలు, నష్టాలు జరిగినా ఆమె ఏరోజు చలించిపోలేదు, సమస్యలకు లొంగిపోలేదు. అంబేద్కర్ ఎన్నో డిగ్రీలు పొందారు. అవన్నీ రమాబాయి త్యాగనిరతికి ప్రతీకలు.

రమాబాయి జీవితం ఎన్నో విషాదాలు చూసింది. వీరికి ఐదుగురు పిల్లలు. కొడుకులు రమేశ్, గంగాధర్, యశ్వంత్, రాజరతన్, కూతురు ఇందు. ఒక్క యశ్వంత్ తప్ప మిగిలిన వారందరూ మరణించారు. పిల్లల మరణం ఆ దంపతుల్ని కుంగ తీసింది.

నలుగురు పిల్లలు మరణం, భర్త ఎప్పుడూ ఇంటి పట్టున ఉండకపోవటం, సమాజంలో రాజకీయ ఉద్రిక్తతలు ఆమెను ఆందోళనకు గురిచేశాయి. భర్త ఆరోగ్యం కోసం ప్రార్థించేది. అంబేద్కర్‌కి ఆరోగ్యం సరిగా లేకపోయినా ఆమెకు తెలియనిచ్చేవారు కాదు. ఆమె మరింత ఆందోళన చెందడం అంబేద్కర్‌కి ఇష్టముండేది కాదు.

రమాబాయి ఆరోగ్యం రోజు రోజుకు క్షీణించిపోయింది. ఆమె రోజురోజుకినీరసించిపోసాగింది. ముఖం కళావిహీనంగా మారిపోయింది. అయినా ఆమె ఆలోచనలన్నీ అంబేద్కర్ మీద ఉండేవి. రమాబాయి అనారోగ్యంతో ఉన్నప్పుడు అంబేద్కర్ సాన్నిహిత్యం కోరుకునేది.

అంబేద్కర్ రమాబాయితో గడిపిన ఘడియలు తక్కువ. అంత అరుదైన ఆమె సాన్నిహిత్యాన్ని కోల్పోయిన అంతులేని బాధని అంబేద్కర్ ఒక వ్యాసంలో ప్రస్తావించారు. అలాంటి మమతామూర్తి అయిన సామాన్య స్త్రీతో రోజులోని 24 గంటల్లో అర్థగంట కూడా గడపలేకపోయాను'' అన్నారాయన.

పరిసరాలు మారితే మానసిక స్థితిలో మార్పు వస్తుంది ఏమో అని అంబేద్కర్ అప్పుడపుడు పక్క ఊర్లకి పంపేవాడు. పూనా ఒప్పందం మీద తీవ్రమైన చర్చలు జరుగుతున్నా అంబేద్కర్ వాతావరణం మార్పు కోసం ఆమెను ధార్వార్ తీసుకెళ్లారు. అయినా ఆమె ఆరోగ్యం కుదుటపడలేదు. దాంతో రమాబాయి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. చివరకు 1935 మే 27న ఆమె తుదిశ్వాసవిడిచారు.పవిత్రమైన నిర్మలమైన మనసు మూగబోయింది. ఆమె మరణించిన తర్వాత అంబేద్కర్ కన్నీరు మున్నీరుగా విలపించారు. చివరకు సన్యాసం తీసుకోవాలని భావించారు. ఎంతోమంది మిత్రులు నచ్చచెప్పి అంబేద్కర్‌ని మామూలు మనిషిగా మార్చారు.

ఈవిధంగా కటికదారిద్ర్యంలో జీవితం కొనసాగించిన రమాబాయి ఏ రకమైన ప్రలోభాలనూ తన దరిదాపుల్లోకి రానివ్వలేదు. ఎంతో ఆత్మగౌరవంతో, మానసిక నిబ్బరంతో జీవించారు. ప్రపంచమేధావి అయిన అంబేద్కర్ జీవన గమనంలో ఆమె రహదారిగా మారారు. ఇలాంటి ధన్యజీవి రమాబాయి అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం.

నేడు అంబేద్కర్ ని పైకి అందరి వాడు అంటూనే,ఆయనను కొందరి వాడిని చేసే కుట్ర జరుగుతుంది. ఆయన వ్యక్తిగత ఆరాధననివ్యతిరేకించారు.ఆయన వ్యక్తిత్వం ఆయన విగ్రహాల్లో లేదు. ఆయన రచించిన పుస్తకాలలో ఉంది.ఇప్పటికైనా అంబేద్కర్ అభిమానులు ఆయన రచించిన పుస్తకాలకి మరింత ప్రాచుర్యం కల్పించాలి.అప్పుడే అంబేద్కర్ భావజాలం మరింతగా ప్రజల్లోకి వెళ్తుంది.

కథ

# "మున్నీకి అమ్మీ"



- ఆచార్య సూర్యా ధనంజయ్
హైదరాబాద్, 9849104186

నెత్తిమీద నిప్పుల వాన కురిపిస్తున్నదా అన్నట్టు పట్టపగలు ఎండ మండిపోతున్నది.

గుండెలు బాదుకుంటూ, కాళ్లకు చెప్పులైనా తొడుక్కోకుండా పెద్దగా ఏడుస్తూ పోలీస్ స్టేషన్ కు పరుగెత్తింది హుస్సేన్ బీ. ఆమెనందరూ మున్నీకి అమ్మి అని పిలుస్తారు. ఆమె అలా పరుగెడుతుంటే వాడకట్టు మహిళలు ఏం జరిగిందో పాపం అనుకుంటున్నారు. కొందరైతే "భర్త ఇంట్లోంచి గెంటేశాడేమో వాళ్ళింట్లో ఎప్పుడూ గొడవలే. రోజూ చూస్తూనే ఉన్నాం." అనుకుంటున్నారు. కానీ రోజువారీ గొడవకు ఏడ్చే ఏడుపులు కావు హుస్సేన్ బీవీ. ఈవాళ ఆమె ఏదో జరగరానిది జరిగితే ఏడ్చినట్టు ఏడుస్తూ పరుగెత్తుతున్నది.

పోలీస్ స్టేషన్ చేరుకొన్న హుస్సేన్ బీ గాభరాపడుతూ మెట్లమీద పడిపోయింది. అప్పుడే బయటినుండి వచ్చిన ఎస్సై రవి ఆమెను గమనించి కానిస్టేబుల్ కి చెప్పి స్టేషన్ లోపలికి తీసుకెళ్లి కూర్చోబెట్టించాడు.

"ఏం జరిగిందమ్మా? ఎవరైనా కొట్టారా?ఎందుకిలా పరేషన్ అవుతున్నావ్? ఏదైనా అన్యాయం జరిగితే చెప్పమ్మా?"

అంటూ విషయం వాకబు చేశాడు ఎస్సై.

ఆమెలో దుఃఖం,ఆయాసం ఒకేసారి తన్నుకువస్తుంటే ఏమి చెప్పలేకపోతున్నది. కానిస్టేబుల్ మంచినీళ్ల గ్లాసు చేయికందించాడు. ఆమెకవేవి పట్టట్లేదు.

"సాబ్ మేరీ బేటికో బచావ్. మేరీ మున్నీకో బచావ్.

ఆ అమీర్ షేక్ నా బేటీని చంపేస్తాడు సాబ్."

అని విలపిస్తున్నది. ఎస్సై ఆమె వివరాలు తెలుసుకొని భర్త అజీజ్ ని స్టేషన్ కి పిలిపించాడు. విషయం ఏంటని అడిగాడు.

"ఆమె రెండు నెలల కాడికెల్లి మతి స్థిమితం లేకుండా ప్రవర్తిస్తుంది సాబ్. ఈయాల ఎక్కువైనట్లుంది. మాఫీ జెయింద్రి సాబ్. మళ్ళీ ఇటు రానియ్యను" అన్నాడు అజీజ్ ఎస్సైతో.......

ఆమెను బలవంతంగా తీసుకొని ఇంటికి బయల్దేరాడు. జుట్టు సిగ ఊడిపోయి, బుర్కాకు మట్టి అంటుకుని ఒక విషాద దేవత వలే పిచ్చిగా "బేటీ బేటీ...."

అని గుండె లోతుల్లోంచి కలవరిస్తూ నడవలేక నడుస్తుంది హుస్సేన్ బీ. చూస్తున్న వారికి ఏదో అనుమానం వెంటాడుతున్నది.

హుస్సేన్ బీ కుట్టు మిషన్ మీద బట్టలు కుడుతూ ఎందరికో పికో పాల్స్ కుట్టడం, డిజైన్లు వేయడం, కుట్లు అల్లికలు నేర్పేది. నోట్లో నాలుకలాగా అందరికీ తోబుట్టువులా ఉండే హుస్సేన్ బీ అంటే హనుమాన్ పేట గల్లిలో అందరికీ గౌరవం ఉండేది. ఆమెకు ఐదుగురు ఆడపిల్లలు, ఒక కొడుకు. పొట్ట చేతబట్టుకుని చిట్యాల దగ్గరి మారుమూల పల్లెటూరు జంగంపల్లి వదిలి చౌటుప్పల్ కి వచ్చి కిరాయికి ఉంటున్నారు.

అజీజ్ కొన్నాళ్ళు టైల్స్ షాప్ లో పనిచేశాడు.అప్పటి వరకు బాగానే నడిచింది కుటుంబం. యజమానికి నష్టం రావడంతో షాపు మూతబడింది. నాటినుండి లారీ పనికి పోతున్నాడు అజీజ్. అక్కడ అతనికి కొత్త స్నేహితులు తోడయ్యారు. కొత్త సోపతుల మాయలో పడి రోజు తాగి ఇంటికి వస్తున్నాడు.

ఈ మధ్యనే పెద్ద బిడ్డ మున్నీ నిఖా ఎవ్వరికీ చెప్పకుండా చేసేశారు. ఆనాటి నుండి వాళ్ళింట్లో రోజూ గొడవలు......

ఇంట్లో ఎక్కడ సామాన్ అక్కడే పడి ఉంది. రెండవ అమ్మాయి ఫాతిమా తల్లిని ఇంట్లోకి తీసుకెళ్లింది. బిడ్డల్ని చూసిన హుస్సేని గుండెలవిసేలా భూమిమీద పడి ఏడుస్తున్నది. ఇది చూసి పొయ్యి పక్కన ఉన్న లొట్టపీసు కట్టెల మోపులోంచి ఒక కట్టెను లాగి కోపంతో ఆమె వీపుపై చరిచాడు అజీజ్ . దుఃఖం

చేసిన గాయాల నొప్పి ముందు వీపుపై కట్టె చేసిన గాయం ఆమెను అంతగా బాధించలేదు.

"తేరా సత్తేనాస్ హో....

నా బేటీని పైసలకు అమ్ముకున్నవ్.

కసాయోడా...

కన్నపేగును అమ్ముతుంటే నీ గుండె ఇంతనన్న కరగలేదా.......

థు...నీ జిందగి...."

అంటూ భర్తపై గాండ్రించి ఉమ్మేసింది.

"మాకీ కిరికిరి రోజు ఏంది నీ లొల్లి.

దిమాక్ ఖరాబ్ జేస్తున్నవ్.

ఆరాంసే ఉండనిస్తలేవ్. విషయం బయటికి తెలిస్తే పొట్టు పొట్టు తంతా"

అంటూ పక్కనే ఉన్న బకెట్ ని కాలితో వేగంగా తన్ని బయటికి వెళ్ళిపోయాడు అజీజ్. అంతలోనే ఇంటిముందు ఆటో ఆగింది. నల్లటి బుర్కా, ముగ్గుబుట్టలా నెరిసిన జుట్టు,నోరునిండా జర్దా, చేతిలో మారుతి సిల్క్స్ అనే ప్రింట్ తో ఉన్న పాలితిన్ కవర్ తో ఇంట్లోకి నడిచింది ఒక పెద్దావిడ. ఆమెను చూడగానే "అమ్మీ మై లుట్ గయి...

ఆ హరామి నా బేటీని పైసలకు అమ్మేశాడు...."

అంటూ పెద్దావిడ గుండెలకు అలుముకుపోయింది హుస్సేని.

పిల్లలయిదుగురు ఆమెను అల్లుకుపోయారు.ఆ వచ్చింది హుస్సేని తల్లి నుస్రత్ బేగం.

"ఆగే క్యా హువా గే...

క్యా బోల్ రి తూ...

హోస్ లా ఉన్నావా నువ్వు.

పైసలకు పిల్లనమ్ముడేంది...

మున్నీ ఏది? కన్పిస్తలేద్"

అని కంగారుగా అడిగింది నుస్రత్. ఏడుస్తున్న కూతురి కండ్లు తుడిచి మళ్లీ ఏమైందని అడిగింది.

గుండెను దిటువు చేసుకొని కాసేపు మౌనంగా ఉంది హుస్సేని. తల్లిని చూస్తూ

"ఆ దరిద్రుడు నా పెద్ద బిడ్డ మున్నీని సౌదీ నుండి వచ్చిన అరబ్ షేక్ కి అమ్మేసిండు.

ఆ షేక్ వయసుల చాలా పెద్దోడు.

మున్నీని కొని కానూన్ అడ్డులేకుంట రహస్యంగా నిఖా జేస్కుండు.

అంతటికీ కారణం నా షోహర్ అజీజ్ అమ్మీ...

వాడు నాశనం గాను"

అని జరిగిన వృత్తాంతం చెప్పింది. ఇదంతా విన్న నుస్రత్ హతాశురాలైంది. పది నిమిషాలు మాట పెగల్లేదామెకు. వెంటనే తేరుకొని కన్నీళ్ల గంగను పైట కొంగులో ఇంకించి

"ఈ విషయం మాకు ఎందుకు జెప్పలేదే నువ్వు!

మేం సచ్చినమనుకున్నవా!

నీ మొగుడికి ఈ దుర్బుద్ధి ఎట్లా బుట్టింది.

నాల్గు నెల్ల కింద ఊరికి వచ్చినప్పుడు బాగనే ఉండు కదా...!

పిల్లనమ్ముకునే గతి ఏం వచ్చింది ఆనికి.

ఒక్కమాట జెప్తే నీ భయ్యా హబీబ్ ని పంపిస్తుంటి గదా బేటీ"

అంటూ విలపించింది.

పొద్దుటి నుండి ఎవ్వరూ ఏం ముట్టలేదు ఇంట్లో. "పిల్లలేమన్నా తిన్నారా" అంది నుస్రత్. లేదన్నట్టు తలాడించింది హుస్సేని. వెంటనే పొయ్యి ముట్టిచ్చి కవర్ సంచి లోంచి తాను తెచ్చిన దేశీ కోడి గుడ్లు ఉడకబెట్టి వండింది. జొన్న రొట్టెలు చేసింది. పిల్లలకు వడ్డించింది. ఎంతో బతిమిలాడితే హుస్సేని నాలుగు ముద్దలు తిన్నది. "ఉస్కో ఆనేదో బేటీ...

నిలదీసి అడుగుతా.."

అంటూ బిడ్డను ఓదార్చింది.

"అమ్మీ నా బిడ్డ ఎట్లా ఉందో! పర్దేశి ముండకొడుకు ఎన్ని బాధలు పెడుతుండో.

నా బిడ్డను వాపస్ దేవాలి అమ్మీ"

అంటూ తనలోని ఆవేదనను తల్లిముందు గుమ్మరించింది హుస్సేని.

సాయంత్రం ఆరు గంటలవుతుంది. సూర్యుడు అప్పుడే

పొద్దు కడుపులోకి వెళ్లిపోతున్నాడు. అజీజ్ కల్లు నిషాలో ఊగుకుంటూ ఇల్లు చేరాడు. అత్తను చూసి అసహనంగా మూతి విరిచి మంచం మీద పడుకున్నాడు.

అంతా నిశ్శబ్దం. అలా గంట గడిచింది. అన్నం పెట్టమన్నాడు అజీజ్ లేచి.

"అన్నం పెట్టే పిల్లల్ని అమ్ముకుంటున్నావ్ నీకు అన్నం ఎట్ల తినబుద్ధి అవుతుంది" అంది అత్త నుస్రత్ అల్లుడితో.

"ఇగో సునో అత్త నా పిల్లను నేను అమ్ముకున్న.

నువ్వెవరు నన్ను అడగనీకి. అన్నం పెడతర లేదా "

అన్నాడు అజీజ్.

ఎంతో భారంగా అతనికి భోజనం వడ్డించి బయటికి వెళ్ళిపోయింది నుస్రత్. పరిస్థితి చేజారిపోయింది ఇక తన కొడుకును పిలుచురావడమే దీనికి సమాధానంగా భావించింది. బయటికి వెళ్లిన నుస్రత్ వెనక్కిరాలేదు. ఎలాగోలా బస్టాండ్ చేరి ఆఖరి బస్సుకు జంగంపల్లి చేరింది.

పరిస్థితిని కొడుకు హాబీబ్ కు వివరించింది. తల్లి చెప్పిన విషయం విన్న హాబీబ్ షాక్ కి గురయ్యాడు. పొద్దు పొద్దున్నే తల్లిని తీసుకొని మొదటి బస్సుకు చౌటుప్పల్ చేరుకున్నాడు.

ఇంకా నిద్ర లేవని అజీజ్ ను లేపి కూర్చోబెట్టారు. అజీజ్ కు విషయం అర్థమైంది. అతని గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. హాబీబ్ కళ్ళలోకి సూటిగా చూడలేకపోతున్నాడు. రెండు చేతులతో ముఖాన్ని దాచుకుని ...

"అమ్మేసాను...

కాదు కాదు నిఖా చేశాను. ఐదుగురు ఆడపిల్లల పెళ్లి చేయాలంటే భయం వేసింది. నా పేగులు, తిత్తులు అమ్ముకున్నా చేయలేననిపించింది.

కొత్తగా పరిచయం అయిన స్నేహితులతో సంగతి చెప్పాను.

వాళ్లే అరబ్ షేక్ ల సంగతి చెప్పారు. అట్లనే అనుకున్నట్టు అరబ్ షేక్ సంబంధం దొరికింది.

పిల్ల బతుకు పర్దేశంలనైనా బాగుపడతది అనుకున్న.

మన మతంల మారు పెళ్లిళ్లు ఉండనే ఉన్నయి. ముసలోడైతే ఏంది! అది సుఖపడతది అనుకున్న. మాతో ఉంటే తల్లితోని కల్సి మిషన్ కుట్టుకుంటూ బతుకు ఖరాబ్ జేసుకుంటది. అందుకే పానం జంపుకొని నిఖా జేసిన.

మీకు దెలిస్తే జరగనివ్వరు. అందుకే జెప్పలే..."

అని అత్త కాళ్ళమీద పడి ఏడుస్తున్నాడు అజీజ్. బావ పరిస్థితిని అర్థం చేసుకున్న హాబీబ్ బావను లేపి ఊకోబెట్టాడు. కానీ తాను చేసిన పని సరికాదని నాల్గు చివాట్లు పెట్టాడు. తామంతా ఉండగా అంత నిరాశ పనికిరానిది అంటూ నిట్టూర్పు విడిచాడు.

"వాడిచ్చిన పైసలు ఏం జేసినవ్ బావ. రోజు తాగుతున్నవని తెలిసింది. తాగుడు గా పైసలతోనే తాగుతున్నవా" అన్నడు హాబీబ్.

"షేక్ ఇచ్చిన ఆరు లక్షల రూపాలు నా దోస్తుల దగ్గర ఉంచిన . వాళ్ళు బాకీ కింద తీసుకున్నరు. నాకు పది వేలు ఇచ్చింద్రు"

అని బదులిచ్చాడు అజీజ్. రెండు చేతుల్తో నెత్తి బాదుకున్నాడు హాబీబ్. ఒక పక్క హుస్సేని ఏడుపు అతన్ని కలిచివేస్తున్నది.

బిడ్డతో మాట్లాడుదామంటే ఈ దేశం కాదు. కానరాని దేశం. కనీసం ఫోన్ నెంబర్ కూడా తీస్కోలే అజీజ్. అందరూ తలపట్టుకొని కూర్చున్నారు. ఇంతలో

"హుస్సేని అత్తమ్మ... హుస్సేని అత్తమ్మ మీ మున్నీ ఫోన్ చేసింది"

అంటూ పక్కింటి లలిత కూతురు శ్రీజ ఫోన్ తెచ్చిచ్చింది. అందరి కళ్ళలో మెరుపులాంటి ఆనందం....

హడావుడిగా ఫోన్ అందుకొని లౌడ్ స్పీకర్ పెట్టాడు హాబీబ్

"హాలో... అన్నాడు.

" హాలో...

అమ్మీ ముజే బచాలో అమ్మీ.

ఏ బుడ్డా మేరేకో బేచ్ దియా.

నాకు నరకం కనిపిస్తుంది అమ్మీ. అంటూ ఏడుస్తూ మాట్లాడుతున్నది మున్నీ. మున్నీ మాటను విన్న హుస్సేని గుండెలు బాదుకుంది. బేటీ అంటూ శోకం బెట్టింది. అందరూ ఆమెను ఊకోబెట్టారు. అవాజ్ జెయ్యకుండా ఉండమన్నారు.

"బేటా నేను హాబీబ్ మాము" అన్నాడు ఫోన్లో హాబీబ్.

"మాము ఈడ ఉండలేను. మా అబ్బు నన్ను ఈ అమీర్ కి అమ్మేశాడు. నన్ను కాపాడు మాము. దిక్కులేని బతుకు బతుకుతున్న మాము. నా బతుకు కుక్కలు చింపిన విస్తారాకు అయింది.

మాము.....నేనొక్కదాన్నే కాదు

నాలాగా ఇక్కడ మన దేశపోళ్లు చాలా మంది ఉన్నారు.

నన్ను కొన్న షేక్ కళ్ళుగప్పి బయటికి వచ్చి ఎస్.టి.డి నుండి ఫోన్ జేస్తున్న.

నన్ను కాపాడుండ్రి"

అని హృదయం కదిలిపోయేట్టు ఏడుస్తుంది మున్నీ.

"బేటా ....

నువ్వు ఫికర్ పడకు

నేను గాపాడుకుంటా బిడ్డ నిన్ను"

అంటూ కన్నీరు మున్నీరయ్యాడు హాబీబ్.

అంతలోనే ఫోన్ కట్టయింది.

విలపిస్తూ మాట్లాడుతున్న మున్నీని ఎవరో గమనించినట్టయ్యింది. అందుకే ఫోన్ కట్ చేసింది.

మున్నీ స్వరాన్ని మోసుకొచ్చిన సెల్ ఫోన్ మౌనంలోకి వెళ్ళిపోయింది. అంతటా ఒక నిశ్శబ్దం.

"మేముండగా పిల్లను ఒక కసాయి మనిషికి అమ్మేసావు. కల్లో గంజో తాగి మాతో పాటే ఉండేది బిడ్డ. దాని బతుకు ఆగం జేసినవ్" అంది నిశ్శబ్ధాన్ని ఛేదిస్తూ నుస్రత్.

"అమ్మీ నువ్వు ఆగు. జరిగింది నష్టం జరిగిపోయింది. ఇప్పుడు మున్నీని ఎట్లా గాపాడాలో సొంచాయించుండ్రి. పిల్ల బతుకు సేయి జారిపాయే" అన్నాడు హాబీబ్.

అంతలోనే డికాషన్ పెట్టుకొచ్చింది పక్కింటి లలిత. అందరికీ అందించింది. తన ఫోన్ కు మున్నీ కాల్ చేసినప్పుడే ఆమెకు డౌట్ వచ్చింది. ఆమె చప్పుడు చేయకుండా వారి మాటల్ని విన్నది.

"అజీజ్ అన్న సక్కని పిల్ల గొంతు గోసినవ్ గదా! గల్లీకి తల్లి లెక్క ఉన్న హుస్సేన్ అక్కకు ఎంత తాపం బెడుతున్నవ్ అన్న " అన్నది లలిత. ఎవ్వరూ పలకలేదు ఉలకలేదు. "మళ్లీ మున్నీ ఫోన్ రావచ్చు ఫోన్ ఉంచుండ్రి అన్న" అని ఇంటికి వెళ్ళిపోయింది లలిత.

ఎవ్వరూ ఏం మాట్లాడలేదు.

కాసేపటికి

"ఇందాక మున్నీ ఫోన్ ల మాట్లాడుతూ దాన్ని షేక్ అమ్మేశాడు అంది జీజూ..

ఏంది కథ! వాడు జేసుకొని ఇంకొకడికి అమ్మేసుడు ఏంది?

థు... ఆఖరికి బేటీ బతుకును కుక్కల పాలు జేసినవ్" అన్నాడు హాబీబ్.

మాట పెగల్లేదు అజీజ్ కి

కొస్తే నెత్తురు రాదన్నట్టుగా బండబారిపోయాడు.

అంతలోనే హాబీబ్ చేతిలో ఉన్న లలిత ఫోన్ మోగింది. ఫోన్ ఎత్తాడు హాబీబ్.

"హలో మాము..

మై మున్నీ..."

"బేటా నిన్ను ఏడ ఉంచిండ్రు. గది ఏ దేశం. దుబాయిలనే ఉన్నవా...!

నిన్ను జేస్కున్న గా అమీర్ షేక్ నిన్ను ఎందుకు అమ్మేసిండు. నువ్వు ఏమన్న తప్పు జేసినవా తల్లి...! అన్నాడు హాబీబ్.

మౌనంగా కారిపోతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ

" లేదు మాము అబ్బు నన్ను గాని కి అప్పగించినాక నాల్గుదినాల్ హైదరాబాద్ ల ఒక హోటల్ ల ఉంచిండు. గా నాల్గు దినాల్ నరకం జూపిచ్చిండు. ఆడ ఉండంగనే ఫోన్ ల ఆళ్ల భాషలో ఎవళ్ళతోనో చాలా సార్లు మాట్లాడిండు.

తర్వాత నన్ను దుబాయ్ తెచ్చిండు. వాళ్ళింట్లో పని మనిషి జేసే పనులు జేపిచ్చిండు. వాని కొడుకులు గూడా నన్ను హింస పెట్టిండ్రు. వాని దగ్గర నాలాగా సానా మంది ఉన్నరు.

ఒకనాడు మా అందర్నీ వ్యాన్ ల ఎక్కించుకొని పోయి ఇంకో షేక్ కి అమ్మేసిండు. వాడు మమ్మల్ని ఐదు కమ్రలున్న సత్రం లాంటి ఇంట్లో ఉంచిండు. నా జిందగీ ఖరాబ్ అయిపోయింది మాము" అంటూ గోళ్ళుమంది మున్నీ...

హుస్సేని మున్నీ మాటల్ని విని ఏడుపు ఆపులేకపోయింది. ఒక్కసారిగా పరుగెత్తుకువచ్చి ఫోన్ లాక్కుంది. "బేటి...మేరీ బేటీ...."అంటూ బోరుమంది.

అవతలి నుండి మున్నీ "అమ్మీ.. అమ్మీ..." అంటూ విలపించింది.

అప్పుడక్కడి వాతావరణాన్ని దుఃఖసాగరం ముంచేసింది.

"బేటీ ఎట్లున్నవే...అంది హుస్సేని దుఃఖాన్ని కట్టడిచేస్తూ....

" నా బతుకేం బాగాలేదు అమ్మీ. అబ్బు నా జిందగీల నిప్పులు బోసిండు.

ఈ అరబ్ దేశంల

నాతో పాటు ఉన్నవాళ్లు చెబుతున్నారు అమ్మీ. వాళ్ళను గూడా గిట్లనే కొనుక్కుని తెచ్చారట. ఆళ్లంతా మన హైదరాబాద్ వాళ్లే. ఆళ్ల అబ్బులు కూడా ఇలాగే నిఖా జేసీ పంపేశారట...

ఈడ నా బతుకు ఏం బాగాలేదు అమ్మీ...

నాకు భయంగుంది అమ్మీ

నన్ను ఏం జేస్తరో...."

అంటుండగానే "అమ్మీ...

అమ్మీ...."అన్న కమ్మని పిలుపును తననుండి ఎవరో దూరంగా ఎవరో లాక్కెళ్తున్నట్టుగా అనిపించింది హుస్సేనికి

తప్పించుకున్న మున్నీని వెతుకుతూ నలుగురు యువకులు వచ్చారు. వారి చేతిలో ఉన్న ఫోటోను ఫోన్ మాట్లాడుతున్న మున్నీని పోల్చుకున్నారు. అంతే మున్నీ చేతిలోని ఫోన్ చేజారి కిందపడి వేలాడుతున్నది.

ఆమె కనుమరుగవుతున్నట్లు, దూరమవుతున్నట్లు "అమ్మీ.. అమ్మీ...."అన్న అరుపులు మాత్రం

హుస్సేనికి వినిపించాయి. ఆ పిలుపులు బిడ్డ పరిస్థితిని పరిచయం చేశాయి.

ఆమె గుండె వేగం పెరిగింది. ఒక్కసారిగా జీవితం సుడిగుండంలోకి నెట్టబడినట్టయ్యింది. పట్టుతప్పి పక్కనే కూర్చుని ఉన్న తన తమ్ముడి మీద వాలిపోయింది.

**కవిత**

# అక్షర నదం



**సుమన ప్రణవ్**
**తిరుపతి, 8919696972**

నేనో అసంపూర్ణ వాక్యం......
కన్నీళ్ళతో కలల పలకపై తుడిచి తుడిచి
కొత్త ఆశల సుద్దముక్కై చీకటి రాత్రుల వేదనలో
వెలుతురు లతలు అల్లుకొన్న అక్షర పల్లకిలో
ఊరేగుతుంటాను...
మౌనాలను మాటలుగా మలిచి
తలుపుల నదంలో
వెన్నెల జలతారును పదాల ప్రవాహానికి అద్దుకోవాలని
అక్షర నావకు లంగరేసి సుదీర్ఘ రాత్రుల తీరాలలో
ఇసుక తిన్నెలపై ఓ విరామ చిహ్నమై చిగురేస్తూనే
ఉంటాను....
ఉన్నట్టుండి నిశి విషాదాశ్రువు నుండి పురుడోసుకొన్న
ఆకాశం వేవేల సూరీళ్ళను పొత్తిల్లలో పొదువుకొన్నట్టుగా...
కాంతి కువకువనై సరికొత్త భూపాళమాలపిస్తాను.....

ఘనీభవించిన మనసు కొలను అంచుల నుండి
కరిగి విడివడి జారిన అక్షర ముత్యంలా
సంధ్యలలో మునిమాపువేళ ఎర్రబడిన
పడమటి కొండ లోయలలో ప్రజ్వలించే
చైతన్య రాగ దీపమవుతాను....
నవ పరిమళాలంటిన భావ తరంగం
ఎదురవుతుందేమోనని
యామినిని పలకరించే శరదృతువు వెన్నెల దారుల్లో
శూన్యమయిన మనసు వేణువును
కలం పెదాలపై మోస్తూ తచ్చాడుతుంటాను...
అక్షరం ఎందుకో అలయని బాటసారిలా
పయనిస్తూనే ఉంటుంది జీవనదిలా!
నేనో దాహం తీరని అసంపూర్ణ వాక్యంలా...
దోసిలొగ్గి అడుగులేస్తూనే ఉంటాను శరణార్థిలా!

# స్వతంత్ర్యపోరాటంలో తెగువచూపిన తెలుగు మహిళలు



- దామరాజు విశాలాక్షి
విశాఖపట్నం, 8309921582

'యాదేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా నమస్తస్యై నమస్తస్యైనమస్తస్యైనమోనమ:

అనగా సమస్త శక్తి రూపాల్లో నెలవైయున్న ఆదేవికి మాటిమాటికీ నమస్కృతులని అర్థం.

అలాంటి శక్తి స్వరూపిణి యైన స్త్రీని గురించి

'స్రీ వ్యక్తికాదు శక్తి. 'మనజాతి ఇంతగా దిగజారిన పోవడానికి కారణం స్త్రీ లను గౌరవించకపోవడమే 'అన్నారు స్వామీ వివేకానందుల వారు.

'ఆధునిక మహిళ చరిత్రను తిరగ వ్రాస్తుందన్నారు' గురజాడ.

స్రీ ఆర్థికంగానిలద్రొక్కు కోవాలని విద్యావంతురాలు కావాలని స్త్రీ వ్యక్తిత్వం వికశించాలని

కందుకూరి వీరేశలింగం గారు వంటి సంస్కర్తలుఅన్నారు కృషి చేశారు,

స్త్రీలు చైతన్యశీలురు. దేశస్వాతంత్ర్య సమరంల ,స్వాతంత్ర్య సమరానికి పూర్వం, ఉద్యమాలలో పాల్గొనిన వీరవనితలెందరో యెందరో అందరికీ వందనాలు. అభినందనలు.

ప్రపంచచరిత్రలో సామ్రాజ్యాలనేలిన శౌర్యలలామలెంత మందో ఉన్నారు.

తెలుగులో తేజోవిరాజిత, తెలుగు సింహాసనాన్నధిరోహించి కాకతీయ సామ్రాజ్యానికి చక్రవర్తిని, అరివీరభయంకర ఆదిశక్తిగా పాలించిన తొలి తెలుగురాణి. కాకత రుద్రమరాణి రాజ్యతంత్రయంత్రాంగాలతో ప్రజారంజకంగా మెలిగిన మొదటి రాణి. కాకతిరుద్రమదేవి.

మంత్రిత్వం. జరిపి, మహిళల్లోనే మహా నాయకురాలిగా నాయకురాలు నాగమ్మగా ఆంధ్రవనితల పౌరుషానికి. అద్దంపట్టిన ధీశాలిని పలనాటినాగమ్మ.

మహాత్ముని పిలుపు విని స్వాతంత్రోద్యమంలో ఉరికిరుఝాన్సీరాణి పోరాటపటిమన స్ఫూర్తిగా తీసుకొని, దేశమాత దాస్య శృంఖలాలు ఛేదించడానికి సాయశక్తులా కృషి చేసారు.

'స్త్రీలు తాము అబలలమన్న మాట మరిచిపోతే పురుషులకంటే గొప్పగా పోరాడిగలరనడంలో నాకెలాంటి సందేహం లేదంటారు గాంధీజీ'.

'మత విద్వేషాలను రూపుమాపి అస్పృశ్యత అనైక్యతలను చెండాడి, అసామరస్యాన్నిపారద్రోలి, ప్రజలకు స్వశక్తితో ఆధారపడే శిక్షణనిచ్చి, ముఖ్యంగా స్త్రీలను పురుషులతో పాటు.

సాంఘికంగా ఆర్థికంగా రాజకీయంగా సమస్థితికి తెచ్చి. భారతదేశాన్ని ఉద్ధరించాలన్నదే గాంధీజీ ఆశయం అంటారు డా::సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు.

''గాంధీ జీ హండ్రెడ్. ఇయర్సు' అనే పుస్తకంలోఆయన ఈ విషయం వ్రాసారు.

"మహిళాశక్తిని మహాత్ముడు ఇంత మహనీయంగా గుర్తించడం వలననే స్వాతంత్రోద్యమంలో అన్ని తరగతుల వర్గముల స్త్రీలు యధేచ్ఛగాఉద్యమాలలో పాల్గొన్నారు ,స్త్రీలు పాల్గొనడానికి పురుషులు అనుమతించడం కూడా జరిగిందని 'పండిట్ నెహ్రూ 'అనిన మాటలు అక్షర సత్యాలు.

మహాత్ముని అడుగు జాడలలో నడిచి స్వాతంత్రోద్యమానికి వన్నెతెచ్చిన మహిళామణులగూర్చి తెలుసు కుందాం.

దేశబాంధవి దువ్వూరి. సుబ్బమ్మగారు భర్త

పోయినపుట్టాడు దు:ఖాన్న గుండెలలో దాచుకొని 'భారతమాత దాస్యశృంఖలాలు ఛేదించడానికి స్వాతంత్రోద్యమంలోనికి ఉరికిన దేశభక్తురాలు.

ఆడపిల్లలు పాఠశాలకు వెళ్ళి చదువుకున అవకాశాలు లేని రోజులలోనే, ఈమె స్వయం ప్రతిభతో పాండిత్యం సంపాదించారు. సహాయనిరాకరణోద్యమంలో శిక్షణ పొందిన రెండవ భారతీయ మహిళ సుబ్బమ్మగారు. నాలుగు సంవత్సరాలపాటు కఠిన కారాగార శిక్షకు గురైన ఈమె పోలీసు వారికి పెద్ద సమస్యగాతయారైంది. జైల్లో సదుపాయాలు లేవని గొడవచేస్తే విడుదలై రెచ్చగొట్టే ఉపన్యాసాలిస్తోందని మళ్లీ అరెస్టు చేసారు .క్షమాపణ చెప్తే వదిలేస్తామన్నారట నాటి కలెక్టర్.

నాకాలి గోరుకూడా మీకు క్షమాపణ చెప్పదు అన్నారట .

వంద రూపాయలు జరిమానా వేసి డబ్బులిస్తే వదిలేస్తామంటే ,నాగుండు తప్ప నాకే ఆస్థి లేదని ముసుగు తీసి గండు చూపారట.

లాఠీ చార్జీ చేయడానికి వస్తే, నేనెలాగ గంగా భాగీరధినే ఈ ఆంగ్లేయుల పాలన గంగలో కలిపేవరకూ పోరాటం ఆపనని భీషణ ప్రతిజ్ఞ చేసేవారట.

ఆమె ధైర్యం పోరాటపటిమా దేశభక్తి చూసిన గాంధీజీ ఆమెను 1923 లో దేశ బాంధవి అని ప్రశంసించారుట. ఈ దేశభక్తురాలు 1964 మేనెల 31 దేశమాతలో ఐక్యం చెందారట.

శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారిగారు. హైదరాబాదులో ఘోష పద్ధతులుగలరోజులు.

స్త్రీలు వీధులలో తిరగ కూడదని నిషేదాజ్ఞలున్నప్పుడే' నాటి స్వతంత్రయోధులతో కలసి వీధులలో తిరిగి ప్రచారం చేసేవారట.

ఈ సంఘ సేవకురాలు 1927 లో కస్తూరిభ గాంధీ హైదరాబాద్ వచ్చినపుడు ఆమె సమక్షంలో మాట్లాడి సమస్యలను చెప్పి ఆమె ప్రశంసలు పొందారట.

1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని భారీ ప్రచారం చేసారట.

గోల్కొండపత్రికలో రచయిత్రి కూడా అయిన ఈమె అనేక వ్యాసాలు వ్రాసారట.

సేవాస్ఫూర్తి ,హేతువాదకీర్తిసరస్వతీ గోరా .గోపరాజు రామచంద్రయ్యగారి సహధర్మచారిణి.

'సమాజసేవకురాలు ఈమె స్వాతంత్ర్య సమరయోధురాలు. అనేకఉద్యమాలలోపాల్గొని

జైలుశిక్షలు అనుభవించారు. కొన్నాళు గాంధీగార సేవాగ్రామ్ సేవచేసారు.

గాంధీగారి అడుగు జాడలలో నడిచినవీరు ఆదర్శాలు చెప్పడమ కాదు ఆచరించి చూపినఆదర్శమహిళ.

స్త్రీ స్వేచ్ఛావాది మల్లాద సుబ్బమ్మగారు అణుగారి పోతున్న మహిళల హక్కులకోసం అనుక్షణం పోరాడారు. అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. న్యావాదిగా సమాజ సేవకురాలిగా గొప్ప దేశభక్తు రాలిగా సుబ్బమ్మగారు వెలకట్టలేన సేవలు చేసారు.

కష్టాలకొలిమిలో కాలుతున్నా ఉద్యమాలకు ఊపిరి పోసిన కొండపల్లిఈశ్వరమ్మగారు. వందేమాతరం పాడిన వారిని లాఠీలతో కొట్టడం. జైళ్ళలో పెట్టడంచూసి, చిన్నారి బాలవితంతువు ఈశ్వరమ్మకు ఆంగ్లేయులపై కోపం కల్గింది. ఆ పసిపిల్లకే అసహ్య భావంకల్గించాయివారి చర్యలు. మధురమైనకంఠంతో మంచి గీతాలాలపించేది.

ఆరోజుల్లో ఖద్దరుధరించడం విదేశీ వస్తు దహనం సత్యాగ్రహ పోరాటం ఆమెను స్పందింపజేసాయి. జాతీయోద్యమం. కమ్యూనిష్టు ఉద్యమం. ప్రజానాట్య మండలిలలో. అనేక ప్రజాసంఘాలలో పనిచేసిన కొండపల్లి ఈశ్వరమ్మగారు గొప్ప చైతన్య శీలి.

గుంటూరు ఝాన్సీగా ఆంగ్లేయుల గుండెల్లో అగ్ని పర్వతాలు ప్రేల్చిన 'ఉన్నవ లక్ష్మీ బాయమ్మ'శుద్ధ గాంధేయవాది. 'ఉన్నవ లక్ష్మీ నారాయణ గారి' ధర్మపత్ని.

1921 గాంధీగారి సహాయం నిరాకరణోద్యమ సమయంలో, భర్తతోపాటు పాల్గొనడమే గాక భర్త కారాగారంలో ఉన్నప్పుడు ఆంధ్ర దేశమంతటా పర్యటించి. సత్యాగ్రహోద్యమానికి ప్రచారం చేసారు. వేలాది మందిని ఉద్యమించేలాచేసిన వీరవనిత. జన సమీకరణలో గొప్ప నిపుణురాలు.

ఎన్నోసార్లు జైలు పాలయి భయంకరహింసలకు గురైనా,

దేశ భక్తి విడువలేదు.

తమకలలు సాకారమై స్వాతంత్ర్యం వచ్చాక,1956 లో అశువులు బాసారు ఈ యోధురాలు.

నెల్లూరు విప్లవకణిక పొణకా కనకమ్మ గారు .

'ఎక్కడ స్త్రీ విద్య ఉద్ధరింపబడిందో ,ఎక్కడ మహిళల ప్రాధమిక హక్కులు రక్షింప బడినవో ఎక్కడ రైతు ఉద్యమాలు పుష్పించి ఫలించి బడినవో అక్కడ కనకమ్మ పేరు కనబడుతుంది వినబడుతుంది. ఆమె మూర్తి కనబడుతుంది అని ఈ ధీరవనితను త్యాగమూర్తి కీర్తించారు పద్మ విభూషణ్ కొండారెడ్డి గారు.

మొక్కవోని కార్య దీక్షతో మాత్రు దేశదాస్య విముక్తికి జీవితాన్ని త్యాగం చేసిన కర్మ యోగిని పొణకా కనకమ్మ గారు.

త్యాగమూర్తి మాగంటి అన్నపూర్ణాదేవి. జాతిపిత గాంధీ మహాత్ముడు అతి చిన్న వయసులోనే కన్నుమూసిన అన్నపూర్ణాదేవిని తలచు కుంటూ శ్రద్ధాంజలి ఘటించాట,

'నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ తనకున్న బంగారు నగలన్నిటినీ దేశంకోసం నాకు సమర్పించిన తొలిభారత మహిళ ఆమెయే. నాఆదృష్టం కొలదీ నన్ను తండ్రిగా భావించి సేవించిన పుత్రికలలో ప్రథమగణ్యురాలు అన్నపూర్ణేఅన్నారట కంటతడి పెడుతూ గాంధీజీ.

స్వదేశీఉద్యమానికి. సర్వస్వం ధారపోసి విదేశాల నుండి వచ్చిన భర్త కు స్టీమర్ దిగిన సమయంలోనే స్వయంగా వడికిన ఖద్దరు బట్టలిచ్చి కట్టుకోమని అతనిని కూడా దేశ సేవకు అంకితం కావాలని ప్రభోదించిన. అన్నపూర్ణాదేవి సేవలు అనన్య సామాన్యం.

పద్మజానాయుడు. తల్లి తొలి గవర్నరు సరోజినీనాయుడు. కుమార్తె పద్మజానాయుడు.

తొలితెలుగు మహిళాగవర్నర్. గొప్ప దేశభక్తురాలు స్వతంత్రోద్యమ నాయకు రాలు.

యుక్త వయస్కురాలిగా ఉన్నప్పుడేఈమె స్వరాజ్య నిధిని పోగు చేయడంలో ఈమె జాతీయ నాయకులుకు సహాయపడింది.

1942 క్విట్ ఇండియా ఉద్యమంలో నిజాం రాజ్యంలో నిషేదాజ్ఞలను ధిక్కరించి గాంధీజీజయంతి ఉత్సవం నిర్వహించినందుకు నిజాం ప్రభుత్వం ఆమెను నిర్బంధించింది.

స్వాతంత్రోద్యమంలో ఈమె క్రియాశీలక పాత్ర పోషించింది. గొప్ప రాజనీతిజ్ఞురాలు.

'శ్రీమతి దిగుమర్తి. జానకీబాయమ్మ గొప్ప స్వాతంత్రోద్యమవీరురాలు. తండ్రి విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు శ్రీ మల్లెదుగుల బంగారయ్య. తల్లి లలితమ్మ. గొప్ప దేశ భక్తురాలు. భర్త దిగుమర్తి .వేంకట రామాస్వామి నిష్కళంక దేశ భక్తుడు.

గాంధీజీ సత్యా గ్రహోద్యమానికి బందరు జాతీయ కళాశాల స్థాపనకూ విద్యార్ధినిగానే ఈమె ఇల్లిల్లూ తిరిగి విరాళాలు సేకరించింది.

ఉప్పు సత్యాగ్రహంలో పిడికిలిలో ఉప్పు పట్టుకొని ఉద్యమించే ఈమె చేతిని పట్టుకోలేక ఆంగ్లేయ అధికారి ఇండియన్ పోలీసుకు అప్పగిస్తే, అతడు ఈ మె గుప్పిట్లో ఉప్పు విడిపించలేక చేతిని ఎంత బలంగానొక్కినా ఆమె చిరునవ్వుతో భరిస్తుంటే నిశ్చేష్టుడయ్యట.

సాందర్సు ఈమెకు ఆరునెలలుగ కఠిన కారాగార శిక్ష వేసారు. శిక్షతో పాటు జరీమానాకు కూడా గురైన తొలి ఆంధ్రమహిళ జానకీ బాయమ్మ, రామస్వామి దంపతులు.

విశాఖ పట్టణం నుండి వెళ్ళి నెల్లూరు జిల్లా పినాకినీ సత్యాగ్రహ సమరంలో పాల్గొన్నారు.

భార్యాభర్తలిరువురూ శిక్షలకు వెరువక గొప్ప సత్యాగ్రహ ఉద్యమాలు నడిపి శిబిరాలు నిర్వహించారు .ప్రసంగాలతో వేలాది తెలుగు వరిని ఉత్తేజ పరిచారు..

1931 లో జానకీబాయమ్మ గారికి. 18 నెలల కఠిన కారాగార శిక్ష విధించి రాయవేలూరు జైలులో నిర్బందించారు. ఆ కారాగారం లోన ఈమెకు దుర్గాబాయి దేశముఖ్, ఆచంటరుక్మిణీ దేవి వంటి ప్రముఖ స్త్రీలతో పరిచయం ఏర్పడింది అదేజైలులో 'దేవకీదేవి యోగ మాయకు జన్మనిచ్చినట్లు' జానకీబాయి ఒక బాలికకు జన్మనిచ్చింది ..ఆజైలులో ప్రముఖ స్వాతంత్రయోధురాళ్ళంతా సహాయపడ్డారట. దుర్గాబాయ్ అక్కడ కలిసారట. రఘుమాయాదేవి ఈమెగారి పాపకు బాలసార చేసి నామకరణం చేస్తే, కోటమర్తి కనకమ్మ

స్నానంచేయించారట. భారతీ రంగా గాని కుట్టి తొడిగారట. రుక్మిణీ లక్ష్మీపతి జోకొట్టి జోలలు పాడేవారట. ఏడునెలలు ఆ శిశువు. జైలులో పెరిగాక విడుదలయ్యారట. విడుదలయినప్పుడు వీరిని మన మాజీ రాష్ట్రపతి వి.వి. గిరి దంపతులుమద్రాసు తీసుకువచ్చి, అక్కడినుండి స్వయంగా. విశాఖ పట్టణం తీసుకు వెళ్ళారట. .స్వా తంత్ర్యఅనంతరం కూడాభారతీయ స్త్రీ సమాజ స్థాపనకు విశేష కృషి చేసిన వీరు చిరస్మరణీయులు.

రైతు ఉద్యమ మహిళానేత భారతీరంగా. స్వాతంత్రోద్యమవీరుడైన తండ్రి. తండ్రి ఆశయాలతో పెరిగిన భారతీ దేవి దేశాభ్యుదయాన్ని కాంక్షించడంలో ఆశ్చర్యంలేదు.

కొన్నాళ్ళు మాతృదేశంలో విద్యాభ్యాసంచేసి, భర్తతో పాటు లండన్ వెళ్ళి నప్పుడు అక్కడ విద్యాభ్యాసం చేసి వచ్చారు 1930 లో సత్యాగ్రహోద్యమంలోనూ, విదేశీ వస్తు బహిష్కరణ పన్నులనిరాకరణ వంటి అనేక ఉద్యమాలలో ఎంతో కృషిచేసారు. ఆమెతన సేవాభావంతో త్యాగనిరతితో గాంధీగారిని మెప్పించారు గాంధీజీ వెంకటగిరి జమిందార రైతులసమస్యలపరిష్కారానికి వెళ్ళిప ఇపుదు భారతీదేవిని .పొనకా కనకమ్మగారినీ కలసారట.

వారిద్దరితోగాంధీజీఆంధ్రామహిళలకుఉత్సాహమేకాదు కార్యశూరత్వం కూడా ఉంది అని మెచ్చుకున్నారట. ఈమె గొప్ప దేశభక్తురాలు దేశాభ్యుదయం కోసం వివిధ కార్య క్రమాల నిర్వహణలోనూ, కార్యదక్షతాదీక్షలోను, త్యాగనిరతిలోనూ, ధైర్య సాహసాలు ప్రదర్శించడంలోనూ, స్త్రీ చైతన్య శక్తికి శుద్ద ప్రతీక యైన దుర్గాబాయి దేశముఖ్ మార్గ దర్శియని చెప్పక తప్పదు.

చిన్నప్పటినుండీ ఆటపాటలలో చదువుసంధ్యలతో చురుకుగాఉండేది.తాత,తండ్రితల్లివలన స్వాతంత్రోద్యమంపట్ల అవగహన పెంపొందించుకున్నది.

వీరేశలింగంగారి స్త్రీజనోద్ధరణ ఈమెకు ఆదర్శం.

పదకుండేళ్ళవయసులోనే ఆమె కాకినాడలో బాలికా హిందీ పాఠశాల ప్రారంభించింది.

అన్ని కళలలో పట్టు సాధించింది. కాంగ్రెసు మహాసభలకు 600 మంది మహిళా వాలంటీర్లకు తర్ఫీదు చేసింది దుర్గాబాయి తను నడుపుతున్న పాఠశాలనుండేనట.

కాంగ్రెసు మహాసభలప్రవేశద్వారంవద్ద టిక్కెట్. లేదని ఆయననెహ్రూగారని చెప్పినా అందరికీ ఒకటే నిబంధన అవి టిక్కెట్ ఇచ్చే వరకూ నెహ్రూ గారిని కూడా లోప లిపి పోనీయలేదట వారి మెప్పును పొందిన ధైర్యశాలిని ..

గాంధీజీ కాకినాడ. పర్యటనలో మహిళలతో ప్రత్యేక సమావేశమ నేర్పాటుచేసి నాటి కాంగ్రెస్ పెద్దల ఇష్టానిక వ్యతిరేకంగా గాంధీజీ ఆ సభలో ప్రసంగించేటట్లు చేసింది.

ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనడానికి గాంధీగార నుండి ప్రత్యేక అనుమతి పొందినది.

ఉద్యమాలలో పాల్గొని అనేక మార్లు జైలుక వెళ్ళికఠిన కారాగార శిక్షలకు గురైన దుర్గాబాయి ఆ కారాగారంలో మహిళలన సంఘటితపరచి ఉద్యమానికి ఊపుతెచ్చినది.

అనునిత్యం ప్రజాహిత కార్య క్రమాలలో ఉద్యమాలలో నిమగ్నమై ఉండే దుర్గాబాయి నిత్య చైతన్యశాలిని. 1955 లో దుర్గాబాయి హైదరాబాద్ లో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు.

మంచి కుమార్తెగా, మనుమరాలిగా. చురుకైన విద్యార్థిని గా, నిబద్దత గల కార్యకర్తగా. నాయకురాలిగా, ఉపాధ్యాయగా, గృహిణిగా, న్యాయవాదినిగా, రచయిత్రిగా. సంఘ సంస్కర్తగా అనేక రూపాలతో తిరిగి ఆదిశక్తిగా మెలగిన దుర్గాబాయి సేవలు తెలుగు జాతి ఎన్నటికీ విస్మరించదు. ఈమె చిరస్మరణీయురాలు.

'బఅగాధమగు జలనిధిలోన ఆణి ముత్యాలున్నట్లే'. స్వాతంత్రోద్యమ సమరానికి వెన్నుదన్నుగావిలచిన విశిష్ట మహిళలెందరో అందరికీ వందనాలు.

వారందరూ ఈ తెలుగు నేలపై వెలుగులు విరజిమ్మారు. పేరు పేరునా అందరినీ పరిచయం చేయగలిగిన సమయంలో తప్పక చేద్దాం. అంతవరకూ భరతమాత దాస్య శృంఖలాలు ఛేదించడానికి కృషిచేసిన. జ్వలించి చలించిన ప్రతి ఒక్కరిక అంజలి ఘటిద్దాం.

భారతాంబిక పునర్వైభవ ప్రాప్తికొరకు నడుంకట్టిన మహిళామణులులో మనతెలుగు తేజాలెందరో మరెందరో అందరికీ వందనాలు.

భారత్ మాతాకీ. జై

పిల్లల నవల

# నీలాకాశంలో నిధి



## (పిల్లల నవల - మొదటి భాగం)

- శాంతి ప్రబోధ
హైదరాబాద్, 9866703223

పైన నీలాకాశం

కింద నీలి సముద్రం

నెమ్మదిగా కదులుతున్న తెల్లని మేఘాలు

ఆ మధ్యలో రెక్కలల్లార్చుకుంటూ ఎగిరే పక్షి లాగా విహరిస్తూ మామయ్య.

వావ్..

ఎంత అద్భుతమైన ఆ దృశ్యం!?

మనసులోనే అనుకుంది నిధి.

కళ్ళు మూసినా తెరిచినా ఆ దృశ్యమే నిధి తలపుల్లోకి వస్తున్నది. మళ్ళీ మళ్ళీ వస్తున్నది.

అటువంటి దృశ్యం మీరెప్పుడైనా చూశారా? లేదు కదూ..

కానీ నిధి చూసింది.

నీలాకాశంలో ఎన్నెన్నో పక్షులు ఎగురుతూ ఉంటాయి. అది అందరికీ తెలిసిన విషయమే.

నీలి సముద్రంలో రకరకాల చేపలు, పీతలు, పాములు, కప్పలు ఇంకా ఏవేవో చాలా జీవరాశులు ఉంటాయి. అది కూడా అందరికీ తెల్సిన సంగతే.

నిధికి ఎందుకో గానీ చేపలాగా నీలి సముద్రంలో ఈత కొట్టాలి అని అనిపించలేదు.

నీలాకాశంలో పిట్టలాగా ఎగరాలని కోరిక మాత్రం అలా అలా పెరిగిపోతున్నది.

ఈ విధంగా అనిపించడం పదకొండేళ్ల నిధికి ఇది మొదటిసారి కాదు .

ఇప్పటికి ఎన్ని సార్లు అంటే.. లెక్కపెట్టలేనన్ని సార్లు పక్షిలా గగనంలో విహరించాలని అనుకుంది.

మామయ్య పిట్టలాగా ఆకాశంలో షికారు చేసిన సుందర దృశ్యం నిధి కళ్ళలో ఎప్పుడూ మెదులుతూనే ఉంది.

ఏం చేసినా, ఎక్కడున్నా ఆ దృశ్యం ఆమెను వెన్నంటి వస్తూనే ఉంది.

అయస్కాంతంలా ఆకర్షిస్తూనే ఉంద. అస్సలు వదలడం లేదు.

నిధి అందరు పిల్లల్లాంటి పిల్ల కాదు. ఆమె ఆలోచనలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఆమె పనులు కొత్తగా కనిపిస్తాయి. ఒక్కోసారి చాలా అల్లరిపిల్ల అనిపించుకుంటుంది. ఒక్కోసారి పొందికైన పిల్ల. నిధిని చూసి నేరుకోండి అని పెద్దలు అనేలా ఉంటుంది.

నిధికి తనకు ఏది అనిపిస్తే అది చెప్పడం, చేయడం అలవాటు.

ఆ చిన్నారి మనసులో కొత్త కొత్త ఆవిష్కరణలు జరిగిపోతుంటాయి. కలలు కంటుంది. వాటిని సాకారం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది.

కానీ ఏమిటో.. ఈ కోరిక తీరుతుందో లేదో నన్న బెంగ నిధి కళ్ళలో.

అప్పుడప్పుడు , రెక్కలున్న హ్యాంగ్ గ్లైడర్ కళ్ళముందు కదులుతుంది. మామయ్య స్థానంలో ఆమె ఉన్నట్లు ఊహించుకుంటుంది.

ఆ ఊహ రాగానే ఆమె కళ్లలో కొత్త వెలుగులు నిండుతాయి.

నక్షత్రాల్లా మిల మిల మెరిసే ఆ కళ్ళు మరిన్ని ఊహల్లో తేలిపోతూ ఉంటాయి.

శరీరమంతా గాలిపటంలా ఎగిరి పోతున్నట్టు ఉంటుంది. కాసేపటి తర్వాత ఎప్పటికో ఈ లోకంలోకి వస్తుంది నిధి.

ఇప్పుడూ అంతే ..

తన ఊహ ప్రపంచంలో కాసేపు తిరిగి వచ్చింది.

తన కాళ్ళను చూసుకుంది. చేతులు తడిమింది.

అయ్యో .., నేను నింగికి నేలకు మధ్య గాలిలో రివ్వున ఎగిరి పోవట్లేదా?

ప్చ్ .. ఈ కాళ్ళు నేల మీదే ఉన్నాయి అని చిన్నగా నిట్టూర్చింది.

కొద్ది క్షణాలు కళ్ళు మూసుకుంది.

తెల్లటి మబ్బు తునకలను ముద్దాడుతూ, హ్యాంగ్రె గ్లైడింగ్ ని హత్తుకుని ఆకాశం లో ఎగిరిపోతున్న దృశ్యం మళ్ళీ కళ్ళ ముందు మెదిలింది.

కళ్ళు తెరిచి చూసింది. తన ఇంట్లోనే ఉంది.

ఇది ఏంటి? నేను ఆకాశంలో కదా ఉండాల్సింది. ఇంట్లో ఉందేమిటి అని మళ్ళీ కళ్ళు మూసుకుంది .

మళ్ళీ ఆ అద్భుత దృశ్యం. గాలిలో గిరికీలు కొడుతూ కేరింతలు కొడుతున్న దృశ్యం కళ్ళ ముందు నిలిచింది.

మూసిన కళ్ళు తెరవాలని అనిపించడం లేదు. కళ్ళు తెరిస్తే కమ్మని కల కరిగిపోతుంది.. అలా జరగడం ఇష్టం లేదు. కళ్ళు మూసుకుని ఊహల్లో ఊరేగుతూ ఉన్నది నిధి. .

అంతలో, చెల్లి రిధి వచ్చి “కూర్చుని నిద్రపోతున్నావా .. అక్కా అక్కా” అంటూ చెయ్యి పట్టి లాగింది .

“ఏంటే .. ఎందుకు అలా అరుస్తావు? “అని చెల్లిని కసిరింది నిధి.

అక్క మొహం చూసి రిధి మూతి ముడుచుకుని అమ్మ దగ్గరికి పరిగెత్తింది.

నిధీ..

ఊహల్లో ఎన్ని రోజులు ఉంటావ్.

కలలో ఎన్ని రోజులు తేలిపోతావు. చందమామ భూమి చుట్టూ తిరుగుతుంది. అట్లా నీవు కూడా ఆకాశమంత చుట్టేసేయ్. వెన్నెల మడుగుల్లో స్నానం చేసేయ్ . మెత్తని చుక్కల చుట్టూ చక్కర్లు కొట్టేయ్.

ఎన్నాళ్ళు, ఈ నేల మీద నడుస్తావు. పరుగుపెడతావు. దూకుతావు అని ఆమె మనసు మెత్తగా మొట్టికాయ వేసింది.

నేలపైన నడిచినట్లు, నీటిలో ఈదినట్లు గాలిలో కూడా ఎగిరితే ఎంత బాగుంటుంది.

అప్పుడప్పుడు ఎగిరిపోవాలని గాల్లోకి దుముకుతుంది నిధి. తన ఆశ ఎప్పుడు నెరవేరదు.

ఇప్పుడు కూడా దూకింది. కానీ కాళ్ళు మళ్ళీ నేలను తాకాయి. తన కాళ్ళను చూసుకుంది.

అయ్యో.. గాల్లోకి గెంతినా కొన్ని క్షణాలే. కాళ్ళు మళ్ళీ నేలనే అంటి పెట్టుకుంటున్నాయి.

పక్షులు, తూనీగలు, ఈగలు, దోమలు, గబ్బిలాలు రెక్కలు అల్లారుస్తూ గాలిలో ఎంచక్కా ఎగురుతాయి . షికారు చేస్తాయి. నేనెందుకు ఎగరలేక పోతున్నాను. అని ఎప్పటిలాగే ప్రశ్నించుకుంది.

ఎగరడం లో ఎంత స్వేచ్ఛ ఉంది. ఆ షికారులో ఎంత ఆనందం ఉంటుంది అని అనుకుంది ఆ చిన్నారి.

నువ్వు కూడా ఎగురు. గాలిలో ఈత కొట్టు.

చందమామతో చేయి కలుపు, నక్షత్రాలతో స్నేహం చెయ్యి.

నీ కలల్ని నిజం చేసుకో అంటూ నిధి మనసు మరోసారి మొట్టికాయలు వేసింది .

అమ్మ పిలుపుకు, చెల్లెలి అరుపులకు విసుగ్గా కళ్ళు తెరిచింది నిధి.

నిజమే, కరిగిపోయే కలలు ఎన్ని రోజులు కనడం అనుకుంది.

మామయ్య కల కనకుండానే గాలిలో గిరికీలు కొట్టాడు. నేను కలగంటున్నా .

మరి.. నా కల నిజం చేసుకోవాలంటే అంత సులభమా .. ప్చ్ కాదు . చాలా కష్టం.

కష్టమని ఊరుకుంటే ఎలా. సాధించుకోవాలి .

ఎంత కష్టమైనా సాధించుకోవాలి. ఎన్ని అవస్థలు అయినా పడతా. ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గను. తనకు తాను చెప్పుకుంది.

నిధి తనలో మొలకెత్తిన ఊహలను నిజం చేసుకోవాలి అని తహతహ లాడుతుంది.

ఆ నిర్ణయం, ఆ ఆలోచన ఆమెలో కొత్త ఉత్సాహం ఉరకలు వేయిస్తూ ఉంది . ధైర్యాన్ని ఇచ్చింది.

అందుకు ఏం చేయాలి? అని తనలో తాను ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం మొదలు పెట్టింది.

ఇట్లా చాలా సార్లు అనుకుంది. ప్రణాళికలు వేసుకుంది.

కానీ నిజం చేసుకునే ప్రయత్నం మాత్రం చేయలేదు.

ఇప్పుడు అట్లా కాదు. ఎలాగైనా తను అనుకున్నది సాధించుకోవాలి. ఊహను వాస్తవం చేసుకోవాలి. నిధి చాలా పట్టుదలతో ఉంది.

రెండేళ్ల క్రితం నిధి మామయ్య నీలాకాశంలో పక్షిలాగా విహరించి వచ్చాడు. ఆ ఫోటోలు , వీడియోలు నిధి చూసింది .

అట్లా వాటిని చూసిన తర్వాత ఆమెకు నీలాకాశం మీద నీలి సముద్రం మీద ప్రేమ పుట్టింది అని అనుకుంటున్నారేమో... అదేమీ కాదు.

నిధికి చిన్నప్పటి నుంచి నీలి రంగు ఆకాశం అంటే చెప్పలేనంత ప్రేమ. పిచ్చి ఇష్టం.

ఎంతంటే... ఎంతని చెప్పను?

ఊ.. ఆకాశమంత ఇష్టం. అవును, ఆకాశమంత ఇష్టం.

నిధి లాగే మీక్కూడా అనిపిస్తుంది కదా. నాకు తెల్సు, చాలా మంది పిల్లలు రెక్కలుంటే ఎంత బాగుండు. ఆకాశంలో ఎంచక్కా ఎగిరిపోవచ్చు.

ఎప్పుడూ నేలమీద నడవడమేనా .. పక్షిలాగా గాలిలో ఎగిరిపోవాలని గింగిరాలు కొడుతూ నీటిని ముద్దాడి మళ్ళీ పైకి పైపైకి స్వేచ్ఛగా ఎగిరిపోతే ఎంత బాగుంటుంది అని పిల్లలందరూ ఎప్పుడో ఒకసారి అనుకుంటూనే ఉంటారు.

పిల్లలే కాదు, పెద్దలు కూడా అనుకుంటారు. కానీ, అది సాధ్యం కాదని మౌనంగా ఉండి పోతారు.

కానీ నిధి అలా కాదు. అందరిలా సరిపెట్టుకుని ఉండలేక పోతున్నది.

నిధికి ఎప్పుడూ అదే ధ్యాస. అదే శ్వాస అయింది.

నిధి తన కల నిజం చేసుకోవడానికి రకరకాల ఆలోచనలు చేస్తూ ఉంది.

ముందే చెప్పాను కదా .. నిధికి ఆకాశమంటే ఆకాశమంత ఇష్టమని.

ఆకాశాన్ని ఏ సమయంలో చూసినా, ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూస్తుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే ఆకాశమంటే ప్రేమలో పడిపోయింది ఆ పిల్ల.

పక్షులు ఎగిరినట్లు తాను ఎందుకు ఎగురలేదు అని చాలా సార్లు ప్రశ్నించుకుంది. అమ్మని నాన్నని టీచర్లని అందరినీ అడిగింది. పక్షులకు ఉన్నటువంటి కండరాలు లేవని, మన శరీరం బరువుగా ఉండడం వల్ల ఎగరలేమని ఏవేవో చెప్పారు. అవేమీ ఆమె చిన్ని బుర్రకి ఎక్కేవి కాదు.

ఎప్పుడైతే మామయ్య హ్యాంగ్ గ్లైడింగ్ చూసిందో అప్పటి నుంచి నిధి తాను కూడా ఆకాశంలో ఎగుర గలనని నమ్మకం వచ్చింది.

ఆమె ఊహలు, కలలకు రెక్కలు వచ్చాయి. కలల్ని నిజం చేసుకొమ్మని తొందర పెడుతున్నాయి.

మరి, నిధి తన కలల్ని, ఆశల్ని, ఊహలను నిజం చేసుకుంటుందా? కలలుగానే , ఊహలు గానే , ఆశలుగానే మిగిలిపోతాయా .. ?

ఏమో మరి!

అసలు అది తెలుసుకోవాలంటే ముందు నిధి చిన్ననాటి సంగతులు, మామయ్య చేసిన హ్యాంగ్ గ్లైడింగ్ అనుభవం, ఆయన చెప్పిన కబుర్లు నిధితో ఏమేమి చేయించాయో

తెలుసుకుందాం. పదండి.

★★★

ఆ ఆకాశంలో ఏముందే .. కళ్ళు అప్పగించి చూస్తూ ఉంటావ్ అంటుంది నిధి వాళ్ళమ్మ .

అమ్మా .. అంత పెద్ద దానివి అయ్యావు. అది కూడా తెలియదా. ఇంకా అట్లా చిన్న పిల్లలా మాట్లాడతావు .

చూడు, అటు చూడు ఆకాశాన్ని.

నిన్న చూసినట్లు ఇవ్వాళ ఉందా ..?

పొద్దున్న చూసినప్పుడు ఉన్నట్లు ఇప్పుడు ఉందా .. ఎప్పుడు చూసినా కొత్తగా ఉంటుంది కదా .. అంటుంది వాళ్ళమ్మని .

అందరికీ మామూలుగా కనిపించే దృశ్యాలు, చూసీ చూడకుండా మరచిపోయే దృశ్యాలు నిధికి అపురూపంగా కనిపిస్తాయో.. ఎందుకు అసాధారణంగా కనిపిస్తాయో ..అర్థం కాదు అనుకుంటుంది అమ్మ.

అలా ఆలోచిస్తూ .., వాటి లోతుల్ని చూడగలిగే దృష్టి కోణం నిధి ది. వాటిని ఆస్వాదించే మంచి మనసు తన చిట్టితల్లి ది అని మురిసిపోతుంది అమ్మ.

ప్రకృతిలో అనుక్షణం సరికొత్తగా జీవం పోసుకునే దృశ్యాలు, అందాలు ఎప్పటికప్పుడు ఒడిసి పట్టుకునే

బిడ్డ మాటలకి, సునిశిత పరిశీలనకు, సృజనకు అమ్మ మురిసిపోతుంది. ముసిముసి నవ్వులు నవ్వుతుంది.

ఆ తర్వాత నిధి నెత్తి మీద మెచ్చుకోలుగా చిన్న మొట్టికాయ వేస్తుంది.

అబ్బా .. అని తల మీద చేత్తో నెమ్మదిగా రుద్దుకుంటుంది. అమ్మకేసి కొరకొరా చూస్తుంది నిధి.

అప్పుడు అమ్మ కూతురిని దగ్గరకు తీసుకుంటుంది. కుడి చేతి వేళ్ళతో భుజంపై తడుతుంది .

అమ్మ చేతి మెత్తటి స్పర్శ నిధికి కొండంత బలాన్ని ఇస్తుంది .

మళ్ళీ ఆకాశం కేసి చూపు విసురుతుంది.

మనిద్దరం ఫ్రెండ్స్ కదా.. నాకు అందనంత ఎత్తులో ఎందుకు ఉన్నావు?

ఏయ్ నింగీ.. నిన్ను తాకాలని అనిపిస్తుంది. ఒక్క సారి వంగి నాకు షేక్ హాండ్ ఇచ్చి పో అంటూ ముద్దు ముద్దుగా అడుగుతుంది.

ఎగిరే పక్షుల్ని చూస్తూ ఎప్పుడూ మీరే ఎగురుతారా.. నన్ను కూడా మీతో తీసుకుపోవచ్చుగా..

నాకు మీతో వచ్చి లోకమంతా చుట్టేయాలని అనిపిస్తుంది. మీరేమో నన్నిట్లా వదిలేసి ఎంచక్కా పోతారు.. ఒక్కసారైనా మీ రెక్కలపై కూర్చోపెట్టుకుని ఊరేగించొచ్చుగా అంటుంది.

ఇంటి ముందు మెట్ల పై కూర్చుని బారులు తీరి పోతున్న పక్షుల గుంపులను ఆరాధనగా చూస్తుంది.

అప్పుడు అక్కడ నిధి నాన్నమ్మ ఉందనుకోండి.

నవ్వుతూ నిధి వైపు చూస్తూ ఏదో చెప్పడం మొదలు పెడుతుంది.

పో నాన్నమ్మా .. ఇంకా ఎన్ని సార్లు చెబుతావ్ . ఇక చాల్లే అంటూ నిధి బుంగమూతి పెట్టింది.

నాన్నమ్మ ఊరుకుంటుందా.. ఊహూ.. ఊరుకోదు. నీ చిన్నప్పుడు... అంటూ నవ్వుతుంది నాన్నమ్మ.

నిధికి అర్థమై పోతుంది. నాన్నమ్మ తనని ఏడ్పించాలని అట్లా అంటున్నదని.

అందుకే నాన్నమ్మ మాటలు పట్టించుకోదు.

ఆకాశంలో మారిపోతున్న రంగుల్ని చూస్తూనో, రూపం మార్చుకుంటున్న మేఘాల్ని చూస్తూనో, ఆకాశంలో ఎగిరే పక్షులు చూస్తూనో, లేదా సీతాకోకచిలుకలు, తుమ్మెదలు చూస్తూ ముచ్చట్లాడుతూనో ఉంటుంది నిధి.

అయినా నాన్నమ్మ చెప్పడం ఆపదు. ఎవరుంటే వాళ్ళకి మనవరాలి ముద్దు ముచ్చట్లు చెప్పడం మొదలు పెడుతుంది.

మీరు వింటారా.. వినండి.

★★★

నిధికి అప్పుడు నాలుగేళ్లు ఉంటాయేమో ..

అప్పుడే నర్సరీకి వెళ్లడం మొదలు పెట్టింది.

నిధి అమ్మ, నాన్న ఇద్దరు టీచర్లు కదా. వాళ్ళు వాళ్ళ బడికి వెళ్లేవారు.

అందుకే నిధిని నాన్నమ్మ ప్రీ స్కూల్ కి తీసుకు పోయేది. తీసుకు వచ్చేది.

రోజూలాగే ఆ రోజు కూడా సాయంత్రం ప్రీ స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. ఇంటి తాళం తీస్తున్నది.

నిధి ఆకాశాన్ని, ఆకాశంలో ఎగిరే పక్షుల్ని చూస్తున్నది.

అంతలో నాన్నమ్మా అటు చూడు గట్టిగా అరిచింది .

నాన్నమ్మ గాభరా పడిపోయింది. ఇంట్లోకి పో బోతున్న నాన్నమ్మ నిధి దగ్గరకి పరిగెత్తుకొచ్చింది. చుట్టూ చూసింది. ఏమీ కన్పించలేదు.

ఏమైందే.. ఏదో కొంపలు అంటుకు పోయినట్లు అరుస్తున్నావ్ అన్నది నాన్నమ్మ.

అయ్యయ్యో ..నాన్నమ్మా .. అటుచూడు

ఆకాశం చూడు ముక్కలై పోతాంది. అయ్యో.. పాపం.

ఆకాశం ముక్కలై పోతాంది. ఇప్పుడెట్లా .. ? ఏడుపు మొహంతో అరుస్తున్నది నిధి .

నాన్నమ్మ కంగారు కంగారుగా ఆకాశాన్ని చూసింది. ఏమీ కనిపించలేదు .

మనవరాలి వైపు చూస్తూ.. ఆకాశం ముక్కలవడం ఏమిటే తింగిరి అన్నది.

అదిగో అటు చూడు. ఆకాశాన్ని అది ముక్కలు చేస్తూ ఉన్నది.

నాన్నమ్మకి ఏమీ అర్థం కాలేదు. ఆకాశాన్ని ముక్కలు చేయడం ఏమిటే పిచ్చి మొహమా.. అని నిధి చెయ్యి పట్టుకుని లోపలికి నడవబోయింది.

నాన్నమ్మ చెయ్యి నుంచి తన చెయ్యి విదిలించుకుని బయటకు పరిగెత్తింది నిధి.

అదిగో .. అటు చూడు

ఆకాశాన్ని ముక్కలు చేస్తున్నది. తెల్లగా గద పట్టుకుని వచ్చింది. ఆకాశాన్ని కొట్టేస్తున్నది అని ఏడుపు మొహం పెట్టింది నిధి.

అది చూసి నాన్నమ్మకు నవ్వాగలేదు. పడి పడీ నవ్వింది. పొట్ట చెక్కలయ్యేలా నవ్వింది.

నాన్నమ్మ ఎందుకు నవ్వుతుందో నిధికి అర్థం కాలేదు. నానమ్మ మీద చాలా కోపం వచ్చింది .

ఆకాశాన్ని హనుమంతుని గద ముక్కలుగా చితక కొట్టేస్తున్నది. ష్చ .. పాపం. ఆకాశానికి ఎంత నొప్పిగా ఉందో.. ఎంత ఏడుపు వస్తున్నదో.. ష్చ పాపం ఎట్లా .. ఎట్లా సహాయం చేయాలి అని ఆలోచన చేస్తూ ఉంది నిధి.

మనవరాలి బిక్క మొహం చూసిన నాన్నమ్మ వస్తున్న నవ్వుని ఆపుకుంది. నిధిని చంకన ఎత్తుకొని, బుగ్గలు నిమిరి ముద్దు పెట్టింది. మనవరాలిని మురిపెంగా చూసింది . ఆ తర్వాత ఇంట్లోకి తీసుకు పోయి ఒళ్ళో కూర్చో బెట్టుకుంది .

నాన్నమ్మ ముద్దు చేయడం నిధికి నచ్చడం లేదు . అక్కడ ఆకాశం పగిలి పోతుంటే సహాయం చేయకుండా నాన్నమ్మ నన్ను ముద్దు చేసిందేంటి అని ముఖం చిట్లించి చూసింది .

నిధి తల నిమురుతూ అది హనుమంతుని గద కాదు తల్లీ .. మేఘం .

ఆకాశాన్ని ఎవరు ముక్కలు చేయలేదు. మేఘాలు ఆకాశంలో అప్పుడప్పుడు తిరుగుతూ ఉంటాయి అని ఇంకా ఏవేవో చెప్పింది .

ఆ మాటలు నిధి బుర్రలోకి వెళ్ళలేదు.

ఆకాశానికి ఏమీ కాలేదు అని మాత్రం అర్థమైంది .

వెంటనే, అప్పుడు హనుమంతుడి గద అని చెప్పావుగా ..

నేనెప్పుడూ చెప్పానే.. ఆ రోజు మనం పార్క్ కి వెళ్ళేటప్పుడు చెప్పావ్ అంటూ నిలదీసింది నిధి.

నాన్నమ్మకేమో తను ఎప్పుడు చెప్పిందో అస్సలు గుర్తులేదు.

కొద్దిసేపటి తర్వాత, శనివారం రాత్రి అమ్మ నాన్న చూసిన సినిమాలో హనుమంతుడి గద గుర్తొచ్చింది. అయితే సినిమాలో గద ఆకాశాన్ని కొట్టిందేమో అనుకుంది.

అది నిజం కాదని తెలిసింది. హమ్మయ్య అని హాయిగా ఊపిరి పీల్చుకుంది.

ఇంట్లోంచి బయటికి వచ్చి మళ్ళీ ఆకాశంలోకి చూసింది. మేఘం ఇంకా పెరిగి ముక్కలు ముక్కలుగా అయినట్లుగా కనిపిస్తున్నది.

ఆకాశంలో మేఘాలు అప్పుడప్పుడు వస్తాయి అని నానమ్మ చెప్పింది. నన్ను ఎప్పుడూ ఎత్తుకోని నాన్నమ్మ ఇప్పుడు ఎత్తుకుంది. ఆకాశం కూడా అలాగే మేఘాల్ని అప్పుడప్పుడు ఎత్తుకుంటుందా.. నిధికి మరో సందేహం వచ్చింది.

తన వెనకే బయటికి వచ్చిన నాన్నమ్మను చూసింది .

నాన్నమ్మ, నేను బరువైతే నన్ను దింపుతారు కదా ..

మరి, ఆకాశం మేఘాన్ని ఎత్తుకుంటే దానికి బరువైతే ఎక్కడ దింపుతుంది? అని ప్రశ్నించింది.

నిధి మాటలకు నాన్నమ్మకి చాలా నవ్వు వచ్చింది .

వచ్చే నవ్వును ఆపుకుంటూ ఆకాశానికి మేఘం బరువే కాదు. అవి వస్తే దానికి సంతోషమే . మేఘం బరువు అయితే తన దగ్గర ఉన్న నీటిని కిందికి వంపేస్తుంది అని చెప్పింది నాన్నమ్మ

అవునా ..! ఆశ్చర్యంగా చూసింది నిధి. అలా చూసినప్పుడు నిధి పెద్ద కళ్ళు మరింత పెద్దగా బాదం కాయల్లా కనిపించాయి.

మనవరాలి బాదంకాయ కళ్ళు అంటే నాన్నమ్మకి ఇష్టం .

ఆ కళ్ళలోకి చూస్తూ, ఆ ..అవును, దాన్ని వర్షం అంటారు. వాన అంటారు అని చెప్పింది నానమ్మ.

ఓ అవునా.. ఏదో అర్థమయినట్లు తలూపి ఇంట్లోకి వెళ్ళింది నిధి .

మరి కొన్ని రోజులకు నిధి నాన్నమ్మ తో డాబా ఎక్కింది. నాన్నమ్మ సన్నజాజి మొగ్గలు కోస్తున్నది. నిధి నానమ్మతో ఏవో కబుర్లు చెబుతూ పచార్లు చేస్తున్నది.

నాన్నమ్మా... మంటలు మంటలు. అగ్గి అంటుకున్నది. ఫైరింజన్ కి ఫోన్ చెయ్యి అని గట్టిగా అరిచింది.

కంగారు పడిన నాయనమ్మ ఎక్కడ మంటలు అంటే పడమటి దిక్కు చూపింది.

అది సూర్యాస్తమయ సమయం.

ఆకాశమంతా ఎరుపు నారింజ రంగుల్లో.. ఎగుస్తున్న మంటల ఆకారంలో.. వాటిని చూసి నానమ్మ నవ్వేసింది.

నవ్వుతున్న నాన్నమ్మను చూసి నిధికి కోపం వచ్చింది. మూతి ముడుచుకుంది.

దీపావళి పండక్కి అవతలి బజారులో టపాకాయలు అమ్మే షాప్ లో మంటలు వచ్చాయి. అచ్చం అలాగే ఆకాశంలో మంటలు కనిపిస్తున్నాయి.

అప్పుడు, గంటలు కొడుతూ ఫైర్ ఇంజన్ వచ్చింది. మంటలు ఆర్పింది. ఆ విషయం గుర్తొచ్చింది నిధికి .

నాన్నమ్మా.. అట్లా నవ్వుతావేంటి?

ఓ పక్క మంటలు మండిపోతుంటే..

మంటలు వస్తే ఫైరింజన్ కి ఫోన్ చేయాలి నాన్నమ్మా.. ఫోన్ చెయ్యి. గట్టిగా నాన్నమ్మకి ఆర్డర్ వేసింది.

ఇంత పెద్దగా అయింది. ఈ నాన్నమ్మకి ఏమీ తెలియదు. గబగబా హాలు లో ఉన్న లాండ్ లైన్ ఫోన్ తీసుకుంది.

హలో హలో.. ఇక్కడ మంటలు వస్తున్నాయి . ఫైరింజన్ .. ఫైరింజన్ పంపండి అని చెప్పి పెట్టేసింది.

మనవరాలి ని చూసి మెటికలు విరుస్తూ , మా అమ్మే .. మా తల్లే .. నీకెంత తెలివి అంటూ మురుసుకుంది.

ఓ పక్క మంటలు మండిపోతుంటే, నాన్నమ్మ నవ్వడం, తీరికగా కూర్చోవడం చూసి నిధికి చాలా బాధ కలుగుతున్నది. దుఃఖం పొంగి వస్తున్నది.

మళ్ళీ ఫోన్ దగ్గరకి వెళ్లి హలో హలో అన్నది.

అవతల ఎవరి గొంతు వినిపించడం లేదు. నాన్నమ్మా నేను చిన్న పిల్లను అని వాళ్ళు మాట్లాడడం లేదు.

నువ్వు ఫైరింజన్ కి ఫోన్ చెయ్యి . మళ్లీ మళ్లీ అరుస్తూ నాన్నమ్మని చెయ్యి పట్టుకుని లాక్కొని వెళ్ళింది.

సరిగ్గా అప్పుడే నిధి నాన్న ఇంటికి చేరాడు

నిధి అరుపులు విన్నాడు. పైకి వచ్చాడు.

నిధి పరుగెత్తుకుంటూ నాన్నను చేరింది. నాన్నమ్మ ఫైరింజన్ కి ఫోన్ చేయడం లేదని ఫిర్యాదు చేసింది.

చూడు, అటు చూడు నాన్నా.. ఎట్లా మంటలు వస్తున్నాయో చూడు అంటూ కిటికీ లోంచి చూపింది.

అవి మంటలు కాదురా బంగారు తల్లీ.. అంటూ నాన్న ఒళ్ళో కూర్చోపెట్టుకుని వివరించి చెప్పేవరకూ చాలా హంగామా చేసింది.

ఆ రెండు సంఘటనలు నాన్నమ్మ ఎప్పటికీ మరచిపోదు.

ఇంటికి వచ్చిన అందరికీ చెబుతుంది. అమ్మ నాన్న అందరికీ చెప్పరు. కానీ ఆకాశం చూసినప్పుడల్లా గుర్తొచ్చి లోలోనే నవ్వుకుంటారు.

అలా ఆకాశంతో పాటు మేఘాన్ని చూడడం, అది రకరకాల ఆకారాల్లో మారిపోవడం గమనిస్తున్నది నిధి.

ఆ ఆకారాలకు ఎన్నెన్నో పేర్లు పెడుతుంది. ఆ పేరుతో వాటిని పిలుస్తుంది. ఆనందిస్తుంది. పరవశిస్తుంది. అవి కదులుతూ కిందకు వస్తుంటే తన దగ్గరకు వస్తున్నాయి అని భావిస్తుంది. చప్పట్లు కొడుతూ రమ్మని కేరింతలు కొడుతుంది

చిక్కగా , దట్టంగా ఉన్న మేఘాన్ని చూసి ఇది ఎక్కడో నీళ్లు కుమ్మరిచ్చేస్తుంది అనుకుంటుంది.

వాన చినుకులు మొదలవగానే సంతోషంగా చప్పట్లు కొట్టేస్తుంది. వాకిట్లోకి వెళ్లి నోరు తెరిచి నాలుక చాపుతుంది. వాన చినుకు నోట్లో పడగానే ఇంట్లోకి పరిగెత్తుతుంది. అమ్మతో నాన్నతో తన ఆనందం పంచుకుంటుంది.

ఎప్పుడు చూసినా అదే ఆకాశం. అందులో అంతగా చూసేది ఏముంటుంది అంటావుగా నానమ్మా..

దా... నాతో రా.. అంటూ బయటికి లాక్కొని వస్తుంది . నానమ్మని తాను చేసినట్లు చేయమంటుంది .

నోరు తెరిచి నాలుక బయట పెట్టు నాన్నమ్మా. ఇదిగో ఇట్లా చేతులు చాచి వానా వానా వల్లప్పా అంటూ గుండ్రంగా తిరుగు నాన్నమ్మా అని ఆవిడను కూడా తిప్పుతుంది.

నోట్లో వాన చినుకు టప్ మంటూ పడగానే నా నోట్లో పడింది. నా నోట్లో పడింది అంటూ సంబరపడిపోతుంది.

నాన్నమ్మా.. ఇంకా నీ నోట్లో చినుకు పడలేదా.. అంటూ ఆరా తీస్తుంది.

నానమ్మ.., చూడు, చల్లగా ఎంత బాగుంది కద నానమ్మా .. అంటుంది నిధి.

తన మీద చినుకు పడగానే వర్షం నన్ను ముద్దు పెట్టుకుంది అని కేరింతలు కొడుతుంది.

నానమ్మ ఎప్పుడూ ఇంట్లో ఉంటుంది. వాన చినుకులు

పట్టుకోవడం, వాటిని ముద్దు పెట్టుకోవడం కూడా తెలియదు. పాపం, తన ఫ్రెండ్స్ ఎవరూ చెప్పలేదేమో.. .ఆశ్చర్యపోతూనే ఉంటుంది నిధి.

అందుకే నాన్నమ్మను తన స్నేహితురాలిగా మార్చేసుకుని తనకు తెల్సినవన్నీ నేర్పించాలని తాపత్రయ పడుతుంది నిధి.

చీకటి దాటి అందంగా వచ్చే సూర్యోదయాన్ని చూస్తే సంబురం. నెమ్మదిగా మాయమయ్యే సూర్యాస్తమయాన్ని చూడడం నిధికి చాలా సంభ్రమం.

అబ్బ.. ఎంత అందంగా ఉన్నావే ఆకాశం. ఎన్ని రంగుల బట్టలు వేస్కుంటావు.

మాటి మాటికీ ఆ బట్టల రంగులు మార్చేసుకుంటావు ఎందుకు ?

నీకు ఈ బట్టలన్నీ ఎవరు ఇస్తారు అని అడుగుతుంది.

ఏంటో.. నాన్నమ్మ ఎప్పుడు చూసిన ఇంట్లో పని పని అంటుంది. లేకపోతే టీవీ అంటుంది. కానీ అద్భుతమైన ఆకాశాన్ని, అది వేసుకునే రంగురంగుల బట్టల్ని, మేకప్ ని గుర్తించదు. ఆనందించదు. ఇట్లా ఎట్లా ఉంటారు అని ఆశ్చర్యపోతుంది.

అమ్మకి, నాన్నకి సమయమే ఉండదు.

మబ్బులు పట్టి ఆకాశమంతా చిక్కటి బూడిద రంగుల్లోకి మారిపోయినప్పుడు కూడా కదిలే మేఘాల్ని కళ్లప్పగించి చూస్తుంది. మేఘాలలో రకరకాల రూపాలు చూస్తుంది. తను విన్న కథల రూపాలను ఆ మబ్బు తునకల్లో వెతుక్కుంటుంది. వాటితో మాట్లాడుతుంది.

ఆరేళ్ళు వచ్చేసరికి నిధి చేతికి బొమ్మల పుస్తకాలు వచ్చాయి. బొమ్మలకు రంగులు వేయడం మొదలు పెట్టింది. ఆ బొమ్మల్లో, గీతల్లో సూర్యుడు, చందమామ, ఆకాశం, మేఘాలు , పక్షులు తనకు తోచిన విధంగా వేసేది. వాటికి తాను చూసిన రంగులు పులిమి ఆనందించేది.

ఆకాశంలో మారే రంగుల్ని చూస్తూ నీకు ఈ రంగులు ఎవరు వేశారు.. నీ రంగులు భలే ఉన్నాయి అనేది.

నిధి వయసు పెరుగుతున్న కొద్దీ ఆమెతో పాటు ఆ ఇష్టం కూడా పెరిగిపోతూనే ఉంది. చక్కటి ఊహలు ఆమెకు తోడుగా వస్తూనే ఉన్నాయి.

అంతులేని నీలాకాశం, అందులో మెరిసే చందమామ, మినుకు మినుకు మెరిసే చుక్కలు ఎన్నిసార్లు చూసినా అద్భుతమే ఆ చిన్ని బుర్రకి .

చందమామ రావే
జాబిల్లి రావే
కొండెక్కి రావే
కోటి పూలు తేవే

అంటూ గోరుముద్దలు అమ్మ పెట్టినప్పుడే వాటి మీద ఆకర్షణ మొదలైంది. అది ఆమెతో పాటు పెరిగిపోతూ ఉంది. పెరుగుతున్న కొద్దీ అనేక ప్రశ్నలు, సందేహాలు తలెత్తడం మొదలైంది. ఆ సందేహాలకు, ప్రశ్నలకు జవాబుల కోసం వెతకడం కూడా ప్రారంభమైంది.

ఆకాశానికి ఆవల ఏముందో అని ఆలోచిస్తుంది. పగలు సూరీడు వెలుతురు ఇస్తున్నాడు. రాత్రి ఎక్కడికి పోతున్నాడు. ఎక్కడ పడుకుంటాడు. చందమామ పగలంతా ఎక్కడ ఉంటుంది. ఒక్కోసారి రాత్రి కూడా కనపడదు. అప్పుడు ఎక్కడ ఉంటుందో .. అని సందేహ పడుతుంది.

అమ్మని నాన్న ని అడిగి తెలుసుకోవాలని ఉబలాట పడుతుంది. తనకి తృప్తి ని ఇచ్చే సమాధానం వచ్చే వరకు మళ్ళీ మళ్ళీ ఆ ప్రశ్న వేస్తూనే ఉంటుంది.

రాత్రిపూట చుక్కలు పై నుండి టార్చ్ లైట్ వేసి తమకు వెలుతురు ఇస్తున్నాయి ఎంత మంచివో అనుకునేది ఒకప్పుడు. వాటి గురించి రకరకాల ఆలోచనలు చేసేది. ఇప్పటికి కూడా ఆ ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. ఆగలేదు.

నిధికి ఐదేళ్ల వయసులో అమ్మమ్మ తాతయ్య కారు ప్రమాదంలో చనిపోయారు.

అమ్మమ్మ తాతయ్యల గురించి అడిగేది. వాళ్ళని ఎక్కడికి తీసుకు పోయారు అని ప్రశ్నించేది.

అలా అడుగుతుంటే ఒకరోజు, మామయ్య ఆకాశంలో చుక్కలు చూపించాడు. ఆ చుక్కల్లో అమ్మమ్మ తాతయ్య ఉన్నారని చెప్పారు.

అప్పటి నుంచి ఎప్పుడు ఆకాశంలో నక్షత్రాలు చూసినా అమ్మమ్మ, తాతయ్య ఆకాశంలో చుక్కై తనను చూస్తున్నారని భావిస్తుంది నిధి.

నాకు చీకటంటే భయం కదా. అందుకే చీకట్లో భయం లేకుండా టార్చి వేస్తున్నారని అనేది. చీకటిలో బయటికి వెళ్లడానికి ఎప్పుడు అమ్మమ్మ తాతయ్య తనకు తోడుగా ఉంటారని అనుకునేది. అప్పటి నుంచి చీకటి అంటే భయం పోయింది చిన్నారి నిధికి.

తన మాటలకి అమ్మ నాన్న నవ్వితే నిధి చిన్నబుచ్చుకుని, అత్తిపత్తి ఆకు లాగా ముడుచుకు పోయేది.

ఒక సారి పక్కింటి వాళ్ళ కుక్క పిల్ల చనిపోయింది. ఆ కుక్క పిల్ల చనిపోయి ఆకాశంలో చుక్క అవుతుంది అని అమ్మకు చెప్పింది నిధి.

కాదు మట్టిలో కలిసి పోతుంది అని చెప్పింది అమ్మ.

నిధి ఒప్పుకోలేదు. నాన్నని అడిగింది. నాన్న కూడా మట్టిలో కలిసిపోతుంది అని చెప్పాడు.

మరి మనుషులు ఏమవుతారు అని అడిగింది.

మనుషులు కూడా మట్టిలో కలిసిపోతారు అని చెప్పాడు నాన్న.

ఏం కాదు ఆకాశంలో చుక్కలు అవుతారు. అమ్మమ్మ తాతయ్య అయినట్లుగా ..

నీకేం తెలియదు. మామయ్యకు చాలా తెలుసు అని వాదించేది.

నీలి మేఘాల తో కలిసి విహరించే విహంగాలని, విమానాలను అలా కళ్లప్పగించి చూస్తూ ఉంటుంది నిధి.

అవి భూమి మీద నిలవకుండా గాలిలో ఎగరడం ఎప్పుడు అద్భుతమే .. అలా ఎలా ఎగురుతున్నాయి .. అర్థం కాని ప్రశ్నే .

తను కూడా పక్షిలా ఎగరాలని ప్రయత్నం చేస్తుంది.

చేతులు చాపి ఊపుతూ ఎగరాలని ప్రయత్నిస్తుంది . అది సాధ్యం కావడం లేదు.

ఎన్ని సార్లు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. మరి పక్షులు ఎలా ఎగురుతున్నాయి

విమానం ఆకాశంలో ఎలా ఎగరగలుగుతున్నది ఎన్నో ప్రశ్నలు ఆ చిట్టి బుర్రలో తాడు లేని బొంగరం లాగా గిరగిరా తిరుగుతుంటాయి.

అప్పుడప్పుడు తన ప్రశ్నలు అమ్మనో నాన్న నో అడిగేది. అమ్మ పనిలో ఉంటే విసుక్కునేది. లేదంటే చెప్పేది .

ఒకరోజు ఎప్పట్లాగే అడిగింది పక్షిలా నేనెందుకు ఎగరలేదు అని.

మనం మనుషులం కదా .. మనకి రెక్కలు ఉండవు .

అవి పక్షులు కదా .. వాటికి రెక్కలు ఉంటాయి . వాటి శరీరం ఎగరడానికి వీలుగా తయారయింది. ఆకాశంలో ఎగర గలవు అని చెప్పింది అమ్మ.

నేను పక్షినైతే .. పక్షి నేనైతే.. ?! అని కాసేపు ఆలోచిస్తుంది

ఏడేళ్ల నిధిలో మన శరీరం ఎగరడానికి వీలుగా తయారు చేసుకోకూడదా అనే ప్రశ్న మొదలైంది.

పక్షిలా తోక, ఈకలు పెట్టుకుంటే తను కూడా ఎగుర వచ్చేమో.. అనుకుంది.

వెంటనే అమ్మకు చెప్పింది.

మిక్సీ లో పప్పు రుబ్బుకుంటూ అమ్మ పకపకా నవ్వేసింది. అప్పుడు నిధి మొహం చిన్నబోయింది.

నాన్న నిధిని చూశాడు. అమ్మను అడిగింది విన్నాడు.

బంగారు తల్లీ... రా.. మనం కబుర్లు చెప్పుకుందాం అంటూ హాల్ లోకి తీసుకెళ్లాడు.

వంటపనిలో వత్తిడిలో ఉన్న అమ్మ వీళ్ళని పట్టించుకోలేదు.

తల్లీ.. పక్షిలా ఎగరాలని ఉం ది కదూ అడిగాడు నాన్న.

'అవును, నాన్నా .. 'అంటూ నాన్న వైపు చూసింది.

'రెక్కలు ఉంటే చాలదు. పక్షుల ఎముకలు తేలికగా ఉంటాయి . బోలుగా ఉంటాయి. వాటి కాళ్ళు బలంగా ఉంటాయి. పక్షి కాళ్లను భూమి నుంచి గాల్లోకి నెట్టేస్తుంది . గాలిలో ఉండడానికి రెక్కలు ఊపుతుంది . దాని రెక్కలు గమనించావా అవి తలకిందులుగా ఉండే చెంచాలాగా వక్ర ఆకారంలో ఉంటాయి. పక్షి ఆకారం గాలి రెక్కల పైన , కింద కదలడానికి , గాలిలో ఉంచడానికి సహాయపడుతుంది పక్షులు ఎప్పుడు రెక్కలు కట్టుకోవు' అని వివరించారు నాన్న

మరి నేనెలా ఎగరాలి? నిధిలో ఆలోచనలు.

(నిధి ఆలోచనలేంటో వచ్చే సంచికలో .. )

వ్యాసం

# ప్రశ్నించడం ఓ కళ !!



- నాంపల్లి సుజాత
హైదరాబాద్, 9848059893

ప్రశ్న రెండక్షరాలే కావొచ్చు కానీ పాతాళాన్నీ,

ఆకాశాన్నీ కదిపి కుదిపి వెంట తీసుకొచ్చే పాతాళగరిగే. సమాధానానిదేముందీ కుక్క పిల్లలా తోకూపుకుంటూ దాని వెంట రావాల్సిందే.!

తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉండాలే గానీ ప్రశ్న ఉదయించక మానదు.

జ్ఞానాన్వేషణకు, జ్ఞానార్జనకు పునాది ప్రశ్నే మరి.

మూఢనమ్మకాలను తొలగించుకోవాలన్నా, అంధవిశ్వాసాలని విడనాడాలన్నా, హేతుబద్ధంగా ఆలోచించి తగు నిర్ణయాలు తీసుకోవాలన్నా కూడా మన ముందు నడిచి తోడ్పడేది ప్రశ్ననే, ఇది సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహద పడుతుంది, విషయ పరిజ్ఞానాన్ని పెంచడమే కాదు అన్యాయాలనీ అసమానతలనీ తుంచేందుకు ఇంతకు మించిన శాంతియుత ఆయుధం ఇంకొకటి కానరాదు.

ప్రశ్నించే తత్వం కరువైతే మనిషి జీవశ్చవం లాంటి వాడే.

ప్రశ్నించడం అంటే నిగ్గదీసి, నిలదీసి, దిక్కరించమనీ కాదు, దేనికైనా ఓ నేర్పు ఓర్పు కూర్పు ఉండాల్సిందే ! అందుకే ప్రశ్నించడం కూడా ఓ కళనే..! కళలని ఆస్వాదించడం అభ్యసించడం అనుకరించడం ద్వారా పరిపుష్టి చేసుకోవచ్చు.

ప్రశ్నించడం ద్వారానే ప్రపంచ మహిళలు కొన్నాళ్లుగా తమకు వర్తింప చెయ్యని ఓటు హక్కుని సాధించగలిగారు దానివల్లే నేడు రాజ్యాలకి సామ్రాజ్ఞులుగా సేవలందించే ఎత్తుకు ఎదిగారు.

వేద కాలం నాటి మహాయోగిని గార్గి గురించి తెలిసే ఉంటుంది. పరబ్రహ్మ యొక్క ఉనికిని ప్రశ్నిస్తూ ఆత్మ పరమాత్మల గురించి వేసిన ప్రశ్నలకు జవాబులు చెప్పలేని మహాజ్ఞాని యజ్ఞవల్క్యుడు ఆమె ప్రశ్నలనే దాటవేస్తాడు. ఆమె అపారమైన మేధస్సుకి ఆశ్చర్యచకితుడై ఆనంద భరితుడైనట్లు ఉపనిషత్తులలో గార్గి జ్ఞాన వెలుగుల ప్రస్తావన కనిపిస్తుంది.కాబట్టి ప్రశ్నించడం అంటే తమ చుట్టూ కమ్ముకున్న చీకట్లను పారదోలడమే అన్నట్టు తొలుస్తున్న మెదడులోంచి ఉదయించే బాణమే ప్రశ్నంటే..

గిరగిరా తిప్పి విసిరేసే ఒడిసెలరాయే అది. ప్రశ్నించాలంటే నేర్పు నైపుణ్యంతో పాటు దమ్మూ ధైర్యం కావాలి. ఆశించిన సామర్థ్యాలను రాబట్టాలంటే ప్రశ్నించేతీరు లోనే ఉంటుంది అసలు ప్రతిభ.

ఒక ప్రశ్న చైతన్యంలోంచి ఉదయించి వెలుగులను వెంట తెచ్చేదాకా విశ్రమించదు, ఒక ప్రశ్న అసమానతల్లోంచి పుట్టి అగ్నిపర్వతమై నిలదీస్తుంది, ఒక ప్రశ్న తెలుసుకోవాలనే కుతూహలం నుంచి తలెత్తి నూతన ఆవిష్కరణలకు తెరలేపుతుంది. ఆనాటి పాశ్చాత్య గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ ప్రజలను మేలుకొలిపింది కూడా ప్రశ్నల ద్వారానే కదా..!

ప్రశ్నించడం అంటే ఎదుటివారి కోసమే కాదు నిన్ను నువ్వు చక్కదిద్దుకోవడానికి నీలోకి నువ్వు పయనిస్తూ వేసుకునే స్వీయ బాణం కూడా ప్రశ్ననే..!

ఇంతటి ప్రయోజనాలున్న ప్రశ్నని నొప్పించక తానొవ్వని రీతిలో సంధించినట్టయితేనే వచ్చే సమాధానాలు కూడా సానుకూలంగా ఉంటాయి. ప్రశ్నిస్తున్న నీ పదాల తీరును బట్టే దూరమవుతావో, చేరువవుతావో తేలిపోతుంది.

నోరు మంచిదైతే ఊరు మంచిదంటారు..!

కొందరి ప్రశ్నించే విధానాన్ని వింటే నవ్వు తెప్పించకు మానదు.

"నువ్వు నిన్న ఎందుకు రాలేదు? జ్వరం వచ్చిందా? అంటారు.

వారికి జ్వరం వచ్చిందో రాలేదో గానీ, సమాధానం అయితే 'హా అవును.!' అనే వస్తుంది. అలాగే

"ఈ సమయం లో నువ్వెక్కడున్నావ్..? బండి మీద ఉన్నావా..?" అంటారు. అప్పుడు ఎదుటి వారి జవాబు వారెక్కడున్నప్పటికీ

" హ..అవును " అనే వస్తుంది.

ప్రశ్న వారిదే జవాబు వారిదే, అయినప్పుడు అడగడం ఎందుకో అర్థం కాదు.

ప్రశ్నిస్తే దూరమవుతామేమో నని భయపడితే బానిసలమవుతాం..! దూరమూ కాకుండా, బానిసలమూ కాకుండా కూపీ లాగడమే ప్రశ్న స్వభావం..! అన్నట్టు సమాచార హక్కు కూడా నీ చేతిలో ఉన్న శక్తివంతమైన అస్త్రం ..!

ఇంకేం నీకు నువ్వు పారదర్శకంగా ఉంటూ సమయస్ఫూర్తితో కళాత్మకంగా ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకొని ముందుకు నడవడమే సగౌరవంతో జీవించడానికి దోహదపడేది..!!

కథ

# అత్తమ్మ



**సుభాషిణి తోట**

**ఖమ్మం, 9502818774**

మెహర్ అలా అడుగుతుందని అసలూహించలేదు ఫాతిమా.. ఒక్క సారిగా తను నిలదీసినంతగా అడిగేసరికి ఏం మాట్లాడాలో తెలీక తన గదివైపు వెనుతిరిగింది..

ఒకో అడుగు వేస్తుంటే తనగది సమీపిస్తోంది కానీ వెనుకనుంచి మెహర్ ప్రశ్న వీపును బల్లెం తో పొడుస్తున్నట్టు అనిపిస్తోంది.. ముందుకు అడుగేయటం ఇక నావల్ల కాదు అనుకుంటూ ఒక్కసారిగా వెనుతిరిగింది మెహర్ కు ఏదో చెబుదామని..కానీ సరిగ్గా అప్పుడే ఆమె తన గది తలుపేసుకుంటుండటం కనిపించింది..

రేపు మాట్లాడొచ్చులే అనుకుంటూ గదిలోకొచ్చింది.. మంచమ్మీద నడుం వాల్చినా మనసు కుదుట పడటం లేదు.. ఇందాక మెహర్ సంధించిన ప్రశ్నే చెవుల్లో ధ్వనిస్తోంది.. వేళ కాకపోయినా ఖురాన్ తీసి కల్మా చదుకుంది మనశాంతికోసం..

'' మతమేదైనా సరే ఎవరి పవిత్ర గ్రంథం వారికి ధ్యానంతో సమానం.. యోగ విద్య సమానమైన ఉపశాంతి లభిస్తుంది '' అని అనుకుంది.. మళ్ళీ వెళ్ళి పడుకోవాలనుకుంది కానీ నిద్ర రావటం లేదు..ఫాతిమా ఇవాళ అడిగింది కానీ ఈప్రశ్న నన్ను చాలా రోజులుగా వేధిస్తోంది అని అనుకుంది.. '' సాహిర్ '' అంటూ పిలిచింది.. '' ఓహ్ ఈ టైం లో వాడు ఇంట్లో ఎందుకుంటాడు '' అనుకుంటూ సెల్ తీసి అతనికి ఫోన్ చేసింది.. '' బేటా ఆ సంబంధం విషయం ఏమయ్యిందీ '' అంటూ ఆరా తీస్తోంది..

ప్రవాహం కర్ర పుల్లను తనలో కలుపుకోవాలనుకుంటుంది కలిసి సాగమంటుంది కానీ కర్రపుల్ల కలిసి నడుస్తూనడుస్తూనే హఠాత్తుగా ఆగిపోతుంది.. కుటుంబ సభ్యులు తన దుఖం మరిపింపచేసేందుకు ప్రయత్నిస్తున్నా మెహర్ ఎవరితోనూ కలవలేకపోతోంది.. ఎక్కువ భాగం తనగదిలో ఒంటరిగా దిగులుగా గడుపుతోంది.. బయటకు వెళ్ళాల్సొచ్చినప్పుడేకాదు ఇంట్లో ఉన్నప్పుడూ బుర్ఖాను ఆశ్రయించాలి అనుకుంటోంది ఏడ్చి ఏడ్చి ఎరుపెక్కి ఉబ్బిన కళ్ళు ఎవరికంటా పడనీయొద్దని..

ఫోన్ బల్లమీద పెట్టి ఆరాం కుర్చీలో కూలబడింది ఫాతిమా.. కళ్లు మూసుకోగానే గతం ఆవరించింది..

'' సాహిర్ ఐసా మత్ బోల్నా బేటా ఎలాగైనా పాషాకు నిఖా పక్కా చేయాల్సిందే .. కాస్త గట్టిగా ప్రయత్నించు '' అంది ఫాతిమా.. '' తమ్ముడికి పిల్లను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావటం లేదమ్మా '' అని చెప్పిన తన పెద్ద కొడుకు సాహిర్ తో..

'' అమ్మీ ఆ పలకలన్ని మీచేతుల్లోనేగా తయారు అయ్యేది … అదే చేతులతో ఆపలకమీద మన బతుకులు బాగుపడాలనీ రాయొచ్చు గా అంది మెహరున్నీసా" ఆ మాటలకు వాళ్ళ అమ్మ కరీం బీ చేతిలో ఉన్న పింగాణీ గ్లాసు జారి మట్టి పలకలా పగిలిపోయింది....

'' ఏమయ్యా నువ్వు, నేను, మన ఇద్దరు మగ పిల్లలు ఇలా మన బతుకులు ఆపలక పరిశ్రమలో పగిలిపోవలసిందేనా.. చూడు మెహర్ పెళ్ళీడుకొచ్చింది ఏదో తంటా పడి దాన్ని ఒక అయ్య చేతిలో పెట్టాలి '' అంది కరీం బీ.. '' మన అమ్మాయి పేరు మెహరున్నీసా కానీ మన పెళ్ళికొడుకుకు మెహర్ ఇచ్చుకునే స్థితిలో లేము కదనే '' అన్నాడు ఆమె భర్త ఖాదర్..

తల్లి తండ్రి తన గురించి బాధపడుతుండటం తెలుస్తోంది మెహర్ కు.. తన స్నేహితురాళ్లల పెళ్ళి చేసుకొని వెళ్ళిపోవాలనుంది కానీ తనకు కట్నమిచ్చి పెళ్ళి చేయలేని అసహాయత గుర్తొస్తోంది.. తల్లిదండ్రులకు ఏమన్నా సాయపడగలనా అనుకుంటుంది ఇదేమాట వాళ్ళతో అంటే

'' ఆడపిల్ల బుర్ఖా దాటి రావటం బాగోదు..మనం కూటికే పేద కానీ కులానికి కాదు.. నువ్వు ఆ పరదా చాటునే ఉండు చాలు '' అని అంటుండేవారు.. తన ఇద్దరు అన్నల్ని మాత్రం తమ వెంట పనికి తీసుకుపోయేవారు..

అమ్మీ అంటూ పెద్దగా కేకవేస్తూ లోనికొచ్చాడు సాహిర్.. '' క్యా హువా సాహిర్ '' అని ఫాతిమా అడుగుతుండగా.. తమ్ముడికి పిల్లనిచ్చేందుకు ఒకరు ఒప్పుకున్నారు.. ఇప్పుడంటే మనది ఈ యర్రగొండ పాలెం కానీ ఇంతకుమునుపు మనది ఆ మార్కాపురమే కదా..అని అంటుండగా.. ఆ..అయితే అంది ఫాతిమా ఆతురతగా.. ఆఊర్లో ఒకరు పాషకు పిల్లనిస్తామన్నారు అనగానే ఫాతిమాకు పట్టరాని సంతోషం కలిగింది.. '' యా.. అల్లాహ్ తుం కిత్నే అచ్చే హో.. మనం వెంటనే పోదాం ఆ బంగారు పలకను వెంటనే ఇంటికి తెచ్చేసుకుందాం '' అంది..

మాంగ్నా చేసుకోడానికి వస్తామని పిల్లాడి వైపు వాళ్ళు కబురందించగానే మెహర్లో భయం నీరెండలా గుండెను చేరుకుంది... రాత్రంతా నిద్రలేదు.. పొద్దున్నే తన సహేలి అంజూ దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్లి విషయమంతా చెప్పి.."నాకు చాలా భయంగా ఉంది అంజూ" అంది

''ఎందుకే నవ్వుతూ అంది అంజూ''..."మొన్న కదూ మన చుట్టాలమ్మాయి సలీమ చెల్లెలు అత్తారింట్లో అత్త వేధింపులు తట్టుకోలేక ఆ బాధలు భరించలేక ఉరేసుకుంది నన్ను చేసుకుంటాం అని వస్తున్న వాళ్లు అలాంటి వాళ్ళేనా ఈ అత్తా గయ్యాళేమో '' అంది మెహర్ కాస్త కోపంగా.. .. ఆమాట వినగానే '' చ ఊకో ఎవరికో ఏదో జరిగిందని నీకు జరుగుతుందా ''... అంది అంజూ

పిల్లను చూడటం అయ్యాక.. పెళ్ళి కొడుకు పాష సహా వచ్చిన అతని కుటుంబసభ్యులందరూ తమకు నచ్చిందన్నారు .. '' కానీ బహెన్ '' అంటూ ఖాదర్ నసుగుతుండగా.. '' కట్న కానుకలు మాకేం వద్దు ఆడపిల్లే అన్నిటికన్నా సంపద.. అవసరమైతే మీ ఖర్చులూ మేమే భరించి మా కోడలిని తీసుకుపోతాం '' అని అభయమిస్తున్న ఫాతిమా దేవతలా కనిపించింది ఆ దంపతులకు ఆక్షణం.. అలానే ఆమె వైపు కృతజ్ఞతగా చూస్తుండగా.. '' కానీ మా అబ్బాయికి సంబంధించి కొంత లోపం ఉంది అది మీకు నచ్చితేనే మనం ముందుకెళదాం..నేను ఏదీ దాచదలచుకోలేదు ''.. అని అంటుండగా.. '' మీ పెద్దబ్బాయి అన్ని విషయాలు చెప్పాడు.. మీ అబ్బాయి చిన్నతనం లో అనారోగ్యం కారణంగా పెద్దగా చదువుకోలేదు.. ఆ అనారోగ్యం మళ్ళీ తిరగబెడుతుందేమో అని మీరు భయపడుతున్నారు..ఇదేగా మీరు చెప్ప దలిచింది..మేం అన్నిటికీ సిద్ధపడ్డాం.. ఇప్పుడు అబ్బాయిని చూశాక మరింత సంతోషిస్తున్నాం మీ ఇంటికి మాపిల్లను ఇచ్చేందుకు '' అని అంది కరీం బీ.. '' మీకు సరే కానీ మీ అమ్మాయి ఏమంటుందో అసలు ప్రాధాన్యత తనకు కదా ఇవ్వాల్సింది '' అని ఫాతిమా మెహర్ వైపు చూస్తుండగా '' నాకు ఇష్టమే ఏమీ అభ్యంతరం లేదు అని సిగ్గుపడుతూ'' లోనికి పరుగుతీసింది మెహర్..

పెళ్ళికొడుకు తరపు వాళ్ళు అమ్మాయి మాది అనిపించుకుని ఇంటికి తిరిగి వెళ్ళాక... వాళ్ళ మాట తీరు ...కుటుంబ కట్టు బాట్లు మంచితనం గ్రహించిన మెహర్ కు కాస్త మనసు శాంతించింది... కొద్ది రోజుల్లోనే పాషా తో మెహర్ పెళ్ళి జరిగింది..

అత్తారింటికి వెళ్ళబోయే రోజు మెహర్ తల్లి దగ్గరకు వెళ్ళి వెళ్ళొస్తా అని కంట్లో నీటితోనే చెప్పింది... అన్నలిద్దరూ చెల్లిని దగ్గరకు తీసుకోగానే కన్నీళ్లు ఆగడంలేదు మెహర్కు గుడిసె అయినా పుట్టిల్లు పుట్టిల్లేగా ...నక్కో బేటీ పక్కన అత్తలు పిన్నమ్మలు సముదాయిస్తున్నారు...ఈఇంటికంటే నీకు ఆ ఇల్లే బాగుంటుంది.. ఇంకెప్పుడు ఈ ఇంటికి రావు కూడా '' అని అంటున్న ఆమ్మీ మాటలకు నివ్వెరపోయింది మెహర్....

ఆత్మీయ ఘన స్వాగతం తో ఫాతిమా కోడలిగా ఆ ఇంట్లో అడుగుపెట్టింది మెహర్ కొత్తగా అంతా కొత్తగా ఉంది తనకు ఫాష అమాయకుడు అయినా తనని బాగా చూసుకుంటున్నాడు ఆడబిడ్డ అత్త మామ... బావ గార్లు వీళ్లేవ్వరు తను సినిమాల్లోనో పొరుగింట్లోనో చూసినట్టు లేరు...ఉన్నంతలో తినడం.... దాచుకోవడం.. వండిపెట్టడం ,ఉమ్మడి కుటుంబం... తోడికోడళ్ళు అత్త మామ అందరూ ఒకే ఇంట్లో అయినా ఏ గది ఇరుకుగా ఉండదు.. కాస్త పచ్చడి వేసుకు తిన్నా కడుపు నిండిపోయేది ...

అత్త సముద్రం లాంటిది.. ఇంటికి తరలివచ్చే నదుల్ని

తనలో కలుపుకుంటుంది.. మొదటి నాలుగైదు రోజులు కొంత బెరుకుగా భయంగా అనిపించినా.. వేపచెట్టు నీడలాంటి అత్త స్నేహం లో ఇట్టే కలిసిపోయింది మెహర్ .. తన పుట్టింటితో పోలిస్తే అన్నివిధాలా పెద్ద కుటుంబం తన భర్తది.. అన్నిటికి మించి అత్త పెద్ద మనసు బాగా నచ్చింది .. బెరుకుతనం తగ్గి కుటుంబంలో కలిసిపోవడం జీవితం ఇంత హాయిగా ఉంటుందా అని తెగ పొగుడుకుంది తనని తానే ...

రోజులు పాత బడుతున్నాయ్.. తీగకు పందిరిలా తను అల్లుకుపోయింది.. పాష తనని ఎంతో ప్రేమగా చూసుకునేవాడు.. కొద్ది నెలల్లోనే తను నెలతప్పిన సంగతి తెలియగానే ఎంతో సంతోషించాడు..అత్త హడావుడైతే అంతా ఇంతా కాదు ఆ సంతోషాన్ని అల్లా దీవెనగా నమ్మి ప్రత్యేక నమాజులు చేసింది.. భర్తతో ఉన్నంతసేపు పుట్టేబిడ్డగురించి వాడు చేసే అల్లరి గురించి ... వాడిని ఎలా పెంచి పెద్ద చేయాలన్న కోరిక గురించి ఇద్దరు పదే పదే చర్చించుకునే వారు...పాషా ఓ రోజు పని నుండి వస్తూ వస్తూ కార్ బొమ్మ పాక్ చేయించుకొని తెచ్చాడు... కాళ్ళు కడుక్కొని ఇంట్లో వాళ్లకు తెలీకుండా వాళ్ళ రూంలోకి వెళ్లి "మెహర్" అని ప్రేమగా పిలిచాడు

"హా జీ" అంటూ తను రాగానే ఇవాళ నీకొకటి ఇస్తాను దానికి నువ్వేమి ఇస్తావు అనగానే సిగ్గుతో కొంగుకప్పుకుంది మెహర్.. తెచ్చిన బహుమతిని అపురూపంగా చూస్తూ " మేరా బచ్చే కేలియే" అన్నాడు పాషా" అంటుండగా తుంహారా నై హమారా "అంటూ చేతిలోకి తీసుకుంది మెహర్...

నెలలు నిండిన కొద్దీ మెహర్ ఏ పని చేయలేక పోతుంది అయినా తిని కూర్చోడానికి ఎప్పుడు ప్రయత్నించలేదు... తల్లి గారింటికి కాన్పు అని పోవాలని ఎప్పుడూ అనుకోలేదు.. .

ఒక్కసారి మాత్రం మెహర్ వాళ్ల అమ్మ నాన్న చూడ్డానికి వచ్చినప్పుడు

'' మెహర్ ఇక్కడే కంటుంది... వీలైతే మీరు ఉండండి '' అంది ఫాతిమా... అంతే ఎంతో సంతోషంతో వెళ్ళిపోయారు మెహర్ తల్లి తండ్రులు... అందరూ అనుకున్న రోజు రానే వచ్చింది...నొప్పులు తీస్తున్న మెహర్ లో భయం ఎక్కువైంది... అనుభవం ఉన్న అత్త దొరకడం తన అదృష్టం అని మరోసారి రుజువు చేస్తూ.. మెహర్ పాదాలు ఒళ్లు చల్లబడకుండ ఒత్తుతూ "నక్కొ బెటా నక్కో... గభరావు మత్".. సబ్ టీక్ హోగీ"

అంటూ కోడల్ని భయం నుండి బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది....కానీ అంతలోనే బిడ్డ అడ్డం తిరిగిందనీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు....పెద్దాపరేషన్ తో పరేషాన్ ఖతం హోగయా... బంధువులు చుట్టాలకి ప్రసూతి గది బయట జరిగిన విషయాన్ని చెబుతున్నాడు మామ గారు... బే టీ..... బేటా ....పాషా మనసులో అనుకుంటూ బెంచీ చివర్లో అవిసిపోయిన బెండులా కూర్చున్నాడు...

పెద్ద డాక్టరమ్మ .. పెద్ద డాక్టరమ్మా.. బంధువులలో ఒకరు పెద్దగా చెబుతున్నారు... ఫాతిమా ఉలిక్కిపడి లేచి డాక్టర్ దగ్గరకు వెళ్ళి "క్యాహువా మేం సాబ్. మేరా బహు '' అంటూ దీర్ఘంగా నిట్టూర్చింది...

'' అబ్బాయి పుట్టాడు... అంతా బావుంది ఇంకో పదిహేను నిమిషాల్లో బిడ్డని తల్లిని చూడొచ్చు '' అంటూ చేతికున్న గ్లౌజ్స్ తీస్తూ వెళ్ళిపోయింది...'' యా అల్లాహ్ '' అంటూ అక్కడున్న వారు అంతా ఊపిరి పీల్చుకున్నారు... బిడ్డ పుట్టిన దగ్గర నుండి మెహర్లో అమ్మతనం ఎక్కువైపోయింది...పాషా కూడా ఇంటి పట్టునే ఉండటం మొదలు పెట్టాడు.. బిడ్డను ఎత్తుకోవడం అస్సలు వదలట్లేదు...

మెహర్ ఒకరోజు వంట పని పూర్తి చేసుకొని తన రూంలోకి రాగానే పిల్లాడు కనపడలేదు... గదంతా కలియ చూసింది...బాబు ఏడుపు లేదు...తనలో ఒకలాంటి ఒణుకు మొదలైంది "మేరా బేటా"అంటూ పరుగున వసారాలోకి వచ్చి చూసింది హాయిగా నిద్ర పోతున్న బిడ్డ .. బిడ్డని నేర్పుగా ఎత్తుకుని అటు ఇటు తిరుగుతున్న తండ్రి తారసపడ్డారు... "ఏ క్యా హై జీ"...కాస్త కోపంగా అంది "ఉష్" పిల్లాడు పడుకున్నాడని సైగ చేసాడు పాషా...

మౌనంగా లోపలికి వెళ్ళిపోయింది , పిల్లాడ్ని తండ్రి చూడకుండా ఉండలేక పోతున్నాడు... '' కామ్ కో భూల్ గయా ఆప్ ''...పొద్దున్నే నమాజ్ చేసి లోపలికి వస్తున్న భర్తని అడిగింది మెహర్...'' నీతో కాస్సేపు మాట్లాడాలి '' అన్నాడు పాషా...పక్కకు వచ్చి కూర్చుంది ..'' ఈ మధ్య ఎందుకో ఒంట్లో నలతగా ఉంటోంది ''.. భార్య ఒళ్ళో తలపెట్టి అన్నాడు పాషా... '' ఏమీ కాదు అల్లా దయతో అంతా సర్దుకుంటుంది '' అంటూ

పిల్లాడిని పాషాని రెండు బుజాలపై ఆనిచ్చుకుంది.. పిల్లాడు తండ్రి ఇద్దరు ఒకరి కళ్లలోకి ఒకరు చూడటం చూసి... '' బలే ఉంది ఈ రోజు ఇలాగే ఉండాలి ఎప్పుడు '' అంది... పిల్లాడు మళ్లీ మళ్లీ వాళ్ళ నాన్నను చూస్తూ కళ్ళని కొడుతున్నాడు...

బయటకు వెళ్ళబోతున్న కొడుకును ఆపింది ఫాతిమా '' పాషా నేను ఒకటి చెప్పనా "అంది ... "బోలో అమ్మీ "అన్నాడు పాషా " ఇంతలో బిడ్డను ఎత్తుకొని అటువైపొస్తోంది మెహర్..'' మీ ఇద్దరికీ లేనిది బిడ్డకు ఉండాల్సిందే "అంది "అదృష్టమా" అన్నాడు పాషా

"నహీ... "పడ్నా " అంది కాస్త గర్వంగా... "హా సహీ బోలా.... అల్లాకే దువా" అన్నాడు పాషా భార్యని కొడుకుని మార్చి మార్చి చూస్తూ..." బిడ్డకు మనం ఆస్థి ఇవ్వగలగటం కాదు వాడ్ని మంచి ప్రయోజకుడిగా చేయాలి ఉన్నత విలువలుకల వ్యక్తిగా తీర్చిదిద్దాలి '' అని అంటుండగా .. అందుకు మనమేం చేయాలి అన్నట్టు చూసింది మెహర్ '' చదువుని ఇస్తే విజ్ఞానవంతుడవుతాడు, సమాజం హర్షించే పౌరుడవుతాడు..అలాంటి బిడ్డలు కుటుంబానికే కాదు దేశానికీ గర్వకారణమే అవుతాడు ''...అని అంది ఫాతిమా...

రాను రాను పాషాలో మార్పు మొదలైంది తినడం పూర్తిగా బంద్ చేశాడు..కడుపులో ఏదో ఉందని... ఆసుపత్రికి పోదాం అని చెబుతూనే...ఇంకేదో అవుతుందని తన గదిలో ముడుచుకొని పడుకోవడం మెహర్ను కలవర పెడుతోంది... ఇంట్లో వాళ్ళు అందరూ అతని గురించి మాట్లాడుతున్నారు... ఏమైందో తెలుసుకో అని పురమాయిస్తున్నారు... ఇంతలో పాషా తండ్రి హఠాన్మరణంతో అతను ఇంకా కుంగిపోయాడు... చూస్తూ చూస్తూనే అతని మెదడు పనిచేయడం మానేసింది.. తరువాత మిగతా శరీరం చచ్చుబడిపోయి... కన్నుమూశాడు పాషా.... కలలు కన్న జీవితం కళ్ళ ముందే కూలిపోవడం మెహర్ నిస్సహాయికగా మార్చింది.... కలలు కన్న రంగులు కళ్ళముందే వెలసిపోతున్నట్టు అనిపిస్తోంది..

పాషా జ్ఞాపకాలతో బరువుగా గడుపుతోంది.. బిడ్డలో పాషా రూపాన్ని చూసుకుంటోంది అలా చూసినప్పుడల్ల అతని జ్ఞాపకాలతో మరింత దుఖిస్తోంది..

ఒకరోజు బిడ్డను ఎత్తుకొని బీరువా సర్దుతుండగా.. అందులో ఉన్న పాషా ఫొటో వంక చూస్తూ పిల్లాడు ఆఫొటో వైపు వెళ్తానని జారిపోతున్నాడు..మెహర్ సముదాయించి ఎత్తుకుంటుంటే చేతులతో ఆఫొటోలోని మానాన్న '' ఏడి ఎటెళ్ళాడు '' అన్నట్టు సైగ చేయటంతో మెహర్ గుండెపగిలింది.. ఏం సమధానం చెప్పాలో తెలియక.. ఏడుస్తున్న తల్లి ముఖాన్ని కొంత సేపటి తరువాత పిల్లాడే తుడవటంతో.. వాడ్ని గుండెలకు హత్తుకుంది..

రోజులు భారంగా గడుస్తున్నాయి.. ఇంటి పక్కన ఉండే స్నేహితురాలొచ్చి ఒకరోజు.. '' ఇక నిన్ను ఈ ఇంట్లో ఉండనివ్వరు నువ్వు తిరిగి మీ పుట్టింటికి వెళ్ళాల్సిందే '' అని అనగానే.. ఆమెలో కొత్త భయం మొదలయ్యింది.. అత్తింటి ఆధారం కూడా కోల్పోతే ఇక తన బతుకేం కావాలి అని అనుకుంటోంది..

పుట్టింటికి చేరటం ఇష్టం లేదు తనకు.. పాషా ఉన్నప్పుడోఒ ఒకటి రెండూ సార్లు మినహా పెద్దగా పోలేదు.. ఏ తల్లైనా రాత చెడిన బిడ్డను గుండెల్లో పెట్టుకుంటుంది కానీ తనకే తన పుట్టింటికి పోవాలని లేదు.. వాళ్ళ పేదరికానికి తాను మరింత భారం కావటం ఇష్టం లేదు, అత్తింట్లో అయితే రక్షణగా ఉంటుంది.. అని అనుకుంటుండగా స్నేహితురాలు అలా చెప్పటం తనని కలవరపెట్టింది..

ఆభయం తోనే ఫాతిమాను అడిగింది అత్తమ్మా నన్ను ఈ ఇంట్లోంచి పంపించేస్తారా '' అని. అడగాలి అనుకుంటూనే నిద్రలోకి జారుకుంది. సరిగ్గా అప్పుడే ఆ దృశ్యాన్ని కిటికీలో నుండి గమనించిన ఫాతిమా.. కోడలి గదివైపు వెళ్ళి చూసింది.. '' ఏడ్చి ఏడ్చి ఎప్పుడు పడుకుందో బిడ్డ తెల్లారగానే తన భయం తీర్చేయాలి '' అని అనుకుంది..

తలుపు ధన్ ధన్ శబ్దం చేస్తూ అత్త పెద్దగా పిలుస్తుండటంతో గదినుంచి బయటికొచ్చింది కన్నీళ్ళు తుడుచుకుంటూ లేచి.. '' నన్ను ఈ ఇంటినుంచి పంపవద్దని అత్తను వేడుకుంటాను '' అనుకుంటూ వచ్చి తలుపుతీసింది..

ఎదురుగా కనిపించిన మెహర్ ఏదో అడగబోతుండగా.. ముందుగా తనే నోరు విప్పింది ఫాతిమా.. కోడలి కళ్లల్లోకి చూస్తూ కన్నీళ్ళు తుడిచింది.. '' గబ్ రావ్ మత్ బేటీ.. నిన్ను పంపించ దలిస్తే నా బిడ్డలా పంపిస్తాను '' అంటూ భుజమ్మీద

ఓదార్పుగా చెయ్యేసింది.. కానీ ఆమె మాటకు అర్థం ఏంటో మెహర్ కు అవగతం కాలేదు..

'' ఏం సాహిర్ ఇంకా సంబంధాలు వెతుకుతూనే ఉన్నావా.. అని ఎవరో అడిగారు, ఇంకా మీ తమ్ముడికి పిల్ల దొరకలేదా '' అని ఇంకొకరు అడుగుతుండగా.. '' హా మళ్ళీ వెతుకుతున్నా, పిల్లని కాదు పిల్లాడ్ని, మాతమ్ముడికి కాదు అతని భార్యకు '' అని చెప్పేసరికి ముందు అవాక్కవుతున్నా.. ఆ విప్లవాత్మక నిర్ణయానికి, అభ్యుదయ ఆలోచనకు, స్త్రీ పక్షపాత గుణాన్ని మెచ్చుకుంటున్నారు.. మసీదులో మౌలా చెప్పింది విని రావటం కాదు ఆ ధర్మ గుణాల్ని, ఆచరించటమే అసలైన ఇస్లాం అని పొగుడుతున్నారు.. ఇన్షా అల్లా.. ఆ అమ్మాయికి మంచి జరగాలి అని కోరుకుంటున్నారు..

''అమ్మీ ''...అంటూ లోనికొచ్చాడు సాహిర్..ఈసారి అతని గొంతులో అప్పటి హుషారు లేదు..తల్లికి చాలా సేపు ఏదో వివరించాక.. '' సరే అలాగే చేద్దాం బేటా.. తనకు మళ్ళీ పెళ్ళి విషయం మెహర్ కు ఇప్పటికే చెప్పాను కానీ తన భర్తగా మరొకర్ని ఊహించలేను నా బిడ్డకు దూరం కాను అని మొండిగా వాదిస్తోంది.. మళ్లీ ఇంకొకరితో పెళ్ళిని తిరస్కరిస్తోంది ...నచ్చ చెప్పగా చెప్పగా కొంత మెత్త పడింది.. ఇక ఈ సంబంధం విషయం ఒకసారి చెప్పి ఖాయం చేద్దాం '' అంటూ కోడలి గదివైపెళ్ళింది..

ఫాతిమా అటువైపొస్తుండగా మెహర్ పొయ్యిదగ్గర కనిపించింది..అపుడే గంజివార్చి పొయ్యిలో మండుతున్న కట్టెల్ని బయటకు లాగి ఆ మంటపై నీళ్ళు చల్లి చల్లారుస్తోంది.. తను చెప్పబోయేది విని కోడలు ఎలా ప్రతిస్పందిస్తుందో తెలుసు, బంధువులు, ఇతర కుల పెద్దలు ఏమంటారో తెలుసు కానీ చేయబోయేది ఒక మంచిపని కనుక ధైర్యంచేసింది '' పేరుపెట్టి పిలవగానే.. ''హా మాజీ '' అంటూ అత్త వైపు తలతిప్పింది మెహర్ '' నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలి నీ జీవితం ఇలా మోడు వారటానికి వీల్లేదు,పచ్చగా కళకళ లాడాలి '' అని అనగానే.. భోరున ఏడుపు మొదలుపెట్టింది ..''ఊరుకో ఏడవటం స్త్రీ లక్షణం అని నీకేవరైన చెప్పారా" అంది తన కళ్ళు తుడుస్తూ.. "నహీ మాజీ నావల్ల కాదు మళ్లీ ఆ ప్రస్తావన నాదగ్గర తేవొద్దు "అంటూ భర్త ఫోటోని ఆలింగనం చేసుకొని కుములుతుండగా "పిచ్చి పిల్ల నువ్వు అమాయకురాలివి అనుకున్నా కానీ ఇంత బేల తనం ఇంత పిరికితనం కూడా ఉందా" అంది ... " ముఝే మాఫ్ కరో అమ్మి మీ దగ్గర నేనెందుకు ఉండకూడదా ఇంకెవరికో ఎందుకు చెందాలి నేను అంది" కళ్ళు ఇంకా ఇంకా వర్షిస్తుంటే '' దేఖో..పాష ఉన్నంతదాకా నువ్వు ఈ ఇంటికోడలివి..కానీ ఇప్పుడు మా బిడ్డవి "బిడ్డని మెట్టినింటికి పంపడం ఆచారం కదా...ఏ సంప్రదాయంలో అయినా ఆ ఆచారం మామూలు విషయం ,నా బిడ్డకు ఆ తంతు జరిపించకుండా ఎలా నా దగ్గరే పెట్టుకోను " అంది , పెద్ద మనసుతో అలా మాట్లాడుతున్న అత్త తల్లి కంటే ఎక్కువగా కనిపిస్తుంది.... "అమ్మి" అంటూ రెండు చేతులూ ఎత్తి కాళ్ళ దగ్గర కూల బడింది... "ఏ క్యాహై " ఆడపిల్ల ఏడిస్తే ఇంటికి అరిష్టం" పెళ్ళి ఏర్పాట్లకు ఏవి కావాలో సాహిర్ కు పెద్ద కోడలికి లిస్టు చెప్పాలి పద అంటూ ముందుకు నడిచింది ఫాతిమా..

పెళ్లికొడుకు వాళ్ళు అందరూ మెహర్తోపాటు ఆమె కొడుకునీ ఒప్పుకున్నారు...

కొద్దిమందిబంధువుల సమక్షంలో మెహర్ కు కొత్త జీవితాన్నిచ్చింది ఫాతిమా.....పెళ్లికొడుకు సాహిర్ వాళ్ళ అన్నదమ్ముల తో కలిసిపోయాడు .. ఇప్పుడు మెహరున్నీసా ఆ ఇంటికి ఆడపడచులా మారింది..

"గాలివీచి పూవుల తీగ నేలవాలిపోగా.. అటులే దాని వదిలివేతువా..చేరదీసి నీరుపోసి చిగురించనీయవా.. " రేడియోలోపాట మంద్ర స్థాయిలో వినవస్తోంది..

మెహర్ ను తన భర్తతో పంపించే హడావుడి మొదలయ్యింది.. ఫాతిమా మిఠాయిలు పంచి తనూ నోట్లో పెట్టుకుండగా.. '' యా అల్లాహ్..ఇది రంజాన్ మాసం కదా.. ఫాతిమా ఉపవాస దీక్ష చేయటం లేదా '' అని పక్కింటి ఆయేషా బుగ్గలు నొక్కుకుంటుండగా.. '' ఇది కూడా పుణ్యాకార్యమే అని అల్లామియాకు అర్థమవుతుందిలే '' అంది ఎదురింటి రసూల్బీ..

కారు కదులుతుండగా ఫాతిమా మరోసారి ప్రేమగా చెప్పింది '' బేటీ వస్తూ పోతూ ఉండు ఇది నీపుట్టినిల్లని మరిచిపోకు అని "

కవిత

# వనితా తెలుసుకో నీ ఘనత




చంద్రకళ దీకొండ,
మల్కాజిగిరి
చరవాణి:9381361384


సహనంలో అవనివి నీవు/త్యాగంలో తరువువు నీవు
లోకానికి చాటు నీ విలువ/ వనితా తెలుసుకో నీ ఘనత...!

వంటింటి కుందేలు నాడు/మింటిలో సగం ఈనాడు
సాటిలేనిది కదా నీ సామర్థ్యం/వనితా తెలుసుకో నీ ఘనత...!

రాయంచ నడకలు నీవి/ రాశిపోసిన సుగుణాలు నీవే
రాణకెక్కిన కీర్తి నీదే /వనితా తెలుసుకో నీ ఘనత...!

సమస్యలలో సలహాయై మెరిసేవు /విపత్తులలో స్థితప్రజ్ఞవు నీవు
సాధించని విజయాలు కలవా ధరలో/వనితా తెలుసుకో నీ ఘనత.!

మనసు తెలిసి మసలేవు /మనములోనే కుమిలేవు
మనోధైర్యం పెంపొందించుకో/ వనితా తెలుసుకో నీ ఘనత...!

అలుపెరుగని శ్రామికురాలు నీవు/సమస్యలతో పోరాడే సైనికురాలు నీవు
వండి వడ్డించే అన్నపూర్ణవు నీవు/వనితా తెలుసుకో నీ ఘనత...!

సంసార చోదకురాలు నీవు/సర్దుబాటు ఎరుగుదువు నీవు
స్వాభిమానం నిలుపుకో/వనితా తెలుసుకో నీ ఘనత...!

సృష్టికి మూలం నీవు/కుటుంబ వేరుమూలం నీవు
సాధికారతను సాధించు/వనితా తెలుసుకో నీ ఘనత...!

తీసివేతగా తేల్చేరు నిన్ను/గణిత శకుంతలను మరిచేరు
లెక్కలు తేల్చి చూపించు/వనితా తెలుసుకో నీ ఘనత...!

మమతల మాగాణివి నీవు/చిరునవ్వుల సిరివి నీవు
చిన్నమాటకే క్రుంగెదవేల...?/వనితా తెలుసుకో నీ ఘనత...!

అందరి గురించీ పట్టించుకుంటావు/
కుటుంబానికై నిరంతరం తాపత్రయపడతావు
నీ ఆరోగ్యంపై శ్రద్ధ చూపవెందుకు...?/వనితా తెలుసుకో నీ ఘనత...!

బాధలన్నీ గొంతులో దిగమింగుతావు/బాధ్యతల బరువుతో క్రుంగేవు
బ్రతుకులో ఆనందాన్ని నింపుకో/వనితా తెలుసుకో నీ ఘనత...!

పరిచయం లేని మెట్టినింటిలో పాదుకుంటావు
పదుగురినీ నీతో కలుపుకుంటావు
నీ అస్తిత్వాన్ని నిలుపుకో నీవు/వనితా తెలుసుకో నీ ఘనత...!

ఆదివారమంటే అందరికీ విశ్రాంతి/నీకు మాత్రం పనులతో అవిశ్రాంతి
శ్రమించే శక్తిని కూడగట్టుకో నీవు/వనితా తెలుసుకో నీ ఘనత...!

నీ కోసం సమయం కేటాయించుకో/నీలోని నైపుణ్యాలకు పదునుపెట్టుకో
నీ అభిరుచులతో ఉత్తేజం పొందు/వనితా తెలుసుకో నీ ఘనత...!

పారిపోతే వెంటపడును లోకం/వెంటపడితే పారిపోవును లోకం
వెనుదిరిగి ఒక్క చూపుతో నిలవెయ్యి/వనితా తెలుసుకో నీ ఘనత...!

జీవితమంతా పరులకై ధారపోయకు/నీ ఇష్టాలను అణచివేయకు
అప్పుడప్పుడూ సంతోషాన్ని అందిపుచ్చుకో/వనితా తెలుసుకో నీ ఘనత...!

నీ అభిప్రాయాలను వెల్లడించు/నీ నిర్ణయాన్ని ప్రకటించు
కుటుంబానికి మూలస్థంభం నీవు/వనితా తెలుసుకో నీ ఘనత...!

అందాన్ని పొగిడితే మైమరవకు/మాయమాటలకు లోబడిపోకు
నీ జాగ్రత్తలో నీవుండు/వనితా తెలుసుకో నీ ఘనత...!

నీకు అసాధ్యమైనదేదీ లేదు/అంతరిక్షానికి సైతం పయనమైనావు
పరిశోధనల్లో ప్రథమం నీవు/వనితా తెలుసుకో నీ ఘనత...!

ఆత్మన్యూనతతో వెనక దాక్కోకు/ఆత్మస్థైర్యాన్ని వదులుకోకు
ఆత్మవిశ్వాసపు ఆయుధం ధరించు/వనితా తెలుసుకో నీ ఘనత...!

మంచితనం చూపి మోసపోకు/అన్యాయాన్ని ఆదిలోనే ఎదిరించు
ముసుగులోన ఉంచితే ముదిరిపోవు/వనితా తెలుసుకో నీ ఘనత...!

పెంపకంలో వివక్షను ప్రశ్నించు/చదువులో నీవే మెరుగని చాటు
నీ గొప్పతనం అందరి మెదళ్ళలో నాటు/వనితా తెలుసుకో నీ ఘనత...!

పనిచేసే చోట వేధింపులను సహించకు/బయటకు తెలిస్తే ఏమగునోయని భరించకు
కంటిచూపుతో కట్టడి చేయడం నేర్చుకో/ వనితా తెలుసుకో నీ ఘనత...!

అబలవనే సానుభూతిని ఆశించకు/సమస్యలను సామరస్యంగా పరిష్కరించు
సబలవు నీవని నిదర్శనం చూపు/వనితా తెలుసుకో నీ ఘనత...!

కథ

# తెరువని కవర్లు



- చల్లా సరోజని దేవి
హైదరాబాద్, 9849826634

అదొక అందమైన పొదరిల్లు లాంటి చిన్న కుటుంబం. అమ్మా, నాన్న, పాపా, బాబూ. వీళ్ళు గాక అప్పుడప్పుడూ వచ్చి, గుండెల నిండుగా ఆదరాభిమానాలను మూట గట్టుకొని వెళ్లే ఇద్దరి అత్తా, మామలు.

బాబు రవీంద్ర , పాప రేవతి అంటే వారి అమ్మ జానకికి, నాన్న రామచంద్ర కూ పంచ ప్రాణాలు. పిల్లలిద్దరినీ మంచి బడిలో చేర్పించి, అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు జానకీ, రామచంద్రా. పూల పడవలా ,హాయిగా సాగిపోతున్న వారి సంసారం లో హఠాత్తుగా చిన్న కుదుపు వచ్చింది. ఏడేళ్ల రవీంద్ర కు మొదట మామూలు జ్వరం లా వచ్చిన ఒక వ్యాధి , అతడి జీవితాని కే శాపంగా మారే ప్రమాదం ఏర్పడింది. అంత చిన్నవాడికి కుడి కాలి లో నరాలు చచ్చు బడినవి. ఆపరేషన్ చేయక పోతే శాశ్వితంగా కుంటి వాడవుతాడని చెప్పారు డాక్టర్లు. అయితే కనీసం 4 నుండి 5 లక్షల రూపాయల ఖర్చు అవుతుందని కూడా చెప్పారు. జానకీ, రామ చంద్ర లు వెనుకాడలేదు. ఎప్పటినుండో ఇల్లు కొనాలని దాచిన డబ్బులకు తోడు, రేవతి పేరున ఉన్న FD నీ విత్ డ్రా చేసి, జానకి నగలు కొన్ని అమ్మి రవీంద్ర కు ఆపరేషన్ చేయించారు. నెల రోజుల తరువాత పూర్తిగా కోలుకున్న రవీంద్ర ఎప్పటిలాగే చెంగు చెంగున గంతులేస్తూ ఆడుకుంటూ వుంటే ఆ దంపతుల హృదయాలు ఆనందం తో పొంగి పోయినవి. మళ్ళీ వారి కుటుంబవనం లో సంతోష సుమాలు విరబూయ సాగినవి.

చీమ లాగా పిల్లల భవిష్యత్తు కోసం మళ్ళీ డబ్బు కుడబెట్టడం మొదలు పెట్టారు ఆ దంపతులు. రామచంద్ర ఒక ప్రభుత్వ ఉద్యోగి గా, జానకి ఒక ప్రైవేట్ పాఠశాల లో ఉపాధ్యాయినిగా పని చేస్తూ, తమ పిల్లలను ఒద్దికగా, పద్ధతిగా పెంచుకొంటూ వున్నారు. రామచంద్ర కు ప్రమోషన్ రావడం వారికి మరింత ఆనందం కలిగించింది. రోజులు సాఫీగా గడుస్తున్నాయి.

★ ★ ★

"ఏమండీ, మొన్న రామచంద్రన్నయ్య మీకు దాచమని ఏదో కవర్ ఇచ్చాడు కదా? చాలా జాగ్రత్తగా లాకర్ లో దాచారు. ఏముందట అందులో?" అని భర్త సుధాకర్ ను అడిగింది లలిత.

" ఓ, ఆ వేళ వాళ్ళ పాప పుట్టిన రోజు నాడు ఇచ్చిందేనా? ఏమో, ఏముందో నాకూ తెలియదు. తను చెప్పే వరకూ ఓపెన్ చేయవద్దన్నాడు కదా! నామీద వాడికి ఎంతో నమ్మకం వుంది. అందులో ఏముందో నేను అడుగ లేదు. అడగను కూడా. అవసరమైతే వాడే చెప్తాడుగా?" అన్నాడు సుధాకర్. " అందులో ఏముందో చూడాలని మీకు అనిపించడం లేదా?" అడిగింది లలిత. " అలాంటి ఆలోచనే నాకు లేదు. నీకూ రానీయకు. పొరపాటున కూడా దానిని తెరిచే ప్రయత్నం చేయవద్దు. నా పైన ఎంతో నమ్మకంతో వున్న నా బాల్య మిత్రుడి నమ్మకాన్ని వమ్ము చేయవద్దు." హెచ్చరిక గా చెప్పాడు సుధాకర్.

"చ , చ నేనెందుకు తెరుస్తానండీ? ఊరికే అడిగానంతే." అన్నది లలిత.

"Thats good. పిల్లలు ఇంకా రాలేదా? ఈ వేళకి వచ్చేస్తారు కదా?" అడిగాడు సుధాకర్. " ఈ రోజు వాళ్ళ స్కూల్ లో ఏదో మ్యాజిక్ షో ఉందిట. లేట్ గా వస్తామని ఉదయమే చెప్పారు లెండి" అన్నది లలిత.

"అవునా?" అంటూ భార్య ఇచ్చిన కాఫీ కప్పు ను అందుకొన్నాడు సుధాకర్.

★ ★ ★

చూస్తుండగానే మరో ఐదేళ్లు గడిచాయి. రవీంద్ర పదవ తరగతి లోకి వచ్చాడు. రేవతి ఆరవ క్లాస్ కు వచ్చింది. ఆ పాప 10 వ పుట్టిన రోజు నాడు రామచంద్ర మరో సీల్డ్ కవర్ ను తన ప్రాణ స్నేహితుడైన సుధాకర్ కు ఇచ్చి" గతంలో ఇచ్చిన దానితో

పాటు ఇదీ దాచి పెట్టరా సుధా" అన్నాడు. ఏమీ మాట్లాడకుండా ఆ కవర్ ను అందుకొని భద్రంగా బ్యాగ్ లో పెట్టుకొన్నాడు సుధాకర్. ఆ ఇద్దరి మిత్రుల పిల్లలకూ మంచి స్నేహం వుంది. అలాగే లలితా, జానకీ కూడా అరమరికలు లేకుండా స్నేహంగా ఉంటారు. కానీ భర్త చెప్పిన మాట గుర్తున్న లలిత ఎప్పుడూ ఆ కవర్ ల విషయం మాత్రం జానకి తో చెప్పలేదు. అది ఆమెకు భర్తీ మాట మీదా, ఆ ఇద్దరి స్నేహం మీదా వున్న అభిమానానికి నిదర్శనం.

రోజులు బంతుల్లా దొర్లి పోయాయి. రవీంద్ర ఇంటర్ లో ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా EAMCET లోనూ మంచి ర్యాంక్ పొందాడు. అతడికి మంచి గుర్తింపు వున్న కాలేజీ లో నే ఇంజనీరింగ్ సీట్ దొరికింది. రేవతి పదవ తరగతి లోకి వచ్చింది. అటు సుధాకర్ పిల్లలు కూడా చక్కగా చదువుకో సాగారు. రేవతి 15 వ పుట్టిన రోజు న రామచంద్ర సుధాకర్ కు మరో సీల్డ్ కవర్ ఇచ్చాడు. ఇలాగ ఐదేళ్లకోసారి అతడు తనకు "దాచి పెట్టరా" అంటూ అలాంటి కవర్ లు ఇవ్వటం ఈ సారి లలిత తో పాటు సుధాకర్ కు కూడా ఆశ్చర్యం కలిగించింది.

"ఏరా, ఇలాగ ఫైవ్ ఇయర్స్ కో సారి చొప్పున ఇప్పటి కిది మూడవ కవర్ ఇచ్చావు. ఏమున్నాయి అందులో? నాకు కూడా చెప్పకూడని రహస్యమా?" అని అడిగాడు." ఇప్పుడేమీ అడుగవద్దు రా సుధా, కానీ ఎప్పటికైనా నువ్వే వాటిని ఓపెన్ చేయాలి." అన్నాడు రామచంద్ర.

"అదే ఎప్పుడూ?" అడిగాడు సుధాకర్.

"సమయం వచ్చినప్పుడు" అని నవ్వుతూ బదులిచ్చాడు రామచంద్ర.

"ఎంటోరా రామూ, నీ మాటలు నాకు అర్థమే కావడం లేదు. సరేలే, పాత వాటితో పాటు ఇదీ జత చేస్తాను" అన్నాడు సుధాకర్." అలా అన్నావు , బాగుంది" అంటూ మిత్రుడి భుజం తట్టాడు రామ చంద్ర ఆప్యాయంగా............।

మరో ఐదేళ్లు కాల గర్భంలో కలిసిపోయినవి. ఈ లోగా ఇరు కుటుంబాల్లోనూ చెప్పుకోదగిన విశేషాలే జరిగినవి. రేవతి డిగ్రీ పూర్తి చేసింది. ఇంకా చదువుకోవాలని ఆమెకూ, చదివించాలని ఆమె తల్లితండ్రులకు వున్నప్పటికీ , అనుకోకుండా మంచి సంబంధం వచ్చింది రేవతి కి. ఏదో ఫంక్షన్ లో ఆమెను చూసిన వరుడు వరుణ్ ఆమెను ఎంతో ఇష్ట పడ్డాడు. స్నేహితుల ద్వారా ఆమె వివరాలు సేకరించి , తన తల్లి తండ్రుల ను రేవతి ఇంటికి పంపించాడు. వరుణ్ బెంగుళూరు లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా జాబ్ చేస్తున్నాడు. మంచి జీతం. అందగాడు. బుద్ధిమంతుడు. అతనికి ఒకే ఒక అక్క వుంది. ఆమెకూ పెళ్ళి అయింది. అతని తల్లి తండ్రు లు కూడా మంచి విద్యా వంతులు. వారి సంస్కారం వారి మాటల్లోనే అర్థం అవుతుంది. పైగా కట్న కానుకలు కూడా ఏమీ వద్దనీ, పెళ్ళి మాత్రం బాగా జరిపించితే చాలనీ అంటున్న వారిని ఎలా నొప్పించాలో తోచలేదు రామచంద్ర కు. చివరికి ఒక నిర్ణయానికి వచ్చి" మాకు కూడా అన్ని విధాలా సమ్మతమే. కానీ మా అమ్మాయి ఇంకా చదువుకోవాలని కోరుకుంటోంది అండీ" అని వున్న విషయమే చెప్పాడు వారితో.

"ఓస్, ఇంతేనా? మా వాడు ముందే చెప్పాడు లెండి. అమ్మాయి ఎంత వరకు కావాలంటే అంత వరకూ చదువు కోవచ్చ నీ, అభ్యంతరం లేదని చెప్పండి అన్నాడు. ఇంక బెంగుళూరు లో కాలేజీలకు ఏం కొదవ బావగారూ?" అన్నాడు వరుణ్ తండ్రి నవ్వుతూ. ఆనందంతో మూగ బోయారు జానకీ రామచంద్ర లు. రేవతి కి కూడా వరుణ్ నచ్చడంతో ఏదీ ఆగలేదు. రవీంద్రకు కూడా వరుణ్ చాలా నచ్చాడు. రేవతీ వరుణ్ ల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఆ జంటను చూసి అందరూ మెచ్చుకున్నారు. రవీంద్ర కు ఒక మంచి కంపెనీ లో జాబ్ వచ్చింది. సుధాకర్ పిల్లలు ఇద్దరికీ కూడా మంచి ఉద్యోగాలు వచ్చాయి. అందరూ వున్న ఊరి లోనే జాబ్స్ చేయడం అందరికీ సంతోష దాయకం అయింది. రేవతి Pg లో చేరింది బెంగుళూరు లో నే. ఈ సారి ఆమె పుట్టిన రోజు భర్త తో కలిసి చేసుకొంది. రామ చంద్ర ఆహ్వానం మేరకు వరుణ్ సెలవు పెట్టు కొని , సతీ సమేతంగా వచ్చాడు. అమ్మా నాన్న లు, అన్నయ్యా, అత్తామామలు, భర్తా , సుధాకర్ కుటుంబం తో కలిసి చాలా సంతోషంగా కేక్ కట్ చేసింది రేవతి. రామచంద్ర మరో సీల్డ్ కవర్ ను సుధాకర్ కు ఇచ్చాడు. " ఇది నాలుగవది. ఐదేళ్లు అయింది కదా? ఇంకా ఇవ్వలేదేంటా "అనుకొంటున్నాను." అని నవ్వాడు సుధాకర్. బదులుగా రామచంద్ర కూడా నవ్వి "ఇంకెన్నో ఇవ్వను లేరా" అన్నాడు.

అర్థం కానట్లు చూసాడు సుధాకర్." ఈ సారి రేవతి పుట్టినరోజు విలక్షణంగా జరిగింది కదూ?" అని మాట దాట వేసాడు రామ చంద్ర.

మరో నాలుగేళ్లు కాలపురుషుడి కబంధ హస్తాల్లో బందీలై కనుమరుగైనవి. ఈ మధ్య కాలంలో రామ చంద్ర జీవితంలో పెను మార్పులే జరిగాయి. రవీంద్ర కు కంపెనీ నుండి ఫారిన్ వెళ్ళే అవకాశం వచ్చింది. కానీ రామచంద్ర అంగీకరించ లేదు. దాంతో హతాశుడైన రవీంద్ర అలిగి , కొన్నాళ్ల పాటు తండ్రి తో మాట్లాడలేదు. రామచంద్ర తనలో తనే బాధపడేవాడు. జానకి తండ్రీ కొడుకుల కిద్దరికీ సర్ది చెప్పింది. రేవతి కి ఇద్దరు పిల్లలు పుట్టారు. ఏ లోటూ రాకుండా అన్నీ సక్రమంగా చేసారు ఆమె పుట్టింటి వారు.

మరోసారి మళ్ళీ రవీంద్ర కు ఫారిన్ అవకాశం వచ్చింది. "ఈ సారి ఎలాగైనా వెళ్ళి తీరాల్సిందే " అని పట్టు బట్టాడు రవీంద్ర. జానకి భర్తకు ఎంతో నచ్చచెప్పినా , రామచంద్ర సుముఖత చూపలేదు. " పరుగెత్తి పాలు త్రాగే బదులు, నిలబడి నీళ్ళు త్రాగడం మేలు. దూరపు కొండలు నునుపు గానే కనిపిస్తాయి. దగ్గరకి వెళ్లి చూస్తేనే వాటి సంగతి అర్థం అవుతుంది. నా అనేవాళ్ళు లేకుండా అక్కడెక్కడో ఒంటరిగా ఎందుకు వుండాలి? అక్కడి సంపాదనకు, ఖర్చుకూ సరిపోతుంది. ఇక్కడ మనకు ఏమైనా అయితే దిక్కెవరు?" అన్నాడు రామచంద్ర." అదీ అసలు సంగతి. మీ స్వార్థం కోసం , మిమ్మల్ని చూడడం కోసం నా బంగారు భవిష్యత్తు ను బలిపెడుతున్నారన్న మాట. అయినా మీకు ఏమవుతుంది? ఏదైనా అయినా చెల్లీ, బావగారూ, సుధా అంకుల్ వాళ్ళంతా ఉన్నారుగా?" కోపంగా అన్నాడు రవీంద్ర. దెబ్బతిన్న పక్షిలా విల విల లాడుతూ దీనంగా చూసాడు రామ చంద్ర. నిజానికి అతడి అభ్యంతరం వేరు. ఒకసారి అమెరికా లో దుండగులు అకారణంగా కాల్పులు జరుపడం తో అతనికి బాగా తెలిసిన వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆ భయం అతడి మనసులో నిలిచి పోయింది. ఆ కారణం చెప్పితే ఎవ్వరూ వినరనీ, తేలిగ్గా కొట్టి పడేస్తారనీ అతను తన భయాన్ని ఎవరికీ చెప్పలేదు. కొడుకు తనని స్వార్థ పరుడు అనడం తట్టుకోలేక పోయాడు. నీళ్ళు నిండిన కళ్ళతో భార్య వైపు చూసాడు . కానీ ఆమె అదేమీ పట్టించు కోలేదు. కొడుకు మాటనే బల పర్చింది. రామ చంద్ర కు ఒప్పుకోక తప్పలేదు. "అవసరానికి వుంటాయి "అని మూడు లక్షలు కొడుకు చేతికి ఇచ్చి, వీడ్కోలు పలికాడు. రవీంద్ర అక్కడ అన్నీ చూసుకొని , తండ్రికి ప్రతీ నెలా డాలర్లు పంపడం మొదలు పెట్టాడు. అవి చూసిన ప్రతీ సారి కొడుకు అన్న మాట గుర్తుకు వచ్చేది రామ చంద్ర కు. నిర్లిప్తంగా నవ్వు కొనే వాడు. అంత ఇంట్లో అతను అతని భార్య మాత్రమే వుండడం బాధగా వుండేది అతనికి. అప్పుడప్పుడూ వచ్చి కొన్నాళ్ళు తమతో గడిపే కూతురి కుటుంబాన్ని చూసుకొని సంతృప్తి పడే వారు ఆ దంపతులు. రవీంద్ర విదేశానికి వెళ్ళిన రెండేళ్లకు రామచంద్ర రిటైర్ అయ్యాడు. విషయం తెలిసినా రవీంద్ర రాలేదు. మరో ఏడాదికి జానకి గుండె పోటు తో కన్ను మూసింది. ఈ కబురు తెలిసిన వెంటనే రేవతీ,వరుణ్ లు హుటాహుటిన వచ్చారు. రవీంద్ర కు కూడా కబురు చేసారు. మొదట " రావడానికి కుదరదేమో?" అని గొనిగినా , ఏ పేగు బంధం కదిలించిందో , ఎలాగో వచ్చాడు ఇండియా కు. కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న చెల్లిని, తండ్రిని చూసినా అతని నిగ్రహం సడలలేదు. కానీ నిద్ర పోతున్నట్లే , ప్రశాంతంగా వున్న తల్లి పార్థివ దేహాన్ని చూడగానే అతనికి ఏడుపు ఆగలేదు. ఎవరి కన్నీళ్లకూ కరగని కాలం ముందుకు సాగుతూనే ఉంటుంది కదా? కార్య క్రమాలు అన్నీ అయిపోయాక , బంధు మిత్రులు అంతా ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళి పోయారు . రవీంద్ర కూడా తన ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవడం చూసిన రామ చంద్ర ఆశ్చర్య పోయాడు.

" అదేంటి, మళ్ళీ వెళ్తావా?" అడుగలేక అడగలేక మెల్లగా అడిగాడు. " మరి? నేను నెల రోజుల సెలవులతో మాత్రమే వచ్చాను. నెక్స్ట్ మంత్ నాకు ప్రమోషన్ తో పాటు గ్రీన్ కార్డ్ కూడా రానున్నది. నాన్నా! నువ్విలా ఇక్కడ ఒంటరిగా ఎందుకు వుండాలి? నువ్వు కూడా నాతో వచ్చేసెయ్. నీకూ వీసా కు అప్లై చేస్తాను." అన్నాడు రవీంద్ర. తన కొడుకుకు విదేశీ వ్యామోహం ఎంతగా తల కెక్కిందో గ్రహించిన రామ చంద్ర శుష్క హాసం చేసాడు. " అలా నవ్వితే దానికి అర్థమేంటి నాన్నా? నువ్వూ వస్తున్నావుగా?" అన్నాడు రవీంద్ర. " లేదు నాన్నా, నేను రాను. బ్రతికినన్నాల్లు నా జానకి తిరుగాడిన ఈ ఇంట్లోనే వుంటాను. ఏడాది లోపు నువ్వు నీకు నచ్చిన అమ్మాయిని చూసుకొని ఒక ఇంటి వాడివైతే మీ అమ్మ ఆత్మ సంతోషిస్తుంది. అంతకన్నా ఇంకేమీ కోరను నిన్ను" వణికే కంఠం తో నెమ్మదిగా చెప్పాడు రామ చంద్ర.

రవీంద్ర కు కోపం వచ్చింది. " ఇప్పుడు నా పెళ్లికి ఏం తొందర వచ్చింది? ఇంత ఇంటిలో "ఒంటరిగా వుంటాను " అంటావేంటి? అమ్మే లేనప్పుడు , ఆమె జ్ఞాపకాల కోసం ఇక్కడే

వుంటాననడం అర్థం లేని మాట" అన్నాడు కొంచెం కోపంగా. " నీకు అది అర్థం లేని మాట కాబోలు! రవీ, కానీ నాకు కాదు. మీ చిన్నప్పుడు ఈ ఇల్లు కొన్నదగ్గిరనుండీ దాదాపు , పాతికేళ్లుగా అడుగడుగునా నాకు తోడుగా వుంది. ప్రతీ అంగుళం లోనూ మీ అమ్మ జ్ఞాపకాలు నాకు కనబడతాయి. నీ పెళ్ళి నీ ఇష్టం. కానీ నన్ను నీతో రమ్మని మాత్రం బలవంతం చేయకు" అని స్థిరంగా అన్నాడు రామ చంద్ర. అప్పటికేమీ అనకుండా సుధాకర్ తో చెప్పించాడు రవీంద్ర. " ఒరేయ్ సుధా, ఈ ఇంట్లో నా నీడ లాగ మీ చెల్లి తిరుగుతూనే వుంటే , నాకు ఒంటరి తనం ఏముందిరా? రేవతీ వాళ్ళు వస్తారు. నువ్వూ, లలితా, పిల్లలూ నా కళ్ళ ముందే వుంటారు గా? ఇంక నేను ఒంటరిని ఎలా అవుతాను?" అని వాదించి కొడుకు తో వెళ్ళడానికి నిరాకరించాడు రామ చంద్ర. చేసేదేమీ లేక గడువు పూర్తి కాగానే , తిరిగి అమెరికాకు వెళ్ళి పోయాడు రవీంద్ర. రేవతీ వరుణ్ ల బలవంతం తో వారి వెంట వెళ్ళి కొన్నాళ్ళు బెంగుళూరు లో వున్నాడు రామ చంద్ర. మనః శాంతి లభించక తిరిగి స్వంత గూటికి వచ్చేసాడు. తనే వండుకునే వాడు. తరచుగా సుధాకర్ వచ్చి, యోగ క్షేమాలు కనుక్కొని వెళ్తుండగా, రోజులు భారంగా గడుస్తున్నాయి అతడికి.

★ ★ ★

ఒకసారి అలా సుధాకర్ వచ్చినప్పుడు "ఒరేయ్ సుధా, నా జానకి నన్ను రమ్మని పిలుస్తున్నట్లు అనిపిస్తోంది రా" అన్నాడు రామచంద్ర. ఉలిక్కి పడి" ఏమిటా వెధవ మాటలు? పిచ్చి పిచ్చి ఆలోచనలు చేయకుండా , రా నాతో. అలా గుడి దాకా వెళ్దాం" అని కసురు కొంటునే మిత్రుడి చేయి పట్టుకుని లేవదీయ బోయాడు సుధాకర్." వద్దురా, నేను ఏ గుడికీ రాను. నాకు ఏ దేవుడూ న్యాయం చేయలేదు. ఎవరికి, ఏం అపకారం చేసానని నిత్యం పూజలు చేసే నా జానకిni నాకు దూరం చేసాడు దేవుడు? నా దగ్గిరే వుండి తన పెళ్ళీ పేరంటం, పిల్లలూ అనే ముచ్చటలు

చూసే అవకాశం లేకుండా , నా ఒక్కగానొక్క కొడుకు నా నుండిదూరంగా అన్ని వేల మైళ్ళ దూరం ఎందుకు వెళ్ళాడు? అన్నీ కర్మ ఫలాలు అంటావు. నాకు తెలుసు. ఇంక చాలులేరా, బ్రతుకు పోరులో బాగా అలసి పోయాను. హాయిగా నేను కూడా నా జానకి దగ్గిరకి వెళ్ళి పోతాను." నవ్వుతూనే తన లోని ఆక్రోశాన్ని వెలి బుచ్చాడు రామ చంద్ర. " నోరు ముయ్యరా, నీ మెట్ట వేదాంతం, నువ్వూను. పోనీ గుడికి వద్దులే. అలా పార్క్ కైనా వెళ్దాం లే" అన్నాడు సుధాకర్. " అలా కాదురా. ఇక్కడే కూర్చుని, కాఫీ త్రాగుతూ మన చిన్నప్పటి కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు రామచంద్ర. చిన్న నాటి కబుర్లు అనేసరికి సుధాకర్ కూడా ఉత్సాహం చూపించాడు. అలా ఆ రోజు ఇద్దరూ పదేళ్ల పిల్లలై పోయారు. ఎన్నెన్నో కబుర్లు చెప్పుకొన్నారు. జ్ఞాపకాలు ఎన్నో కలబోసుకొని నవ్వుకొన్నారు. కన్నీళ్ళు పెట్టుకొన్నారు. చివరగా" ఇంక నీకు ఇంకో కవర్ ఇవ్వను లేరా. నా తరువాత నువ్వే వాటిని తెరిచి చదివి ,మరీ నా పిల్లలకు ఇవ్వాలి" అన్నాడు రామచంద్ర. అప్పటి వరకూ వున్న సంతోషం చప్పున మాయమైంది సుధాకర్ లో. " ఏమైందిరా రామూ, ఇవ్వాళ ఇలా మాట్లాడుతున్నావు? ఈ పూటకు మాయింటికి వెళ్దాం పద" అని అభిమానంగా స్నేహితుడి భుజం తట్టాడు.

" వద్దు లేరా సుధా, నేను బాగానే ఉన్నాను. రేపు కలుద్దాం . చాలా పొద్ద పోయింది. మా చెల్లి ఎదురు చూస్తూ వుంటుంది. ఇంక బయల్దేరు. " అని సుధాకర్ ను పంపించేసాడు రామచంద్ర.

కొద్ది రోజుల తరువాత నిజంగానే తథాస్తు దేవతలు ఉంటారేమో అన్నట్లు గా కూరగాయలకు వెళ్ళి వస్తున్న రామచంద్ర కు బస్ ఆక్సిడెంట్ జరగడం దురదృష్టం. పరధ్యానంగా బండి నడుపుతున్న అతడు ఎదురుగా వస్తున్న బస్ ను గమనించక ఆ ప్రమాదానికి గురి అయ్యాడు. నిముషాల్లో జనం గుమి గూడారు. అతడిని ఎరిగిన వాళ్ళు ఎవరో సుధాకర్ కు ఫోన్ చేసారు. అంబులెన్స్ కు కాల్ చేసారు మరెవరో. పరుగున వచ్చాడు సుధాకర్. వెంటనే వచ్చిన అంబులెన్స్ లో తీవ్రంగా గాయపడిన రామచంద్ర ను హాస్పిటల్ కు తీసుకొని వెళ్ళాడు. కళ్ళనుండి ధారా పాతంగా స్రవిస్తున్న కన్నీళ్ళతో కూర్చున్నాడు . ICU లో నలుగురు డాక్టర్లు రామచంద్ర ను రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ లోగా కాల్ అందుకొన్న రేవతీ వరుణ్ లు వచ్చారు. రవీంద్ర కు కూడా కేబుల్ చేసాడు సుధాకర్."అవునా? ఎలా జరిగింది? ఇప్పుడెలా వుంది?" అని చాలా క్యాజువల్ గా అడిగాడు రవీంద్ర. అతడి మాటల ధోరణి కి ఆశ్చర్యం కలిగింది సుధాకర్ కు. 48 గంటలు గడిస్తే గానీ ఏమీ చెప్పలేం అనీ, తలకు తీవ్రంగా దెబ్బ తగలడం వల్ల కోమా లో కి వెళ్ళాడనీ, బ్రతికే అవకాశం తక్కువే అనీ చెప్పారు డాక్టర్లు.

ఫ్లైట్ లో రావడం వల్ల రేవతీ వరుణ్ లు ఒక రెండు గంటల్లోనే చేరుకొన్నారు. ఒడలంతా గాయాలతో వున్న తండ్రిని చూసి బోరున విలపించ సాగింది రేవతి. వరుణ్, సుధాకర్ ల తో పాటు లలిత కూడా ఆమెను ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు. " రవీంద్ర బయలు దేరాడా అంకుల్?" అని సుధాకర్ ను అడిగాడు వరుణ్. రవీంద్ర స్పందించిన తీరు ను చెప్పి" వాడు వస్తాడని నాకైతే ఏమీ అనిపించడం లేదు" అన్నాడు సుధాకర్.

"అదెలా అంకుల్! నేనూ కాల్ చేస్తాను ఆగండి" అంటూ వెంటనే రవీంద్ర కు ఫోన్ చేసాడు వరుణ్. చాలా సేపటికి ఫోన్ ఎత్తిన రవీంద్ర" ఏమైంది బావగారూ?"అన్నాడు." ఏమైందో నీకు తెలియదా? సుధాకర్ అంకుల్ చెప్పారు కదా? ఎప్పుడు బయల్దేరుతున్నావు?" కొంచెం కటువుగానే అడిగాడు వరుణ్.

" అది కాదు బావ గారూ, మాకు ఇక్కడ ఆడిటింగ్ జరుగుతున్నది. ఎటూ కదిలెందుకు లేదు. మా బాస్ సెలవు కూడా గ్రాంట్ చేయడు. మీరూ, చెల్లీ, సుధాకర్ అంకులే ఎలాగో చూసుకోండి" అన్నాడు రవీంద్ర." ఏం మాట్లాడుతున్నావు రవీ? నీకు ఆ ఉద్యోగం పోయినా, ఇక్కడ నీ బ్రతుకు తెరువు కు కొదవ లేదు. కానీ నీ కన్న తండ్రి చావు బతుకుల మధ్య వుంటే , కడసారి చూడలేక పోతే ఆ బాధ, ఆ పాపం నిన్ను వెన్నాడదా? వెంటనే బయల్దేరు" అని గట్టిగానే చెప్పాడు వరుణ్. " అది కాదు బావ గారూ, నాన్నను అలా చూసి నేను తట్టుకోలేను. నాకు రావడం కుదరదు కూడా. అర్థం చేసుకోండి ప్లీజ్" అన్నాడు రవీంద్ర. వరుణ్ కోపంగా ఫోన్ పెట్టేసాడు. తన ఫ్రెండ్ కూడా రవీంద్ర చేసే దగ్గిరే జాబ్ చేస్తున్నాడు. తరచుగా వారు మాట్లాడు కొంటూ వుంటారు. అతని ద్వారా వాళ్ళ బాస్ తో మాట్లాడే అవకాశం సంపాదించాడు వరుణ్. ఆ బాస్ చాలా మంచివాడు. విషయం విని" అరెరే, అలాగా? నాకు రవీంద్ర చెప్పనే లేదు. అయినా ఇప్పుడు మాకు ఏ ఆడిటింగ్ కూడా లేదు. వెంటనే నేను రవిని ఇండియా కు పంపిస్తాను" అని మాట ఇచ్చాడు. రవీంద్రను పిలిచి మందలించి , అప్పటికప్పుడు బయల్దేర తీసాడు. రవి కి కోపంగా, విసుగ్గా వుంది. తప్పదు అనుకొని ఇండియా కు వచ్చాడు. అప్పటికి ఒక రోజు గడిచింది. రేవతి కి అన్న మీద చాలా కోపం వచ్చింది. తండ్రిని చూస్తుంటే దుఖం ఆగడం లేదు ఆమెకు. ఇంకో రోజు గడిస్తే అతను బ్రతుకుతాడు అనే ఆశతో అందరూ ఎదురు చూస్తున్న సమయం లో వచ్చాడు రవీంద్ర. విదేశాల్లోని సౌఖ్యాలు, విలాసాలు అతడిని బలంగా ఆకర్షించడం వల్ల, అక్కడనుండి రావడానికి అతడికి మనసొప్పలేదు. కానీ అతడు కూడా భావోద్వేగాలు వున్న మనిషే కదా! తండ్రి అంటే అతనికీ ప్రేమ వుంది. , శరీరం అంతా కట్లతో ,కోమాలో వున్న తండ్రిని చూడగానే అప్రయత్నంగా అతని కి దుఖం ముంచుకు వచ్చింది. " చెల్లీ, మన నాన్నేనా? " అని రేవతి నీ పట్టుకొని పెద్ద పెట్టున ఏడ్చేసాడు. రేవతి కి అప్పటి వరకూ అన్న మీద వచ్చిన కోపం పోయింది. తనూ ఏడవ సాగింది. ఈ లోగా రామ చంద్ర లో కొంచెం కదలిక కలిగినట్లు అనిపించింది. అందరూ ఆశగా అద్దాల వెనుకనుండి చూస్తూ, డాక్ట ర్ను చుట్టు ముట్టారు. " చెప్పలేం. ఎవరో ఒకరిద్దరు లోనికి వెళ్లి చూడండి" అన్నాడు అతడు. అందరికీ వెళ్ళాలనే వుంది. అయితే అది కుదరదు కాబట్టి రేవతి నీ, రవీంద్రను వెళ్ళమన్నాడు సుధాకర్. కానీ రేవతి " మీరూ , అన్నయ్యా వెళ్ళండి అంకుల్. మేము ఇక్కడి నుండి చూస్తాం" అని సుధాకర్ ను పంపించింది. " నాన్నా" అని రవీంద్ర ఆర్తిగా పిలుస్తుంటే , రామచంద్ర కళ్ళు కొంచెంగా కదిలినవి. కానీ తెరుచుకోలేదు. " రామూ" అని సుధాకర్ రామచంద్ర చేతిని పట్టుకొన్నాడు. చూస్తుండగానే ఆ చేయి బిగుసుకు పోయింది. అతడి కళ్ళు శాశ్వితంగా మూత పడినవి. సుధాకర్ నిశ్చేష్టుడయ్యాడు. అంతకు కొద్ది రోజుల క్రితమే తామిద్దరూ చెప్పుకొన్న ముచ్చట్లు, నవ్వుకున్నా నవ్వులూ అతడి చెవుల్లో ప్రతిధ్వనిస్తూ అతడిని కుదిపేయ సాగినవి." నాన్నా" అని రవి గట్టిగా అరిచి ఏడవడం చూసిన రేవతి కూడా ఒక్క ఉదుటున లోపలికి వచ్చి బోరుమన్నది. వరుణ్ పూనుకొని హాస్పిటల్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేయించి మామగారి శవాన్ని ఇంటికి తరలించాడు. ఆ తరువాతి కార్యక్రమాలన్నీ కూడా సుధాకర్ సహాయంతో వరునే రవీంద్ర తో చేయించాడు. యాంత్రికంగా ఎవరు ఏది చెప్పితే అది చేసాడు రవీంద్ర. ఆ పదిరోజులూ రేవతి కి సాయంగా లలిత కూడా అక్కడే వుండి పోయింది. కర్మ కాండలు అన్నీ సజావుగా ముగిసినవి. అంతా సావకాశంగా కూర్చుని వుండగా, సుధాకర్ కు చటుక్కున రామ చంద్ర ఇచ్చిన తెరువనీ కవర్లు గుర్తుకు వచ్చాయి.

" ఇప్పుడే వస్తాను" అని వెంటనే బండి మీద ఇంటికి వెళ్ళి, బీరువా లాకర్ లో భద్రంగా దాచిన నాలుగు సీల్డ్ కవర్స్ తీసుకొని వచ్చాడు. అందరూ ఆశ్చర్యంగా, ఆసక్తిగా చూడసాగారు." రవీ, రేవతీ, ఇవి మీ నాన్న ఐదేళ్లకోసారి ఇచ్చి

దాచమని ఇచ్చిన సీల్డ్ కవర్స్. ఇందులో ఏం వున్నాయో నాకూ తెలియదు. ఇలాంటి ఆపత్సమయం లోనే తెరిచి చూడమని చెప్పాడు." అంటుండగనే సుధాకర్ గొంతు దుఖం తో వణికింది. అందరూ నిశబ్దంగా వుండిపోయారు . కాస్సేపటికి ముందుగా తేరుకున్న సుధాకర్ తను డేట్ వేసి వుంచిన మొదటి కవర్ తీసాడు. " రేవతీ, ఇది నీ 5 వ పుట్టిన రోజు నాడు ఇచ్చిన మొదటి కవర్ " అని దానిని జాగ్రత్తగా తెరిచాడు. అందులో రేవతీ, రవీంద్ర ల పేరు మీద తీసుకొన్న fd కాగితాలు, పాస్ బుక్స్ తో పాటు రామచంద్ర సుధాకర్ కు రాసిన చిన్న ఉత్తరం వుంది." ఒరే సుధా, మానవ జీవితాలు క్షణ భంగురాలు కదరా? ఎందుకో నాకు ఇలా చేయాలనిపించింది. పిల్లలు ఇద్దరి పేరునా చెరో రెండు లక్షలు ఫిక్స్డ్ చేసాను. ఇరవై ఏళ్ళకు రెట్టింపు కావచ్చు. నీ దగ్గిరైతేనే ఇవి భద్రంగా ఉంటాయనీ, అవి సక్రమంగా వాళ్ళకు అందుతాయనీ నాకు తెలుసు. నేను లేనప్పుడు వీటిని తెరువు.నీకు శ్రమ ఇచ్చాను కదూ?నీ రాము. "అని వుంది ఉత్తరం లో. అది చదువుకొన్న సుధాకర్ కళ్ళు అశ్రుపూరితాలు అయినవి ఉత్తరం తో సహా ఆ కవర్ ను రవీంద్ర కు ఇచ్చి, రెండో కవర్ తెరిచాడు అతడు. అందులో ఏవో డాక్యుమెంట్లున్నాయి. అవి వివరంగా చూస్తే రేవతీ, రవీంద్ర ల పేరు మీద ఎప్పుడో కొన్న ప్లాట్ల కాగితాలు అని తెలిసింది. అప్పట్లో వాటి ధర చాలా తక్కువే, అయినప్పటికీ ఇప్పుడు కోట్లలో వుంది. సుధాకర్ కు మరో ఉత్తరం కూడా వుంది .అందులో" డియర్ సుధా, ఇప్పటి నుండే ఆస్తులు ఇస్తే పిల్లలకు సోమరితనం పెరుగుతుంది. స్వయం శక్తి వుండదు. వాళ్ళకు బాగా ఊహ తెలిసాక మాత్రమే ఇవ్వాలని ఈ ప్లాట్ల సంగతి రహస్యంగా నే వుంచాను. నా తర్వాత ఎలాగూ నువ్వు వాళ్ళకు అవి అందిస్తావని తెలుసు. శ్రమ కలిగిస్తున్నాను మిత్రమా!– నీ రాము అని వుంది. దుఃఖం ఆపుకోలేక పోయారు అందరూ. కన్నీళ్ళతో నే మూడవ కవర్ తెరిచాడు సుధాకర్. " ఇది నీ 15 వ పుట్టిన రోజు న ఇచ్చాడు మీ నాన్న. " అని రేవతి తో చెపుతూ కవర్ లో చూసాడు. అందులో ఒక బ్యాంక్ లాకర్ కీ తో పాటు ఉత్తరం మాత్రమే వుంది. " సుధా, రవి కి ఆపరేషన్ కోసం 4 లక్షలు ఖర్చుయినవనే విషయం నీకూ తెలుసుగా? అప్పటి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా అంత మొత్తం సమకూర్చడానికి నా Pf విత్ డ్రా చేసాను. మీ చెల్లి నగలూ అమ్మాను. పాప పేరున వున్న fd కూడా విత్ డ్రా చేసాను. అలాగ ఎవరినీ అప్పు అడగకుండా ఎలాగో డబ్బు అమిరింది. నా బంగారు తండ్రి రవి నాకు దక్కాడు. అదే పదివేలు అనుకొన్నాను. తరువాత డబ్బు వెసులుబాటు అయ్యాక మీ చెల్లి కోసం ఎన్నో నగలు కొన్నాను. కానీ తను ఒకటి రెండు నగలతో నే సంతృప్తి పడేది. ఆ నగలన్నీ ఫలానా బ్యాంక్ లాకర్ లో వున్నాయి. దాని తాలూకు కీ ఇది. నా పాస్ బుక్ లో నామినీ పేరు రవిదే వుంది. ఇబ్బంది వుండదు. నిజానికి ఆ నగలు అన్నీ రేవతి కి చెందాలి. తన ఇష్టమైతే నే రవి కి గానీ , అతని భార్య కు గానీ ఏమైనా ఇవ్వవచ్చు. అన్నీ నువ్వే చూసుకోవాలి.– నీ రాము. అని రాసి వున్నది అందులో. అది కూడా రవి కి అందించి చివరి కవర్ చేతిలోకి తీసుకొని " ఇదే చివరి కవర్. నీ పెళ్ళి తరువాత జరిగిన నీ పుట్టిన రోజు నాడు ఇచ్చాడమ్మా. " అంటూ కవర్ తెరిచాడు సుధాకర్. అందులో కూడా రెండు డాక్యుమెంట్స్, ఒక పాస్ బుక్ తో పాటు ఉత్తరం వున్నాయి. ఆ డాక్యుమెంట్స్ లో ఒకటి తాము నివసించే ఇంటి తాలూకుది. అది రవి పేరున వీలునామా రాసి రిజిస్టర్ చేయించ బడింది. రెండవది పల్లెటూరులో వున్న విశాలమైన ఇల్లు రేవతి పేరున రాయబడిన వీలునామా. పాస్ బుక్ రవీంద్ర పేరున వుంది. అందులో రవీంద్ర ప్రతీ నెలా తండ్రికి పంపించిన డబ్బు యధా తదంగా జమ చేయబడి వుంది. ఉత్తరం తెరిచాడు సుధాకర్." సుధా! ఏ తల్లి తండ్రులు అయినా తమ పిల్లలు బాగా చదువుకొని, వృద్ధి లోకి రావాలనే కోరుకుంటారు కదా! ఆ దేవుడి దయ వల్ల మన పిల్లలు బాగానే చదువుకొని, మంచిగా స్థిర పడ్డారు. రేవతి కి బంగారం లాంటి భర్త దొరికాడు. రవి గురించేరా నా బెంగ అంతా. వాడికి అమెరికా వెళ్ళి, అక్కడే స్థిర పడాలని వుంది. నాకు మాత్రం నా కొడుకును విదేశాలకు పంపడం అస్సలు ఇష్టం లేదు. కారణం చెప్పితే నువ్వు నవ్వుతావేమో! మొన్నీ మధ్యనే టీవీ లోనూ, పేపర్ లోనూ చూసాం , గుర్తుందా? దుండగులు అకారణంగా జరిపిన కాల్పుల్లో మన ఇండియన్ వాళ్ళూ వున్నారని. అందులో ఒకరు మనకి బాగా తెలిసిన వ్యక్తి అనీ. నా బంగారు తండ్రి రవిని అందుకే అక్కడికి పంపించడం నాకు ఇష్టం లేదు. నేను వున్నంత వరకు వాడు నా కళ్ళ ముందే వుండాలని నా ఆశ. వాడు ఇచ్చే ప్రతీ రూపాయి వాడి పేరునే బ్యాంక్ లో వేస్తున్నాను. చాలా పేజీలు ఖాళీగా ఉన్నాయి కదా? నామినీ వాడే కాబట్టి , బ్యాంక్ కు వెళ్ళితే అన్ని వివరాలూ తెలుస్తాయి. నువ్వే దగ్గిరుండి ఆ వ్యవహారం చూస్తావు కదూ? ఏమో, ఎప్పుడేమవుతుందో

ఎవరికి తెలుసు ? నువ్వు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలు కలిగి బాగుండాలి. నీ నుండి చాలా ఆశిస్తున్నాను కదూ?– నీ రాము. అని వున్న ఆఖరి వుత్తరం చదివి" రామూ" అని బావురుమన్నాడు సుధాకర్. రవీంద్ర కు తండ్రి ఆంతర్యం అర్థం అయింది. "స్వార్థపరులు " అని తాను అమ్మా నాన్న లను నిందించడం గుర్తుకు వచ్చి, పశ్చాత్తాపంతో కుమిలి కుమిలి ఏడ్చాడు.

" కొవ్వొత్తి కరిగి పోతూ , వెలుగులు పంచినట్లే , ప్రతీ తల్లీ తండ్రీ తమ బిడ్డల కోసం ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని, ఎన్నో త్యాగాలు చేసి, వారి సుఖాన్ని మాత్రమే కోరుకుంటారు. బదులుగా వారి ఆదరణ ను తప్ప మరేమీ ఆశించరు. ఇది నేను చాలా ఆలస్యంగా గుర్తించాను. అమ్మా, నాన్నా! మాకు మిమ్మల్ని సేవించే చిన్న అవకాశం కూడా ఇవ్వకుండా ఎలా వెళ్లిపోయారు?" అనుకొని ఆక్రోషించింది రవీంద్ర మనసు. రేవతి కూడా పొగిలి

పొగిలి ఏడ్చింది. ...........

బ్యాంక్ లో గత నెల వరకూ తను పంపించిన డబ్బంతా జమ చేసి వుండడం చూసి" నాన్న ఎంత అభిమాన ధనుడు!" అనుకొని, ఆయన ప్రేమను తలచుకొని మరోసారి దుఃఖించాడు రవీంద్ర. " అన్నయ్యా! నువ్వు మళ్ళీ అమెరికా వెళ్ళి తే నాన్న ఆత్మ శాంతించ దు. నాకూ పుట్టిల్లంటూ నువ్వు తప్ప ఎవరున్నారు? ఆ తర్వాత నీ ఇష్టం" అన్నది రేవతి. వరుణ్ కూడా " అవును రవీ, మా ఆఫీస్ లో నే వేకెన్సీలున్నాయి. నిన్ను కళ్ళకద్దుకొని మరీ తీసుకొంటారు. మంచి జీతం తో పాటు క్వార్టర్ కూడా ఇస్తారు. ఎలాగూ పల్లెలో ఇల్లు అద్దెకు ఇచ్చారు కదా! అలాగే ఈ ఇల్లు కూడా అద్దెకు ఇచ్చేసి , నువ్వూ బెంగుళూరు వచ్చెయి" అన్నాడు. సుధాకర్ కూడా

" అవును రవీ, అదే మంచిది. త్వరలో నువ్వూ ఒక ఇంటి వాడివైతే ఆ లోకంలో నుండి చూసైనా వాడు సంతోషిస్తాడు." అన్నాడు. " అలాగే, ఒకసారి వెళ్ళి అన్నీ సెటిల్ చేసుకొని వస్తాను. నాకు మాత్రం మీరు గాక ఇంకెవరున్నారు?" అన్నాడు రవీంద్ర. ఫోటో లో వున్న రామచంద్ర తృప్తి గా నవ్వినట్లు అనిపించింది అందరికీ.

ఇది నా స్వంత రచనే. దేనికీ అనువాదం గానీ, అనుకరణ గానీ కాదు.

కవిత

# అందుకే..



- హిమజ
హైదరాబాద్

మనల్ని బాధించే దాని గురించి
మాట్లాడటానికి
మనం ఇష్టపడం

మాటలు శ్వాసిస్తాయి
స్పర్శిస్తాయి
వేధిస్తాయి, శాసిస్తాయి కూడా

మాటలు మనసులోకి చొచ్చుకు పోతాయి
హృదయమంతా విచ్చుకుంటాయి
కల్లోల అంతరంగం మీద
పచ్చని పచ్చికలా పరచుకుంటాయి

కోనేట్లో విసిరిన ఆఠాణా బిళ్ళలా
మాటలు గిరికీలు కొడుతూ
వలయాలు సృష్టిస్తాయి
సుడిగుండాలై కలవరపెడతాయి

అందుకే
వేదనల్ని వాదనలని
అక్షరాల్లో అభివ్యక్తీ కరిస్తాం


చాలాసార్లు
అక్షరాలే మనకన్నా బాగా
బహిర్గతమవుతాయి

ఊహలు ఊర్లు తిరిగొస్తాయి
మాటలు వేర్లై అల్లుకుంటాయి

అందుకేనేమో
బాధించే విషయం మాట్లాడేందుకు
ఇష్టపడని మనం
ఒక పద్యపాదంలో
హృద్యంగా
వ్యక్తమయ్యేందుకు
రెండో పేజీ తిప్పుతాం !!

కథ

# మనోరథం



- వేలూరి ప్రమీల.

విశాఖపట్నం. 9492535415

తూర్పు సింహద్వారపు గంటలు, తెల్లవారకముందే లయబద్ధంగా చప్పుడు చేస్తూ, పక్షుల కిలకిలారావాలకు బాణీలు కడుతున్నాయి. భానుడి లేలేత కిరణాల నులివెచ్చని స్పర్శకు, పరదాలమాటున నిద్రిస్తున్న రాకుమారి చిత్రలేఖ... కలువరేకుల్లాంటి కనురెప్పల రెపరెపల నడుమ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. అరుణ వర్ణపు కాంతి, చెక్కిలిని ముద్దాడుతుండగా... తామర తూడుల్లాంటి అందమైన చేతివేళ్ళ నడుమనుండి, ఉదయిస్తున్న భానుణ్ణి దర్శించుకుని, మనసులోనే దణ్ణం పెట్టుకుంది చిత్రలేఖ.

కిటికీలకున్న పరదాలను పక్కకు జరిపి, ఉత్తరదిక్కున ఉన్న గుఱ్ఱపుశాలవైపు దృష్టిసారించింది. గుర్రాలకు కళ్ళేలను బిగించి, స్వారీకి నాడాలను సరిచేస్తున్న సిద్ధప్ప... రెండవ వరుసలోవున్న తెల్లని గుర్రాన్ని ప్రేమగా నిమురుతూ, తినడానికి గడ్డిపరకల్ని వేసాడు. గుర్రం తినకపోవడం చూసి, తన వెంట తెచ్చుకున్న నార సంచిలోనించి రెండు జొన్న కంకుల్ని తీసి గుర్రం నోటికి అందించాడు. ఎంతో ఇష్టంగా తినే జొన్న కంకుల్ని సైతం తినడానికి హితవు లేనట్టు, మొహం పక్కకు తిప్పుకుంది బృహతి.

పట్టుకుచ్చులాంటి పొడవైన తెల్లని తోకను, వెనక రెండు కాళ్ళ మధ్యా లోనికి లాక్కుని, తన అయిష్టతను వ్యక్తం చేస్తున్న బృహతి పృష్ఠభాగంపై చేతితో మెల్లగా తట్టి, మెడను ప్రేమగా స్పృశిస్తూ... తన తలను ఆ తెల్ల గుఱ్ఱానికి ఆనించి, నిట్టూర్చాడు సిద్ధప్ప. నల్లటి కాటుకనద్దినట్టున్న విశాలమైన కళ్ళలోంచి వర్షిస్తున్న కన్నీటి ధారలు, ఆ మూగజీవి మనసులోని బాధకు అద్దం పడుతున్నాయి.

"రాకుమారీ! ఈరోజు మాఘ పౌర్ణమి... కొలనినుంచి ఎర్రని తామరలు తెప్పించాను. అమ్మవారి అలంకారానికై తెల్ల చామంతి దండలూ, తులసి మాలలూ, పట్టు వస్త్రాలూ సిద్ధం చేసాను. విప్పపువ్వు, పట్టు తేనె సమర్పించి, చెంగాలమ్మ పరమేశ్వరి ఆశీర్వచనం తీసుకోమని నాన్నగారి కోరిక. గులాబీ రేకులూ, కస్తూరీ కలిపిన పన్నీటి జలము, స్నానానికి సిద్ధంగా ఉంది... పాలమీగడా, పసుపూ రాసుకుని, తొందరగా స్నానం ముగించిరండి" చందన గంధమద్దిన ఎర్రటి అంచున్న తెల్లని పట్టు చీర, రవికెను నెమలి తల్పంపై ఉంచుతూ చెప్పింది, చెలికత్తె జాహ్నవి.

అర్ధగంటలో అభ్యంగన స్నానం పూర్తిచేసి, సూర్యనాస్కారాలు చేసుకుని, పట్టువస్త్రాలు అలంకరించుకుని, రాచ మర్యాదలతో అమ్మవారి గుడికి బయలుదేరింది చిత్రలేఖ.

తాను ఎంతో ప్రేమగా చూసుకునే బృహతికి నుదుటన కుంకుమ అద్ది, చెవులకు బంగారుపోగులు తగిలించి, అమ్మవారికి సమర్పించే కానుకలను తీసుకుని, నూట ఎనిమిది గోక్షీర కలశాలతో అమ్మవారి అభిషేకానికై తరలివెళ్లింది రాకుమారి చిత్రలేఖ.

మాఘపౌర్ణమి రోజు రాత్రి రాకుమారి చిత్రలేఖ, వెన్నెల రాతిరిలో కోటకు దగ్గరలో ఉన్న కాళింది నది అందాలను, కోట గవాక్షం నుండి వీక్షిస్తూ పరవశంతో మైమరచిపోయింది.

నీరపు చుంబనమందుటకు, తారల గుంపును విడివడి, చీకటి ఒడిలో చేరిన చంద్రుడు... కాళిందీ నది నురగల ముత్యపు కాంతిలో తెల్లని పూలబంతివలె తేలియాడుచుండడం చూసి, ఆనందాశ్చర్యాలకు లోనయ్యింది. నింగి విడిచి, నీటిలోకి జారినట్టున్న ఆ నిజపూర్ణ బింబానికి భక్తితో నమస్కరించింది.

నది ఒడ్డున ఉన్న నిద్రగన్నేరు చెట్లపైకి చేరి, నిద్రిస్తున్న తెల్లని కొంగల గుంపులు... విరబూసిన చెట్లను తలపిస్తుంటే, నీటి అలలను తాకి ఆటలాడు పిల్లగాలి చల్లని స్పర్శకు, నిద్రలోకి

జారుకుంది చిత్రలేఖ.

★ ★ ★

"డాక్టరు గారూ! రెండు, మూడు సంవత్సరాలుగా మా అమ్మాయి మానసిక పరిస్థితి ఏమీ బాగాలేదు. తానేదో రాజవంశానికి చెందినదానిననీ, నదీ విహారానికి వెళ్ళినప్పుడు, సుడిగుండంలో పడవ చిక్కుకుని ప్రాణాలు కోల్పోబోతే, చెంగాలమ్మ అమ్మవారు తనని కాపాడిందనీ... ఏవేవో పొంతనలేని మాటలు మాట్లాడుతూ, నిద్రలో కలవరిస్తోంది. ఎంతోమంది వైద్యులకి చూపించాం. వ్యాధి నయం కాలేదు. చివరి ఆశగా మీ దగ్గరకి తీసుకువచ్చాం. మా అమ్మాయి మామూలు మనిషి అయ్యే మార్గం చూడండి డాక్టర్!" అంటూ డాక్టర్ దాయానంద్ కు చేతులు జోడించి వేడుకున్నారు... నిఖిత తల్లిదండ్రులు.

సరిగ్గా మూడు సంవత్సరాల క్రిందట, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఆరుగురు విద్యార్థినులు, చంద్రయాన్-2 రాకెట్ ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టినప్పుడు, చూడడానికి శ్రీహరికోట వెళ్లారు. ఇస్రో శాస్త్రవేత్తలు కొందరు, 'షార్' చైర్మన్ తో కలిసి, రాకెట్ లాంచింగ్ కు ముందు... సూళ్ళూరుపేటలోని చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి వెళ్ళి, అమ్మవారిని దర్శించుకుని, రాకెట్ నమూనాను అమ్మవారి ముందుంచి, ప్రత్యేక పూజలు చేయించారు.

ఆరోజు ఆలయ సందర్శనార్థం అక్కడికి కొందరు విద్యార్థులు కూడా వెళ్లారు. అందరూ చాలా ఆసక్తిగా ఆలయ చరిత్రను గురించి స్థానికులను అడిగి తెలుసుకుంటుంటే... నిఖిత మాత్రం ఆ ప్రదేశం తనకు ఎప్పట్నుంచో పరిచయం ఉన్నట్టుగా అక్కడ తిరగసాగింది.

ఆలయ ప్రాంగణంలోనే ఉన్న పచ్చనిచెట్టు వద్దకు వెళ్లి, అక్కడ ప్రతిష్ఠించిన నాగులకు నమస్కరించి, దగ్గరలోనే ఉన్న నది ఒడ్డున దేనికోసమో వెతకసాగింది. నది ఒడ్డునే కూర్చుని, అస్తమిస్తున్న సూర్యునివంక తదేకంగా చూడసాగింది నిఖిత. దూరంగా కనపడుతున్న కొండపై శిథిలావస్థలో ఉన్న కట్టడాన్ని చేరుకోబోయేంతలో... చీకటివేళ అటువైపు వెళ్లవద్దన్న స్థానికుల సూచనతో వెనుదిరిగింది.

అప్పటినుంచీ ఆమె గజిబిజి ఆలోచనలతో సతమతమవసాగింది. విశాఖపట్నం తిరిగి వచ్చాక, తానొక రాజకుమారిననీ, అరేబియా నుంచి వచ్చిన విదేశీ పర్యాటకుడు ఒకరు, తాను గుర్రపు స్వారీపై మక్కువ కలిగివుండడం గమనించి, తమ బృందం వెంట తెచ్చుకున్న గుర్రాలలో రెండు తెల్లటి గుర్రాలను తనకు బహుమతిగా ఇచ్చాడనీ చెబుతుండేది.

అయితే తాను ఎంతో ఇష్టంగా శిక్షణనిచ్చిన బృహతి, జగతి అనే ఆరెండు తెల్లని గుర్రాలలో... జగతి, మాఘ పౌర్ణమి రోజున నాగుపాము కరిచి చనిపోయిందని చెబుతుండేది. నిఖిత మానసిక పరిస్థితి చూసి గందరగోళ పడిన ఆమె తల్లిదండ్రులు, కనపడిన వైద్యునికల్లా ఆమెకున్న మానసిక వ్యాధి గురించి చెప్పి, వారిచ్చిన మందులు ఆమెకు వాడేవారు. చివరకు బంధువులూ, స్నేహితులూ ఆమెకు పిచ్చి పట్టిందనీ, ఏదో ఆత్మ ఆవహించిందనీ... రకరకాలుగా చెప్పుకునేవారు.

వారు చెప్పినదంతా విన్నాక, నిఖితతో విడిగా మాట్లాడి, ఆమెలో అలజడికి కారణమవుతున్న విషయాలు గురించిన వివరాలు రాబట్టే ప్రయత్నం చేసాడు డాక్టర్ దాయానంద్.

బ్రెయిన్ కి అవసరమైన స్కానింగ్ లు తీసి, ఆమె మానసిక పరిస్థితిలో మార్పేమీ లేదనీ, నార్మల్ గానే ఉందనీ నిర్ధారించుకున్నాక... ఆమె చెబుతున్న మాటల్లో వాస్తవం ఎంతుందో తెలుసుకునే దిశగా ప్రయత్నం చెయ్యమని ఆమె తల్లిదండ్రులకి డాక్టర్ దాయానంద్. అతని సలహా మేరకు నిఖితని తీసుకుని, సూళ్లూరుపేటకు బయలుదేరారు.

★ ★ ★

సూళ్లూరుపేట చేరుకోగానే నిఖిత ముఖంలో ఏదో తెలియని ఆనందం. అక్కడి ప్రదేశాలన్నీ ఎప్పటినుంచో అలవాటు ఉన్నదానిలా తిరగసాగింది. చెంగాలమ్మ పరమేశ్వరి ఆలయానికి చేరుకొని, అమ్మవారిని దర్శనం చేసుకుంది. ఆలయ ప్రాంగణంలోనే ఉన్న చెంగాలమ్మ చెట్టు దగ్గరకు వెళ్లి, భక్తితో మూడు ప్రదక్షిణాలు చేసి, చెట్టు మొదట్లో ప్రతిష్ఠించబడిన పంచ నాగుల విగ్రహాలకు పసుపు, కుంకుమతో పూజలు చేసి, పాలతో అభిషేకం చేసింది.

దూరంగా కనిపిస్తున్న కొండమీద శిథిలావస్థలో ఉన్న కట్టడం దగ్గరకి తనను తీసుకువెళ్ళమని కోరడంతో... అందరూ అక్కడికి చేరుకున్నారు.

ఎప్పటిదో, ఆరు శతాబ్దాల క్రిందటి కోట... చోళ రాజులు శుభగిరి అనే ఆ ప్రాంతాన్ని ఏలిననాటి జ్ఞాపకాలను, నిఖిత పూస గుచ్చినట్టు చెబుతుంటే అందరూ విస్తుపోయి చూసారు. తానొక రాజ కుమార్తెననీ, తన పేరు చిత్రలేఖ అనీ, ఆరు వందల సంవత్సరాలకు ముందు మరణించిన తాను... మరలా ఈ జన్మలో నిఖితగా పుట్టాననీ చెబుతున్న ఆమె మాటల్లో వాస్తవం ఎంతుందో తెలుసుకునే ప్రయత్నం చేశారు.

కోటకు ఉత్తరాన ఉన్న గుఱ్ఱపుశాల ఆనవాళ్లు, రాజ గురువులు శిక్షణనిచ్చిన విద్యాలయం, భోజనశాల, తూర్పు దిక్కున ఉన్న కాళిందీ నది ఒడ్డున 'జగతి' సమాధి ఉన్న ప్రాంతం... అన్నీ ఒక్కొక్కటిగా చూపించసాగింది. అమ్మవారి బ్రహ్మోత్సవాల సమయంలో బృహతి, జగతి అనీ ఆ రెండు శ్వేతాశ్వాలపై చెంగాలమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తుల్ని శుభగిరిలో ఊరేగించేవారమనీ, ఉత్సవానికి ముందు రెండు గుర్రాలకు బంగారు నాడాలు తొడిగి, పూజించేవారమనీ తెలిపింది. అంతేకాదు కాళిందీ నది ఒడ్డున జగతి అనే ఆ గుర్రాన్ని ఉంచిన సమాధిలో, బంగారు నాడాలు, బంగారు చెవిపోగులతో పాటు అరేబియన్ పర్యాటకుడు ఇచ్చిన లెదరు జీను, దానికి అలంకరించి ఉన్న వెండి గొలుసులు కూడా సమాధిలో ఉంచాననీ చెప్పింది.

అయితే ఒకప్పుడు చోళరాజులు శుభగిరి అనే ఆ ప్రాంతాన్ని పాలించినప్పటికీ, కాల క్రమంలో ఆ నగరం మట్టిలో కూరుకుపోయి... అక్కడి కట్టడాలు సైతం ఆనవాలు పట్టలేనంత శిథిలావస్థకు చేరుకున్నాయి.

చరిత్ర విశ్లేషకుల సమాచారం ప్రకారం నిఖిత చెప్పినదంతా నిజమేనని తేలింది. దాంతో... కాళిందీ నది ఒడ్డున ఆమె చూపించిన ఆ సమాధి ఉన్న ప్రాంతాన్ని తవ్వి చూసారు. అందులో ఆమె చెప్పినట్టుగానే బంగారు నాడాలు, చెవి పోగులు, వెండి గొలుసులు ఉండడం చూసి అక్కడున్న వారందరూ విస్తుపోయారు. నిఖితకు ఎటువంటి మానసిక వ్యాధీ లేదనీ... కేవలం పూర్వజన్మ జ్ఞానం కలగడం వల్లనే, ఆమెకు ఇలాంటి గజిబిజి పరిస్థితి ఏర్పడిందనిదనీ... పూర్వజన్మ స్మృతులతో తమ బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతోనే ఉందనీ తెలిసి, ఆమె తల్లిదండ్రులు చాలా సంతోషించారు.

సమాప్తం

కవిత

# నేను



- వకుళవాసు, హన్మకొండ
9989198333

ఎవరికీ అర్థంకాని భావగీతాలాపాన్ని...
కవితా కాన్వాసుపై నర్తించె కావ్య శిల్పాన్ని...
ఒక్కోసారి నాకే అంతుపట్టని అగాధ సంద్రాన్ని...
నీ హృదిలో కమ్మిన చీకట్లను పారద్రోలే వెన్నెల కిరణాన్ని...
స్వచ్ఛ స్నేహాన్ని కాంక్షించే పరిమళ పారిజాతాన్ని...
వడ్లిన మోమును పూయించే చల్లని వర్షాన్ని...
నీ కనుదోయికి అపురూపంగా కనిపించే మంచుబొమ్మని...
కాలపు వాకిలిలో ప్రేమ వెన్నెల కురిపించే చుక్కల ముగ్గుని...
అనురాగాల తోరణాలను కట్టి అనుబంధాలను పెనవేయ....
తరాలకు వారధినై పుట్టిన "అమ్మ"ని....

కవిత

# అంతరాలు



ఆసూరి ఉషారాణి
తిరుపతి, 9441646016

తరం తరం నిరంతరం ఈ అంతరాలెందుకు ?
కన్నీటి, కథలతో, వ్యధలతో మా జీవితమింతేనా ?
అత్తల ఆరళ్ళకు, ఆడబిడ్డల అడి ఆశలకు
పరి సమాప్తం చెప్పలేని మా బ్రతుకు లింతేనా?
ఆడపిల్లే వద్దంటూ కడుపులోనే చిదిమేస్తే
మగశాతం పెరిగితే మా మనుగడలింతేనా?
నా బిడ్డ జన్మ కోసం నవ మాసాలు నే మోస్తే
నా ముదుసలి వయసులో నాకు వెలివేతేనా?
మగ వారితో పోటి పడితే మేమే విజేతలం
అది జీర్ణించుకోలేని మగవారి అలసత్వం
పర్వతారోహణ, వాయు, వైమానిక, సైనిక
మేము లేని, చూడని రంగం ఏది లేదు
ఇంతుల జీవితంలో నవవసంతం విరియాలి
ఇది ఆలోచిస్తే ప్రతి పడతి అవుతుంది రాణి

వ్యాసం

# సంతృప్తి



- డా. శ్రీభాష్యం అనూరాధ
హైదరాబాద్, 8790325502

లక్ష్యాన్ని సాధించినపుడు కలిగే తృప్తి అనుభవైకవేద్యం....

దీనికి సంబంధించిన ఒక సంఘటన ...

గురుకుల విద్యాలయసంస్థలో ఓ పాఠశాల ....ఆపాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది 'సరిత'.

సరిత చూడడానికి అమాయకంగా కనిపిస్తుంది. కానీ కళ్ళలో మాత్రం ఏదో మెరుపు...

ఓ రోజు యధావిధిగా తరగతులు కొనసాగుతున్నాయి.సరిత క్లాస్ లో ఫిజిక్స్ పాఠ్యభోధన సాగుతున్నది.ఫిజిక్స్ ఉపాధ్యాయిని పరిశోధనల గురించి,అవిచేసిన శాస్త్రవేత్తలు, ప్రయోగాల విజయాలను వివరించింది.సరిత ఏదో ఆలోచనలో పడిపోయింది. ఫిజిక్స్ క్లాస్ అయిపోయిందన్న సంకేతంగా బెల్ కొట్టారు. తర్వాత తరగతి 'తెలుగు'.ఉపాధ్యాయిని వచ్చింది.విద్యార్థులంతా లేచి నమస్కరించారు.ప్రేమతో వారిని పలకరిస్తూ,అన్యమనస్కురాలైన సరితను చూసింది టీచర్."ఏమి ఆలోచిస్తున్నావ్ సరితా?" అంది. తడుముకోకుండా సరిత"మేడం నేను శాస్త్రవేత్తను కావాలంటే ఏమి చేయాలి?"అంది.అందరూ ఘొల్లున నవ్వారు.విద్యార్థులందరిని వారించి,నెమ్మది పరిచింది.ఆతర్వాత "పట్టుదల ఉంటే కాగలదు మరొ[బ్రహ్మ"అనే కథను(కలాం)వినిపించింది ఉపాధ్యాయిని.అది సరిత శ్రద్ధతో విన్నది.....

అలా కొన్ని రోజులు గడిచాయి.. ఉపాధ్యాయిని మరోచోటికి బదలీపై వెళ్ళింది.

దాదాపు15సం. తర్వాత ఓ రోజు ఉపాధ్యాయినికి ఫోన్ మోగింది."ఈ విదేశపు కాల్ ఎవరిదా.."అంటూ ఫోన్ ఎత్తింది. అటువైపు నుండి గద్గద స్వరంతో.."మేడం..ఎన్ని రోజులు నుండి మీకోసం,మీ ఫోన్ నంబర్ కోసం ఎదురు చూసాను.ఇన్నాళ్లకు దొరికింది.మీరిచ్చిన స్ఫూర్తితో ,నేను కోరుకున్నట్లు పరిశోధన విభాగంలో పనిచేస్తున్నాను.భవిష్యత్తులో శాస్త్రవేత్తను అవుతాను మేడం.."అని చెప్పింది సరిత. ఉపాధ్యాయిని కళ్ళలో నీళ్లు తిరిగాయి. ఇద్దరు తృప్తిగా మాట్లాడు కున్నారు.ఆ మాటల్లో తాను న్యూజెర్సీ(US) లో(Anneal Pharmaceutical ) Analytical సైటిస్ట్ గా పనిచేస్తున్నానని తెలిపింది..యోగక్షేమాలు తెలుసుకున్నారు.

సరిత మాటల్లో తొణికిసలాడిన ఆత్మవిశ్వాసం సంతృప్తితో గడుపుతున్న జీవితం, ఆప్యాయతలు గమనించిన ఆ ఉపాధ్యాయిని ఆనందపడింది."తాను వేసిన మొక్క నీడనిచ్చెనంతగా ఎదిగి,ఆదర్శంగా నిలిచినందుకు..ఆనందించింది.

సంతృప్తి..అనే విలువ అమూల్యమైనది.అది స్వీయకృతి.

"విజయం ఫుల్ స్టాప్ కాదు.ప్రయాణం"అన్న కలామ్ మాటలు గుర్తొచ్చాయి.ఈ ఆనందం స్ఫూర్తిగా తీసుకొని,జీవితాన్ని విజయబాటలో నడచి,మరో ఐన్ స్టీన్,కలాం కావాలని కోరుకుంది ఉపాధ్యాయిని...

కథ

# "సీమంతం"

- లంక సీత, న్యూ ఢిల్లీ

9868145541



పుండరీకాక్షయ్య గారింట్లో  పేరంటాల సందడి.

ఏమిటిటా విశేషము?

వాళ్ళ కోడలికి సీమంతమట. వియ్యాల వారు చాలా గొప్పవారు. ఇన్నోవా నిండా ఫలహారాలు, మిఠాయిలు, అరటి గెలలు, ఇంటిల్లిపాదికి పట్టు బట్టలు అబ్బో ఇంకా ఎన్నో! పక్కింటావిడతో కబుర్లు. ఊరందరిని పేరంటానికి పిలిచారు. పిలిచినప్పుడు వెళ్ళక పోతే బాగుండదు మరి . మనమేమో వాళ్ళ తాహతుకు తగక రాలేదనుకుంటారు. గొప్పింటి వాళ్ళ ఇంట్లో సీమంతం ఎలా ఉంటుందో చుడాలిగా మరి ! ఓ సారి వెడితేనే సరి.

పేరంటాళ్ళ సందడి హాలులో మారు మ్రోగుతోంది. సావిత్రమ్మ అందరిని సాదరంగా పలకరించి ఆహ్వానిస్తోంది. వచ్చిన వారంతా ఒకరినొకరు పల్కరించుకుంటూ కబుర్లాడుకుంటున్నారు. ఇంతలో "ఏం వొదినా ఎన్నాళ్ళయింది నిన్ను చూసి మరీ నల్లపూసవైపోయావు" అంటూ సుశీలమ్మ పలకరింపు మీనాక్షమ్మని.

"ఏం చెప్పమంటావు మీ అన్నయ్య పని తోనే సరిపోతుంది రోజంతా . పొద్దున్న లేచిన దగ్గరనుంచి ఎవరో ఒకరు రావడము. మా అమ్మాయికి పెళ్లి ముహూర్తము చూడండి అనో అన్నప్రాసన ముహూర్తము చూడండి అనో వొడుగుకి మంచి ముహుర్తాలు ఉన్నాయా అనో ఒకరి తరువాత ఒకరు రావడము ఈయన గారు తననే గదా అడుగుతున్నారు అని వొళ్ళు మర్చిపోయి అదే పనిలో మునిగి పోయి ఏ ఝామ్ముకీ భోజనానికి రాక అపరాహ్ణము దాటిపోవడము నిత్యం జరిగే బాగోతమే."

"సరే భోజనాలయి ఇలా నడుం వాల్చానో లేదో" "ఏమోయ్ మబ్బు పట్టి వర్షం వచ్చేలా వుంది దొడ్లో బట్టలు తీయి అంటూ ఒకటే నస. ఎలాగూ లేచావుగా కాఫీ తో పాటు వేడిగా కొంచెం పకోడీలు చెయ్యి అంటూ సన్నాయి నొక్కులు" ఇంకా నాకు తీరికెక్కడ పెత్తనాలకి.

"వీళ్ళ వియ్యాలరు బాగా వున్నవాళ్ళటగా అంది గుసగుసగా కాంతమ్మ" అవును మరి అబ్బాయి పెద్ద చదువులు చదివి ఫారిన్ లో  ఉద్యోగము, ఒక్కడే పిల్లాడు అందుకే ఏరి కోరి వీళ్ళ సంబంధము చేసుకున్నారట అని మరొకరు. పెళ్ళిలో అమ్మాయికి బంగారము ఘనంగానే పెట్టారుట. వియ్యపురాలికి కూడా బంగారపు గొలుసు, పట్టు చీర పెట్టారుట. ఇంతలో సావిత్రమ్మ అటుగా రావడము తో మాటలు ఆపేసారు.

సావిత్రమ్మ మాత్రం తక్కువదా ! తమ వియ్యాలారి గొప్పదనము తమ హోదా చూపించుకోవాలిగా మరి ! అందుకే ఊర్లో తెలిసిన వారందరిని  కోడలు సీమంతానికి పిలిచింది. ఎంతయినా ఆ ఊర్లో  పేరుమోసిన కుటుంబమాయె మరి ఆ మాత్రం చెయ్యకపోతే ఎలా ?

అమ్మాయ్ నేను చెప్పినవన్నీ ఏర్పాటు చేసావా? అంటూ పురోహితుల వారు ప్రవేశించారు. వస్తూనే మూడు ఇరవై కె ముహూర్తం అన్నారు.

ఆ ఆ అన్ని రెడీ గా వున్నాయ్ పంతులుగారు అంది సావిత్రమ్మ. వియ్యపురాలు తెచ్చిన వన్నీ  పళ్లేల నిండా పెట్టి, పళ్ళు, పూలు, గాజులు వగైరా సిద్ధం చేసింది. సావిత్రమ్మ మరొక పక్క తమ తరఫునుంచి పంచదార చిలుకలు, చందనం బొమ్మలు, ముత్తైదువులకు ఇచ్చే తాంబూలాలు , రవికల బట్టలు తయారుగా  పెట్టింది.

వచ్చిన వారంతా ఒక్క సారిగా నిశబ్దమయిపోయి మాటలు ఆపేసారు. వీడియొ గ్రాఫరు, కెమెరా వాళ్ళు కూడా ప్రవేశించారు. ఇంకా ముహూర్తంకి పది నిమిషాలు టైముంది వుంది. అమ్మాయిని  బ్యూటీ పార్లర్ అమ్మాయి తయారు చేస్తోంది. పంతులు గారు అమ్మాయిని తీసుకు రండి అని తొందర పెడుతున్నారు. వచ్చేస్తున్నాం అంటూ లోపలినుంచి జవాబు. ముహూర్తము దాటి పోకూడదు. త్వరగా రావాలి అని పంతులు గారు ఒకటే తొందర చేస్తున్నారు. అక్కడ అమ్మాయి ముస్తాబు పూర్తి అవలేదు. ముహూర్తము దాటిపోతుందని అందరికి ఆత్రుత.  పంతులుగారు గట్టిగా అరిచారు...... కోపంగా  ముహూర్తబలం మీకు తెలియడం లేదు అని

విసుక్కుంటున్నారు. వెంటనే సావిత్రమ్మ గబ గబా లోపలి వెళ్లి సగం మేకప్ తో వున్న కోడలిని తీసుకు వచ్చేసింది. అమ్మాయిని చూసి పేరంటాళ్ళందరూ ఒకటే ముసి ముసి నవ్వులు. అమ్మాయికేమో చాలా సిగ్గుగా వుంది. వీడియో, ఫోటో వాళ్లకి తీయొద్దని చెప్పేసింది.

మరి ఈ కాలంలో ముహుర్తానికంటే వీడియోలకు, ఫొటోలకే ఎక్కువగా ఎక్కువ ప్రాధాన్యత ఉంటోందిగదా ! ముహుర్తాలు దాటిపోయే ఫంక్షన్లు అనేకం చూస్తున్నాము. పూర్వకాలం లో ముహూర్త బలం అని ఒక్క సెకను గూడా అటు ఇటు కానివ్వకుండా జరిపేవారు.

ముత్తైదువులందరు గాజులు తొడగడానికి, పూలు పళ్ళు పెట్టడానికి ముందుకు వస్తుంటే పంతులు గారు "మీరంతా వుండడమ్మా! అవన్నీ తరువాత చేద్దురు ముహూర్తము దాటి పోకుండా ముందు పిల్ల తల్లి పిల్ల వొళ్ళో చలిమిడి, పూలు, పళ్ళు పెట్టాలి" అని మంత్రం మొదలు పెట్టారు. ముహూర్తము పూర్తి అయిన తరువాత వేడుకలు ఎన్నయినా చేసుకోవచ్చు అన్నారు. ఓహో ఇది పెద్దింటి పద్దతి గాబోలు అని వెనక్కి తగ్గారు అందరు.

రుస రుసలాడుతూ మొహం ముడుచుకుని కూర్చుంది. కూతురు మొహం చూసి 'ఇంకేం హంగామా చేస్తుందో అని భయపడి తల్లి తబడుతూ ముందుది వెనక వెనకది ముందు గా పిల్ల వొళ్ళో ముందుగా చీర పెట్టబోతుంటే "పంతులుగారు అమ్మా ముందు చలిమిడి, పళ్ళు, పూలు పెట్టాలి ఆ తరువాత చీర పెట్టాలి" అన్నారు. అప్పుడు పంతులుగారు చెప్పినట్లే అన్ని పెట్టింది. తరువాత అత్తగారు కూడా పెట్టడము పూర్తి అయి ముహూర్తము టైముకే కార్యక్రమము అయిందనిపించారు.

"ఇంకొంచెము ఉంటే ముహూర్తము దాటిపోయేదే" అన్నారు పంతులు గారు. అమ్మయ్య అని అమ్మలక్కలందరు ఊపిరి పీల్చుకున్నారు.

ఫార్మాలిటీ పూర్తి అవుతూనే అమ్మాయి టక్కున లేచి మేకప్ పూర్తి చేసుకోవడానికి లోపలి కి వెళ్ళిపోయింది. మేకప్ పూర్తి అయి ముప్పావు గంట తరువాత అమ్మాయి వచ్చింది. ఇక మళ్ళీ వీడియో, ఫోటోల రీటేక్ కార్యక్రమము మొదలయి ఇంకో ముప్పావుగంట నడిచింది. వచ్చిన వారంతా వెళ్లాలనే తొందరలో వున్నారు.

తరువాత ముత్తయిదువులందరు ఒక్కొక్కరుగా అమ్మాయి చెప్పినట్లే అంటి అంటనట్టుగా బొట్టుపెట్టి, గాజులు తొడిగి దీవించారు. కార్యక్రమమంతా పూర్తయ్యేసరికి ఇంకో గంట పట్టింది.

మూడుగంటలకే ముహూర్తము అన్నారని హడావిడిగా రెండుగంటలకే బయలుదేరి వచ్చారాయె మరి. అప్పుడే ఆరయిపోయింది. అందరికి వెళ్లాలనే తొందర. అందరు సావిత్రమ్మ గారు ఇచ్చిన పసుపు కుంకుమ, తాంబూలము తీసుకుని నెమ్మదిగా నిష్క్రమించారు. ఇల్లు గాలివాన వచ్చి వెలిసినట్లు నిశబ్దముగా అయింది.

ఎంతయినా ఆడంగులు కదా మరి పోస్ట్ సీమంతం కబుర్లు చెప్పుకోకుండా వెళ్ళలేరు. బయటకు వస్తూనే జంటలు జంటలుగా గుసగుసలు మొదల్లయ్యాయి.. "ఇదేమి విచిత్రమమ్మా సీమంతము అంటే ముత్తైదువులంతా కడుపు చలవ కోసం బొట్టు పెట్టి ,పూలు పెట్టి, పళ్ళు చేతిలో పెట్టి ఆశీర్వదిస్తారు. అటువంటిది ఆ పిల్ల పూలు పెట్టించుకోలేదు సరిగదా బొట్టు గూడా వొద్దంది. మేకప్ పాడయిపోతుందిట." అని ఒకావిడ అంటే మరొకావిడ "అంతే కాదు రేపు వాళ్ళ అబ్బాయి వచ్చాక మళ్ళీ అన్నీ చేస్తున్నట్లు వీడియో తీస్తారుట వాళ్ళ ఫ్రెండ్స్ కి చూపించడానికి ". "ఓహో ఇవన్నీ డబ్బున్న వాళ్ళ పద్ధతులు కాబోలు" అని మరొకావిడ. ఇళ్ళకి వెళ్లాలని తొందర పడినవాళ్లు వీధి చివర నుంచుని కబుర్లాడుతున్నారు. "

"అంతేలే మరి మనరోజులేమిటి పెద్దవాళ్ళు ఎలా చెబితే అలా నడుచుకోవడానికి. ఈ కాలం ఆడ పిల్లలు చదువుకుని మగవాళ్ళతో సమానంగా ఉద్యోగాలు వెలగబెడుతున్నారాయె! డబ్బు సంపాదన వున్నప్పుడు నోరెత్త లేరు మరి అని మరొకావిడ సన్నాయి నొక్కులు." "వియ్యాల వారు రేపే పిల్లని తీసుకు వెడతారు అంది సావిత్రమ్మ మరి రేపు ఈ వీడియో తతంగము ఎలా చేస్తారుట? ఆ దానిదేముందిలే వియ్యాల వారు ఇంకో రోజు వుండే వెడతారు." అంది మరొకావిడ. ఇవీ పేరంటాళ్ళ కబుర్లు.

మొత్తాన్ని పుండరీకాక్షయ్య గారి కోడలు సీమంతము వూళ్ళో ఒక పెద్ద చర్చనీయాంశము అయిపోయింది.

మొదటి కానుపు ఏడవ నెలలోనే తీసుకు వెడదామని వియ్యపురాలు, వియ్యంకుడు వచ్చారు. మరునాడే ప్రయాణము. సావిత్రమ్మ, పుండరీకాక్షయ్య గారు వియ్యంకుడికి, వియ్యపురాలికి ఘనంగా బట్టలు పెట్టి , బహుమతులు ఇచ్చి పంపించారు.

వియ్యాల వారిని సాగనంపాక సావిత్రమ్మ రాబోయే మనవడి గురించి కలలు కనడం మొదలెట్టింది. పైకి ఎంత మోడరన్ కాలంలో ఉంటున్నాఆడవారి మనసుల్లో జీర్ణించుకు

పోయిన పాత పద్ధతులు, పాత ఆలోచనలు ఎక్కడికి పోతాయి ! అందుకే సావిత్రమ్మ గారి ఆలోచనలు వంశోద్ధారకుడు మగపిల్లవాడే పుట్టాలని తాను అందుకు తగ్గట్టు ఆర్భాటం గా అన్నిముచ్చట్లు జరపాలని కలలు కనడం మొదలెట్టింది.

మనవడు పుడితే తమ గొప్పతనము, ఆడంబరాలు చూపించుకుందామని తెగ ఉబలాట పడిపోతోంది. వంశోధారకుడు మనవడు వచ్చాక కోడలి సీమంతం కంటే గొప్పగా మనవడిని ఉయ్యాలలో వేయడము, మూడో నెలలో ముద్దలు పంచిపెట్టడము, పాకుతే పాయసము పంచిపెట్టడము వగైరా వగైరా లు ఊహించుకుని మురిసిపోతోంది.

అంతే మూడు నెలలు యిట్టె గడిచి పోయాయి. ఒకనాడు వియ్యంకులు వారి వద్దనుంచి ఫోను. " మీ కోడలికి ఈ రోజు డెలివరీ అయింది ఆడపిల్ల పుట్టింది. తల్లి, పిల్ల క్షేమం గా వున్నారు" అని. అది విని మగపిల్లాడు పుడతాడు అచ్చట్లు ముచ్చట్లు తీర్చుకుందాము అనుకున్న సావిత్రమ్మ ఒక్క సారిగా నీళ్లు కారిపోయింది. ఆవిడ ఉత్సాహమంతా పొంగిన పాలమీద నీళ్లు చల్లినట్లు చప్పబడిపోయింది.

సావిత్రమ్మ కూడా ఆడదయి ఉండి ఆడపిల్ల అనగానే నిరుత్సహ పడిపోవడము ఎంతవరకు సబబు ? ఈ కాలంలో గూడా ఆడ మొగా అంటూ వివక్షత చూపడము ఆశ్చర్యం అనిపించడం లేదూ ?

కవిత

# సంకెళ్ళు




**సౌజన్య వేముల**
**హన్మకొండ**


అమ్మా !
చిన్న పాపగా ఉన్నప్పుడు/నాకు ఎక్కడ దిష్టి తగులుతుందో
అని కాటుకతో పెద్ద బొట్టు/గుండ్రంగా పెట్టావు.

కాస్త పెరిగి పెద్దయ్యాక/రంగురంగుల తిలకంతో
డిజైన్ బొట్లతో సింగారించావు.

పరికిణి వేసే సమయంలో/మిరమిట్లు గొలిపించే
తీరొక్క బొట్టు బిల్లలు పెట్టి/మురిసిపోయావు.

నాన్న !
పెళ్లికూతురుని చేసి/కళ్యాణ తిలకం దిద్ది
అతనే నీ తోడు అంటూ/అత్తారింటికి సాగనంపావు.

పాపిట్లో సింధూరం ధరించి/నుదుట కుంకుమను ధరించి
చేతినిండా గాజులు వేసుకుని/నిత్య సుమంగళిలా నిలుస్తిని

కానీ.......
విధి వక్రీకరించి, కాలం కలిసి రాక/వివాహ బంధంతో తోడైన మనిషి
కనుమరుగై, తిరిగిరాని లోకానికి వెలితే/అది నా తప్పా.... ???

పుట్టుకతో పెరుగుదలతో వచ్చిన/బొట్టు, పువ్వులు, గాజులు
వితంతువు అనే దుర్మార్గపు పేరుతో/నాకెందుకు దూరం కావాలి ఓ
సమాజమా ??

ఓహో.....!
బొట్టు పువ్వులు గాజులతో/నేను పరపురుషునికి
అందంగా కనిపిస్తానని/ఇవన్నీ నాకు దూరం చేసారా...!

కానీ నా అమ్మ నాన్న ! /నాకు తెలుసు
ఇది మీకు ఇష్టమైన విధానం కాదు అనీ

ఓ స్త్రీ !
నీవు ఇలా – ఎవరికో అందంగా కనిపిస్తావని
ఎవరికో ఆశలు పుట్టిస్తావని/వితంతు అనే మూఢచారాన్ని
అంటగట్టి చీకట్లోకి నెట్టివేయడం/న్యాయమా ఈ సమాజానికి... ???

కానీ ఓ మహిళా ! / సరిగ్గా తెలుసుకో ! !
ఆ ఆభరణాలే అందానికి ప్రేరకాలైతే
మగవాడికి బానిసలా ఆకర్షించేవైతే
ఆ సంకెళ్ళే సమాజానికి కొలబద్దలైతే
అవి ఏవి లేని ఏ అనవసర ఆచ్ఛాధన లేని
స్వచ్ఛమైనా వ్యక్తిలా నువ్వుండు
తుచ్ఛమైన గుంపు తొలగిపోయి
నిన్ను నీలా వెచ్చగా స్వీకరించే
అచ్ఛమైన మనిషొకడు కదిలి వస్తాడు
నీకు అమ్మ నాన్న సమాజం అన్నీ అవుతాడు.

కథ

# ప్రస్థానం



- సిస్టర్ అనసూయ
నల్గొండ, 8074573716

అప్పుడే తన డ్యూటీని ముగించుకొని పాలు తాగ గూట్లోకి చేరుటకు సిద్ధంగా ఉన్నాడు సూర్యుడు.

అతడు ఇంటికి చేరగానే, అడవిలోని పశువులు, పశువుల కాపరులు, అడవి జంతువులు, పక్షులు తమ తమ ఇండ్లలోకి చేరుతున్నయి.

వ్యవసాయ కూలీలు, ఉద్యోగం చేసేవారు అందరూ ఇంటికి వెళ్తున్నరు.

అదే గ్రామానికి చెందిన నిర్మల అనే స్త్రీ అడవిలో ఓ వేప చెట్టు కింద మాసిపోయిన బట్టలతో ఒక్కతే ఒంటరిగ కూర్చొని ఉంది. ఆమె ఎంతో విచారముతో కృంగిపోయిన హృదయముతో బాధపడుతూ ఉంది.

పశువులను మేపుకుంటూ నిర్మల కూర్చున్న వేప చెట్టు దగ్గరకు వస్తూ, ఎవరిమె ఒక్కతే కూర్చొని ఉంది. అచ్చం నిర్మల వలె ఉంది అని తన మనసులో అనుకుంటూ వచ్చి, "ఏందే నిర్మల పొద్దుగింతలప్పుడు ఇక్కడ కూర్చున్నవు? నీ భర్త ఏమన్నా కొట్టిండా ఏంది?" అని అడిగింది శ్వేత.

"ఏం లేదు అక్క" అంది నిర్మల.

" అయితే ఇంటికి పోదాం లే చెల్లా" అంటూ చేయి బట్టి లేపింది శ్వేత.

"నేను రాను అక్క. నువ్వు వెళ్ళిపో అక్క" అన్నది నిర్మల.

"అవును చెల్లా నిన్న రాత్రి మీ ఇంట్లో ఒకటే అరుపులు కేకలు వినబడుతున్నవి . మీ అత్త నోరుకు భయపడి రాలేదురా ఏమైంది చెల్లె" అన్నది శ్వేత.

"ఏం చెప్పమంటవు అక్క నా బాధ, దేవుడు తొందరగా తీసుకపోతే" బాగుండు అంటు ఏడ్చింది నిర్మల. "నీకేమైంది రా ఇంత చిన్న వయసులో చావు గీవు అంటున్నావ్ పైన తధాస్తు దేవతలు ఉంటారంట అట్లా అనబాకు చెల్లె చిన్నప్పుడు మా అమ్మమ్మ అంటుంటే విన్నాను." శ్వేత

"ఉండని అక్క బతికిన దాంట్లో ఏం సుఖం లేదు" అని అంటుండగానే మేకలను మేపుకుంటూ మల్లమ్మ కూడా అక్కడికి వచ్చింది.

వెంటనే శ్వేత "ఏంది మల్లక్క ఇయ్యాల నువచ్చినవ్, మా మర్ది ఎక్కడికి పోయిండు?"

"మా కోడల్ని దావకానకు తీసుకొని పోయిండు."

"ఎందుకు అక్క ఏమైంది?"

"ఏం కాలే రా నెల తప్పింది. అన్నం పడతలేదు."

"ఓ అవునా."

"మా చిన్నోడ్ని జర పోరా మేకల కాడికి అంటే నాకు పరీక్షలు ఉన్నవి నేను పోలేనన్నడు. ఇక నాకు తప్పదని మోకాలు నొప్పులు ఉన్న కూడా వచ్చిన. గాని ఇవేమో కోతి కులమాయే ఎక్కడ పచ్చగ చెట్లు కనిపిస్తే చాలు పరిగెత్తుకుని పోతయి. ఒక్క దగ్గర మేసేవి కావాయే గొర్ల లెక్క" అంటూ నిర్మలను చూసి "నీవెందుకొచ్చినవ్ కోడలా పశువుల కొన్నర" అని అడిగింది మల్లమ్మ.

నిర్మల తలకిందుకేసి ఈమె ఎందుకు వచ్చింది దేవుడా లేనిపోని మాటలు మా ఆయనకు చెప్పగళ్ళ అని మనసులో అనుకుంది.

"దానికి పుట్టెడు బాధలు ఉన్నవి మల్లక్క! ఇంటిల్లుపాది నల్లిని పొడిచినట్లు పొడుస్తున్నరు అంటూ

సరే చెల్లా అందరూ ఇంటికి వెళ్తున్నరు పోదాం రా" అని మరల చేయి బట్టి లేపింది శ్వేత.

నా జీవితాన్ని ఈరోజుతో ముగించుకోవాలని నేను అనుకుంటే సరుక్కునా వీరి కంట బడితిని. ఈ అక్కేమో వదులుతలేదు. ఏంది దేవుడా! నా బ్రతుకుతో ఆడుకుంటున్నావ్

అని మనసులో అనుకుంది నిర్మల.

"ఇంగా లే నిర్మల పొద్దుగూకింది అందరూ ఇల్లు చేరినాలే, మీ బావ పరీశాన్ అయితడు అని చేయబట్టి లేపింది శ్వేత.

వెంటనే మల్లమ్మ "లే బిడ్డ మన ఆడోళ్లకు ఎప్పుడు ఈ బాధలు ఉండేవే. మనకు ఒత్తుకున్నంత ఓపిక భూదేవికున్నంత సహనము ఉండాలని మా నాయనమ్మ అంటుంటే విన్నాను. ఇప్పటి పిల్లలకు ఒత్తు గురించి తెలవదు. ఇప్పుడు అన్ని గ్యాస్ పొయ్యిలాయే మా చిన్నప్పుడు చలికాలంలో అందరం ఒత్తుల నీళ్లతో ముఖం కడుక్కునే వాళ్ళం. అప్పుడప్పుడు స్నానం కూడా వత్తుల నీళ్లతోనే చేసేవాళ్లం."

"వత్తంటే ఏంటిది మల్లక్క?"

అని అడిగింది శ్వేత.

మల్లమ్మ–"ఒసే నీకు సగ తెలవదా వత్తు అంటే"

"తెలవదక్క. తెలిస్తే ఎందుకు అడుగుత" శ్వేత.

అప్పుడు మల్లమ్మ శ్వేతతో

"ఒత్తు అంటే! మూడు పోయిరాళ్లకు బదులు రెండు పోయి రాళ్లు ఒక కుండను పెడతారు. ఆ కుండలో నీళ్లు పోస్తరు. అన్నము కూరతో పాటు, కుండలో ఉన్న నీళ్లు కూడా బాగా కాగుతయి. దీనినే ఒత్తు అంటరు. ఆ కుండలో ఉన్న నీళ్లను ఒత్తుల నీళ్లు అంటరు."

"అవునా!!" అక్క అంటుంటే, నిర్మల తన మనసులో నేను చచ్చిపోతానని కనుక్కొని వస్తే ఇలా జరిగిందేంది ఈరోజు కాకపోయినా అందరు పడుకున్నాక రాత్రికి ఎట్లైనా రావాలి. బతికిన దాంట్లో ఏమి లాభం లేదు మా అమ్మ దగ్గరకు పోదామంటే అక్కడ ఇద్దరు వదినలు ఉన్నరు. వారి దగ్గర ఏం బాగుంటది అనుకుంటున్నా సమయంలో

"లే నిర్మల నా మాట విను నా కోసం లే ఈ రాత్రి మా ఇంట్లోనే ఉందువు మీ ఇంటికి ఏం పోవద్దు" అని శ్వేత అనగానే నిర్మల మనసు మార్చుకుని లేచింది.

ముగ్గురు కలిసి నడుస్తున్నరు. "ఇప్పుడు చెప్పు నిర్మల ఏమైంది" అని అడిగింది శ్వేత.

"ఏమి లేదు అక్క నాలుగైదు రోజుల నుంచి రాత్రి 12 గంటలకు ఇంటికి వస్తుండక్క మీ మరిది. ఇంత రాత్రి దాకా ఏం పని ఉంది. మొన్ననే కదా ఆపరేషన్ అయింది. ఉన్నది మనిద్దరమే నాయే. రోజు మధ్య రాత్రి వస్తున్నవని అడిగిన అంతే అక్క. నా జుట్టు పట్టి గిర గిర తిప్పి కొట్టుకుంటూ నీ దగ్గర ఇంకేముందే లం... గర్భసంచి తీసేసిరి. ఇక నీకు పిల్లలు పుడుతరన్న ఆశ కూడా లేదు. ఇంకెందుకే ఇక్కడ ఉండేది. మీ ఇంటికి వెళ్ళిపో. పిల్లల కోసమే నిన్ను పెళ్లి చేసుకున్నను ఇక పిల్లలు పుట్టే అవకాశం లేదు అంటూ నానా మాటలు తిడుతూ కొడుతుండు అక్క" అని ఏడుస్తూ చెప్పింది నిర్మల.

"ఏడవకు నిర్మల ఇంతకుముందు సొంతం మేనమామ బిడ్డను పెళ్లి చేసుకుండు. దానికి కూడా అచ్చం నీలాగే గర్భసంచికి పుండై ఆపరేషన్ అయింది. పిల్లలు పుట్టరని దాని సగ అట్లనే ఎల్లగొట్టిండు. ఇట్లా ఎంతమంది ఆడపిల్లలను మోసం చేస్తడు" అని శ్వేత అంటుండగానే మల్లమ్మ "ఇన్నాళ్ల లెక్క బయటికి వచ్చి కూసుంటే ఒకరి కష్టాలు ఒకరికి తెలిసేవి ఇప్పుడు టీవీలు సెల్ ఫోన్లు వచ్చి ఒకే ఇంట్లో ఉన్న తల్లి పిల్లలు భార్య భర్తలు కూడా కలిసి మాట్లాడకుండా ఉంటున్నరు. చూసినవా నిర్మల నీకు ఆపరేషన్ అయిన సంగతే నాకు తెలవదు. ఎందుకురా ఆపరేషన్ నువ్వు మంచిగనే ఉంటివి.

"అవును మంచిగనే ఉంటిని. పిల్లల కోసమని ఒక ప్రైవేట్ హాస్పటలకు వెళ్ళిన. డాక్టర్ అన్ని టెస్టులు చేసి, గర్భసంచిలో గడ్డ ఉంది. వెంటనే ఆపరేషన్ చేయాలని అన్నది. మేము నిజమేనని నమ్మి ఆపరేషన్ చేయించుకున్నను.

నాకు కిలో గడ్డ ఉందని చూపించి నమ్మించింది. నాకు ఆపరేషన్ అయిన వెంటనే చలితో జ్వరం వచ్చి గడగడ వణుకుతున్నను. ఏం చేయాలో అర్థం కాట్లేదు. ఎందుకు మేడం ఆపరేషన్ అయిన వెంటనే జ్వరం వచ్చింది అని అడిగితే మలేరియా జ్వరం వచ్చిందమ్మా అని చెప్పి ఏమి కాదమ్మా అదే బాగా అయితది ఓపిక పట్టండి అన్నది.

కొన్ని రోజుల తర్వాత షుగర్ ఉందని చెప్పింది. అప్పుడు మాకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఒకపక్క ఆపరేషన్, మలేరియా జ్వరము మరొక పక్క షుగర్. ఆరోగ్యంగా ఉన్న నేను హాస్పటల్ కొచ్చి రోగాలను తగిలించుకున్న ఏంది నా

జీవితం ఇట్లా అయిపోయిందని తలుచుకుంటే తలుచుకుంటే మనసంతా బాధైతుంది.

ఏది తిందామన్నా ఇబ్బందిగా ఉంది.

ప్రతి దినము జావలతో గడుపుతున్నను. దినదినము నా ఆరోగ్యం కృషించిపోతుంది.

నాకు అన్నం తింటే వెళ్ళిపోతుంది. నా ఆరోగ్యం రోజురోజుకు దిగజారిపోతుంది. లేవలేక పోతున్నను. ఒంటరిగా నడవలేక పోతున్నను. మా తల్లిదండ్రులు నారెండు రెక్కల కింద చేయి పెట్టి పట్టుకొని లేపి నడిపిస్తున్నరు.

ఒకరోజు మా పెద్దమ్మ బిడ్డ ఫోన్ చేసింది. నా ఆరోగ్య స్థితినంతా తెలుసుకుని, డాక్టరమ్మ మిమ్ములను మోసం చేసింది చెల్లా. మీరు వేరే హాస్పటల్ కు వెళ్లండి అని చెప్పింది.

కానీ మేము ఉన్న డబ్బంతా ఇక్కడే ఖర్చు పెట్టుకున్నాం. ఇంకా వేరే ఆస్పత్రికి ఎలా వెళ్ళేది అని ఆ డాక్టర్ చెప్పినట్లే వింటూ వచ్చాము. రెండు నెలల తర్వాత మరల హాస్పిటల్ కి వెళ్లాను డాక్టర్ చూసి ఇక నావల్ల కాదు. హైదరాబాదులో ఉన్న హాస్పిటల్ కి వెళ్ళండి అని చెప్పింది.

చేసేది ఏమీ లేక నన్ను మరొక హాస్పిటల్ కు తీసుకపోయింద్రు. అక్కడ నన్ను చూసి గర్భసంచి మొత్తము చీమొచ్చింది. మరల ఆపరేషన్ చేసి గర్వసంచి తీసేయాలి. లేకపోతే బతకడం చాలా కష్టము అని డాక్టర్ సార్ అన్నడు. నా భర్త రెక్కల కష్టమంతా అప్పటికే అయిపోయింది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కాలేదు.

నా పరిస్థితిని చూసి మా నాన్న దగ్గర చేతులొక్క పైస లేదని, ఎకరంశెల్క అమ్మి నన్ను బ్రతికించుకున్నడు. నాకు ఆపరేషన్ అయ్యేంతవరకు నా భర్త బాగానే దగ్గరుండి చూసుకుండు. ఇంటికి వచ్చిన తర్వాత ఏమైందో ఏమో నన్ను రోజు తిడుతూ, కొడుతూ, హింస పెడుతుండు" అని చెప్పింది నిర్మల.

"ఇంత జరిగినా ఇంటి పక్కల ఉన్న నాకే తెలవదు. ఇగ దూరంగా ఉన్నా నీకు ఎట్ల తెలుస్తదని" అన్నది శ్వేత.

"నిజమే శ్వేత అని మల్లమ్మ అంటుండగానే ఒక వ్యక్తి మేక పోయిందని దాన్ని వెతుక్కుంటూ వచ్చి మల్లమ్మ మేకలను చూస్తున్నడు. వెంటనే మల్లమ్మ "ఎవరయ్యా నీవు నా మేకలను పొరాబట్టి చూస్తున్నావ్" అన్నది.

అందుకు అతడు "మాది మీ పక్క ఊరే నా మేక ఒకటి పోయింది దాన్ని వెతుక్కుంటూ వస్తున్న. అది అచ్చం మీ నల్ల మేక లెక్కనే ఉంటదని" అనగానే మల్లమ్మ వెంటనే "ఇవన్నీ మామేకలే నీ మేక మా వాటిల్లో లేదన్నది".

నేను పొద్దంతా మేక కోసం తిరుగుతున్న. అది ఎక్కడ ఉందో ఏమో అంటూ నిర్మల వంక చూసి... "బాగున్నావా కోడలా" అని పలకరించిండు.

నిర్మల అతనిని చూసి "బాగున్న మామ" అని అంటుండగానే శ్వేతా కల్పించుకొని "ఈమె నీకు ముందే తెలుసా" అన్నది.

" తెలుసమ్మా ఈమెను మా ఊరికే ఇచ్చింద్రు. వాడు మా చుట్టమే కానీ చాలా కిరాతకుడు పైసలకు కక్కుర్తి పడి సొంత అన్న భార్యను చంపిండు. ఈ పిల్లను కూడా ఇంట్లో తోలి టీవీ సప్పుడు ఎక్కువ చేసి కొట్టేవాడు. ఒకరోజు ఇంట్లో పెట్టి తాళం వేసి మూడు నాలుగు రోజులు దాకా రాకపోతే పక్కింటి వాళ్ళు చూసి.. తాళంవిర్ర కొట్టి బయటకు తీసింద్రు"

అని అంటుండగానే మల్లమ్మ కల్పించుకొని "ఏంది బిడ్డ నీకు ఎక్కడ బోయిన సుఖము లేదు. అయినా ఈ ఆడవాళ్లకు అన్ని తిప్పలే ఎటు చూసినా ఆడదానికే బాధలు" అని అంటుంటే

"నిజమే అత్తమ్మ పిల్లలు పుట్టకపోయినా ఆడదాని లోపం అంటారు. మగ పిల్లవాడు పుట్టకపోయినా ఆడదాని లోపం అని రెండో పెళ్లి చేసుకుంటారు. ఇదంతా మగవాడి లోపమని కానక ఆడవాళ్ళ లోపం అంటరు కదా" అన్నది శ్వేత.

అంతలోనే మల్లమ్మ కొడుకు ఎదురొచ్చి "ఏందమ్మా ఇంకా ఇంటికి రాలేదు. మేకలు ఎటన్న పోయినవేమనని భయపడి వస్తున్న."

"అవునా కొడకా అవి ఎటు పోలే. కానీ డాక్టర్ ఏమన్నడు. ఏమనలే అమ్మ అన్ని బాగానే ఉన్నవి. మల్ల నెలకు రమ్మని చెప్పిండు" అనగానే

అవున్రా పిల్ల, పిల్లగాడా అని అడిగితేమైంది."

"మనం అడిగిన కూడా వాళ్ళు చెప్పరమ్మ" అని మాట్లాడుతుండగానే ఊరు వచ్చింది ఎవరింటికి వాళ్లు

వెళ్తున్నరు.

శ్వేత, నిర్మలతో మా ఇంటికి రా చెల్లె రాత్రికి ఇక్కడే ఉండి పొద్దడికి మీ ఇంటికి పోదువు అనగానే వద్దులే అక్క మా ఇంటికి పోతా ఈ రాత్రికి

ఏమన్నా చంపుతాడా ఏంది?

నన్ను చంపి ఆయనే వంద ఏండ్లు బతుకని అక్క." అంటుంటే శ్వేత చెయ్ పట్టుకొని తన ఇంటికి తీసుకొని పోయింది. ఇంట్లోకి అడుగుపెట్టగానే శ్వేత అక్క కూతురు నిస్సి కనపడింది.

వెంటనే శ్వేత "బాగున్నావా తల్లి" అని పలకరిస్తూ "ఎన్నాళ్ళకు కాలాడినయ్ తల్లి ఇక్కడికి రావడానికి. శ్వేత

"లేదు పిన్ని నాకు కూడా రావాలని ఉంటది గాని వీలు పడక రాలేకపోయాను. ఇప్పుడు ప్రాజెక్టు పని మీద వచ్చిన."

" ఓ అవునా తల్లి"

శ్వేత కూతురు వచ్చిందని ఎంతో సంతోషపడి చికెన్ తెప్పించి వంట చేసి పెట్టింది.

అందరు కలిసి భోజనం చేసిన తర్వాత నిర్మలను పరిచయం చేసింది.

నిర్మల తన బాధనంతా నిస్సికి చెప్పుకుంది. నీవు పెద్ద చదువు చదివినగా తల్లి ఏమి చేస్తే ఈమెకు న్యాయం జరుగుతుంది అని నిస్సిని సలహా అడిగింది శ్వేత. "

"ఏం లేదు పిన్ని మహిళా పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టాలి. అప్పుడు వారు ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇస్తరు" అంటూ ఎన్నో విషయాలను చెప్పింది.

వెంటనే నిస్సి సెల్ నెంబరు తీసుకుంది నిర్మల.

కొన్ని రోజుల తర్వాత మహిళా పోలీస్ స్టేషన్ లో భర్త మీద కేసు పెట్టింది నిర్మల. అప్పుడు వారు ఇద్దర్ని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించిండ్రు. వారి దగ్గర నా భార్యను మంచిగ చూసుకుంట అంటడు కానీ ఇంటికొచ్చి మరల అదే కొట్టుడు తిట్టుడు.

నిర్మల ఈ నరక బాధ నేను భరించలేను నావల్ల కాదు అని నిస్సి తో ఫోన్ చేసి మాట్లాడింది.

నీవు కృంగిపోకమ్మ ఓపిక పట్టుకో నీకు తప్పకుండా న్యాయం జరుగుతుంది. ఈ ఆలోచన వల్ల ఆపరేషన్ అయినందుకు ఏమో నా శరీరము రోజురోజుకు బలహీనమైపోతుంది. నేను ఎక్కడికి తిరుగలేని స్థితిలో ఉన్నను. ఇక నా సంగతి వదిలేయండి. నాలాంటి స్త్రీలు ఎంతోమంది ఉన్నరు. వారికి నాలాంటి పరిస్థితి రాకుండా చూడండి అంటూ మీరు నా మీద జాలి పడినందుకు కృతజ్ఞతలు. నేను కన్న కష్టం చేసి, నా తల్లిదండ్రులు ఇచ్చిన సహకారంతో ఇల్లు కట్టుకున్న. కానీ ఇప్పుడు ఆ ఇల్లు నాది కాదని ఇంట్లో ఉండొద్దని హింస పెట్టి బయటికి పంపించేశాడు నా భర్త. నేను ఆరోగ్యంగా ఉన్నప్పుడు బానిసలాగా పనిచేయించుకొని, ఇప్పుడు ఆరోగ్యం బాగా లేదని పిల్లలు పుట్టరని నన్ను ఒంటరిని చేస్తుండు. నాకు పిల్లలు లేకపోయినా నా భర్తే సర్వస్వము అనుకున్న కానీ ఇప్పుడు ఆయన మనసు మారిపోయింది ఎలాగైనా నన్ను వదిలించుకోవాలని అనుకుంటుండు. అందుకని నేను కూడా ఆయన సుఖాన్ని కోరుకొని నా తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లాలని నిశ్చయించుకున్న. నా నిర్ణయము తప్పయితే నన్ను క్షమించండి" అంటూ ఫోన్ కట్ చేసింది నిర్మల.

నిస్సి ఎన్నిసార్లు ఫోన్ చేసినా కూడా నిర్మల ఫోను ఎత్తలేదు. నిజమే ఈనాడు నిర్మల లాంటి స్త్రీలు ఎందరో ఉన్నరు. వారి సమస్యలను బయటికి చెప్పకుండా వారితోనే అంతమై పోవుచున్నవి. స్త్రీలకు ఇంకా స్వాతంత్రం రాలేదు. ఎన్ని స్వాతంత్ర్య దినోత్సవంలు, ఎన్ని మహిళా దినోత్సవములు జరుపుకున్న... స్త్రీ మానప్రాణాలకు రక్షణలేదు. స్త్రీ జీవితానికి ఇంకా స్వాతంత్రం రాలేదు. స్త్రీ ఇంట్ల, బయట అణచివేయబడుతుంది. కొంతమందికి మాత్రమే స్వాతంత్రం వచ్చింది.

నేడున్న చట్టాలు న్యాయస్థానాలు ఏవి కూడా స్త్రీకి రక్షణ ఇవ్వలేక పోతున్నవి. స్త్రీ ఆర్థిక, సామాజిక, స్వావలంబన సాధించే దిశగా తన ప్రస్థానం మొదలుపెట్టాల్సి ఉంది అంటూ మనసులో అనుకుంది నిస్సి.

వృధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి అక్కడే ఉండిపోయింది నిర్మల.

కవిత

# యుద్ధం : అహం విశ్వరూపం



ఝాన్సీ కే.వీ. కుమారి
రాజమండ్రి

ఇప్పుడు .. ఈ పుడమిపై ఐక్యరాజ్యసమితి సాక్షిగా అనంతంగా సాగుతున్న మానవ హననం ../
ప్రస్తుత పాలకులు గుడ్లప్పగించి చూస్తున్న పైశాచికత్వం ../
నెలలతరబడీ సాగుతున్న మృత్యుకేళీ విలయతాండవం ../
ఆపండీ .. ఇక ! /
పిల్లల.. పెద్దల .. సామూహిక స్మశానాలతో .. ఇంకా .. ఎంతకాలం ప్రాణాలతో ఈ .. చెలగాటం ? /
దేశాల మధ్య సమానత్వం , గౌరవం , సుహృద్భావం పాటించాలని గ్రంథాల్లో ముచ్చట్లు ! /
ఇక ఈ నేలను నెత్తుటి బొట్టు ఒక్కటి కూడా ఒలకరాదని .. /
దేశాల మధ్య శాంతి సౌభ్రాత్రాలే ఏలికలవ్వాలని .. నానా జాతులు ముక్క చెక్కలు గాక .. /
ఒక్క ఆత్మగా పరస్పర గౌరవంతో శ్వాసించాలని .. కదా../
శాంతి 'పునాదిగా '..
సోదర ప్రేమ 'కంటి చూపుగా ..'
దయార్ద్ర హృదయం 'ప్రాణవాయువుగా ..'/
రాజ్యాలన్నీ కలిసి 'ఐక్యరాజ్యసమితి ' ఆవిర్భవించిందే .., ఆ నాడు ... !/
మమత సమత సమానత కలిసే కదా.. ఐక్యత !!
పెద్ద చిన్న తేడాలు ఉండకూడదు ..' వీటో ' లనే ప్రత్యేకతలు అసలే ఉండరాదు .. /
ఆత్మవిశ్వాసం .. ఆత్మ గౌరవం కోల్పోయిన మదిలో రగులుకుంటాయి పిరికితనపు భయాలు ! /
మమత .. ఐక్యత .. నిబద్ధత .. శూన్యమైన 'సమితి'లో ప్రారంభం వీటోల వీరంగం .. ! /
'బలవంతుడ నాకేమ'నే అహం .. సామూహిక స్మశానాల సృష్టికి .. సిద్ధం మహా యుద్ధరంగం !/
రక్షించవలసిన వాళ్లే భక్షించడం .. ఎంత ఘోరం .. /
బలిసిన ఎద్దుల కుమ్ములాటలో .. కాళ్ళ కింద నలిగే చిన్ని లేగ దూడలు /
తల్లిఆవులకు మిగిల్చే ది .. గుండె పగిలే విషాదం .. !
గుండె లేనివారికి చుట్టుపక్కల వినోదం /
అగ్ర ఉగ్ర తీవ్రవాద .. సవా లక్ష దరిద్రవాదాలకు వికృత రూపం యుద్ధం !/
నరాలు పిండి వడబోసిన రుధిరధారలు .. మానవజాతి సాధించిన అభివృద్ధి ఫలాలు ! తృటిలో పేలే ఒక్క బాంబు .. శతాబ్దాల
శ్రమైక జీవన సౌందర్యాన్ని బుగ్గి చేసి విరగబడి నవ్వుతోంది.. /
శ్రమశక్తిని .. మనిషి తెలివితేటల డొల్లతనాన్ని.. ఆత్మలోని శూన్యతను /
ఎగతాళి చేస్తోంది ! /
స్త్రీ మూర్తి.. ఎవరండీ .. ? మానవాళికి మాతృమూర్తి ! /
నిన్నటి .. నేటి .. రేపటి.. తరాలను గర్భంలో మోసి.. రక్తంతో పెంచి ../
జీవన్మరణాల పోరాటంలో కని .. పెద్ద చేస్తున్న తల్లులు కదరా .. !

తమ రక్తాన్నీ .. జీవితాన్నీ .. ధారపోసి .. నిన్ను.. నిన్నూ .. ఇంకా నిన్ను ../
మనుషులందరినీ.... కన్నబిడ్డలుగా ఆదరించే అమ్మలురా ! /
మనిషి రక్తం తాగి .. కామోన్మాదం తలకెక్కి .. కళ్ళకు బైర్లు కమ్మిన పైశాచికత్వం .. /
ఎక్కడనుండి దిగబడిందిరా.. ఈ నేలకు
ఈ దానవజాతి ? /
అమ్మల్లారా , అర్ధాంగుల్లారా , ఇక వాళ్లు.. మీరు పెంచిన ప్రేమ మూర్తులు కారని ! /
అరిచి .. అరిచి .. చెప్పండి.. అది 'హంతక దానవజాతి ' అని ! /
సర్వావయవాలకు సంకెళ్లు వేసి ..
ఊరూరు తిప్పుతూ ..
చివరి తీర్పు ప్రకటించండి ! / మానవతను హత్య చేసిన వికృత సమాజానికి/
పశ్చాత్తాప పరివర్తనా మార్గం బోధించి .. /
వాళ్లను మానవులుగా మలచవలసింది అమ్మలూ, మీరే .. ! /
అంతేకాదు.. యుద్ధ రహిత .. నూతన మానవతా సమాజానికి /
ఊపిరి పోయవలసిందీ అమ్మలే ! /
ద్వేషం .. అసూయ.. క్రూరత్వం .. అనే హింసోన్మాద తెగులు /
పసి బాల్యానికి అంటనీక.. ప్రేమ.. దయ.. కరుణ .. /
సహనాలను .. గుండెలో ప్రవహించే రక్తధారలతోనూ .. /
మీ ఒడిలో పెరిగే ప్రాయంలోనే .. ఉగ్గుబాలతోనూ .. రంగరించి .. /
ఆబుల్లిహృదయదేహాలనిండా .. ప్రసరింప చేయండి .. !/
అప్పుడు ..నేటి ఆ చిన్నారి బాలలే .. రేపటి మహోన్నత మానవతా మూర్తులు ..
విశ్వశాంతి ప్రదాతలు.. కాగలరు .. !/
అప్పుడు.. ఈ పుడమికి
కయ్యానికి కాలుదువ్వే దుష్టాత్మలనుండీ ..
సమస్త కాలుష్యాల నుండీ.. కలుషిత మనుషులనుండీ రక్షణ .. ! /
అంతవరకూ ..
పంతం కోసం చేసే యజ్ఞంలో /
జీవచైతన్యాలు సమిధలవుతుంటే /
చలికాచుకు జబ్బ చరుచుకునే /
ఈగో విశ్వరూపం యుద్ధం !
మృత్యువు చేసే విలయతాండవంలో /
చావు బతికేస్తుంది హాయిగా ..
ఇక ... బ్రతుకంతా మూగబోయి శిథిలమైన విపంచిక .. ! /

అందుకే .. యుద్ధాలను ఆపుదాం !
తప్పిపోయిన శాంతికపోతాలను వెతికి పట్టుకుందాం .. !!

వ్యాసం

# వివక్షను గెలిచిన విజేత



- సరోజన బోయిని
మంచిర్యాల, 8919913083

కాలం ఏదైనా గానీ మన సమాజంలో మహిళలు తమ పట్ల వివక్షను ఎదుర్కొంటూనే వస్తున్నారు..

తమ హక్కుల కోసం,సమస్యల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు..

మరి ఇది అందరితో సాధ్యమా అంటే దానికి సమాధానం తన లోని ఆత్మ విశ్వాసాన్ని బయటకు తీసి దైర్యంగా నిలబడి ఒక్క మహిళ వేసే ముందడుగే మిగితా వాళ్లకు మార్గ దర్శకంగా మారుతుంది.

తమ హక్కుల కోసం,సమస్యల కోసం తామే పోరాటం చేసి సాధించు కోవాలి అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో రావడానికి పునాదిగా నిలుస్తుంది.

ఇప్పడి వరకు మహిళలు సాధించుకున్న హక్కులు ఎన్నో.. ఎన్నో దురాచారాలు, మరెన్నో మూఢనమ్మకాలు నుండి తమని తాము రక్షించుకుంటున్న గానీ ఇంకా,ఇంకా వివక్షను ఎదుర్కొంటూనే వున్నారు. మహిళలు ఇలాంటి సమస్యల నుండి బయటపడడం లో తమ అస్థిత్వాన్ని నిలుపుకోవడంలో కొంత మంది మహానుభావులు అయిన ప్రగతిశీల పురుషుల సహకారం ,వారి తోడ్పాటుతోనే వాటిని అధిగమించారు..

మహిళలకు చదువు అనేది ఒకప్పుడు నోటికందని కూడు. ఇందుకు కారణం బాల్య వివాహాలు కావచ్చు,ఆడపిల్ల బయట ప్రపంచంలో తిరగడం ఇష్టం లేని తల్లి,తండ్రులు కావచ్చు,ఆడపిల్లకు చదువు ఏంటి అనే వివక్ష కావచ్చు..

చదువుతో మహిళ బుద్ధి బలం పెరిగి తమ హక్కుల కోసం ఈ సమాజాన్ని ఎక్కడ నిలదీస్తుందో అన్న భయం కావచ్చు.

ఆడపిల్ల చదువు లేక వంటింటికే పరిమితం కావాల్సి వచ్చింది.

కానీ మహిళల్లో మార్పు కొద్ది,కొద్దిగా చదువు అందుకుంటూ ఉన్నత శిఖరాలను చేరుకుంటుంది..

అలాంటి వాళ్లలో ఒకరు.. అయ్యలసోమయాజుల లలిత భారతదేశ మొదటి మహిళా ఇంజనీర్..మన తెలుగింటి ఆడబిడ్డ..

ఆ కాలంలో ఇంట్లో ఆడపిల్ల ఉంది గుండెల మీద కుంపటిలా భావించేవారు..దీనికి తల్లితండ్రులు నిరక్షరాస్యులా అక్షరాస్యులా ఉన్నత స్థానంలో ఉన్నవారా ? అనే తేడా ఏం లేకుండా ఆడపిల్ల పెళ్లి విషయంలో ఒకే ఆలోచన ..

ఒక స్త్రీ ముందడుగు వేయడంలో పురుషుని సహకారం ఎంతనో వారి అనుమతి కూడ అంతే అవసరంగా ఉండేది..ఈ పురుషాధిక్య ప్రపంచంలో ఇప్పడికి ఈ ధోరణిలో మార్పు రాలేదు..

కానీ ఒక ఆడ పిల్ల చదువు అంటేనే విడ్డురంగా చూసే సమాజంలో అప్పటి తన పరిస్థితులకు ఎదురుతిరిగి .. తాను చిన్న వయస్సులో ఒక బిడ్డకు తల్లి అయి భర్తను కోల్పోయినప్పటికీ ..తిరిగి తన చదువు కొనసాగించి ఇంజనీరింగ్ పూర్తి చేసింది అయ్యలసోమయాజుల లలిత .

భర్తను కోల్పోయిన స్త్రీకి తెల్ల బట్టలు కట్టించి ఇంట్లో ఓ చీకటి గదే తన ప్రపంచగా భావించాలి అనే ఈ సమాజపు మూర్ఖత్వాన్ని సవాల్ చేస్తూ తన చదువు కొనసాగించింది ఆమె..

1919ఆగష్టు27న మద్రాసులో అంటె నేటి చెన్నైలోని ఒక తెలుగు కుటుంబంలో జన్మించారు లలిత. తండ్రి పప్పు సుబ్బారావు ఇంజనీరింగ్ ప్రొఫసర్ . అమెకన్న పెద్దవారు నలుగురు ,చిన్నవారు ముగ్గురు తోబుట్టువులు ఉన్నారు .ఆనాటి సమాజ పద్దతుల ప్రకారం ఇంకా స్కూల్లో చదువుకుంటుండగానే ,15 ఏళ్ళ వయసుకే 1934

లో లలితకు పెళ్లి చేసారు. ఆ తరువాత కూడా కొన్నాళ్ళు స్కూల్లో విద్య కొనసాగిన పదో తరగతిలో ఆమె చదువు ఆపేశారు .

1937 లో శ్యామలకు జన్మనిచ్చారు లలిత.కూతురు పుట్టిన నాలుగు నెలలకే భర్త చనిపోవడంతో తండ్రి ,సోదరుల ప్రోత్సాహంతో ముందుగా క్వీన్ మేరీ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసారు. ఆ తర్వాత కుటుంబసభ్యులు పని చేస్తున్న కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ గిండీలోనే ( సి.ఈ.జి) 1940లో నాలుగేళ్లు ఇంజనీరింగ్ కోర్సులో చేరారు. తండ్రి సిఫార్సులో ఆమెకు అక్కడ దొరకడం తేలికయింది.

1940లో క్యాంపస్ లైఫ్ ఎలా ఉంటుందో ఇప్పుడు మనం ఊహించడం కష్టం. అసలు అమ్మాయిలే ఇంజనీరింగ్ కాలేజిల్లో లేని ఆ కాలంలో ముగ్గురు మహిళలు (సి.ఈ.జి)లో చదువుకున్నారు లీల్లమ్మజార్జ్, థెరిస్స సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో లలిత కీ జూనియర్ గా చేరిన రెండో ప్రపంచ యుద్ధం వల్ల ముగ్గురు 1943లో ఇంజనీరింగ్ పట్టా పొందారు ఫిబ్రవరి 1944లో ఇచ్చిన డిగ్రీ సర్టిఫికెట్ లో( 'హి పాసుడు ది ఎక్సమినేషన్')అనే వాక్యంలో 'హీ' అనే పదాన్ని కొట్టేసి 'షీ' అని చేతితో సవరించడం ఆనాటి పరిస్థితులకి అద్దం పడుతుంది.మహిళ విద్యార్థులు ఈ కోర్సులు చేయడం అరుదంటే వారి జెండర్ కోసం ప్రత్యేకించి సర్టిఫికేట్స్ తయారు చేయించలేరు లేదా హీ. షీ అనే ఎంపిక ఇవ్వలేదు అలాంటి కాలంలో ముగ్గురు మహిళలు పట్టా భద్రులయ్యారు తన కూతురి ఆరేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు బంధువుల దగ్గర తన కూతురిని ఉంచి కుటుంబసభ్యుల సహకారంతో ఇంజనీరింగ్ పూర్తి చేసింది.

డిగ్రీ పూర్తి చేయడానికి కావాల్సిన ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం లలిత 1943లో ఒక ఏడాది పాటు "జమల్ పూర్ వర్క్ షాప్ లో పనిచేశారు అది ఈస్ట్ ఇండియా కంపెనీ" వారు 1862లో ప్రారంభించిన పూర్తిస్థాయి వర్క్ షాప్ ఫెసిలిటీ. తరువాత 1944లో ఆమె "సెంట్రల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా" సినిమాల్లో ఇంజనీర్ గా అసిస్టెంట్ గా పని చేశారు.తర్వాత తండ్రికి రీసెర్చ్ లో సాయం చేయడానికి ఆ ఉద్యోగం వదిలిపెట్టారు. లలిత తండ్రి పేరు మీద అనేక పేటెంట్లు ఉన్నాయి.

1948లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆమె ఆ పని కూడా మానేయాల్సి వచ్చింది. 1928లో స్థాపించిన "బ్రిటిష్ కంపెనీ అసోసియేటెడ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్" కు చెందిన కలకత్తా ఆఫీసులో ఎలక్ట్రికల్ విభాగంలో లలిత చేశారు. అక్కడ "డిజైన్ ఇంజినీర్ గా ట్రాన్స్మిషన్ లైన్స్"మీద చేసిన పని ఆమెకు గుర్తింపు తెచ్చింది.

పురుషులే అధికంగా ఉండే పని స్థలాల్లో ఆమె ఇన్ని ఉద్యోగాల బాధ్యతలను సింగిల్ పేరెంట్ గా ఆ రోజుల్లోనే నెట్టుకొని వచ్చారు. కుటుంబానికి దగ్గరగా ఉండి కూతుర్ని బాగా చూసుకోగలిగే నిర్ణయాలే కెరీర్ పరంగా తీసుకున్నారు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భారత ఉపఖండంలో బ్రిటిష్ పాలన అంతమవడంతో మహిళలకు ఇంజనీరింగ్ లో అవకాశాలు పెరిగాయి. అంతర్జాతీయ సమావేశంలో ఇండియాను ప్రపంచం మీద నిలబెట్టిన వారు లలిత..

ఆమె 1953లో" ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్(IEE) కౌన్సిల్" లో అసోసియేట్ మెంబర్ గా ఆ తరువాత 1966 లో పూర్తిస్థాయి మెంబర్ గా ఎన్నికయ్యారు.

జూన్ 1964లో న్యూయార్క్ లో జరిగిన తొలి అంతర్జాతీయ మహిళా ఇంజనీర్ల సమావేశానికి ఐ సి డబ్ల్యూ ఈ ఎస్(ICWES) ఆహ్వానాన్ని అందుకున్నారు. లలిత అప్పటికి ఆ సంస్థకు ఇండియాలో ఎలాంటి చాప్టర్ లేకపోయినా ఈ ఆహ్వానం రావడం దానికోసం వ్యక్తిగత స్థాయిలో ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ఆమె ఆ సమావేశానికి హాజరు కావడం విశేషం. ఆ సమావేశంలో 35 దేశాల నుంచి 500 మంది మహిళ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జీవితాంతం ముళ్ళబాటలో నడిచి గెలిచిన లలిత 60 ఏళ్ల వయసులో రిటైర్ అయిన రెండేళ్లకే అనగా 1979 అక్టోబర్ 12న బ్రెయిన్ ఎన్యూరిజం (brain aneurysm) కి గురై మృతి చెందారు.

కవిత

# అమ్మనై పుట్టినందుకు..

- నిర్మలారాణి తోట
కరీంనగర్, 9154767654



ఇల్లంతా తీపికబురని సంతోషంలో
తేలిపోతుంటే
నాసికను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాసనల్లో
వరుసవాంతులతో ముద్దమింగలేని
మూడంకెనయ్యాను

సీమంతమని ముత్తైదులు సింగారం చేస్తుంటే
నడుము మీది బిందె
ముందుకు జారిన భారంతో ఓపలేని ఆయాసమయ్యాను

పొద్దులు పడ్డాయని అందరూ ఆత్రంగా ఎదురుచూస్తుంటే..
పక్కపొర్లలేని పొంగినపొట్టతో
అతలాకుతలమయ్యాను
లోలోపల తంతుంటే మాతృత్వపు కలకంటూ
పంటిబిగువున నొప్పిని నవ్వైపూయించాను

రోకలిపోట్లో ,కత్తుల కోతలో
పసిగుడ్డుకు ప్రపంచమివ్వాలని
ప్రాణాలతో చెలగాటపు పునర్జన్మనయ్యాను

ఒళ్ళంతా పచ్చిపుండై సలుపుతున్నా
నా నిద్రనెత్తుకెళ్ళిన రాత్రుల్లో
తెల్లవార్లూ నీకడుపునింపే పాలధారనయ్యా

నే పళ్ళెం ముందు కూర్చున్న ప్రతిసారీ
నువ్ మలమూత్రాల రాగమెత్తితే
సానిటైజరైనా లేని పాకీ చేతులయ్యాను

బుడిబుడినడకల బడి ఘట్టంలో
యూనిఫాం రాజసానికి
సాయంత్రాలు సాక్సుల్లో కంపు కడిగి
పొద్దున్నే నీ బ్యాగులో లంచ్ బాక్సునయ్యా

చదువుల కిరీటం నీ శిరసునుంచే
పరీక్షల ప్రస్థానంలో
పట్టాలేని కష్టభద్రనయ్యా
ఉద్యోగపు సోపానం నిన్నెక్కించాలని
బోసిమెడల నిచ్చెనయ్యా !

పాతికేళ్ళు ప్రాణంలా పెంచుకొని
పరాయింటిపిల్లకు కన్యుడిదానం చేసి
నీ జీతం జీవితం నాదికాదంటే
నువ్ కన్న పిల్లలకు దాసీనయ్యా !

నడీడుదాటి నడుంవంగిపోయినా
బొడ్డుతాడు తెంపుకోలేని అశక్తనై.. రోగాలపుట్టనై
పంపకాల గడపల్లో బుక్కెడుబువ్వకై
కొంగుచాచే బిచ్చగత్తెనయ్యా !

★★★★

రేయ్ !ఎవడ్రా అక్కడ ?
అపుత్రస్య గతిర్నాస్తని కూస్తున్నది !
మాతృత్వపు మహాకావ్యాన్ని అందంగా నా నెత్తుటి
కన్నీళ్ళతో రాస్తున్నది ?

★★★

కథ

# బోషాణం



- జ్యోతిర్మయి మళ్ళ
విశాఖపట్నం, 9296356220

"ఏయ్ కమలా పదపద "

"ఎక్కడికక్కా"

"చప్పుడు చెయ్యకుండా నా వెనకాల రా" రోకలి గోడవారగా నిలబెట్టి, నడుంకి చుట్టి పక్కన దోపుకున్న పైటచెంగు పైకి లాగి చేతులు తుడుచుకుంటూ కదిలింది కాంతం.

"సరేనక్కా" రోటి పక్కనే ఉన్న గిన్నెలోని నీళ్ళల్లో చేతులు ముంచి తీసి దులిపి చెంగు తో తుడుచుకుంటూ పైకి లేచి తోటికోడలిని అనుసరించించింది కమల.

పెరట్లోని వసారాలోంచి వంటగదినీ నడవగదినీ దాటుకుని వరండాలోకొచ్చాక అర్థమయింది కమలకి తామిద్దరూ అత్తగారిని అనుసరిస్తున్నామని. నాలుగడుగుల దూరంలో అత్తగారు వరండా గదిలోంచి అటకమీదికి చెక్కమెట్లు ఎక్కబోతూ అటూ ఇటూ చూసింది. కాంతం తలుపు వెనకాల దాక్కుంటూ కమలని కూడా తన వెనక్కి లాగింది. కమల ఆశ్చర్యంగా చూస్తుంటే నోటిమీద చూపుడువేలు పెట్టి "ష్" అంటూ నవ్వింది. అత్తగారు ఆఖరి మెట్టు ఎక్కి అటకమీదికి వెళ్ళగానే రా అంటూ సైగచేసింది కాంతం. కమలకు అర్థం కావట్లేదు ఇదంతా.

వర్ధనమ్మ ఆ ఇంటి పెద్ద. ముగ్గురు కొడుకులూ ఇద్దరు కూతుళ్ళూ ఆవిడకి.చిన్న కూతురుకి నాలుగేళ్ల వయసప్పుడు భర్త చనిపోయి ఇంటి బాధ్యతంతా నెత్తిన పడితే చెదరకుండా బెదరకుండా ఇంటిని నడిపించిన ధైర్యశాలి.

అందరికీ పెళ్ళిళ్ళు చేసి పురుళ్ళూ పుణ్యాలూ అన్నీ చూసి ఆ ఇంటి బాధ్యతంతా మోసి ఊళ్ళో అందరి దగ్గరా 'వర్ధనమ్మ గొప్ప ధైర్యవంతురాలు, ఎవరి దగ్గరా దేనికీ చెయ్యి చాచకుండా పిసరంత మాట కూడా పడకుండా ఇంటిని నడిపించుకొచ్చింది' అన్న పేరు తెచ్చుకుంది. ఆ ఊళ్ళోఅమాయకమైన భర్త చాటు ఇల్లాళ్ళందరికీ వర్ధనమ్మ ఒక ఆదర్శం. పెద్ద కొడుకు సిటీలో ఉద్యోగం చేస్తున్నాడుఅక్కడే కాపరం. రెండు వారాలకొకసారి ఆదివారం భార్యా పిల్లలను తీసుకుని ఇంటికొచ్చి రోజంతాఉంటాడు. కొడుకులుముగ్గురూ అమ్మ చెప్పిన మాటను కలలో కూడా పెడచెవిన పెట్టడం చేతకాని బుద్ధిమంతులు.చిన్న కొడుకులిద్దరూవ్యవసాయం చూసుకుంటూ తండ్రి వదిలెళ్ళిన పొలాన్ని నాలుగింతలు చేసిన సమర్థులు. ఇద్దరు కూతుళ్లకీ పెళ్ళిళ్ళయ్యి అత్తారిళ్ళల్లో చక్కగా కాపురాలు చేసుకుంటున్నారు. పెద్ద కూతురి భర్త ఉద్యోగస్తుడవ్వడం వలనే వాళ్ళు దూరంగా వెళ్ళిపోయారని తన కళ్ల ముందు తిరుగుతుందని చిన్న కూతుర్ని ఊళ్లోనే వ్యవసాయదారుడికి ఇచ్చి చేసింది.

కాంతం రెండో కోడలు. కాపురానికి వచ్చి పదేళ్ళు అయింది. అత్తగారి మాట జవదాటని ఉత్తమ కోడలు. అయితే అది భయంతో మాత్రమే. నిజానికి వర్ధనమ్మ మాట వినడం ఇష్టం ఉండదు ఆమెకి. భర్త కోప్పడతాడనీ అందరూ గౌరవించే ఇంటిపెద్దని తానొక్కతీ ఎదిరిస్తే అందరిదగ్గరా చులకనయిపోతుందనీ భయపడి ఆమె మాట వింటుంది. అత్తగారి మీద తనకున్న కోపాన్ని లోలోపల గొణుగుడుతో తీర్చుకుంటుంది. పదేళ్లనుండీ బయటపెట్టుకోలేని ఆ కోపం ఇదిగో ఇప్పుడు పంచుకోడానికి ఒక మనిషి దొరికింది. నెలరోజుల క్రితమే తనకి తోడుగాఆ ఇంటికి చిన్నకోడలు రూపంలోకమల వచ్చింది. అన్నదమ్ములిద్దరికీవయసులో నాలుగేళ్లే తేడా అయినాపెళ్ళిళ్ళు మాత్రం పదేళ్ళ తేడాతో జరిగాయి. కమల పల్లెటూరి పిల్ల. వయసులో బాగా చిన్నది కూడా. తోటికోడలు తనకన్నా చాలా పెద్దది కాబట్టి ఆమె చెప్పినట్లు చేయడం అలవాటు చేసుకుంటోంది కమల. ఎవరితో ఏం మాట్లాడాలన్నాఏం చెయ్యాలన్నాముందు కాంతంకి చెప్పి ఆమె చెప్పినట్లే చేస్తుంది.అత్తగారు చెప్పింది కాంతంబలవంతంగా చేస్తుందని అర్థం చేసుకోవడానికి అట్టే సమయం పట్టలేదు కమలకి.

ఇద్దరూ చప్పుడు చేయకుండా అటక ఎక్కారు. అటకమీద ఒక వారగా అటేపు తిరిగి కింద కూచుని ఉంది వర్ధనమ్మ. రెండడుగులు ముందుకి వేసి ఎత్తుగా ఉన్న బియ్యం మూటల

వెనక నక్కి కూచున్నారుకాంతం కమలా. అక్కడికెందుకొచ్చామో అత్తగారు అక్కడ కూచునిఏం చేస్తున్నారో, అసలు ఆమెకి తెలీకుండా దొంగచాటుగా ఆమెని ఎందుకు అలా చూడాలో ఏమీ అర్థం కావట్లేదు కమలకి. అయినాకాంతం ఆసక్తిగా చూస్తుండడంతో తానూ ఆశ్చర్యంగా చూస్తోంది. అక్కడ పెద్ద బోషాణంపెట్టె ఉంది దాని ముందే కూచుని ఉంది వర్ధనమ్మ. ఆమె చేతుల కదలికను బట్టి పెట్టె తాళం తిప్పి, గొళ్ళెం తీసి మూత పైకెత్తి పెట్టి అందులోని సామాన్లు సర్దుతున్నట్లు అనిపించింది. ఇదంతా చాలా మెల్లిగా జరుగుతోంది. కమలకి బోరు కొట్టింది.కాంతం మాత్రం ఆసక్తిగా చూసింది అంత సేపూ. కాసేపటికి మూత మూసి గొళ్ళెం పెట్టి తాళం తిప్పినట్లు అనిపించి మూటల వెనక్కి మరింతగా నక్కారు. అత్తగారు మెట్లు దిగి కిందికి వెళ్ళగానే నెమ్మదిగా చప్పుడు చేయకుండా దిగిపోయారు.

"రోట్లోనిబియ్యం రోట్లోనే వదిలేసి ఎక్కడికెళ్ళారిద్దరూ" తడిబియ్యం మీద వాలిన ఈగల్ని తోలుతూ అంది వర్ధనమ్మ.

"కమలకి తలనెప్పిగా ఉంటేనూ కాస్త అమృతాంజనం రాద్దామని తీసుకెల్లానత్తయ్యా" అంటూ బొంకింది రోకలి చేతిలోకి తీసుకుంటూ కాంతం.

'అయ్యో ఇదేంటి నాకు తలనొప్పేంటీ' అన్నట్లు చూస్తున్న కమలని 'నువ్వూరుకో నేనున్నాగా' అన్నట్టు కన్నుగీటింది కాంతం. ఏమీ అర్థం కాక కింద కూచుని బియ్యం ఎగదోయడం మొదలుపెట్టింది కమల.

అత్తగారికి వినపడకుండా మెల్లిగా చెప్పింది విషయం కాంతం. తను కాపురానికొచ్చిన పదేళ్ళ నుండీ కూడా ఎంత ప్రయత్నించినాఆవిడ అప్పుడప్పుడూ ఆ పెట్టె దగ్గర అరగంట సేపు కూచుని ఏం చేస్తుందోతనకి అర్థం కావడం లేదని. కమల ఆలోచనలో పడింది.

"ఇంతకీ ఆ పెట్టెలో ఏముంది అక్కా?" అమాయకంగా అడిగింది.

"అది తెలిస్తే పదేళ్లుగా నాకెందుకీ కష్టాలూ?" దీర్ఘం తీసింది కాంతం. ఇంత అమాయకురాలివేంటే బాబూ అన్నట్లు పెట్టింది ముఖం.

"మరి అత్తగార్నే అడిగేయలేకపోయావా అందులో ఏం ఉన్నాయని"

"సర్లే, మనం అడిగితే మాత్రం ఆవిడ చెప్పేస్తుందా ఏమిటీ"

"ఇంతకీ పోనీ మనింట్లో ఎవరికేనా తెలుసా లేక ఎవ్వరికీ తెలీదా?"

"ఎవ్వరికీ తెలీదు. ఆ తాళం ఎప్పుడూ ఆవిడ బొడ్డు లోనే దోపుకుంటుంది. ఎవరికీ ఇవ్వదు కూడా"

"అయితేఏవన్నా విలువైనవి ఉన్నాయంటావా అక్కా, అంటే నగలూ డబ్బూ అలాంటివి?"

"ఏమో, ఎవరికి తెలుసు" ఇన్నాళ్ళయినా కనిపెట్టలేకపోయినందుకూ ఆవిడ ఎవరికీ చెప్పకుండా ఏదో చేసేస్తున్నందుకూ కలిగిన కోపం అంతా రోకలి పోటుతో తీర్చుకుంటోందికాంతం. బయటికి చిందే బియ్యాన్ని జాగ్రత్తగాఎగదోస్తోంది కమల.

మర్నాడు మధ్యాన్నం భోంచేసి వర్ధనమ్మ మంచం మీద పడుకుంది. వేసంకాలమేమో అలిసిన శరీరం గట్టిగా నిద్ర పట్టేసింది ఆమెకి. కాసేపటికే గట్టిగా గురక కూడా మొదలయ్యింది. ఆదమరిచి నిద్రపోతున్న అత్తగార్ని చూడగానే కాంతం బుర్రలో మెరుపులా ఒక ఆలోచన పుట్టింది. తోటికోడలు తోడుందనో ఏమో గొప్ప ధైర్యంతో ఉంది. కమలని పిలిచి తన ఆలోచన చెప్పింది.

"బాగుండదేమో అక్కా, వద్దు..ఆవిడకి తెలిస్తే చండాలంగా ఉంటుంది."

" ఏం పర్లేదు..పదేళ్ళ ఆరాటం ఇవాల్టితో తీరిపోవాలి. నువ్వు పక్కన ఉండు చాలు నేను చూసుకుంటాగా" అంది ధైర్యంగా.

తోటికోడలు తనకన్నా పదేళ్ళు పెద్దది పైగా తను వచ్చి ఇంకా నెలరోజులే అయింది ఆమె మాట కాదనే ధైర్యం లేక భయంగా బిడియంగా కాంతంకి నాలుగడుగులు దూరంగా నడిచింది కమల అత్తగారి మంచం వేపుకి.

వర్ధనమ్మవెల్లికిలాపడుకునిఉంది.గురకతోలయబద్ధంగా పైకీ కిందికీ కదులుతున్న ఎత్తైన పొట్టకి దిగువగా కాంతం చూపులు వెతికాయి.నడుం మీద చీరకొంగుదోపుకున్న ప్రాంతంలోనే దోపి ఉన్న చిక్కాం (చిన్న గుడ్డ సంచీ ) కనిపించింది.మెల్లిగా దగ్గరగా వెళ్లి చిక్కాం మీద చేయి వేసింది. పట్టుకుని పైనుండే తడిమిచూసి అందులో తాళం ఉందని నిర్ధారించుకుని మెల్లిగా పైకి లాగే ప్రయత్నం చేసింది. అత్తగారు కళ్ళుతెరిస్తే ఏంటి పరిస్థితని కమలకికంగారుగా ఉంది. గుండె కొట్టుకోవడం కాసేపు ఆగింది భయంతోఆమెకి.

నడుం మీద కలిగిన స్పర్శకి వర్ధనమ్మ గురక ఆగింది. గుండాగినంత పనయింది కమలకి. చిక్కం మీంచి వెంటనే చెయ్యి తీసేసిందికాంతం. వర్ధనమ్మకళ్ళు తెరవకుండానే

చిక్కాం ని మరింత లోపలికి దోపుకుని పక్కకి తిరిగి పడుకుంది. ఇప్పుడుకాంతంచెయ్యగలిందేమీ లేదు చిక్కాం వర్ధనమ్మ భారీ శరీరం కిందికి వెళ్లి ఇరుక్కుపోయింది.

కాంతం నిరుత్సాహంగా పెరట్లోకి వచ్చి బావి పక్కన వేపచెట్టు కింది బండరాయిమీద కూచుంది. కమలకూడా పక్కకి చేరింది. మధ్యాహ్నం వేళ అక్కడే కూచుని ముచ్చట్లు పెట్టుకుంటారు కాంతంతో కలిసి ఇరుగుపొరుగు ఇద్దరు ముగ్గురు ఆడాళ్ళు కూడా. చెట్టుకింద చల్లగా ఉంటుందనిన్నూ మగాళ్ళకీ పెద్దాల్లకీతమ మాటలు వినపడకుండా ఉంటాయనిన్నూ. నెల రోజులుగా గమనిస్తున్న కమలకిఅంతా కొత్తగా ఉంది. కాస్త ఇబ్బందిగా కూడా ఉంది అందరూ అత్తా ఆడబడుచుల మీద చాడీలు చెప్పుకోవడం. అక్కడందరూ పెద్దవాళ్ళే వాళ్ళ మాటలు నచ్చడం లేదంటే ఏమనుకుంటారో అని చిన్న నవ్వు నవ్వడం తప్ప నోరు విప్పి ఒక్క మాట కూడా మాట్లాడదు. ఆరోజు కమల,కాంతం మాత్రమే ఉన్నారు. వేరే ఆడాళ్లెవరూ రాలేదు మీటింగుకి.

"ఛ, ముసిల్దిదెబ్బ తినిపించీసింది. ఎప్పట్నించో అనుకుంటున్నాను గానీ ధైర్యం చాలీది కాదు. ఇప్పుడు నువ్వు తోడున్నావు కదాని ధైర్యం చేసాను గానీ పని మాత్రం అయ్యింది కాదు." నిరుత్సాహంగా అంది

"పోన్లే అక్కా, సమయం వచ్చినపుడు అత్తగారే మనకి చూపిస్తుంది కదా, అందాకా తొందరెందుకు?"

"నీ మొహం, ఆవిడ మనకి చూపించేదే అయితే ఎప్పుడో చూపించును. తాళం ఎక్కడా వదలకుండా అంత జాగ్రత్తగా బొడ్లో దోపుకుని ఉంచుకుంటుందంటే కచ్చితంగామనకి తెలీకూడని రహస్యం ఏదో ఉంది ఆ పెట్టెలో"

"ఏమో మరి"

"అదీ కాక ఆ పెట్టె ముందు కూచుని అంతంత సేపు ఏం చేస్తుందన్నది కూడా ఎవరికీ తెలీదు. ఒకసారి ఆవిడ వెనకాల అటక మెట్లెక్కబోతుంటే 'వెళ్లి పని చూసుకో' అని నన్ను పంపించీసింది. అక్కడే నాకు అనుమానంగా ఉంది"

"ఏమో అక్కా, మరి నాకయితే ఏమీ తెలీదు. మీకే తెలియాలి"

"నా అనుమానం ఇంకో తాళం మన చిన్నాడబడుచు దగ్గర ఉండుండొచ్చు. ఆవిడ వొచ్చినప్పుడల్లా గుసగుసలాడుకుంటారు తల్లీ కూతుళ్లిద్దరూ " అందిదీర్ఘంగా ఆలోచిస్తూ.

"సర్లే, మనకెందుకు మన పనేదో మనం చేసుకుందాం ..ఆ పెట్టెలో ఏముందో ఏంటో సమయం వచ్చినపుడు అదే తెలుస్తుంది. ఇంక దాని సంగతి మర్చిపో అక్కా" అంది తోటికోడలు అంతటితో ఆపేస్తే బాగున్నని ఆశగా ఉంది కమలకి.

కాంతం మనసు మాత్రం బాధగా మూల్గుతోంది తన ప్రయత్నం బెడిసికొట్టినందుకూ, తోటికోడలు తనని సరిగా సమర్థించడం లేదనిపిస్తున్నందుకూ కూడా. అక్కడ్నించి కదిలి వంటింట్లోకి వెళ్లి టీ పెట్టే పనిలో పడిపోయారు ఇద్దరూ.

ఉదయాన్నే వాకిట్లో ముగ్గేస్తూ వినాయకుడి విగ్రహం వేపు చూసిందికాంతం. స్వామి చుట్టూ పువ్వుల్లేవు. ఇంటి ముందు రోడ్డు పడ్డాక ముఖద్వారానికి ఎదురుగా రోడ్డు శూల అలా ఉండకూడదని వినాయకుడి విగ్రహం పెట్టుకున్నారు. వర్ధనమ్మ చీకటితోనే లేస్తుంది. ముందు రోజు సాయంత్రమే పువ్వులు కోసి పెట్టుకుంటుంది. విగ్రహం చుట్టూ శుభ్రం చేసి స్నానం చేసి నీళ్ళతోవిగ్రహంకడిగిపూలతోఅలంకరి స్తుంది. ఇవాళ వినాయకుడికి ఆవిడ సేవలు అందలేదంటే ఏమయి ఉంటుంది కాంతంగాభరాగా లోపలికి పరిగెత్తింది. అత్తగారు ఇంకా మంచం మీదే ఉండడంతో అనుమానంగా దగ్గరికెళ్లికదిపింది వెంటనే కెవ్వుమంది.. వర్ధనమ్మప్రాణం గాల్లోకి ఎప్పుడు కలిసిపోయిందో గానీ శరీరం బిగుసుకుపోయి ఉంది.

ఇంటిల్లిపాదినీ ఒక తాటిమీద నడిపించి ఇక తన గమ్యాన్ని వెతుక్కుని వెళ్ళిపోయింది ఆవిడ.. కొడుకులు కూతుర్లంతా దుఃఖపడ్డారు. కుమిలి కుమిలి ఏడ్చారు. ఆమె అంతిమ యాత్ర చూసేందుకు ఊరు ఊరంతా వచ్చారు. పెద్దకొడుకు లక్ష్మణరావు తలకొరివి పెట్టాడు. మూడ్రోజుల పాటు ఊళ్ళో అంతా ఆవిడ గురించే చెప్పుకున్నారు. మూడోరోజుబంధువులంతావెళ్ళారు. ఇల్లు ప్రశాంతంగా ఉంది. హఠాత్తుగా కాంతానికి అటకమీద పెట్టె గుర్తొచ్చింది. అత్తగారిచిక్కాం ఎవరు తీసుకున్నారు? హడావిడిలో తను గమనించలేదు. ఆడబడుచులు తీసుంటారా? పెద్ద తోటికోడలు తీసిందా? కమల తీసుంటే కచ్చితంగా తనకే ఇస్తుంది. ఇంతకీ ఎవరు తీసారు? వెంటనే గబగబా అటకమీదికెళ్లి చూసింది. పెట్టె అలాగే ఉంది తాళం కప్ప ముఖాన్న వేలాడేసుకుని. అది తనని చూసి నవ్వినట్లనిపించింది.ఏమీ అర్థం కాక కిందికి దిగి వంటింట్లో పనిలో ఉన్న కమల దగ్గరకెళ్ళి చెప్పింది.

"అటకమీదికి ఎవరేనావెళ్ళడం చూసావా ఈ రెండ్రోజుల్లో?"

"ఏమో చూళ్ళేదక్కా"

"సరే, ఇకనుండీ ఓ కంట కనిపెట్టు "

"సరే అక్కా" అని పైకి అన్నదే గానీ 'ఇంత జరిగినా పెట్టె సంగతి మర్చిపోదే అక్క'అనిఅనుకుంది లోపల.

రాత్రి భోజనాలయాక అందరూ నిద్రపోయేందుకు సిద్దమవుతుండగా వర్ధనమ్మ చిన్నకూతురు మహేశ్వరి నడవింట్లోకి రండని కేకేసింది అందర్నీ. తన భర్తా, ముగ్గురన్నలూ, వదినలూ, అక్కా, బావాఅందరూ వచ్చి చేరారు. ఏంటి విషయమన్నట్టు అందరి ముఖాల్లో ఉత్సుకతకొట్టొచ్చినట్లు కనపడుతోంది. వెనక వరండాలో కబుర్లాడుకుంటున్న పిల్లల్ని కూడా రమ్మని పిలిచింది. అందరూ వచ్చారు గానీ అందరి ముఖాల్లోనూ ఏదో అనుమానం, ఆశ్చర్యం..ఏంటా ఈ మీటింగూ అని. కాంతం గుసగుసలాడింది కమల చెవిలో

"ఈ డ్రామా చూడూ. అత్తగారు పెట్టెలో దాచినవన్నీ ఈవిడ నొక్కేసి ఉంటుంది. ఎవరికీ ఏ అనుమానం రాకుండా ఇప్పుడు అందరిలోనూ ఆ తాళం ఇస్తుంది చూడు ..చూస్తూ ఉండు నా మాట నిజమో కాదో" కమల ఆశ్చర్యంగా చూసిందామెవేపు'పెట్టె తప్ప ఇంకో ధ్యాస లేదే అక్కకి ' అన్నట్టు.

అందరూ సర్దుకుని కూచున్నాక మహేశ్వరి నోరు విప్పింది.

"మనందరిఅవసరాలూతీర్చింది ఏ లోటూ లేకుండా మనందర్నీ చూసింది ఇక తన అవసరం మనకి లేదనుకుందేమో తన దారి తను చూసుకుంది" గొంతు దుఃఖం తో పూడుకుపోగా చీరచెంగు నోటికడ్డం పెట్టుకుంది. అన్నలు ముగ్గురూ వెళ్ళి ఓదార్చారు చిన్నది కదా బాగా ముద్దుగా పెరిగింది పైగా ఊళ్ళోనే ఉన్నందువలన అమ్మని రోజూ కలిసేది అందుకే అంతగా బాధపడుతుందని అర్థం చేసుకున్నారు. అన్నలు సముదాయించాక తమాయించుకుని కళ్ళు తుడుచుకుంది. చీర చెంగున ముడేసి ఉంచిన తాళం విప్పదీసి అందరికీ చూపిస్తూ

"అమ్మ తన పుట్టింటి నుండి ఈ ఇంటికి కాపరానికొచ్చినపుడు తెచ్చిన బోషాణం పెట్టెది ఈ తాళం " అంతా ఆశ్చర్యంగా చూసారు. కమలా కాంతం ముఖాలు చూసుకున్నారు.

"తను పోయాక మాత్రమే ఆ పెట్టెను తెరవమని నాకొక తాళం ఇచ్చింది ఎప్పుడో. "

"నేను చెప్పలేదూ..నా లెక్క తప్పవదెప్పుడూ" కమలకు మాత్రమే వినపడేట్లు చెప్పింది కాంతం.

వెంటనే పెద్దకోడలు లేచెళ్ళి అల్మారాలోంచి అత్తగారి చిక్కాం తీసుకొచ్చింది. అందులోంచి కూడా తాళం తీసి చూసారు. రెండూ ఒకేలాంటివి. అందులో ఆ తాళం తప్ప ఇంకేం లేవు.

"ఇప్పుడే అందరూ ఉండగానే పెట్టె తెరుద్దాం" అంది మహేశ్వరి

"అంత అర్జెంటేంవుందీ తర్వాత చూసుకోండి" అన్నాడు లక్ష్మణరావు.

"కాదన్నయ్యా, అందరికీ తెలియాలి అందులో ఏముందో" అంది మహేశ్వరి. ఇద్దరుమగ పిల్లలు అటకమీదికెళ్ళి జాగ్రత్తగా పెట్టెని మోసుకొచ్చి మధ్యలో పెట్టారు. అందరూ ఆత్రంగా చూస్తున్నారు. లక్ష్మణరావు తాళం తిప్పాడు. గొళ్ళెం తీసాడు. మూత పైకెత్తుతుంటే గుండె ఉగ్గబట్టుకుని చూస్తోంది కాంతం. పదేళ్ళ తన కల కొద్ది క్షణాల్లో తీరబోతోంది.

కాంతం కళ్ళు విప్పార్చి చూస్తోంది. పెట్టె నిండుగా ఉంది. తెల్లని పంచె గుడ్డ కప్పి ఉంది. దానిమీద ఒక కాయితం కనపడింది. లక్ష్మణరావు కాయితం చేతిలోకి తీసి చూసాడు. పెన్సిలుతో రాసున్నాయి దానిమీద అక్షరాలు. తల్లి చేతిరాత ఎలా ఉంటుందో తెలీదు తనకి అసలు ఆమెకి రాయడం వచ్చని కూడా తెలీదు. కానీ నొక్కిపెట్టి పొడిపొడిగా చిన్నపిల్లలు రాసినట్లుగా ఉన్న ఆ చేతివ్రాత తల్లిదే అని గ్రహించాడు. లేచి నిలబడి అందరూ వినాలని పైకి గట్టిగా చదివాడు.

" పిల్లలందరికీ నా ఆశీస్సులు. కాపరానికొచ్చినప్పటికి నాకు చదువు లేదు. కానీ చదువుకోవాలని నాకు కోరిక. అత్తగారికీ మావగారికీ తెలిస్తే కోప్పడతారని పడుకునేముందు మీ నాన్న దగ్గర అడిగి నేర్చుకున్న అక్షరాలూ గుణింతాలూ కూడపలుక్కుని రాస్తున్నాను ఈ నాలుగు మాటలూ..నా చీకటి చదువు ఇలా నా చివరి మాటల్ని మీకు వినిపించేందుకు పనికొస్తున్నందుకు సంతోషంగా ఉంది..." చదవడం ఆపి తలెత్తి చూసాడు లక్ష్మణరావు. అందరూ ఆసక్తిగా వింటున్నారు.

"....ఈ పెట్టెలో నాలుగు మూటలున్నాయి. ప్రతి దాన్లోనూ ఒక ఉత్తరం పెట్టాను. అది చదవండి. అందులోనివి ఎవరికి ఇవ్వాలో రాసాను. వారికి అందించండి.

ఉత్తరం మడిచి కింద పెట్టాడు. మూటలను కప్పి ఉంచిన తెల్లపంచ తీసి పక్కన పెట్టాడు. పెద్ద చెల్లి పరమేశ్వరిని పిలిచాడు. ఆమె వెళ్ళింది. చిన్న చెక్క బల్ల లాగి మధ్యలో పెట్టింది. మొదటి మూట తీసి చెల్లి చేతిలో పెట్టాడు. తల్లి తన చీరలను చింపి ఈ మూటలు కట్టిందని అర్థమయింది ఆమెకి. ఆమె దానిని బల్ల మీద పెట్టి ముడి విప్పింది అందరూ బల్ల చుట్టూ దగ్గరగా చేరి ఆత్రుతగా చూస్తున్నారు అందులో ఏముందా అని. విప్పగానే

కనిపించింది ఒక కాయితం కవరూ దానిమీద మడతపెట్టిన ఉత్తరం. తీసి అన్నయ్య చేతికిచ్చింది. విప్పి చదువుతున్నాడు. "ఇందులో పాతిక వేలున్నాయి .. నా అంత్యక్రియలకి వాడండి. ఆమాత్రం మేం చేయలేమా అని కోపం తెచ్చుకోకండి. మీరు మాత్రం ఇప్పటికిప్పుడు డబ్బులకోసం ఎక్కడికి పరిగెడతారూ? అందుకే ఈ ఏర్పాటు" లక్షణరావు కళ్ళు తడెక్కాయి. చివరి అక్షరాలు కనపళ్ళేదు అంచనాగా చదివాడు. కవరు తీసి చూసాడు. అన్నీ చిన్న నోట్లు. పెద్ద కట్టలు..ఎంత కష్టపడి కూడబెట్టిందో అమ్మ..అతని కళ్ళు మరింత చెమ్మగిల్లాయి . కట్ట తిరిగి కవర్లో పెట్టి తమ్ముడి చేతికందించాడు. అతను తీసుకెళ్ళి బీరువాలో పెట్టాడు.

రెండో మూట తీసి అందించాడు. బల్లమీద పెట్టి విప్పారు. ఉత్తరం తీసాడు.

"ఇందులో పదివేలున్నాయి. నేను ఎలాగూ చదువుకోలేదు..నాలాగ చదువుకు నోచుకోని ఒక్కరినైనా నేను స్కూలు ఫైనలు దాకా చదివించాలని అనుకున్నాను గానీ అది ఎలాగో తెలీక డబ్బు మాత్రం కూడబెట్టాను. ఆపని నాకోసంమీరు చెయ్యండి"

చిన్నపిల్లలందరికీ కళ్ళు చెమ్మగిల్లాయి. అంతా మొహామొహాలు చూసుకున్నారు. ఆ క్షణమే ఆవిడ మీద ఆరాధన కలిగింది వాళ్ళకి.

మూడో మూట పెద్దదిగా ఉంది. కాంతం ఆసక్తిగా చూస్తోంది. అన్నీ పాత వెండి సామాన్లు.

"ఇవి అమ్మితే ఇరవై వేలన్నా వస్తాయి. నాచుట్టూమీరంతాఉన్నారు. నాకు మీ ప్రేమని పంచారు. కానీ

పిల్లలుండీ అనాధలుగా వృద్ధాశ్రమాల్లో కాలం గడుపుతున్నారట ఎందరో. వాళ్ళ దగ్గరికెళ్ళి సాయం చెయ్యాలని ఎన్నోసార్లుఅనిపించింది గానీ ఆ ధైర్యం చేయలేకపోయాను నేను. ఇల్లు, పొలం తప్ప ఊరు దాటి బయటికి వెళ్ళడంనాకు తెలిస్తే కదా! దగ్గర్లో ఉన్నవృద్ధాశ్రమానికి ఈ డబ్బు విరాళంగా ఇవ్వండి.

"ఎవరెవరి కోసమో ఇవన్నీ అట్టిపెట్టింది చూసావా" కమల చెవిలో గొణిగింది విమల అక్కసుగా.

తోటికోడలివేపు ఈసారి కాస్త కోపంగా చూసి బావగారు నాలుగో మూటలోని ఉత్తరంలో ఏం చదువుతారో అని అటు చూసింది కమల. ఊహించని ఆ చూపుని తట్టుకోలేక కళ్ళు దించుకుంది విమల.

నాలుగో మూట కొంచం చిన్నగానే ఉంది. కాయితాల కట్ట అది.విప్పి చూస్తే భూమి తాలూకు పత్రాలు అని అర్ధమయింది. ఆశ్చర్యంగా చూసాడు లక్ష్మణ రావు. తమ్ముళ్ళిదరినీ దగ్గరికి పిలిచి చూపించాడు.

పెద్దతమ్ముడువాటిని చేతిలోకి తీసుకుని చూస్తూ "ముందు ఉత్తరం చదువన్నయ్యా" అన్నాడు

"ఇదిమీ నాన్న కొన్న భూమి పత్రం. ఇవి ఉన్నట్లు అసలునాకు తెలీదు. ఆయన చనిపోయే ముందు చెప్పారు నాకోసం ఏమీ చేయలేదనీ ఇది ఒకటీ నాపేరున పెట్టాననీ." నాకు ఎందుకని అడిగితే నీకు నచ్చినవాళ్ళకి ఇచ్చుకుంటావని అన్నారు..."

చెవులు రిక్కించి వింటున్నారు కూతుళ్ళూ కోడళ్ళూ.

"ఈ భూమి అమ్మి ఆ సొమ్ము.." చదవడం ఆపి అందరివేపూ చూసాడు లక్ష్మణరావు

పెద్దాళ్ళందరిలోఆమెకి ఇష్టమయినవారు ఎవరా అనే ఉత్కంఠ రేగింది. వారి కళ్ళలోని ఆత్రుతని కనిపెట్టిన లక్ష్మణరావు చదవసాగాడు.

"....నా ముగ్గురు కోడళ్ళకీ సమానంగా పంచండి."

కూతుళ్ళు కాసేపు నోళ్ళు తెరుచుకుని ఉండిపోయారు. విమల అవాక్కయి ఉండిపోయింది. కమలతోటికోడలి వేపు అదోలా చూసింది.ఆ చూపులో 'చూసావా ఎంత పొరబడ్డావో' అన్న అర్ధం కనపడింది విమలకి.

"ఇంకా ఉంది వినండి" లక్ష్మణరావు అనడంతో అంతా సైలెంటయ్యారు.

"...నా ఒంటి మీది బంగారం ఎలాగూ కూతుళ్లకే ఇస్తారు. ఎక్కడో పుట్టి నాలాగే ఈ ఇంటికి వచ్చి ఇంటినీ ఇంటివాళ్ళనీ ప్రేమతో చూసుకునే నా కోడళ్ళకు కూడా నేను ఏదోటి ఇవ్వాలి కదా! ..."

విమలకు కన్నీళ్ళాగడం లేదు.

ఉత్తరంలో ఇంకా ఇలా ఉంది

"....విమల అసలే అమాయకపుది. మాయా మర్మం తెలీనిది..ఆమెను జాగ్రత్తగా చూసుకోండి"

"అత్తయ్యా" అంటూ కుప్పకూలిపోయింది వర్ధనమ్మ ఫోటో ముందు. నిలువునా ముద్దబంతి పూలమాల అలంకరించుకున్నవర్ధనమ్మఅక్కడ్నించే చిరుమందహాసంతో కోడలిని ఆశీర్వదిస్తోంది.

**సమీక్ష**

# తిరుగులేని సంఘటిత ఆమె



**యడవల్లి శైలజ ప్రేమ్, ఖమ్మం**

**చరవాణి: 9394171299**

ఆడవాళ్ళు ఏ పనిచేసినా ఆడా మగ అనే తేడా లేకుండా వింతగా ఉంటుంది. అటువంటి క్రమంలో ఈ సంఘటిత పుస్తకం ముద్రించి తీసుకుని రావడం సాహసంతో కూడిన పని. దీనిలో 115 కవయిత్రుల కవితలు ఉన్నాయి. ఆడవారికి ఆనాటి నుంచి ఈనాటి వరకు కూడా అన్యాయం జరుగుతూనే ఉంది. ఇంట్లో, ఉద్యోగం లో, ఆఫీసులో, బస్సుల్లో, రైళ్ళలో, గుడిలో, బడిలో ఎక్కడంటే అక్కడ ఆ దృశ్యాన్ని కవితలుగా మలిచి తమ బలాన్ని సంఘటిత పరిచారు. నేను కూడా ఇందులో భాగస్వామిని అయినందుకు ఆనందంగా ఉంది. ఈ అవకాశం కల్పించినందుకు జ్వలిత గారికి ధన్యవాదాలు.

స్త్రీ అంటే అణిగిమణిగి ఉండాలి,పొద్దున్నే లేచి ఊడ్చి శుభ్రం చేసుకోవాలి, తలవంచి నడవాలి ,నోరు తెరిచి మాట్లాడ కూడదు. నిప్పుల్లో దూకమంటే దూకాలి, నిలువునా అమ్మినా అమ్ముడు పోవాలి, కన్న కొడుకు తల నరుకుతున్నా పలకని తల్లి పురాణాలలో స్త్రీ కి లభించిన వరం ఇది.' అభేదం ' అనే కవితలో భైరి ఇందిర, అవును మౌనాన్నే మాట్లాడుతున్నాను కవితలో ' అనిశెట్టి రజిత ' గార్లు కళ్ళకు కట్టినట్లు చూపిస్తూనే మరో ప్రపంచపు యుద్ధబేరి మోగిస్తున్నాను విప్లవ నారినై ఆయుధ దారినై అంటున్నారు.

స్త్రీ అంటే వ్యాపార వస్తువు కాసుల వర్షం కురిపించే బ్రాండ్ అంబాసిడర్ – విశాలపురం పుష్పలత / కంట నీరు రానివ్వని ఆత్మవిశ్వాసం – తమిరశ జానకి / ఆమె ఒక ఆకాంక్ష జ్వాల హక్కుల యజ్ఞానికి ఆయుధశాల – సరోజన బోయిన / ఆశల రెక్కలు కట్టుకుని ఎగరాలని కలకని తలదిండులో ముఖం దాచుకుని కన్నీళ్ళు కార్చి పళ్ళు బిగించి పడుకునే రాత్రులెన్నో.

పి. సుష్మ–ఆడపిల్ల దారిన పోతుంటే దాహపు చూపులు / ఐక్యతతో అవకాశాల కోసం ఫిరంగిలా దూసుకొస్తోంది ఇలాంటి వాక్యాలెన్నో ఈ పుస్తకంలో ఉన్నాయి. సంస్కృతి, సాంప్రదాయాలు మధ్య పడతి మనసు చిక్కుకుని ఏడ్చేందుకు కూడా స్వతంత్రత లేక వంటింట్లోనే మగ్గి, పరదా ముసుగులో మతం మాటున విధించిన ఆంక్షలను ఆమె నిషేధ స్థలాలు కవితలో షాజాహానా వివరించారు.

భారతదేశం ఎంత అభివృద్ధి చెందుతున్నా కూడా ఇంకా వదలని జిడ్డులా కులం,మతం, లింగ వివక్షత కొనసాగుతూనే ఉంది. కులం పేరుతో దూషిస్తూ ఆకృత్యాలు , అఘాయిత్యాలు రోజురోజుకి పెచ్చరిల్లిపోతున్నాయి. కొంచెం పచ్చిగా, కొంచెం కచ్చగా కొంచెం అచ్చంగా ఉన్నది ఉన్నట్లు ఈ కవితలో సమాజంలోని భూస్వాములు అనబడే పెద్ద మనుషులు దళిత మహిళల పట్ల చేసే అవమానాలు, అవహేళనలు, మానభంగాలు గురించి చెప్పడానికి ఏ మాత్రం భయపడకుండా నిర్భయంగా ' ఆల్ ఇండియన్స్ ఆర్... అనే కవితలో 'వినోదిని ' తన గళాన్ని ధీటుగా వినిపిస్తోంది.

ఆడవారికి నెలసరి ఒక సమస్య ముట్టు అంటూ అంటరానిదానిలాగ మూలన కూర్చొపెట్టి తన ఆత్మవిశ్వాసాన్ని, గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ సాంప్రదాయాన్ని అనుసరించి ఆమె అదేదో తప్పు చేసిన దానిలా అందరి ముందు తలవంచుకుని కూర్చోవడం తలుపు చాటున దాక్కుని చూడటం దూరంగా ఎక్కడో పాకలో ఉంచబడటం. అలా ఉంచబడటం వల్ల ఆమె

ఆరోగ్యం దెబ్బతినడం మాత్రమే కాకుండా జంతువుల బారిన పడి చనిపోవడం జరిగింది కూడా పూర్వం ముట్టు గుడిసెలు అదేకాకుండా పురిటి కోసం కూడా ఏర్పాటు చేసేవారిని విని ఉన్నాను. ఆమె ముట్టు ఆపితే మన జననం అనే వాస్తవాన్ని గ్రహించి ఆ సమయంలో ఆమెకు విశ్రాంతి, గౌరవం,మర్యాద, ఇవ్వడమే కాకుండా వింత చూపులు ఆపితే ' హ్యాపీ టూ బ్లీడ్ ' అనగలం. మెర్సీ మార్గరెట్, నోముల వనితా రాణి గార్లు మాత్రమే కాకుండా చాలామంది కవయిత్రులు సహజ సిద్ధమైన పీరియడ్స్ ని వింతగా, విడ్డూరంగా చూడొద్దు ఆమెను అర్థం చేసుకోవాలనే ఆవేదనా



భరిత మాటలు కవితలుగా మలిచి అందరు మగువలు పడుతున్న మానసిక వేదన వ్యక్తపరిచారు. ఆ సమయంలో మూడ్ స్వింగ్స్ కూడా మారుతుంటాయి. అది అర్థం చేసుకునే మగవారికి మగువలందరి తరపున ధన్యవాదాలు.

పితృస్వామిక వ్యవస్థ లో స్త్రీ అంటే కేవలం వంటింటికే పరిమితం ఆమె కంటూ భావ వ్యక్తీకరణ కూడా ఉండకూడదు. ఆమెకు ఏమీ తెలియదు . ఆమె అమాయకురాలు అనే ముద్ర వేసింది. అతని రాత్రులకు ఉన్న విలువ ఆమె రాత్రులకు ఉండదు.

పగలంతా పనిచేసి పడక గదిలోకి వెళ్లాక వంటి నొప్పులు మంచం కింద దాచేసి అతనికి తన శరీరాన్ని మనసుతో పనిలేకుండా అప్పగించాలి. వంశాభివృద్ధి కోసం గర్భంతో ఉన్నప్పుడు నిద్ర పట్టక, పిల్లలు పుట్టిన తర్వాత వాళ్ళ అవసరాల కోసం నిద్ర పోకుండా అందం,ఆరోగ్యం చూసుకోకుండా అహర్నిశలు కష్టపడుతూ అన్ని తనైన ఆమెకు ఏం తెలుసు? అనే ముద్ర. ఆమె ప్రతిభకు గుర్తింపు ఉండదు. చాకిరీ కి అంతం ఉండదు.

అవమానాలు అవహేళనలు దాటుకుంటూ ముందుకు వచ్చింది మహిళ. తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూస్తూ కూర్చోకుండా తనే అన్నింటిలోను ముందుకు సాగుతోంది. కూలీ పని మొదలు ఆటో, ట్రాక్టర్, బస్సు, రైలు, విమానం నడిపే డ్రైవర్ , టీచర్, లాయర్, జడ్జి, రాజకీయ రంగంలోనూ ముందంజలో ఉన్నారు.

ఈ కట్టుబాట్లను సాంప్రదాయ సంకెళ్లను తెంచుకుని తనదైన గళాన్ని గట్టిగా వినిపించి ప్రజలను చైతన్య పరుస్తూ విజయభేరీ మోగించి మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచిన మహిళామణులు ఎందరో ఉన్నారు.

కవితలు మరికొన్ని అలసిన మనసు – గట్టు రాధిక మోహన్ ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కప్పుకునే ఈ పితృస్వామ్యం /ఈ వాక్యంలో పితృస్వామిక వ్యవస్థ ఎటంటే అటు తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది/ ఆకాశంలో సగం నేను.

నిర్మల నందిగామ నా అస్థిత్వాన్ని పురిట్లోనే నలిపేస్తున్నప్పుడు నాకో రక్షణ కవచం కావాలి/కట్టు కథల గుట్టులన్నీ ఆమె విప్పుతుంటే ముల్లోకాలు ఘొల్లుమన్నాయి–

ఝాన్సీ.కె.వి.కుమారి – పిల్లల్ని కనే యంత్రాన్ని జేసిందు/ తాగి పడేసిన ఖాళీ సీసా కాదు మీ మోహం వ్యామోహం తీర్చి విసిరెయ్యడానికి/ వెన్నెల వాకిలిని ఆదరణ కరువైన పొక్కిలిని/ వరకట్న దహనాలు భ్రూణ హత్యా పాతకాలు/ పాల సలుపుల వేదనెవరిది/ సముద్రంలో జలకాలాడినట్టు ఈ మధ్యన పెరిగిన ఆధునికత/ నాకు తెలియకుండానే నన్ను నేను పొగొట్టుకున్నాను./ ఎస్.నేను ఆడపిల్లను కవితలో అనుమానపు మొగుడు, ఆరళ్ళు పెట్టే అత్తగారు/ పిండంగా గెలిచి అన్యాయంగా మిగిలి.

వడలి లక్ష్మీ నాథ్ – అశ్రు ముద్ర ఆయుధంగా మలుచుకోవడం/ భర్తంటే కలలో వచ్చి నిద్ర లేచేలోపు వెళ్ళిపోయేవాడని ఇలాంటివి ఈ పుస్తకంలో ఎన్నో ఉన్నాయి.

లైంగిక వాంఛలతో కంపుకొడుతున్న వాడి మెదడును బయటకు తీసి కాల్చి బూడిద చేయాలి – ఎస్.కె.సలీమా ఈరోజుల్లో ఆడవారిని చూసే తీరు ఎలా ఉంటుందో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఆడవారు బయటికి అడుగుపెడితే చాలు ఎన్నో చూపులు ఆబగా తడమాలని చూస్తాయి. దూరం నుంచే కొలతలుకొలుస్తాయి . విషపు ఆలోచనలు మదినిండా నింపుకుని మాటలతో మోసం చేస్తాయి.

ఆమెకు కూడా కొన్ని కలలు ఉంటాయి కానీ వాటిని నీ మనో దర్పణం తో ఏనాడైనా దర్శించావా అని అంటారు. పురిమళ్ల సునంద గారు అంతేనా ఆమె కలలు ప్రతి నిత్యం అగ్నికి ఆహుతి అవుతూనే ఉంటాయంటారు. అవును ఈ లోకంలో ఎంత మంది ఆడవాళ్ళు తమ ఆశలు చంపుకుంటున్నారో !

ఈ పుస్తకంలో కవితలు అందించిన ప్రతి ఒక్కరికి అభినందనలు. ఈ కవితలు అందమైన జ్ఞాపకం తో రాసిన కవితలు కావు అంతులేని ఆవేదనకు నిలువెత్తు నిదర్శనంగా, కొన్నింటికి ఎప్పటికీ సమాధానం దొరకని ప్రశ్నలు, చెదిరిన స్వప్నాలు, చెడగొట్టబడిన జీవితాలు వెతలు ఉన్నాయి. మరికొన్ని పిడికిలిని ఆయుధంగా చేసుకొని ధైర్యంగా ముందుకు కదిలిన జీవితాలు ఉన్నాయి.

జ్వలిత గారు తాను కవయిత్రి, రచయిత్రి, అనువాదకురాలు , విమర్శకురాలు ఇంకా ఎన్నో రకాల రంగాల్లో తనదైనశైలిలో ప్రతిభను చాటుకున్నారు. అంతేకాకుండా తన తోటి సాహిత్యకారులను, రచయితలను ప్రోత్సహిస్తూ ఈ పుస్తకం ముద్రించి తీసుకుని రావడం నారీలోకానికి గర్వ కారణం. ఇన్ని కవితలను సేకరించడం చాలా శ్రమతో కూడుకున్న పని పుస్తకాలను పోస్ట్ చేయడం, అందుకున్నారా లేదా అని అడగడం ఇది మన విజయం మహిళలందరూ కలిసి సాధించిన విజయమని విజయాన్ని అందరికి పంచుకోవాలని సూచనలు ఇస్తూ ఉత్సాహ పరుస్తూ అందరికి ఆదర్శంగా ఉంటున్నారు. 'సంఘటిత' పుస్తక సంపాదకులు ' జ్వలిత ' గారికి అభినందనలు.

★ ★ ★

కథానిక

# మానస

- కె. జ్యోతి, గుంటూరు
8639002917



నిశ్శబ్దరాగాలు మీరెపుడైనా విన్నారా? గుండెపై మునివేళ్ళతో తాడనచేసినట్లు, అండదండ ఉన్న దేవుడు చిరునవ్వునవ్వినట్లు, పొగడపూలదండ నడుముచుట్టూ చుట్టినట్లు, వెండిమువ్వల పట్టీలు గల్లునమ్రోగినట్లు, నేనిపుడే విన్నా!

వాన జోరుగా కురవడం ఇంకా మొదలుకాలేదు. మట్టిపరిమళం మత్తుగాసోకింది కిటీకీలోంచి చూస్తున్న నాకు తొలకరిలో ఓ పసిది కన్పించింది రేగినజుట్టు చెదరినబొట్టు పెదాలపై అందమైన నవ్వు చేతిలో సంచితో పాతడబ్బాలో చిత్తుకాగితాలో ఏరుకుంటూ కిటికి దగ్గర నించున్న నన్ను చూసి 'అమ్మా అంత అన్నంపెట్టవా' అంది. అది దైన్యంకాదు ఆకలి కేక కాదు సమాజపు చేతగానితనం ఇంట్లోకిపిలిచి కడుపునిండా తిండిపెట్టా. కట్టుకునేందుకు బట్టలిచ్చా.

ఎవరూలేని అనాథే అయినా ఆత్మవిశ్వాసం ఆ పాప నవ్వులో నిండుగా కనిపిస్తోంది ఎక్కడైనా పనిచేసుకోపోయావా నాప్రశ్ననాకే అసహజంగా వినిపించింది నవ్విందిపిచ్చితల్లి...... పనిమాటున నన్ను వాడుకుంటానన్నారమ్మా అందుకేఇలానే బాగుంది అంది కళ్ళుచెమర్చాయి..... రేపు ఇదేవేళకి కనపడు అనిపంపేశాను.

★ ★ ★

సాయంత్రం ఆయనతో ఓమాటచెప్పా చెప్పొద్దూ రాత్రంతా ఉద్విగ్నత.... ఉదయాన్నే ఆపాపకోసం ఎదురుచూసాననే చెప్పాలి. అమ్మాయి రావడంతోనే శుభ్రంగా స్నానంచేయమని బట్టలిచ్చాను కుందనపుబొమ్మలా ఉన్న తన కడుపునిండా భోజనం పెట్టాను...నాఇంట్లో ప్రతిరోజూ నాకెలా సహాయంచేయాలోనేర్పించాను....ప్రతిగా "అ"అక్షరందిద్దించాను....అన్నీనేనై అందించాను కాలం తనపని తానుచేసుకొంటూనే ఉంది

★ ★ ★

8ఏళ్ళుగడిచాయి మానస(నేను పెట్టినపేరు)వచ్చిన తర్వాత నాలోకం మారిందనే చెప్పాలి. ఇంట్లో ఆడపిల్లవుంటే ఆ సందడే వేరు.... 21 ఏళ్ళ నామానస ఇపుడు చదువులతల్లి...

★ ★ ★

సాయంత్రం ఆయన ఆఫీసునుంచి వస్తూ అబ్బాయి ఫోటో తెచ్చినపుడు కాని నాకు మానస అనాథగా నా దగ్గరచేరిందని గుర్తురాలేదు.. ఎక్కడా ఏందాచలేదు నిజాలతోనే పెళ్ళికూతురైంది మానస.

ఇపుడు నావయసు 50. అదే కిటికిలో, అదే తొలకరి, అదే మట్టివాసన. ఆదివారం ఆఫీసు లీవు కదా మానస వస్తుందని ఎదురుచూస్తున్నా.

మానస తన 4ఏళ్ళ పిల్లాడితో వస్తూ చెపుతోంది "అమ్మమ్మ కథలు బాగాచెపుతుంది కదా.నువ్వు అల్లరిచేయకుండా బువ్వతినేయాలి......

నాకళ్ళలో సన్నని కన్నీటిపొర...పిల్లలు లేరని నలిగిపోతున్ననాకు మానస మట్టిలోదొరికిన మేలిమి పసిడి.. ఇంట్లోకి వస్తూనే "అమ్మమ్మా" అంటూ నాలుగేళ్ళ 'రియాజ్' నను చుట్టేసినపుడు...అదిగో అపుడు మోగింది నిశ్శబ్దరాగం.... ఎందుకంటే మానస భర్త ముస్లీం...

కులమతాలు కావు....కాసింత బంధాలు పెనవేసుకుంటేచాలు....బ్రతుకు మధురమానసరాగమే.....



# మాలపల్లి నవల - సంఘసంస్కరణ దృక్పథం

- డా॥ సముద్రాల ప్రిస్కిల్ల
రాజమహేంద్రవరం, 7075091195

**ఉపోద్ఘాతం :**

1920 కాలంనాటికి తెలుగు సాహిత్యంలో ఒక వైపు భావకవిత్వ ధోరణి కనిపిస్తుంటే మరోవైపు జాతీయోద్యమ సాహిత్యం, సంఘ సంస్కరణోద్యమ సాహిత్యం కనిపిస్తుంది. అంటే మాలపల్లి రచనాకాలం నాటికి తెలుగు సాహిత్యంలో మూడు దృక్పథాలు కనిపిస్తాయి. (1) భావ దృక్పథం, (2) జాతీయ దృక్పథం, (3) సంఘ సంస్కరణ దృక్పథం. సంఘ సంస్కరణోద్యమ సాహిత్యంలో బ్రాహ్మణ వర్గ సామాజిక సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం కనిపిస్తుంది. దళితుల సమస్యలకు మూల కారణాలు, సామాజిక ఆర్థికకోణాలలో విశ్లేషించేందుకు, వారి సమస్యల పరిష్కారానికి కావలసిన అభ్యుదయ సిద్ధాంత భావజాలం తెలుగు సాహిత్యంలో అంతగా కన్పించదన్న విషయం గుర్తించి మొదటి సారిగా బోల్షవిక్ విప్లవ ప్రేరణతో అభ్యుదయ భావాలతో కుల వివక్షతలేని సమాజాన్ని, ఆర్థిక వ్యత్యాసాలు లేని సంఘాన్ని కోరుకుంటూ ఉన్నవ లక్ష్మీనారాయణ 1922లో మాలపల్లి నవలను రాశారు.

తెలుగు నవలా సాహిత్య వైతాళికుడైన ఉన్నవ లక్ష్మీనారాయణ జాతీయోద్యమంలో భాగంగా పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని జైలుపాలై రాయవెల్లూరు జైలులో జైలు జీవితం అనుభవిస్తూ 'మాలపల్లి' అనే పేరుతో తొలి అభ్యుదయ నవలను దేశభక్తితోనూ, సంఘ సంస్కరణ దృక్పథంతోనూ రాయడం జరిగింది. ఈ నవల జాతీయ ఉద్యమ ప్రభావంతో ఉండడమే కాకుండా, మానవీయ విలువలను తెలియజేస్తూనే అస్పృశ్యుల జీవితాన్ని విశదీకరించింది. మహాత్మాగాంధీజీ రాజకీయ జీవితం మొదలైన నాటికి తెలుగువారి సాంఘిక – ఆర్థిక పరిస్థితులు, చారిత్రక సామాజిక – ఆర్థిక ఉద్యమాలలో వచ్చిన మార్పులు వాస్తవిక ధోరణితో ఈ నవలలో కనిపిస్తాయి.

**నవలలో కథసారాంశం :**

మాలదాసరి కులస్థుడైన రామదాసు వ్యవసాయకుడు. ఇతని భార్య మహాలక్ష్మి. పెద్దకొడుకు వెంకట దాసు తండ్రికి వ్యవసాయంలో సాయం చేస్తూంటాడు. చిన్నకొడుకు సంగందాసు. భూస్వామి చౌదరయ్య దగ్గర పాలేరుగా పనిచేస్తుంటాడు. కుమార్తె జ్యోతి పొలం పనులలో చేదోడుగా ఉంటుంది. భర్త మరణించడం వల్ల రామదాసు చెల్లెలు సుబ్బలక్ష్మి తన కొడుకు అప్పాదాసుతో అన్న దగ్గరే ఇంటిపనులుచేస్తూంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వీరిది శ్రామిక జీవన కుటుంబం.

ఆ ఊరిలోనే 800 ఎకరాల ఆసామి చౌదరయ్య తన ఇద్దరు కొడుకులు రామానాయుడు వెంకటయ్య నాయుడుతో కలిసి భూములు సంపాదించుకుంటూ జీవిస్తుంటాడు. చౌదరయ్య దగ్గరబ్బనివాడైన సంగందాసు, చౌదరయ్య కొడుకైన రామానాయుడు ఇద్దరి ఆశయాలు ఒక్కటే కావడం వల్ల సన్నిహితులుగా సఖ్యత కలిగి ఉంటారు. చౌదరయ్య చేసే అకృత్యాలు, అత్యాచారాలు ఆపేందుకు సంగందాసు తోటి దళిత కూలీలను సంఘటిత పరిచి చైతన్యం కలిగించి సమ్మెలు జరిపిస్తూ నాయకత్వం వహిస్తాడు. దళితులకు విద్య నేర్పించేందుకు బడులు తెరిచి వారి జీవితాలను సంస్కరించడానికి పూనుకున్నాడు రామానాయుడు కూడా సంఘసంస్కరణ, అభ్యుదయ ఆశయాలు కలవాడై సంగం దాసుకు ఆర్థిక చేయూతను అందిస్తాడు. ఈ విషయాలను సహించలేని భూస్వామి సంగం దాసు తలపై గట్టిగా బాదడంతో అక్కడే మరణిస్తాడు. భూస్వామి పోలీసులకు లంచం ఇచ్చి విచారణ పరిధి నుండి తప్పించుకుంటాడు. ఈ కార్పణ్య సంఘటనతో కొడుకు రామానాయుడు పేదలకు మరింత చేరువై,దళితుల అభ్యున్నతికి పూర్తిగా అంకితమై తన స్నేహితుని ఆదర్శ భావవ్యాప్తికి స్మృతి చిహ్నంగా "సంగ పీఠం" గ్రామంలో స్థాపించడంతో ఆ గ్రామస్థులు కూడా ఈ కృషిలో చేరడం విశేషం.

రామదాసు రెండవ కొడుకు అడవులలో "తక్కెళ్ళజగ్గడు" అనే మారుపేరుతో జీవిస్తూ "సంతాను"లను రహస్యంగా

కార్యాచరణ దళాలుగా ఏర్పాటు చేసుకుంటాడు. 'దర్మకన్నాల' ద్వారా ధనికుల ఆస్తిని కొల్లగొట్టి పేదలకు పంచిపెడుతూ ఉద్యమానికి నాయకత్వం వహిస్తాడు. సాయుధ పోరాట ఘర్షణలో వెంకట దాసు గాయపడి, పట్టుబడి జైలుపాలై మరణిస్తాడు.

రామదాసు లంచగాడైన చౌదరయ్యతో వ్యాజ్యంలో ఓడిపోయి తన ఆస్తినంతా కోల్పోయి తన స్వంతపొలం నుండి వెళ్ళగొట్టబడి చివరికి ఒక ధనవంతుని ఇంట్లో పనికి కుదురుతాడు. తక్కళ్ళజగ్గడు తన సహచరులతో ఆ యింటిని కొల్లగొట్టడంతో ధర్మకన్నాలతో పరిచయం ఉందనే నెపంతో రామదాసుని అతని భార్యని అరెస్టు చేసి సెటిల్మెంటులో నిర్బంధ కూలీలుగా పని చేస్తారు. కుమార్తె జ్యోతి దుర్మరణం పాలైందని విన్న భార్య మహాలక్ష్మి కూడా చనిపోతుంది. ఇన్ని బాధలు సహనంతో సహించి వేదాంత ధోరణితో రామదాసు జీవనం గడుపుతాడు.

క్రమంగా 'సంగపీఠం' అభివృద్ధి చెందుతుంది. సహాయ నిరాకరణోద్యమాలు,కార్మికోద్యమాలు, ధర్మకన్నాల వంటి ప్రజా ఉద్యమాలు చేయడం వల్ల స్వాతంత్ర్యం లభిస్తుంది. జైలుపాలైన ఖైదీలు విడుదలవుతతారు. వయోజన ఓటింగు ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటారు. రామదాసు కూడా జైలునుండి విడుదలై గ్రామానికి తిరిగి చేరుకుంటాడు. రామానాయుడు తన యావదాస్తిని దళితుల అభ్యుదయానికి సమర్పించి గ్రామంలోనే ఉంటూ సంగందాసు చేసిన కృషిని కొనసాగించమని కోరతాడు. అయినా, రామదాసు చేసిన కృషిని కొనసాగించమని కోరతాడు. అయినా, రామదాసు నిరాకరించి చివరికి అడవులకు వెళ్ళిపోతాడు. మొత్తం కథలో సంఘ సంస్కరణకు అధిక ప్రాధాన్యత కనిపిస్తుంది. సంఘసంస్కరణలో భాగంగా రామదాసు కుటుంబం అంతా ఏ విధంగా చిన్నాభిన్నం అయిందో, ఏ విధంగా మరణం పాలయ్యారో కన్పిస్తుంది.

**సంఘసంస్కరణను తలపించే పాత్రలు :**

**రామదాసు - గాంధేయవాది :**

"మాలపల్లి" నవలలో సంఘసంస్కరణను తలపించే పాత్రలను చూస్తే ముఖ్యంగా అట్టడుగు వర్గాలవారికి ప్రతీకగా "మాలదాసరి" కులస్థుడైన రామదాసు కనిపిస్తాడు. ఈయన గాంధేయవాది. సాంప్రదాయపరాయణుడు. సాత్వికుడు ప్రతిసమస్యను శాంతియుతంగా పరిష్కరించాలనుకుంటాడు. ఉదాహరణకు చౌదరయ్య కన్న కొడుకుని నిర్దాక్షిణ్యంగా చంపి నష్టపరిహారం ఇస్తానంటే తీసుకోకుండా మౌనంగా భరించాడు. తన పొలం అన్యాయంగా లాక్కొని తరిమేసినా మరలా ఇంకో ధనవంతుని ఇంట పనివాడిగా చేరతాడు. కుటుంబంలో అందరూ చనిపోయినా మౌనంగా అడవులకు వెళ్ళాడే గానీ సమాజం పై తిరగబడలేదు, పోరాటం చేయలేదు. కారణం గాంధేయవాది.

**సంగందాసు-సంఘ చైతన్యస్ఫూర్తి :**

రామదాసుకు చిన్నకొడుకు నవలలో మొదటి ప్రధాన నాయకుడిగా కనిపిస్తాడు. సంఘచైతన్య స్ఫూర్తి కలిగి సమాజంలో కులపరమైన భేదాలు పోవడానికి, దళితుల అభ్యుదయానికి పాటుపటుతాడు భూస్వామి చౌదరయ్య చేతిలో మరణిస్తాడు. సంగందాసు సమాజంతో పాటు పయనిస్తూ సమాజంలో చైతన్యాన్ని నింపుతూ కూలీలలో ఐక్యత, దళితులల్లో చైతన్యం, విద్య అందించిన స్ఫూర్తివంతమైన పాత్ర.

**వెంకట దాసు - సాయుధ పోరాటయోధుడు**

రామదాసుకు పెద్దకొడుకు వెంకటదాసు. సంగందాసు తరువాత రెండవ ప్రధాన నాయకుడుగా కనిపిస్తాడు. తమ్ముడైన సంగందాసు చనిపోయిన తరువాత అడవులకు వెళ్ళి తక్కెళ్ళ జగ్గడు అనే పేరుతో ధనవంతుల ఆస్థిని కొల్లగొట్టి పేదలకు పంచిపెట్టే "ధర్మకన్నాల" ఉద్యమానికి నాయకత్వం వహిస్తాడు. వర్గచైతన్య స్ఫూర్తికలిగిన నాయకుడిగా జీవిస్తూనే సమాజంలో ఆర్థిక అంతరాల నిర్మూలన కోసం విప్లవ బాట చేపడతాడు. చివరికి పోలీసులకు పట్టుబడి జైలుపాలై మరణిస్తాడు.

**అప్పాదాసు : విద్యాదాత**

రామదాసుకు మేనల్లుడు. దళితుల బడికి టీచర్గా ఉంటూ సేవలందిస్తాడు.

**రామానాయుడు :**

భూస్వామి చౌదరయ్య చిన్నకొడుకు. సంగందాసు అభ్యుదయ భావాలను ఏకీభవిస్తూ సాయం చేస్తూ మంచి మిత్రుడుగా ఉంటాడు. దళితేతరుడే అయినా దళితాభ్యున్నతికి కృషి చేస్తాడు. తన యావదాస్తిని సంగపీఠానికి అందించి ఆర్థిక చేయూతనిస్తూ దానిని కొనసాగించినవాడు.

**నవలలో సంఘసంస్కరణ అంశాలు :**

మాలపల్లి నవల వాస్తవంగా ఆనాటి సమాజాన్ని ప్రతిఫలింపజేస్తూనే సంఘానికి అద్దంపడుతుంది. తెలుగు ప్రజల గ్రామీణ జీవితం, సాంఘిక దురాచారాలు,సామాజిక

అంతరాలు,వర్ణ – వర్గ వ్యత్యాసాలు, క్రైస్తవమత మార్పిడికి ప్రయత్నాలు, దళితులు అనుభవిస్తున్న బాధలు, భూస్వాములు దౌర్జన్యాలు, ఆర్థికదోపిడి, బ్రిటిష్ అధికారుల దాష్టికాలు, పోలీసు దమనచట్టాలు, అధికార న్యాయవ్యవస్థ సృష్టించే దుష్పరిణామాలు, న్యాయవ్యవస్థలోని లొసుగులు కక్షిదారుల అవస్థలు, ఖైదీల అవస్థలు, జైలులో ఉండే ఇక్కట్లు, అగ్రవర్ణాలవారు మరియు జమిందారీ వ్యవస్థలు దళితులను, పేదలను, శ్రామికులను, వ్యవసాయ కూలీలను, కులపరంగా వర్గపరంగా దోపిడీ చేస్తున్న అంశాలు ఆనాటి ప్రజల వాస్తవ జీవితాలు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి. పొట్టేలు ఢీకొట్టలేని కొండలాంటి సమస్యలకు ఎన్నో పరిష్కారాలు పాత్రల ద్వారా, సంఘటనల ద్వారా, సూచనల ద్వారా తెలుగుజాతికి ఈ నవల ద్వారా ఉన్నవ లక్ష్మీనారాయణ అందించడం కనిపిస్తుంది. సమస్యలను వాటికి పరిష్కారాలను పట్టిక రూపంలో చూస్తే త్వరగా అర్థమవుతుందని నా సదాభిప్రాయం.

**సమస్యలు:**

1.కులపరమైన అసమానత

2.వర్గపరమైన అసమానత,

3.ఆర్థిక అసమానత

4.లంచం

5.అత్యాచారాలు

6.ఆర్థిక దోపిడీలు .

7.అధికార జులుం

8.న్యాయవ్యవస్థ లొసుగులు

9.మార్పును అంగీకరించకపోవడం

10.హత్యలు

**పరిష్కారాలు:**

1.గాంధేయ మార్గం

2.సత్యాగ్రహ ఉద్యమమార్గం

3.ధర్మకన్నాల ఉద్యమం

4.సాయుధపోరాటం

5.సమ్మెలు కట్టడం

6.కార్మిక సంఘటిత పోరాటం

7.విద్య

8.బడులు తెరవడం

9.ఆర్థిక చేయూత

10.'సమతా ధర్మ ఆర్థికాభివృద్ధికి

**నవలాకారుని పరిచయం :**

సంఘసంస్కరణ దృష్టితో ఇంత గొప్ప నవల రాసిన ఉన్నవ లక్ష్మీ నారాయణ సామాన్య రచయితేమీకాదు. సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆచరణ వాది, గాంధేయవాది, మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఐర్లాండ్ లోని డబ్లిన్ యూనివర్శిటీలో బారిస్టర్ చదువుతూ, అక్కడ ఐరిష్ హోమ్రూల్ జాతీయ నాయకుడైన "డీవాలేరా"తో పరిచయంతో ప్రభావితుడయ్యాడు. మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశాడు. సి.ఆర్ దాస్ వంటి నాయకుల మన్నన పొందాడు. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా పల్నాడులో పుల్లరి సత్యాగ్రహం 1921, ఉప్పుసత్యాగ్రహం 1931, క్విట్ ఇండియా ఉ ద్యమం – 1942లో పాల్గొని జైలు శిక్ష అనుభవించాడు. సంఘసంస్కరణ దృష్టితో విధవరాండ్రు, అనాథలు, అణగారిన వర్గాల ఉన్నతికై పాటు పడ్డారు. గుంటూరులో 32 వితంతు వివాహాలు జరిపించి "గుంటూరు వీరేశలింగం"గా ప్రసిద్ధి చెందాడు. గుంటూరులోనే వితంతు శరణాలయం 1902, స్త్రీల వృత్తి, విద్యకోసం శారదా నికేతన్ని స్థాపించాడు. కులభేదాలులేని సమ సమాజాన్ని ఆశించి కుల వ్యవస్థను ప్రశ్నిస్తూ సాహిత్యాన్ని ఆలంబన చేసుకొని, సామాజిక స్పృహతో దళితుల సమస్యలను విస్తృతంగా పరిశీలించి మాలపల్లి అనే ప్రసిద్ధనవల రచించారు.

**ముగింపు :**

ఈ విధంగా మాలపల్లి నవలలో, నవలా రచయితలోనూ సంఘసంస్కరణ దృక్పథం కన్పిస్తూంది. సంఘసంస్కరణలో భాగంగా నవలలో చూపించిన పరిష్కారాలు కేవలం రచనకే పరిమితమైనవి కావు. రచయిత స్వయంగా అనుభవించిన అనుసరించిన, సమాజాన్ని పరిశీలించగా, మథించగా వచ్చిన అమృతమే "ఈ పరిష్కారములు".

**ఆధార గ్రంథాలు :**

1. లక్ష్మీ నారాయణ, ఉన్నవ : మాలపల్లి

2. మాలపల్లి నవల : వికీపీడియా

3. భూమయ్య అనుమాండ్ల : మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం

4. సత్యనారాయణ, కంభం పాటి : అర్ధశతాబ్ద కాలంలో ఆంధ్రుల పైన విప్లవ ప్రభావం

5. రామకృష్ణ, వకుళాభరణం : ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు.

అనువాద సాహిత్యం

# రసోత్కృష్టం

నిగమ

కథా పరిచయం:

**''ప్రేమ నగరంలో అతిథి''**

కొందరు పవిత్రతను హృదయంతోనూ మనసుతోనూ తూస్తారు. మరికొందరు శరీరంతో లెక్కిస్తారు. నిత్యం వొళ్ళు అమ్ముకుంటే తప్ప పొట్టనిండని స్త్రీలు తమ దౌర్భాగ్యపు జీవితాలను ఇతరులతో పోల్చుకుని వేదన చెందుతూ వుంటారు. వేశ్యావృత్తిలో వున్నవారు తమను తాము కళంకితులుగా భావించుకుంటూ ఆత్మనూన్యతతో కృంగిపోతూనే తమ అసహనాన్ని కసిని వివిధ రూపాల్లో ప్రదర్శిస్తారు. కొందరు తమ వ్యక్తిత్వాలను తూట్లు పడకుండా కాపాడుకుంటారు.

నిజానికి సమాజం యొక్క కామ ప్రకోపాలకు బాధితులైన వారు విలాసవంతుల కొరకు తయారుచేయబడ్డవారు గత్యంతరం లేక ఆ రొంపిలోనికి దిగినవారు దించబడ్డవారు వేశ్యలు గా జీవనం సాగిస్తూ వుంటారు. అదిగో .. అలా ఏర్పడిందే ఊరు వెలివేసిన ఆ వేశ్యా వాటిక. ఆ వాటిక కు సమాజం పెట్టిన పేరు "ప్రేమ నగర్" ఊరి చివర స్మశానభూమిలో వెలసిన ఆ ప్రేమనగర్ లో పాతికమంది స్త్రీలు నివసిస్తూ వుంటారు. వారికి దైవభక్తి కృతజ్ఞత కూడా ఎక్కువ. ప్రతి సంవత్సరం సత్యనారాయణస్వామి పూజ చేసుకుంటారు. ఆ పూజ జరిపించడానికి వచ్చిన పూజారిని కూడా వారు దైవసమానంగా భావిస్తారు. కానీ ఆ పూజారి పూజ చేయడానికి వచ్చినప్పుడు ఓ యువతిని చూసి కామప్రకోపితుడై ఆమె పొందును కోరతాడు. రాత్రికి రాత్రే అతని వాంఛ అయితే తీరుతుంది కానీ.. ఆ ప్రేమనగర్ లోని స్త్రీల మనస్సులో అతని పట్ల వున్న పవిత్రభావం పోయి అతనూ వొక సాధారణమైన విటుడిగా మిగిలిపోతాడు.

వేశ్యలైన స్త్రీలు సమాజం తమని ఏ చూపుతో చూసి తమకు విలువను నిర్ణయిస్తుందో అదే చూపుతో ఆ పూజారిని వారు సాధారణ విటుడి స్థాయికి లెక్కిస్తారు. అక్కడ పవిత్రతకు కొలమానం శారీరక ప్రాతివత్యం అనే భావనకు వారు లోనవడమే కాదు వారి వద్దకు వచ్చే విటుడికి కూడా ఆ పవిత్రత అనే అర్హత లేదని భావించారు. నిర్ధారించారు కూడా. సిగ్గుతో తలొంచుకొన్న పూజారి స్థానంలో సమాజం కనబడుతుంది పాఠకుడికి.

వేశ్యల కోణంలోనే కాదు.. వ్యభిచార గృహాలపై దాడులు జరిగినపుడు అక్కడ వున్న స్త్రీలను మాత్రమే వ్యభిచారులుగా లెక్కిస్తూ వారి పేర్లనూ ముఖాలను ప్రదర్శిస్తూ అదే నేరంలో భాగస్వామ్యులైన పురుషులను రహస్యంగా దాటించడం దాపెట్టడం సమంజసం కాదనే ప్రశ్నకు జవాబు ఈ కథలో నాకు గోచరించింది. ఆధునిక సమాజంలో లోపించిన పారదర్శకత చంద్రమ్మ నిర్ణయంలో ఆమె పూజారితో మాట్లాడిన మాటల్లో సుస్పష్టమయ్యాయి.

కొంకణి భాషలో వచ్చిన ఈ కథను తెలుగు అనువాదంలో నేను చదివాను. అనువదించిన వారు శిష్టా జగన్నాథరావు.

మూల రచన 'అచ్యుత్ తోటేకార్' "ప్రేమ నగరంలో అతిథి" గోవాలోని దేవదాసీ పద్ధతికి సంబంధించింది. ఈ ఆచారం ఆదికాలం నుంచీ వస్తోంది. సామాజిక చైతన్యం వలన ఈ వ్యవస్థ వెలుగులోకి వచ్చింది. ఈ ఆచారంలోని ఒక నాజూకు భావబంధం ఈ కథలో గొప్పగా చిత్రించబడింది. అశ్లీలం అనిపించకుండా రచయిత అద్భుత పంథాలో కలం నడిపించారు. మీరూ చదివి ఆస్వాదిస్తారని.. ఈ కథా పరిచయం.

–నిగమ

# ప్రేమ నగరంలో అతిథి

ఈవేళ ప్రొద్దున్నించీ ప్రేమనగర్లో పెద్ద పెద్ద లౌడ్ స్పీకర్లు మ్రోగుతున్నాయి. ప్రేమనగర్ ఏదో విశేషం వుందని చెప్పడానికి అది సంకేతం. రోడ్డుమీద వెళ్తున్న జనం ఒకర్నొకరు కనుసంజ్ఞలతో విచారిస్తున్నారు. ఏమిటీ ఈ హడావిడి? కొంతసేపట్లో వూరంతా ఈ వార్త పాకింది. ఈరోజు ప్రేమ్నగర్లో వేశ్యల వార్షిక సత్యనారాయణ పూజ. ఈ సత్యనారాయణ పూజ ఎంతకాదన్నా నవ యువకుల నుండి వయోవృద్ధుల వరకూ అందర్నీ ఆకర్షిస్తుంది. దైవదర్శనంతో బాటు కొత్త కొత్త వేశ్యల ముఖారవిందాలు చూడడానికి అవకాశం వస్తుంది కదూ? అందుకని తరచూ వచ్చేవాళ్లేగాక, ఎప్పుడూ అటువైపు అడుగు వేయని వాళ్లు కూడా ఆరోజు సాయంత్రం ప్రేమనగర్కి ఆ ఉత్సవ దర్శనం నిమిత్తం వస్తారు. తమ పవిత్ర కర్తవ్యం నిర్వహిస్తారు. ఆ ఊరుకి ఒక మూలగా వేశ్యల గృహాలు ఒక పాతిక–ముప్పై వున్నాయి. ఆ ప్రాంతాన్నే ప్రేమనగర్ అంటారు. పది సంవత్సరాలకు పూర్వం ఈ ప్రాంతంలో చచ్చిన ఆవులు, గేదెల మృతదేహాలు తెచ్చి పడేసేవారు. రోజంతా యిక్కడ ఆ కుళ్లు మాంసం వాసన, కుక్కలు, కాకులూ, గ్రద్దలూ మినహా మరెవ్వరి దర్శనం వుండేదికాదు. అటువంటి ఆ చండాలపు భూమి భాగ్యం పండి ఈనాడు ప్రేమనగర్ అనే శృంగార నామం రూఢి అయింది.

ఈ వేళ ఈ స్థలంలో వున్న వేశ్యలు యింతకుముందు వూరిలో ఎవరైనా ఆశ్రయం యిస్తే వాళ్ళలో వుండేవారు. యువకులకు యిది గిట్టలేదు. వాళ్లు వేశ్యలకి విరుద్ధంగా గొడవ చేశారు. ఊరు వదలమని బలవంతం చేశారు. వేశ్యలందరూ ఒక్కటయ్యారు. ఊరు బయట స్మశానభూమి దగ్గరకి వచ్చారు.

ఇంటి సామాన్లన్నీ తెచ్చుకొని సత్యనారాయణమూర్తిని స్మరిస్తూ గుడిసెలు వేసుకున్నారు. సంసారాలు పెట్టి కొత్త జీవితం ఆరంభించారు. అనతికాలంలోనే గుడిసెలు ఇళ్లుగా మారాయి. ఇళ్లముందు రోడ్లు వెలిశాయి. రస్తాలొచ్చాక లైట్లు వచ్చాయి. ఆ తరువాత నీళ్లపంపులు, ఒక చిన్నవాడ వెలిసింది. వేశ్యలు దేహం అద్దెకిచ్చేవాళ్లు లేదా ప్రేమని విక్రయించేవాళ్ళు. అందుకని ఎవరో వేళాకోళంగా ఆ వాడకి ప్రేమనగర్ అనే పేరు పెట్టారు. ప్రేమనగర్లోని వేశ్యలందరూ కలిసి ఈ పూజని చేస్తారు. దానివెనక కారణం కూడా ఇదే. పూర్తిగా నిరాధార స్థితిలో వున్నప్పుడు శ్రీ సత్యనారాయణమూర్తి వాళ్లకి సహాయం చేసినందువలన ఆయన కృపతో మంచిరోజులు వచ్చాయి. ముందు ముందు కూడా ఆయన యిలా వాళ్ళని కాపాడాలని ఈ పూజలు.

ఈరోజు వేశ్యలకి దైవ ధర్మవిధులు చేసే పరమ పవిత్ర దినం. ఏ మొగాడిని ముట్టుకోడం కూడా జరగదు. ఎవరినీ దగ్గరకి చేరనివ్వరు. ఎవరికీ కన్ను కొట్టరు. నోట్లో తిట్లూ, బూతులూరావు. పూర్వకాలపు స్త్రీల లాగా తొమ్మిది గజాల చీరలు ధరించి, కుంకుమతో అడ్డంగా రేఖలు వేసుకుని పూజకోసం వేసిన పందిరిలో తిరుగుతున్నారు. పూజ అందరికోసం కనక, ప్రజలందరూ యిమిడేలా పందిరివేస్తారు. అందరికీ తప్పక నిరాఘాటంగా దర్శనం లభించాలని ఉద్దేశ్యం. పూజకి అన్ని హంగులు, రంగులలైట్లు, టపాకాయలు, చిచ్చుబుడ్లు, భజనలు, హారతి యివ్వడాలు... అడక్కండి... ఎంతోమంది ధనవంతులు ఈ పూజకి పరోక్షంగా సహాయం చేసి వుంటారు కదూ? ఈ పూజ నిర్వహణ చూసేది 'చంద్రమ్మత్త'. చంద్రమ్మత్త అంటే ఈ వాడలో వేశ్యలందరికీ నాయకురాలు. ఆమె అధికారంలో, అధీనంలో ఆమె మాటే వాళ్ళందరి మాట.

మొట్టమొదటి నుంచీ, ఈరోజు వరకూ ఈ పూజ నిర్వహించే గౌరవం 'విఠూ'భట్టి (భట్ అంటే పూజారి వేశ్యలందరూ అతన్ని 'గురూజీ' అని వ్యవహరిస్తారు. వాళ్ల దైవ, ధర్మాదికార్యాలు 'గురూజీ'యే చేస్తాడు. అతనికీ మంచి ఆదాయం. అందువల్ల 'గురూజీ' వలన ఎక్కడైనా తత్తరపాటు జరగవచ్చుకాని 'ప్రేమనగర్'లో మాత్రం 'యథావాచ–

తథాకృతి' (మాటకీ చేతకీ పొంతన కుదిరేలా) అన్నట్టు వుండేవాడు. లోకులు పైపైన అతన్ని హేళన చేసినా, మనస్సులో అతనిని అర్థం చేసుకొనేవారు. గురూజీ వంటి సాదాసీదా మనిషి, అంతర్ముఖుడు ఈ ప్రపంచంలో.. మరొకడు వుండడు. నిజం చెప్పాలంటే గత పది సంవత్సరాలుగా ఈ వేశ్యలతో గురూజీగా తప్ప మరేవిధమైన (లైంగిక) సంబంధం లేదు. అందువల్ల దేవుడి తరువాత గురూజీనే వేశ్యలు గౌరవించేవారు. గురూజీ పీఠంమీద కూర్చుని పూజ చేస్తారు. వేశ్యలు పక్కల కూర్చుని చూస్తూ వుంటారు. అలా పుణ్యంలో భాగం పొందుతారు. పూజ పూర్తి అయ్యేవరకు ఎవరికీ పందిరిలోకి రావడానికి వీలుండదు. ఈవేళ పగలు సూర్యోదయం అవగానే గురూజీ పందిరిలో హాజరయ్యాడు. పూజా సామాగ్రి సర్దడం మొదలైంది. చంద్రమత్త కూర్చున్న చోటే వుండి ఒక్కొక్కరికీ సామాన్లు తెచ్చే పని పురమాయిస్తోంది.

"చంద్రమ్మత్తా! గంధం ఎక్కడుందో?" గురూజీ అన్నాడు. "అరే సుమన్, నువ్వు గంధం తేలేదా?" చంద్రమ్మత్త అడిగింది.

"అయ్యో మఱచిపోయాను. ఇప్పుడే తెస్తానుండు... సుమన్.' "ఇలాగే నువ్వు అన్ని విషయాల్లో నిర్లక్ష్యం చేస్తావు" చంద్రమ్మత్త సుపారీని ముక్కలు చేస్తూ అంది. "మరి కలశంలో వెయ్యాల్సిన రూపాయిపావలా?" "ఇదిగో తీసుకొండి గురూజీ" చంద్రమ్మత్త వేళ్లతో రూపాయపావలా గురూజీకి యిచ్చింది.

"ఇదిగో ఈ ఐదుంపావలా తాంబూలంలో పెట్టడానికి." చంద్రమ్మత్త తమలపాకుల మీద సున్నం రాయడం మొదలుపెట్టింది. "సరేగాని, ప్రసాదం చేయడం సంగతి" "గురూజీ మీరు పట్టించుకోకండి, ఆ పని మిలన్కి అప్పజెప్పాను. ఇంకా టైముంది కదూ?" చంద్రమ్మత్త తమలపాకులు నోట్లో గుప్పుకొని, సగం మిగిలిన పళ్లతో నమలడం మొదలెట్టింది. "హారతి సిద్ధం చేశారా?" చంద్రమ్మత్త తమలపాకులు నమలడంలో నిమగ్నురాలయి ఏం మాట్లాడలేదు. ఆమె బదులు షైలా హారతి పళ్ళెంతో ముందుకి వచ్చింది.

"అరె షైలా! హారతి యిలాగేనా పెట్టడం? వొత్తులు మరీ మొద్దుగా చేశావు, కాస్త వాటిని మరింత వొత్తి సన్నంగా నాజూగ్గా చెయ్యమ్మా." గురూజీ మాటలు..విని షైలా నిర్ఘాంతపోయింది. ఆమె సిగ్గుతో హారతి పళ్లెం తీసుకుని పక్కకి పోయింది.

తన మాటలు బెడిసి కొట్టాయా అని అనుకొని గురూజీ చంద్రమ్మత్త వైపు చేశాడు. చంద్రమ్మత్త నోట్లో నమిలిన కిల్లీ "తూ" అని పందిర బయట వుమ్మివేసి, గురూజీ మాటలకి తన వ్యతిరేకత ఆ విధంగా తెలిపింది.

"గురూజీ ఈ దండ, ఈ తులసి ఆకులూ తీసుకోండి" ఎవరో తెలియని ఒక నవ యువతి అంది.

"ఒసే రూపా, నువ్వు ఎంత తొందరగా అల్లావమ్మా దండని." ఎవరో అన్నారు. "రూపా అంటే రూపాయే. దానికి సాటి మరిఎవ్వరూ లేరు." మరెవరో అన్నారు.

రూపా సిగ్గుతో వంకర్లుపోతూ చంద్రమ్మత్త ప్రక్కనే వచ్చి కూచుంది. రూపా ఇలా సిగ్గు పడడం గురూజీకి బాగా నచ్చింది. రూపావంటి సౌందర్య రాశిని గురూజీ ప్రేమనగర్ ఎప్పుడూ చూడలేదు. "సరే ఇక ప్రారంభిస్తా"

గురూజీ చంద్రమ్మత్త అనుమతి తీసుకుని పూజకి వుపక్రమించాడు. "కేశవాయనమ:"

"అందరూ నిశ్శబ్దంగా వుండండ్రా. చంద్రమ్మత్త గట్టిగా అరిచింది. అరుపుతోబాటు నోట్లో ఢిల్లీలో నుంచి ఊరిన లాలాజలం పెదవుల పక్కనించి కిందకి జారింది. దానిని వెంటనే తన కొంగుతో తుడిచింది. వేశ్యలందరూ చేతులు జోడించి దేవుడి పటం ముందు కూర్చున్నారు. ప్రశాంత వాతావరణంలో గురూజీ పూజ పూర్తిచేశాడు. "ఇప్పుడు మీరందరూ ప్రతీ ఏడాదిలాగే దేవుడికి గంధం, పూలు సమర్పించడానికి రండి" గురూజీ సూచన చేశాడు. "వెళ్లండ్రా అందరూ. ఒంటిమీద నీళ్లు చల్లుకుని తడిసిన శరీరంతో దేవుడికి గంధం, పూలు అర్పించడానికి రండి." చంద్రమ్మత్త ఆర్డరు యిచ్చి, తనుకూడా పందిరివదిలి బయటికి వచ్చింది. దేవుడికి గంధం, పూలు

యివ్వాలంటే పూర్తిగా మడికట్టుకోవాలి. అందుకే తడిసిన శరీరంతో, బట్టలతో రావడం నిజమైన మడి అని వేశ్యలందరి భావన. అందరూ పందిర వెనక బయటకి వెళ్లారు. అక్కడ పెద్ద చన్నీళ్ల పాత్ర నిండివుంది. అందరూ వాళ్లవాళ్ల పాతబట్టలు మార్చుకుని, కొత్త చీరలు కట్టుకుని, నెత్తిమీద నీళ్లు పోసుకున్నారు. తరువాత అలాగే తడితడి శరీరాలతో ఒక్కొక్కరూ పూజా మందిరంలోకి రాసాగారు.

మొదటి గౌరవం చంద్రమ్మత్తది. ఆమె అందరికంటే ముందు పందిరిలో అడుగుపెట్టింది. పందిరిలో గురూజీ తప్ప మరెవ్వరూ పురుషులు లేరు. దానికి కారణం వీళ్లందరూ గంధం, పూలు సమర్పించేవరకూ బయటవాళ్ళని పందిరిలోకి రానివ్వరు.గురూజీ గంధం, పూలు ముందుకు చాపాడు. చంద్రమ్మత్త వాటిని అందుకుని దేవుడికి సమర్పించింది. తరువాత ఒంగొని సాష్టాంగ నమస్కారం చేసింది.

మనస్సులో ఆ తలంపు లేకపోయినా గురూజీ దృష్టి ఆమె శరీరంమీద పడింది. ఒకానొకప్పుడు తన సౌందర్యంతో యితరులని వివశులు చేసి ఆకర్షించిన చంద్రమ్మత్త శరీరపు చర్మం మడతలు పడింది. కొన్నిచోట్ల చర్మం వదులుగా వేళ్లాడుతోంది. మొహంమీద ముసలి తనపు చారలు వచ్చాయి. నోట్లోంచి నాలిక లోపలికి బయటకీ కదులుతోంది. శరీరంమీద ఇక్కడా, అక్కడా నలుపు, నీలపు చారలు పొంగుతున్నాయి. ఆమెని చూస్తేనే గురూజీ శరీరంమీద తేళ్లు, జెర్రులు ప్రాకినట్లయింది. చూడలేక తలవొంచుకున్నాడు.

చంద్రమ్మత్త తరువాత వొక్కొక్కరే క్రమంగా పందిర క్రిందకి వచ్చి గంధం,పూలు, అక్షింతలూ సమర్పించారు. చంపి, గంగి, యేసు, లక్షిమే, మంజుళ... అందరూ తడిబట్టలతో, వొంటిమీది సౌందర్య వస్తువులు కడిగి వెళ్లారు.

ఈ వేశ్యలే సాయంసంధ్యలో ఇంటి గుమ్మం ముందో, కిటికీల వెనకో కూర్చుని చూపుల బాణాలతో విటులని గాయపరుస్తారు. ఇప్పుడు వాళ్ళ శరీరాలని చూడాలనిపించదు. సౌందర్యపు ఆటంబాబు పేలిపోయింది. అంతా ఏహ్యాభావం –చీదరింపు కలిగించేది. పెదవులమీద రంగు, మొహంమీద పౌడరు, తుడుచుకు పోయాయి. కళ్ళులోతుకి పోయాయి. వక్షోజాలు పొంగుతగ్గి చదరంగా మారాయి. పొట్టలోని పేగులు లెక్కపెట్టవచ్చు. నెత్తిమీది సవరంతీసి ఎవరో బయట వేలాడదీశారు. రాత్రి చీకట్లో మెరుస్తూ వుండే స్త్రీ వైభవం గిల్టు పోయిన నగలలాగ బయటపడింది. శరీరంలో ఏ భాగంలోనూ ఆకర్షణలేదు. గురూజీ కళ్ళు మూసుకుని ఒక్కొక్కరి చేతిలోనూ గంధం, పూలు పెడుతున్నాడు. అవి దేవుడికి అర్పించి వెళ్లిపోయినా మొగలి ఆకులాంటి ఆమె శరీరకాంతి, ముత్యాలరంగులో తెల్లగా శుభ్రంగా వున్న కళ్లు, దానిమ్మపండు రంగు పెదాలు, చీరవెనక నుంచి తొంగిచూస్తున్న పావురాల జోడిలాంటి వక్షోజాలు కళ్ళముందు నుంచి అదృశ్యం కాలేదు.

చాలాసేపైనా, విచలితమైన గురూజీ మనస్సు కుదుట పడలేదు. మంత్రాలు సక్రమంగా జ్ఞాపకం రావడంలేదు. అయినా ఫరవాలేదు హారతి యిస్తున్నప్పుడు – వొత్తులు నూనెగిన్నెలో బదులు నీళ్లగిన్నెలో ముంచినప్పుడు ఎవరూ చూడలేదు. ప్రదక్షిణకూడ తప్పుగా మరోలా చేయసాగాడు. కానీ చంద్రమ్మత్త "గురూజీ, మీరేం చేస్తున్నారు?" అని అనబోయేలోగా, అతనికి తన తప్పు తెలిసింది.

"చంద్రమ్మత్తా, నేను నీతో ఒక విషయం మాట్లాడాలి."

పూజ పూర్తయిన తరువాత ఒక మూల నిలుచున్న చంద్రమ్మత్తతో గురూజీ అన్నాడు.

"ఏమిటి?

చంద్రమ్మత్త ఎగతాళిగా చూస్తూ అడిగింది. "ఈ రూప ఎవరూ?" "రూప? ఆ నవ్వు ముఖంతో వున్న అమ్మాయా?" "అవును!" "ఒక కొత్త అమ్మాయి. చాలా అందగత్తె. అతిథులకి ప్రాణం అర్పించైనా సుఖాన్నివ్వడానికి తయారుగా వుంటుంది. కానీ నేనే జాగ్రత్త తీసుకొంటాను. దానికి ఏ కష్టం రాకూడదని." "అవును జాగ్రత్త తీసుకోవాలి. చిన్నది పైగా నాజూకైన పిల్ల. "అవును." "చంద్రమ్మత్తా, ఒకటి అడగనా?" "కోపం రాదు కదా నీకు?" "కోపం రావడానికి మీరు పరాయి వాళ్ళు

కాదుకదా!" గురూజీ నిర్మలంగా, తలవొంచుకుని మాట్లాడాడు. "ఈరోజుతో పది సంవత్సరాలయింది నేను యిక్కడికి వచ్చి వెడుతున్నాను. కానీ ఎప్పుడూ ఏ ఆడమనిషిని వక్రదృష్టితో చూడలేదు. కానీ ఈవేళ అలా ఎందుకయిందో ఎవరికి తెలుసు? ఆ రూప నా మనస్సుని ఆకట్టుకుంది. నా కోరిక తీరుతుందా?"

ఏదో దెబ్బ తగిలినట్టు చంద్రమ్మత్త మొహం గంభీరమయింది. గురూజీ మొహం చూస్తూ చూస్తూ ఆమె ఆలోచనల్లో మునిగింది. గురూజీకి షాక్ తగిలింది. రూపాని కోరడంలో తను పెద్ద తప్పు చేయలేదుకదా? చంద్రమ్మత్త కాదని అంటే జరిగే అవమానం తను భరించగలడా? గురూజీ (మనసులో) తర్కించుకుంటున్నాడు. మనస్సులో అస్వస్థత పెరుగుతోంది. కొన్ని క్షణాలు అలా గడిచాయి. ఆఖరికి చంద్రమ్మత్త ఏదో నిర్ణయం మనస్సులో చేసుకొని, ఆదర పూర్వకంగా గురూజీతో అంది. "గురూజీ నేను మీకు ఎలా కాదనగలను?" మీ పుణ్యశక్తి వల్లనే మాకంతా శుభం జరిగింది. మీ మాట నేను తిరస్కరించలేను. మీ కోరిక తీరుతుందిలేండి. చెప్పండి ఎప్పుడు?"

"ఈ వేళ రాత్రి"

"సరే, ఇప్పుడు మీరు వుండండి. ప్రొద్దున్న పూజాసామాగ్రి తీసుకొని మా వీడ్కోలుతో వెళ్లండి.." చంద్రమ్మత్త మాటలు విని గురూజీ గుండెలు చిన్నపిల్లాడిలా లోపల్లోపల గెంతులేయసాగాయి. రాత్రి రూప తన చేతుల్తో తయారుచేసి యిచ్చిన తాంబూలం గురూజీ స్వీకరించి తిన్నాడు. ఆ తరువాత రాత్రి ఎలా రంగుల రసడోలలతో గడిచిందో తెలియలేదు. తెల్లవారింది. గురూజీ ముస్తాబై సోఫామీద కూర్చున్నాడు. పూజసామగ్రి తీసుకుని చంద్రమ్మత్త ముందుకి వచ్చింది. "ఇది పూజ సామాను. ఇదిగో దక్షిణ. అలాగే అందుకొండి. నమస్కారం ఆఖరిది" చంద్రమ్మత్త తన నడుము వెనకభాగం అతనివైపు త్రిప్పి (మొహం చాటేసి) మాట్లాడింది. ఆమె గొంతుకలో కంపన ధ్వనించింది. గురూజీకి ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ నవ్వు ముఖంతో ఆమె గురూజీకి వీడ్కోలు చెప్పేది. కాని ఈరోజు వేరే విధంగా గురూజీకి అనిపించింది. అతని నోటిలోంచి మాటలు వూడిపడ్డాయి. "ఆఖరి నమస్కారమా?" "అవును ఆఖరిది." తన చెమ్మగిల్లిన కళ్లతో గురూజీ కళ్లల్లో చూస్తూ ఆమె అంది.

"ఈవేల్టి వరకూ మీరు మా గురూజీగా వుండేవారు. ఇప్పుడు మీరు... కాదు నువ్వు మా అతిధివి అయ్యావు." "అంటే ఏమిటి?" "ఇది నేను చెప్పాలా? మీరు పుణ్య పురుషులని మేము భావించి మీకు శ్రేష్ఠ గౌరవం ఇచ్చాము. మడిని పాటించాము. మీ పుణ్యశక్తి వలన మా పాపాలు తుడుచుకుపోయేవి." "కానీ మీరు మీ ప్రత్యేకతని త్యజించి మా ఎంగిలి మెతుకులు తింటే మేము మిమ్మల్ని గురూజీగా ఎందుకు గౌరవించాలి?" గురూజీ నిల్చునే వున్నాడు. అతనికి చంద్రమ్మత్త మాటలు తూటాలుగా తగుల్తూ వుంటే, ఆ బాధలో ఎలా జవాబివ్వాలో తెలియలేదు. "గురూజీ దుఃఖించకండి. రూప కోసం మీరు ఎప్పుడు కావాలన్నా రావచ్చు." తన వ్యధిత హృదయంతో తలవొంచుకొని చంద్రమ్మత్త తక్షణం ఇంట్లోకి వెళ్లిపోయింది.

పూజా సామాగ్రితో వున్న సంచి భుజం మీద వేసుకుని గురూజీ చంద్రమ్మత్త ఇంటినుంచి బయటపడ్డాడు. జరిగిన అవమానం సహించే ధైర్యం అతనిలో లేదు. అధః పతనంతో, నల్లబడిన మొహంతో తలవొంచుకుని నెమ్మదిగా అడుగులేస్తూ అతను ప్రేమగర్కి వీడ్కోలిచ్చాడు. మధ్యమధ్య అతనికి ఏదో భావన కలుగుతోంది. మూలల్లోని కిటికీలల్లోంచి రంగులు పులుముకున్న ముఖాలు "షూ...షూ" అంటూ తనని పిలుస్తున్నాయని. అప్పుడే చెవులు గింగురుమనేలా అపహాస్యంగా ఎవరో అరిచారు "ఏం అతిథీ! రాత్రి ఎలా గడిచింది?" ఇంత ఆయుస్సులో ఏమి సాధించి, గడించానో అదంతా ఒక్కరాత్రిలో తగలెట్టేశాననే దుఃఖభారం నెత్తి మీద వేసుకుని గురూజీ ఇంటి ముఖం పట్టాడు. పశ్చాత్తాపంతో అతని గుండెలు మండుతున్నాయి.

# బాల బహుళ





**సాన్వి కలిత**
3 వ తరగతి,
ఆర్కేడ్ ఇంటర్నేషనల్ స్కూల్

## స్నేహ బంధం

- కుసుమ వైష్ణవి, 7 వ తరగతి,
కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిరిసిల్ల.

కనిపించని ప్రేమ బంధం
కనిపెంచని స్నేహ బంధం
అరమరికలు లేని అనుబంధం
అవినాభావ సంబంధం
కలిమిలేముల తోడుగా
కష్టసుఖముల నీడగా
నీ వెంటే నిన్ను వెన్నంటే
మమతానురాగాల మకరందం
స్వార్థ చింతన లేని
స్వచ్ఛకుసుమాల సుగంధం

(సిరిసిల్ల సిరిమల్లెలు : బడి పిల్లల రచనల సంకలనం నుండి)


# కొత్త పుస్తకాలు



'హరిదాసి' అనువాద నవల.
మూలం: రవీంద్ర నాథ్ ఠాగూర్ 'నౌకాభంగం'
అనుసృజన: రంగరాజు పద్మజ
ప్రథమ ముద్రణ- జూన్ 2020, పేజీలు - 360
వెల: 300/- , ప్రతులకు రంగరాజు పద్మజ,
ఆర్.వెంకటేశ్వరరావు. 30 2-2-1078/27/ఎ,
హైదరాబాద్ -500013. ఫోన్: 98897 58144



'జ్యోతిర్మయి కథలు'
కథయిత్రి: జ్యోతిర్మయి మళ్ళ
ప్రథమ ముద్రణ: జూలై 2022,
పేజీలు -120, వెల: 120/-
ప్రతులకు: ప్రభాకర రావు మళ్ళ, 5-155/9,
నాగమల్లినగర్, సుజాత నగర్, వైజాగ్- 530051.
ఫోన్: 9296356220.




'పథగమనం' (కథలు)
కథయిత్రి: సలీమ,
ప్రథమ ముద్రణ: 2022,
పేజీలు: 150, వెల:125/-.
ప్రతులకు: ఫోన్ 9490099083.



'ముంగారు మొలకలు'
(అనంతపురం జిల్లా మహిళా కథకుల కథలు)
పేజీలు : 224, వెల :250/-.
ప్రతులకు: డా. యం. ప్రగతి, 1- 4 -193,
జానకిరామ నగర్, అనంతపురం- 5155004.
ఫోన్: 9440798008

# కొత్త పుస్తకాలు



**'మాతంగి దివిటి'**
**(కన్నడ దళిత స్త్రీ మొదటి ఆత్మకథ),**
**కన్నడ మూలం: ఆచార్య సమతా బి. దేశమానె,**
**తెలుగు సేత: ఆచార్య కె. ఆశాజ్యోతి,**
**ప్రచురణ: 2019. పేజీలు: 210, వెల: 130/-,**
**ప్రతులకు: రిజిస్ట్రార్, ద్రవిడ విశ్వవిద్యాలయం,**
**శ్రీనివాసవనం, కుప్పం - 517426**



**'బతుకు' (అనువాద నవల),**
**కన్నడ మూలం: గీతా నాగభూషణం**
**(సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన నవల),**
**తెలుగు సేత: ఆచార్య కె. ఆశాజ్యోతి.**
**ముద్రణ: 2019, పేజీలు: 480,**
**వెల: 350/-**

**కవిత**

# మహిళా మణిపూసలు



**శ్రీమతి. జి. శాంతా రెడ్డి, పెద్దచింతకుంట,**
**నారాయణపేట 8008177325**

బాల్యమెంతో మోదము / యవ్వన మెంతో ముదము
బరువు బాధ్యత చట్రాన / ముదిమి యెంతో ఖేదము

ఇల్లంటేనే హద్దు /జీవితమంటే పద్దు
సామరస్య జీవితాన /సంయమనమే ముద్దు

నాడు గీతలో సీత/నేడు బరిలోన గీత
పంజరంలో పక్షిలా/మారదుగా నీ రాత

వక్రబుద్ధులను మారని / మగ దురహంకారాన్ని
పాతాలానికి తొక్కేస్తుంది /ఓరోజు ఈ పిశాచిని

ఆకాశంలోన సగము /అవకాశాలు శూన్యము
మహిళా సాధికారతనే /నాకో రక్షణ కవచము

జగతికి జీవం పోస్తూ/ఊహలను ఆవిరిచేస్తు
అబల కాదు సబలంటూ/సకల విజయాల సాదిస్తూ

మహిళనని మేలుకొంట /మహిళగా కోలుకుంట
సమాజమంటె నాదేనని/మనసార పాడుకుంట

నాలా బతుకనీయండి /నాకూ బతుకునీయండి
వంశవృక్ష ఛాయల్లో /నన్నూ ఎదగనీయండి

వినిపింతు మౌనగీతం /కనిపించగ మనోగతం
ఎదురీదిన కాలంలో /రూపుకట్టు నా చిత్రం



ది.26-08-2022న, తిరుపతిలో 'మల్లెసాల' ఆవిష్కరణ చిత్రమాల



కేంద్ర సాహిత్య అకాడమీ రీజనల్ సెక్రటరీ శ్రీ
మహాలింగేశ్వర్ గారికి 'మల్లెసాల' ను అందజేస్తూ,
బెంగుళూరు వారి కార్యాలయంలో (23-6-2022)



ది.29-06-2022న బెంగుళూరు విశ్వవిద్యాలయంలో
ఆచార్య కె. ఆశాజ్యోతి గారికి 'మల్లెసాల'ను అందజేస్తూ..

Printed at JD Publications, Hyderabad

Price : 100/-